సంపుటి-9, సంచిక-1
15వ శాసనసభ
సమావేశము-VIII

వెల : రూ. 17-00
10 మార్చి, 2022
గురువారం
(శక సంవత్సరము - 1943
ఫాల్గుణం - 8)

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు
# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక
OFFICIAL REPORT
విషయసూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| 1. | సభ ప్రారంభం (ఉ.గం.9.00లకు) | 1 |
| 2. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రములు | 1 |
| 3. | వాగ్రూప ప్రశ్నలు - సమాధానాలు | 1 - 57 |
| 4. | సంతాప తీర్మానం (డా.కొణిజేటి రోశయ్యగారి మృతి పట్ల) | 57 - 65 |
| 5. | వాయిదా తీర్మానం - తిరస్కరణ<br>(రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం) | 65 |
| 6. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రములు | 65 - 67 |
| 7. | గౌరవ సభాపతిచే ప్రకటనలు<br>(గవర్నరు గారి ప్రసంగ ప్రతులు సభా సమక్షంలో ఉంచుట మరియు దానికి సవరణలు స్వీకరించుట గురించి) | 67 |
| 8. | గవర్నరు గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, ఆమోదం | 67 - 135 |
| 9. | సభ వాయిదా (సా.5.10ని.లకు) | 135 |

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

**ప్రిసైడింగ్ అధికారులు ఃఃః

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## గురువారం, మార్చి 10, 2022

* * *

(సభ ఉదయం గం. 9.00ని.లకు ప్రారంభమైనది, గౌరవ సభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు)

(ప్రతిపక్ష శాసనసభ్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు వాయిదా తీర్మానానికి అనుమతించమని గౌరవ సభాపతిని కోరారు)

(ప్రతిపక్ష పార్టీ సభ్యులు వారి వారి స్థానాల్లో నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు).

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ఃవాయిదా తీర్మానం మీరు ఇచ్చారు, క్వశ్చన్ అవర్ తరువాత చర్చిద్దాము.**

**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు (SRI KINJARAPU ATCHANNAIDU)(టెక్కలి) :** (మైకు లేకుండా) సభా సాంప్రదాయాలను మారుస్తున్నారా అధ్యక్షా? ముందుగా వాయిదా తీర్మానానికి అనుమతినివ్వండి.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY) (రాజమండ్రి గ్రామీణం):** (మైకు లేకుండా) "రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు", "2 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్య", "నిరుద్యోగుల మీద ఈ ప్రభుత్వానికి దయ లేదు".

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ఃఒకసారి శాసనసభ ప్రొసీడింగ్స్ తీసుకుని, ఏ టైమ్‌లో ఏది వచ్చిందో చదువుకోండి, క్వశ్చన్ అవర్ అయిన తరువాత మీరు మాట్లాడండి. Please sit down.**

(ప్రతిపక్ష సభ్యులు వారి వారి స్థానాల్లో కూర్చున్నారు)

**ప్రశ్న నం.1491(1)** **రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు**

**సర్వశ్రీ రాజన్న దొర పీడిక, కరణం ధర్మశ్రీ, మేరుగు నాగార్జున, శ్రీమతి కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, బియ్యపు మధుసూదన్ రెడ్డి – ఎమ్మెల్యేలు**

**గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా?**

అ) రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచుటకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమి ;

ఆ) అందుకోసం వెచ్చించిన మొత్తం ఎంత?

**గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రి (డా.ఆదిమూలపు సురేశ్) గారి సమాధానం:**

అ) అవునండీ

ఆ) రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు మరియు ఆ విషయంలో ఖర్చు చేసిన మొత్తం పరిమాణం వివరాలను అందిస్తున్నాను. అది సభాసమక్షంలో కూడా ఉంచడం జరుగుతుంది అధ్యక్షా.

**జగనన్న అమ్మఒడి**: బిపిఎల్ కుటుంబాలకు చెందిన ప్రతి విశిష్ట తల్లి/సంరక్షకునికి రూ.15,000/-ల వార్షిక ఆర్థిక సహాయం నిమిత్తం రూ.13.023 కోట్ల మొత్తాన్ని (2019-20 విద్యా సంవత్సరంలో రూ.6349.6 కోట్లు మరియు 2020-21 విద్యా సంవత్సరంలో రూ.6673.4 కోట్లు) ఖర్చు చేయడమయింది.

**మన బడి నాడు-నేడు**: 10 అంశాలతో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టపరిచే నిమిత్తం రూ.11,360 కోట్ల వ్యయానికిగాను రూ.3669 కోట్లను ఖర్చు చేయడమయింది. మనబడి, నాడు-నేడు అకాడమిక్‌ల క్రింద జారీచేసిన క్రొత్త మార్గదర్శకాల ఆధారంగా అదనపు తరగతిగదుల నిర్మాణంతో పాటు 13,981 పాఠశాలల కోసం 11వ దశకు రూ.4535 కోట్ల ఆర్థిక వ్యయాన్ని చేర్చడమయింది.

**జగనన్న గోరుముద్ద**: గుణాత్మక రుచి మరియు పోషకాహార మధ్యాహ్న భోజనం ఉండేటట్లు చేయడానికి మధ్యాహ్నం భోజన కార్యక్రమాన్ని పునరుద్ధరించడం కోసం ప్రతీ సంవత్సరం రూ.1600 కోట్ల మొత్తాన్ని రమారమి ఖర్చు చేయడమవుతున్నది.

**జగనన్న విద్యా కానుక**: పాఠశాల కిట్లను అందించడం ద్వారా పాఠశాలల్లో పిల్లల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి రూ.1437.31 కోట్ల మొత్తాన్ని అంటే (2020-21 విద్యా సంవత్సరంలో రూ.648.1 కోట్లు మరియు 2021-22 విద్యా సంవత్సరంలో రూ.789.21 కోట్లు) ఖర్చు చేయడమయింది.

**మరుగుదొడ్ల నిర్వహణ నిధి**: TMF అధ్యక్షా (Toilets Maintenance Fund) శాస్త్రీయ మరియు వృత్తిపరమైన విధానంలో సాధ్యమైన ఉత్తమ పరిశుభ్రత పరిస్థితులలో విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించడం కోసం రూ.444.89 కోట్లను ఖర్చు చేయడమవుతున్నది.

**పాఠశాల నిర్వహణ నిధి** : ఆస్తులు, భవనాలు మరియు మౌలిక సదుపాయాల జీవితకాలాన్ని సకాల నిర్వహణ పొడిగిస్తున్నందున సకాలంలో మరమ్మతులు చేయడం ద్వారా నాడు-నేడు క్రింద కల్పించిన ఆస్తులు మరియు సామగ్రి అంతటినీ కాపాడాలని ప్రభుత్వం కోరుకుంటున్నది. అందుకోసం ఈ పాఠశాలల నిర్వహణ నిధిని ఏర్పాటు చేయడమైనది. అధ్యక్షా, దీనితోపాటు ఇతర కార్యకలాపాలు, అంటే అకడమిక్స్‌కి సంబంధించి, పాఠ్యాంశ సంస్కరణలు కూడా చేపట్టాం. అధ్యక్షా. పాఠ్యాంశ సంస్కరణలు ప్రధానంగా ఫౌండేషన్ లెర్నింగ్ అంటే పునాది విద్య మరియు సంఖ్యా శాస్త్రం, అర్థమెటికల్ లెర్నింగ్ మెథడ్స్ అధ్యక్షా, సంఖ్యా శాస్త్రంపై ఎక్కువ దృష్టి సారించి 2020-21 విద్యా సంవత్సరం నుండి అనేక పాఠ్యాంశ సంస్కరణలు ప్రభుత్వం విడుదల చేసింది. 21వ శతాబ్దపు నైపుణ్యాలను సాధించడానికి, ఫౌండేషనల్ అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, క్యూఆర్ కోడ్‌లతో శక్తివంతం చేసి ద్విభాషలో పదజాలం నిర్మించడానికి, కార్యకలాప ఆధారిత పాఠ్యాంశాలపై మరింత దృష్టిని సారిస్తూ పాఠ్యపుస్తకాలను రీ-డిజైన్ చేశాం. 1 నుండి 10 తరగతుల వరకు బ్రిడ్జి కోర్సు మెటీరియల్ వారధి వర్క్‌బుక్‌లను రూపొందించి,

పాఠశాల సంసిద్ధత (school readiness) మరియు అడ్డంకులు లేని ట్రాన్సిషన్ కోసం సరఫరా చేయడమయింది.

బి) **సిబిఎస్ఇకి అనుబంధం** : ప్రస్తుత ముల్యాంకన విధానంలో సమూల సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం గమనించింది. దేశంలోని వివిధ పబ్లిక్ పరీక్షల విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అంటే సిబిఎస్ఇ ఒక బ్రాండ్ స్థాయిని పొందినట్లు కనుగొనడమయింది. ప్రభుత్వ అభ్యర్థన ఆధారంగా కాంపిటెంట్ అథారిటీ అయిన సిబిఎస్ఇ అనుబంధ చట్టాల ప్రకారం మొదటి దశలో (1000) పాఠశాలల వరకు అనుబంధించడానికి తమ సుముఖతను నిర్ధారించింది. అనుబంధం ప్రాసెసులో ఉంది.

సి) **నాడు–నేడు (విద్య)** : **పాఠశాలల పునర్ నిర్మాణం** :

విద్యా మౌలిక సదుపాయాలను మార్చడానికి మరియు అధ్యయన ప్రాభవాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం ద్వారా వారిని భావి ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర విద్య మరియు పరిపాలనా సంస్కరణలను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పాఠశాలలను–

i. శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు (పిపి1 & పిపి2 తరగతుల వరకు)
ii. ఫౌండేషన్ పాఠశాలలు (పిపి1, పిపి2, తరగతులు 1 & 2)
iii. ఫౌండేషన్ స్కూల్ ప్లస్ (పిపి1, పిపి2, తరగతులు 1 నుండి 5)
iv. ప్రీ హైస్కూల్ (3వ తరగతి నుండి 7/8 వరకు)
v. ఉన్నత పాఠశాలలు 3 నుండి 10 తరగతులు మరియు
vi. హైస్కూల్ ప్లస్ (3 నుండి 12 తరగతులు)గా పునర్ నిర్మిస్తున్నది.

అధ్యక్షా these are all pertaining to School Education and this question pertains to the entire education system. విద్యా ప్రమాణాలు మెరుగుపరచేందుకు ప్రభుత్వం ఏమేమి చర్యలు తీసుకుందని వాళ్లు అడుగుతున్నారు.

Then we will come to higher education హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కూడా ప్రధానంగా రెండు ముఖ్యమైన పథకాలను మా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రారంభించింది. అందులో ఒకటి జగనన్న విద్యా దీవెన, రెండవది జగనన్న వసతి దీవెన. జగనన్న విద్యా దీవెన కింద 2019–20కి సంబంధించి రూ.2059.84 కోట్లను ఖర్చు చేయడమైనది అధ్యక్షా. ఇందులో పాత ప్రభుత్వం వదిలిపెట్టిన బకాయిలను కూడా జోడించి చెల్లించడం జరిగింది. అట్లాగే 2019–20కి సంబంధించి జగనన్న వసతి దీవెన, ఇది వాళ్ళ మెయిన్‌టెనెన్స్ గురించి Yearly Rs.20,000/- per student నేరుగా తల్లుల ఎక్కౌంట్లోకి జమ చేసే కార్యక్రమం. ఇందులో భాగంగా 2019–20 సంవత్సరానికి రూ.1220.98 కోట్లు చెల్లించాం. 2020–21 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా దీవెన కింద రూ.1648కోట్ల రూపాయలు చెల్లించాం. అట్లాగే 2021–22 సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన కింద రూ.2051.98కోట్లు, అంటే వెరసి ఈ మూడు సంవత్సరాలలో మొత్తంగా హయ్యర్ ఎడ్యుకేషన్‌కి

సంబంధించి మొదటి సంవత్సరానికి రూ.3,880కోట్లు, రెండవ సంవత్సరానికి రూ.1,648కోట్లు, ప్రస్తుత సంవత్సరం అంటే డిసెంబర్, 2022 వరకు రూ.3135.97కోట్లు వెచ్చించాం. మూడు బడ్జెట్లలో ఈ 33 నెలల కాలంలో సుమారు రూ.90వేల కోట్ల వరకు విద్యావ్యవస్థ హెడ్‌కు మన ప్రభుత్వం ఖర్చు చేశాం. ప్రధానంగా దీని ద్వారా విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడడం మనం చూస్తున్నాం. ఎందుకంటే Gross Enrolment Ratio, Number of Students Admission Ratio ఇవన్నీ గణనీయంగా వృద్ధి చెందిన పరిస్థితిని మనం చూస్తున్నాం. Dropout ratio చాలావరకు తగ్గింది. ఈ సమాచారం అంతా గౌరవ సభ్యుల నిమిత్తం సభలో ఉంచాం. దీనిపై ఇంకా ప్రశ్నలు ఉంటే అడగవచ్చు అధ్యక్షా.

**శ్రీ పీడిక రాజన్న దొర (SRI PEEDIKA RAJANNA DORA)(సాలూరు):** అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మా ప్రశ్నకు విపులంగా సమాధానం తెలియచేసినందుకు నా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ సభ ద్వారా మరి కొన్ని విషయాలు ప్రజలకు, సభకు మన ప్రభుత్వం, మన గౌరవ ముఖ్యమంత్రివర్యులు విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల గురించి కూడా తెలియచేయాలని తమకు మనవి చేసున్నాను అధ్యక్షా. గౌరవ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహనరెడ్డిగారు పిల్లల చదువు, సంస్కారం వారి భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించుటకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచుటకు, అదే విధంగా విద్యార్థులకు చదువు, సంస్కారం, బంగారు భవిష్యత్తును ఇచ్చుటకు మన రాష్ట్రంలో పిల్లలకు విద్యనే ఆస్తిగా అందించుటకు ఒక గొప్ప విజన్‌తో, మంచి సంకల్పంతో నాడు గంగను భగీరథుడు భూమికి తీసుకొచ్చినట్లు, నేడు చదువుల తల్లి అయిన సరస్వతిదేవిని మన బడులలో, మన పాఠశాలల్లో కొలువై ఉండుటకు విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారు.

**ఉ.9.10**

చదువు అనే సంస్కరణ ద్వారా సరస్వతి దేవి తల్లి వాగ్దేవిని రాష్ట్ర బడుల్లో కొలువై ఉండుటకు నాడు–నేడు అనే కార్యక్రమం ద్వారా భారతదేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్నమైన, విప్లవాత్మకమైన సంస్కరణలు విద్యా రంగంలో తీసుకొచ్చారు. ఆ సంస్కరణల ఫలితాల్లో భాగమే మన బడి, నాడు–నేడు కార్యక్రమం, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరు ముద్ద పథకం, జగనన్న విద్యా కానుక పథకం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ సంపూర్ణ పథకం లాంటి పథకాలు విద్యకు సంబంధించినవని ఇప్పుడే మంత్రి వర్యులు చెప్పారు. భారతదేశంలో ఏ రాష్ట్రం విద్య కోసం ఖర్చు పెట్టని విధంగా రూ.90,000కోట్లకు పైగా మన ముఖ్యమంత్రిగారు విద్యపై ఖర్చు చేశారు. మన పిల్లలను విద్యలో ఏ విధంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నారు అన్నది దీనివల్ల స్పష్టంగా అర్థం అవుతుంది. జగనన్న విద్యా సంస్కరణల ద్వారా మన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి పూర్తిగా నాంది పలికారు. గతంలో పాఠశాలలు ఎలా ఉండేవి, నేడు ఎలా ఉన్నాయనేది నాడు–నేడు కార్యక్రమం ద్వారా మంత్రి వర్యులు స్పష్టంగా చెప్పారు. అదే విధంగా మన ముఖ్యమంత్రి గారు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగానే నవ్యమైన, నాణ్యమైన ఉన్నత విద్య వరకు చదువుకునే అవకాశం ఎస్సీ, ఎస్టీ,

బీసీ మరియు పేదలైన అగ్రవర్ణ కులాల వారికి అవకాశం దక్కింది. గతంలో ఈ విధమైన అవకాశం లేదు. అదే విధంగా జగనన్న విద్యా సంస్కరణల ఫలితంగా పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఆంగ్ల విద్యను అభ్యసించే అవకాశం దొరికింది. గతంలో ఆంగ్లంలో చదువుకునే వారు లేరు. డబ్బులు ఉన్నవారు మాత్రమే ఆంగ్ల విద్యను అభ్యసించే వారు. ఈ రోజు ఎలిమెంటరీ స్కూల్ నుంచే ఆంగ్ల విద్యను చదువుకునే అవకాశం మన ముఖ్యమంత్రిగారు, మన ప్రభుత్వం కల్పించింది. అదే విధంగా మంత్రిగారు చెప్పినట్లు మన పిల్లలకు ఏ పరీక్షనైనా ఎదుర్కొనే సత్తా, దమ్ము ఉండాలని అది అకడమిక్, కాంపిటీటివ్, సాధారణంగా జరిగే స్కూల్ పరీక్షలు, కాలేజీ పరీక్షలు, పోటీ తత్వ పరీక్షలు కావచ్చు దేనినైనా ఎదుర్కోవాలంటే సిబిఎస్ఈ సిలబస్ అవసరమని అందుకు జాతీయ స్థాయి సిలబస్‌ను, మన ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకొచ్చిన సత్తా మన ముఖ్యమంత్రిగారిదని తెలియజేస్తున్నాను. మన ప్రభుత్వం విద్యలో ఇటువంటి సంస్కరణలు తీసుకొచ్చింది. మన రాష్ట్రాన్ని చూసి, మిగతా రాష్ట్రాలు కూడా నాడు–నేడు కార్యక్రమం, అమ్మ ఒడి కార్యక్రమాన్ని తీసుకొస్తున్నారు. ఫుల్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. అలాగే వసతి దీవెన గురించి పక్క రాష్ట్రాలు మన రాష్ట్రానికి వచ్చి గౌరవ మంత్రిగారిని, అధికారులను కలిసి రాష్ట్రంలో స్టడీ చేసి వాళ్ల రాష్ట్రంలో కూడా అమలు చేయాలని చూస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు, విద్య విషయంలో మన రాష్ట్రం ఆదర్శప్రాయంగా నిలిచిందని చెప్పక తప్పదు. అలాగే మన విద్యా విధానం, విద్యా ప్రమాణాలను చూసి నోబెల్ గ్రహీతలు, భారతదేశంలో ఉన్న విద్యావేత్తలు, మేధావులు కూడా మన రాష్ట్రాన్ని చూసి మెచ్చుకుంటున్నారంటే మన ప్రభుత్వం, మన ముఖ్యమంత్రి వర్యులు విద్యకు ఇచ్చిన ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఎంతగా ఉందో మనందరికీ తెలుసు.

విద్య గురించి ప్రాధాన్యత క్రమంలో ప్రజలకు, సభకు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, ముఖ్యమంత్రిగారి పట్టుదల, కృషి వల్లనే మన పిల్లలు ప్రక్కనున్న కేరళ రాష్ట్రాన్ని అధిగమించే స్థాయికి వచ్చారు. కొన్ని విషయాల్లో మనం కేరళ రాష్ట్రాన్ని కూడా అధిగమించాం. విద్య అనేసరికి మనం కేరళ రాష్ట్రాన్ని చూపిస్తాం. కానీ ఆ కేరళ రాష్ట్రాన్ని బహుశా ఒకటి, రెండు సంవత్సరాలలో అన్ని విధాలుగా అధిగమించే అవకాశం ఉంది.

అంతేకాదు, విద్యకు సంబంధించి ఏ తల్లికి అయితే విద్యా దీవెన, వసతి దీవెన సహాయం అందలేదో వారిని వెతికి ఎక్కడున్నారో తెలుసుకొని డిసెంబర్ నుంచి పెండింగులో ఉన్న 77000మంది తల్లులకు రూ.60కోట్లు ఇచ్చారంటే ముఖ్యమంత్రిగారికి విద్య పైన ఉన్న ప్రేమ, పట్టుదల, కృషి తేటతెల్లమవుతుంది. మన రాష్ట్రం ఇంకా విద్యలో ముందుకు సాగాలనే భావిస్తోంది.

రాష్ట్రంలో చూసినా, దేశంలో చూసినా గిరిజన ప్రాంతాలు విద్యలో వెనుకబడి ఉన్నాయనే విషయం మనందరికీ తెలుసు. గిరిజన ప్రాంతంలో విద్య విషయంలో రూ.1350కోట్లు జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక ద్వారా ఖర్చు పెట్టారంటే అతిశయోక్తి కాదు. ఈ విధంగా మన ముఖ్యమంత్రివర్యులు మన రాష్ట్రంలో అన్ని విధాలుగా విద్యను పెంపొందించడానికి

కృషి చేస్తున్నారు. కొన్ని సప్లిమెంటరీ క్వశ్చన్స్‌ను మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. రెండవ స్థానంలో

నాడు–నేడు కార్యక్రమం చేస్తున్నాం. గిరిజన ప్రాంతాలు విద్య విషయంలో చాలా వెనుకబడి ఉన్నాయి. ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. కాబట్టి గిరిజన ప్రాంత విద్యకు నాడు–నేడు కార్యక్రమంలో ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరముంది. గిరిజన ప్రాంతంలో ఐటిడిఏ, ప్రభుత్వ స్కూల్స్ అతి తక్కువగా ఉన్నాయి. ఏడు నియోజకవర్గాల్లో కూడా మంత్రివర్యులు రెండవ దశలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తమరి ద్వారా మంత్రివర్యులకు, ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

రెండవ ప్రశ్న స్కూల్స్ పునర్నిర్మాణం చేశామని అన్నారు. సాధారణంగా పునర్నిర్మాణం చేసిన తరవాత స్కూళ్లల్లో పిల్లలు ఎక్కువ మంది చేరుతున్నారు. పిల్లలు ఎక్కువ మంది అయితే సెక్షన్స్ కూడా ఎక్కువ పెరుగుతాయి. కాబట్టి సబ్జెక్టు టీచర్లను నియమించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో మీ ద్వారా మంత్రివర్యులను తెలియజేయమని కోరుతున్నాను. ప్రభుత్వం కొత్తగా కొన్ని డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసింది. ముఖ్యంగా మా విజయనగరం జిల్లాలో గజపతినగరం, సాలూరు నియోజకవర్గాలకు కలిపి ఒక డిగ్రీ కాలేజీ ఉంది. ఆ కాలేజీలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేరు, సిబ్బందిని నియమించడానికి ఎంత సమయం పడుతుందో తెలియజేయాలని తమరి ద్వారా మంత్రివర్యులకు మనవి చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**డా.మేరుగు నాగార్జున (DR.MERUGU NAGARJUNA) (వేమూరు):** ధన్యవాదాలు అధ్యక్షా. విద్య మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మేము అడిగిన ప్రశ్నకు మంత్రిగారు చాలా విపులంగా, విశ్లేషణాత్మకంగా వివరణ ఇచ్చారు. ధన్యవాదాలు. అయితే కొన్ని విషయాలు ప్రస్ఫుటంగా రాష్ట్ర ప్రజలకు తమరి ద్వారా తెలియపరచవలసిన అవసరం ఉంది. ఇది వరకు పెద్దలు "విద్య లేని వాడు వింత పశువు" అనేవారు. బాబాసాహేబ్ అంబేడ్కర్ గారు విద్య ద్వారా దేశంలో అసమానతలు పోగొట్టడానికి ఆస్కారం ఉందని చెప్పారు. అలాంటి విద్యను గత ప్రభుత్వాలు కొంతవరకు నిర్లక్ష్యం చేశాయి. విద్యను వ్యాపారంగా చేశాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు చాలా వరకు నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యా వ్యవస్థ చాలా దెబ్బతింది. రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రంలో కొన్ని వేల స్కూల్స్ మూసి వేశారు. నిజంగా విద్య మీద గత ప్రభుత్వాలకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది.మన ప్రభుత్వం వచ్చిన తరవాత విద్యలో సమూలంగా మార్పు తీసుకురావాలనే ఆలోచనతో ముఖ్యమంత్రిగారు చాలా లోతుగా పేద ప్రజల స్థితిగతులు మెరుగుపరిచి ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బ్రహ్మాండంగా చదువుకోవాలనే ఆలోచనతో ముందు రెండు రెగ్యులేటరీ కమిషన్లను ఏర్పాటు చేశారు.

**ఉ.9.20**

స్కూల్ ఎడ్యుకేషన్‌పై, హయ్యర్ ఎడ్యుకేషన్‌పై రెండు కమిషన్లు వేశారు. ఆ కమిషన్లు కాలేజెస్ గురించి, వాళ్ల performance, establishment, ఫ్యాకల్టీ, తీరుతెన్నుల వంటి వాటిపై అవగాహనతో పని చేస్తున్నాయి. వాటివల్ల ఫీజుల నియంత్రణ జరుగుతోంది. ఇదివరకు పేదవారు చదువుకోవాలంటే ఇబ్బడిముబ్బడిగా ఫీజులు ఉండేవి. వాటిని నియంత్రించి పేదవారి పిల్లలకు చదువు వచ్చే విధంగా అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి గారు మన పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే విధంగా

డెడికేషన్ సిస్టం ఉండాలని ఎప్పుడూ చెబుతుంటారు. "Education is a true asset, which should be given to our children'" అని చెప్పింది మన అక్షర సూర్యుడు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి. ఎన్నో ఆస్తులు ఉండొచ్చు కానీ "Education is the best asset to the entire society" అని చెప్పిన ముఖ్యమంత్రి గారు ఆ కోణంలోనే ఈ రాష్ట్రంలో ఎడ్యుకేషన్ సిస్టంను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇందు నిమిత్తం రూ.90వేల కోట్ల పైగా ఖర్చు పెట్టారు. కేంద్ర ప్రభుత్వం National Education Policy, కస్తూరి రంగన్ గారితో ఒక కమిటీ వేసింది. మన రాష్ట్రంలో ఇంగ్లీషు విద్య తీసుకురావాలని, సిబిఎస్ఈ సిలబస్ తీసుకు రావాలని, ఇందాక మంత్రిగారు చెప్పారు. పిపి–1, పిపి–2, ఎల్‌కెజి ని పిపి–1గా, యుకెజిని పిపి–2గా తీసుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా సంస్కరణలు చెయ్యాలనే ఆలోచనతో ముందుకెళుతున్నాం. కస్తూరి రంగన్ గారి సిఫార్సులు ఈ మధ్య కాలంలో వచ్చాయి. దానికన్నా ముందే ఆంధ్రప్రదేశ్‌లో ఎడ్యుకేషన్ పాలసీని బ్రహ్మాండంగా తీసుకొచ్చారు. క్వశ్చన్ రూపంలో నేను తీసుకెళతాను. ఎందుకంటే ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి గారు విద్యకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తున్నారో, ఆ ప్రాధాన్యత, పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో ఈ రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మా మీద ఉంది. ఈ రోజు నాడు–నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన వంటి చాలా పథకాలున్నాయి. నాడు–నేడులో స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు మీ అందరికీ తెలుసు. ఇక్కడున్న సభ్యులు వాళ్ల నియోజకవర్గానికి వెళితే నాడు–నేడు స్కూల్స్ చూశాక ఎంత బ్రహ్మాండంగా, కనుల పండుగగా ఉన్నాయో తెలుస్తుంది. ఆ స్కూల్స్ ముందర కార్పొరేట్ స్కూల్స్ కూడా పనికి రావు. అలాంటి స్కూల్స్ వల్ల ఈ రోజు డ్రాపౌట్స్ తగ్గిపోయాయి. ఆరు నుంచి పది లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూల్స్‌ను వదిలేసి గవర్నమెంట్ స్కూల్స్‌లో చేరుతున్నారంటే that is the achievement of the Government, that is the achievement of our Chief Minister. ఈ రాష్ట్రంలో ఏం జరుగుతోందనేది నిశితంగా గమనిస్తే, చదువుల తల్లి పల్లెటూళ్లల్లో ఓలలాడుతోంది. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులు ఎంతో ధైర్యంగా తమ పిల్లలను బడికి పంపిస్తున్నారు. ఏ పిల్లవాడికి ఏ వసతి, ఏ అవసరం లేకుండా వాళ్ల అకౌంట్‌లో డబ్బులు వేస్తున్నాం. మధ్యాహ్న భోజనం గోరుముద్ద పై టైం టేబుల్ ప్రిపేర్ చేశారు. ఆ టైం టేబుల్‌ను ఈ అసెంబ్లీలో కూర్చొని టక–టక చేత్తో రాసి అందించి జనం మెచ్చిన ముఖ్యమంత్రి అయ్యారు. మధ్యాహ్న భోజనం బ్రహ్మాండంగా ఉంది. ఈరోజు ఒక రకం, రేపు మరో రకం చివరికి చిక్కీలతో భోజనం పెడుతున్నారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే జరిగే విషయాలు తెలుసుకోవాలి. విమర్శలు, ప్రతి విమర్శలు, మాట్లాడుకోవడాలు, పొలిటికల్ అవేర్‌నెస్ అన్నీ ఉంటాయి. కానీ ఈ రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలిస్తే బాగుంటుందని చెబుతున్నాను. అంతే కాకుండా విద్యా కానుక కిట్లు. తమరు వచ్చే సమయానికి అసెంబ్లీలో ముందు ఉండాలని నేను వస్తుంటే మధ్యలో స్కూల్‌కి వెళ్లే పిల్లలను చూశాను. పిల్లలు యూనిఫాం వేసుకుని, టై, సాక్సులు, షూ, బెల్ట్ ధరించి బ్రహ్మాండంగా స్కూల్‌కి వెళుతున్నారు. కార్పొరేట్ స్కూల్స్‌కి వెళ్లే పిల్లల కన్నా గవర్నమెంట్ స్కూల్స్‌కి పేదవారి పిల్లలు వెళుతుంటే కూలి పనికి వెళ్లే తల్లులు తమ పిల్లలు ఆరోగ్యంగా ఉంటే అంతకన్నా

కావలసింది ఏముంది అని అనుకుంటున్నారు. అది క్రియేట్ చేసిన మహనీయుడు ముఖ్యమంత్రిగారు. ఇందాక వసతి దీవెన, విద్యా దీవెన గురించి చెప్పారు. ఈ రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్‌ను సమూలంగా మార్చిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారికి ఉంది. ఇకపోతే డిగ్రీ కాలేజ్‌లు.(బెల్)

**మిస్టర్ స్పీకర్(MR.SPEAKER)ः** క్వశ్చన్‌కు కన్‌ఫైన్ అవ్వండి.

**డా.మేరుగు నాగార్జున(DR.MERUGU NAGARJUNA)ः**కొంచెం సమయమివ్వాలి. ఎందుకంటే విద్య అనేది బాబాసాహెబ్ అంబేడ్కర్ గారు ఇచ్చిన అమూల్యమైన సూత్రాలలో మిళితమైనది. విద్య ద్వారా వికాసానికి, ఆలోచనలకు, అప్‌లిఫ్ట్‌మెంట్, అసమానతలు పోవడానికి ఆస్కారం ఉంటుంది కాబట్టి అలాంటి విద్య నాకు ఇచ్చారు కనుక విద్యపై నేను చెప్పాలి. దయచేసి ఒక నిమిషం సమయం అదనంగా ఇవ్వండి. ఈ రోజు డిగ్రీ కాలేజ్‌లు. నేను చదువుకునే రోజుల్లో పీజీ చదవడానికి వెళితే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కె.వి.శివయ్య, బీకాం(హానర్స్) ఉండేవారు. He is stalwart of the entire nation. ఏమిటో అనుకునేవాడిని. ఈ రోజు నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు పెట్టి బీఏ, హానర్స్ తీసుకువచ్చి ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజలకు స్కిల్‌తో, ఎక్స్‌పిరీయన్స్‌తో ఒక డిగ్రీ కోర్సును తీసుకువచ్చిన చరిత్ర ఆంధ్ర రాష్ట్రంలో ఉంది. అంతే కాదు దీనివల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. చాలా కంపెనీలు, బయటినుంచి వచ్చిన వాళ్లు ట్రైనింగ్ ఇవ్వడానికి అంగీకరిస్తున్నారు. ఇరవై అయిదు పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఈరోజు స్కిల్ కాలేజెస్ వస్తున్నాయి. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో స్కిల్ యూనివర్శిటీని ముఖ్యమంత్రి గారు ఏర్పాటు చేస్తున్నారంటే ఎంత గొప్ప ఆలోచన. చదువుకు ప్రయారిటీ ఇవ్వడం మాత్రమే కాదు చదువుకున్న వాళ్లకి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కూడా ప్రయత్నిస్తున్నారు. మొన్నటి దాకా నేను యూనివర్శిటీలో పనిచేశాను. యూనివర్శిటీలన్నీ డోల్ డ్రమ్స్‌కు వెళ్లిపోయాయి. యూనివర్శిటీలలో రీసెర్చ్ అనేది పూర్తిగా పోయింది. ఈరోజు National Assessment and Accreditation Council (NAAC) వస్తుంది. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న యూనివర్శిటీలకు NAAC 'A' Grade వస్తోందంటే అది ఆంధ్రప్రదేశ్‌లో ఎడ్యుకేషన్ సిస్టంలో తీసుకువచ్చిన మార్పులు కారణం. ఈ రోజు ఈ రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్శిటీలలో 35శాతం సీట్లు ఫ్రీగా పిల్లలకు ఇచ్చే పరిస్థితి తీసుకొచ్చారు. అలాంటి విద్య ఈ రాష్ట్రంలో వస్తోంది. VIT, SRM, Centurion universities కూడా 35శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విద్యార్థినీ, విద్యార్థులకు ఇచ్చే విధంగా తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయి. ప్రైవేట్ మెడికల్ కాలేజెస్ వస్తున్నాయి. అపోల ప్రైవేట్ మెడికల్ కాలేజ్ కర్నూలు, రాయలసీమ ప్రాంతంలో వస్తోంది. దాంట్లో 50శాతం సీట్లు పిల్లలకు ఫ్రీగా ఇచ్చే అవకాశాన్ని ముఖ్యమంత్రి గారు తీసుకుంటున్నారు. ఇలాంటి సంస్కరణలతో ఈ రాష్ట్రంలో విద్యా విధానాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఆ సంస్కరణల్లో భాగంగా ఇంకా కొంచెం లోతుగా గౌరవ ముఖ్యమంత్రి చాలా డబ్బులు వెచ్చిస్తున్నారు. ఈ రోజు

**"విద్యానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం**

**న హి వంధ్యా విజానాతి గుర్వీం ప్రసవ వేదనామ్"**

అని అన్నారు. విద్య లోని మాధుర్యం కష్టపడి చదివే వాడికి తెలుస్తుంది. అలాంటి విద్యకు ప్రయారిటీ ఇస్తున్న గౌరవ ముఖ్యమంత్రి ఇంకా లోతుగా వెళ్లి సెకండ్ ఫేజ్‌లో కొన్ని స్కూల్స్ involve చెయ్యడం, యూనివర్శిటీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నాను. చాలా మంది నిరుద్యోగులు ఉన్నారు. త్వరగా రిక్రూట్‌మెంట్ చేసి వాళ్లను రోల్స్‌లోకి తీసుకురావాలని కోరుతున్నాను. ఈ రోజు కొత్తగా ఇంగ్లీషు మీడియం తీసుకొస్తుంటే చాలామంది కోర్టులకు వెళుతున్నారు. వాళ్లకి కూడా పిల్లలు ఉన్నారని తెలుసుకుని ఎన్ని కోర్టులకు వెళ్లినా, ఎలాంటి అవాంతరాలు ఉన్నా ఈ రాష్ట్రంలో ఇంగ్లీషు విద్యను తీసుకురావాలని కోరుకుంటూ నాకు అవకాశం ఇచ్చినందుకు తమరికి, జగన్మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీమతి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి (SMT. KOTTAGULLI BHAGYA LAKSHMI)(పాడేరు):** ధన్యవాదాలు అధ్యక్షా, ముందుగా ఈ రోజు ఆడపిల్లల చదువు కోసం కృషి చేసి సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి విశేషంగా కృషి చేసిన సావిత్రిభాయి ఫూలే గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయురాలికి ఘన నివాళులు అర్పిస్తూ, ఈ రోజు మేము అడిగిన ప్రశ్నలకు చాలా వివరంగా సమాధానం ఇచ్చిన మంత్రి గారికి నా తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**ఉ.9.30**

అధ్యక్షా, మన ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిగారి నేతృత్వంలో మూడవ బడ్జెట్ సమావేశాలు మనం నిర్వహించుకుంటున్నాం. ఇందాక మంత్రిగారు చెప్పినట్లుగా బడ్జెట్ కేటాయింపుల్లో ఎక్కువ భాగం విద్యా రంగానికి దాదాపుగా రూ.90,000 కోట్లు కేటాయిస్తూ, ఖర్చు పెట్టడమనేది నిజంగా దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ జరగని విషయం. ఈ రోజు మన రాష్ట్రానికి ఇంత అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి గారికి నా తరఫున, మా గిరిజన ప్రాంత ప్రజలందరి తరఫున మరొక్కసారి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా గిరిజన ప్రాంతాలున్నాయి. విద్యా రంగాన్ని ఈనాడు చూస్తే నాడు–నేడు కార్యక్రమం, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, ఈ విధంగా అనేక పథకాల ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా అనేక చర్యలు చేపట్టడం మనం చూస్తున్నాం. మా ప్రాంతానికి సంబంధించి మంత్రి గారికి నా తరఫున ఒక రిక్వెస్ట్. గిరిజన ప్రాంతంలో మాతృభాష వాలంటీర్లు ఐటిడిఏ పరిధిలో దాదాపుగా 1200 మంది పని చేస్తున్నారు. ప్రతీ గిరిజన తెగకు, ఉపతెగకు కూడా వాళ్ల లోకల్ లాంగ్వేజెస్ కొండ భాష, కుయి భాష, ఆదివాసీ ఒడియా, సవర లాంటి భాషల్లో విద్యా బోధనను పిల్లలకు నేర్పుతూ తరువాత తెలుగు, ఇంగ్లీషు మాధ్యమంలో నేర్పే పరిస్థితి ఉండేది. 2007లో సర్వశిక్షాఅభియాన్ కింద వీరిని నియమించారు. వీళ్లకూ చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ రోజు వాళ్లందరూ ఉపాధి కోల్పోయారు. ఎందుకంటే మారుమూల PVTG (Particularly

Vulnerable Tribal Group) గ్రామాలకు మనం వెళితే కనీసం తెలుగు మాట్లాడే పరిస్థితి కూడా వాళ్లల్లో కనిపించదు. ముఖ్యమంత్రి గారు ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి ప్రతి పేద గిరిజనులందరూ పోటీ ప్రపంచంలో పోటీ పడాలి, గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లీషు వచ్చి ఉంటే గనుక కచ్చితంగా ప్రతీ పేదవాడు ఉన్నత స్థాయికి వెళతాడని ఏదైతే లక్ష్యంగా పెట్టుకున్నారో అది సాకారం కావాలంటే లోకల్ లాంగ్వేజీలను కూడా మనం ప్రోత్సహించాల్సిన అవసరముంది. నాడు-నేడు ఫేజ్‌లోని ఆశ్రమ పాఠశాలలు, ఫేజ్.1లో మనం చాలా అద్భుతంగా కార్పొరేట్ స్కూల్స్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలను మనం తీర్చిదిద్దుకున్నాం.

అధ్యక్షా, మారుమూల ప్రాంతాల్లో కనీసం బిల్డింగులు లేని పాఠశాలలు, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు చాలా ఉన్నాయి. అవి సెకెండ్ ఫేజులో టేకప్ చేయాలి. ఎందుకంటే ఎగ్జిస్టింగ్ స్కూల్స్‌ను తరువాత మనం ఫేజ్‌వైజ్ అభివృద్ధి చేసుకున్నా కనీసం నీడ కూడా లేని పాఠశాలలు చాలా ఉన్నాయి కాబట్టి వాటిని ముందుగా టేకప్ చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

గతం నుంచి వర్తమానంలోకి మనం చూస్తే పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్చి చదివించాలని గిరిజన ప్రాంతంలో ప్రతి పేరెంట్ ఆలోచిస్తున్నారు. వారు విద్యను కొనసాగించాలంటే ఎగ్జిస్టింగ్ స్కూల్స్ ఏవైతే ఉన్నాయో గతంలో ఉన్న సామర్థ్యం ప్రకారంగానే ఉన్నాయి. అదనంగా బిల్డింగుల అవసరం చాలా చోట్ల ఉంది. వాటిని కూడా నాడు నేడు ఫేజులో మనం తీసుకోవాలి. ఎప్పుడైతే నాడు నేడు కార్యక్రమం మనం టేకప్ చేశామో, ప్రైవేటు బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్‌లో గతంలో ఉన్న పరిస్థితుల్లో వాళ్లందరూ ప్రభుత్వ పాఠశాలలకు షిఫ్ట్ అయినందు వలన, అకామడేషన్‌కి చాలా ఇబ్బంది అవుతుంది. కాబట్టి దీనిని మంత్రి గారు దృష్టిలో పెట్టుకుని కచ్చితంగా అదనపు క్లాస్ రూమ్స్‌ను నాడు నేడులో ఇవ్వగలిగితే బాగుంటుందని కోరుతున్నాను.

అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ప్రతి తల్లికీ మనం రూ.15,000/- ఇస్తున్నాము. గిరిజన శాఖా మంత్రి గారు కూడా సభలో ఉన్నారు కాబట్టి మేడమ్ గారి నోటీసులో పెడుతున్నాను. Toilet Maintenance Fund కొరకు ఆశ్రమ్ స్కూల్స్‌లో రూ.1000/-లు డిడక్ట్ చేయాల్సింది ఏదైతే ఉందో ఆ జీ.ఓ. ఇప్పటి వరకూ ఆశ్రమ్ స్కూల్స్‌లో అమలు కావడం లేదు. ఎందుకంటే చాలా ప్రతిష్టాత్మకంగా ఎగ్జిస్టింగ్ బిల్డింగ్సులో అదనంగా టాయిలెట్స్ నిర్మాణం చేశారు. ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో కూడా Maintenance లేక చాలా ఇబ్బందిగా ఉంది. అది కంటిన్యూ కావాలంటే కచ్చితంగా Toilet Maintenance Fund కూడా రూ.1000లు తీసుకోవలసిన అవసరముంది. కాబట్టి మంత్రి గారికి ఇవన్నీ తెలియచేస్తూ కచ్చితంగా మా గిరిజన ప్రాంతానికి అత్యధిక ప్రయారిటీ ఇస్తారని కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

**శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి (SRI BIYYAPU MADHUSUDHAN REDDY) (శ్రీకాళహస్తి):** నమస్కారం సార్. ఈ రోజు నేను వస్తుంటే స్కూల్స్ గురించి పక్కన సభ్యులు మాట్లాడుతున్నారు. దయచేసి మనమందరం పార్టీలను పక్కనబెట్టాలి. ఇదొక వ్యవస్థ. చదువు అనేది

మనిషికి చాలా ముఖ్యం. ప్రపంచమంతా అభివృద్ధి చెందుతోంది. అమెరికా ఎందుకు అభివృద్ధి చెందింది? అక్కడ అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. అక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు కూడా దొరకవు. అదే ఆలోచన జగన్మోహన్ రెడ్డిగారికి వచ్చింది. స్కూల్స్‌ను ఎవరు పెట్టినా ఆ రోజు ఆలోచన చేసి ఉండాల్సింది. ఎందుకంటే ఏదైనా సరే ఒక మంచి ఆలోచనను ముందుకు తీసుకువెళితే దానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ ఆనందిస్తారు. గతంలో వరదల సమయంలో జగన్మోహన్ రెడ్డి గారు మా ప్రాంతానికి వచ్చారు. అక్కడ ఎస్టీ స్కూల్స్ చూస్తే కార్పొరేట్ స్కూల్స్ కన్నా బాగున్నాయి. టీవీలు, టేబుల్స్ చాలా బాగున్నాయి. ఎందుకంటే ప్రపంచంలో డబ్బు చదువు నుంచే వస్తుంది. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అమెరికా నుంచి ఇక్కడకు డాలర్స్‌లో డబ్బు తీసుకుని వస్తాడు. ఇండియా ఆర్థిక పరిస్థితి పెరుగుతుంది. ఆ రోజున రాజశేఖర రెడ్డి గారు పేద ప్రజలందరికీ ఫీజులు ఉచితం చేయడం వలన ఈరోజు మన వాళ్లందరూ అమెరికాకు వెళ్లి ఒక మెషీన్‌లాపని చేస్తున్నారు. తద్వారా ఇండియా ఆర్థికంగా పెరుగుతుంది. కాబట్టి, నాడు నేడు కార్యక్రమాన్ని జగన్మోహన్ రెడ్డి గారు ఆలోచించి చాలా ఉన్నతమైన స్థితికి తీసుకు వెళ్లారు. ఇంగ్లీషు మీడియం గురించి ఎవరూ వ్యతిరేకంగా చెప్పకూడదు. ఇంగ్లీష్ మీడియం చాలా ముఖ్యం. మనం ఎక్కడకు వెళ్లినా పారిశ్రామిక సదస్సులలో మాట్లాడాలన్నా ఇంగ్లీషు చాలా అవసరం. నా కొడుకు నాతో మాట్లాడుతూ నాన్న నువ్వు ఇంగ్లీషు సరిగా మాట్లాడటం లేదు. ఏదంటే అది మాట్లాడుతున్నావు. పెద్ద కంపెనీలతో మాట్లాడుతున్నప్పుడు ఏ విధంగా మాట్లాడాలో సరిగా తెలియడం లేదు. ఒక టీచర్‌ను పెట్టుకుని ఇంగ్లీషు నేర్చుకోమని చెప్పాడు. అంటే నా బిడ్డ ఇంగ్లీషు మీడియంలో ఉన్నాడు కాబట్టి మాట్లాడుతున్నాడు. కానీ నేను అలా మాట్లాడలేను. కాబట్టి కచ్చితంగా అందరికీ ఇంగ్లీషు కావాలి. బయటకి వెళ్లినప్పుడు కొంత మంది ఫ్యాషన్‌గా ఇంగ్లీషు మాట్లాడతారు. కొందరు ఇంగ్లీషు రాకపోతే చీప్‌గా చూస్తారు. నేను చాలా చోట్ల చూశాను. ఎంత డబ్బు ఉన్నవాడైనా ఇంగ్లీషు రాకపోతే అతనికి ఏమీ రాదనిపిస్తుంది. ఈ రోజు జగన్మోహన్ రెడ్డి గారు ఎన్ని ఆటంకాలున్నా దేశంలో మన రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో అందరూ చూస్తున్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, పాఠశాలల నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు ఇవన్నీ ఏ విధంగా చేస్తున్నారని చూస్తున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో గ్రౌండ్ లేదు. ప్రైవేటు స్కూల్స్‌కు వెళ్లే పిల్లలు 15 కేజీల బ్యాగులు భుజాన వేసుకుని మోయలేని పరిస్థితుల్లో ఉన్నారు. చదువు చూస్తే అంతంత మాత్రంగానే ఉంది. జగన్మోహన్ రెడ్డి గారు ప్రభుత్వ పాఠశాలను ప్రతి రోజూ మానిటర్ చేస్తూ అందరికీ విద్యను అందిస్తున్నారు. ఈ రోజున పిల్లలు ఎంత ఆనందపడుతున్నారంటే వాళ్లు వేసుకునే యూనిఫామ్, షూస్, చదువు పట్ల సంతోషంగా ఉన్నారు. ఈ రోజు ప్రైవేటు స్కూళ్లల్లో టీవీలు లేవు. మంచి డెస్క్‌లు లేవు. కింద కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఇది మనందరం గమనించాలి.

ప్రతిపక్ష సభ్యులను కూడా రిక్వెస్ట్ చేస్తున్నాను. మన ఊర్లు గతంలో ఏ విధంగా ఉన్నాయి, ఇప్పుడు ఏ విధంగా ఉన్నాయన్నది కంపేర్ చేద్దాం. అంతేగానీ ప్రతిదానికీ విమర్శించుకుంటూపోతే అది పద్ధతి కాదు. రాజకీయంగా విమర్శించాలి. పదిమందికీ విద్య నేర్పించే అంశంలో మనం రాజకీయం

చేయకూడదు. ఇక్కడున్న సభ్యులందరి పిల్లలు ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నారు. ఎవరు ఇంగ్లీషు మీడియంలో చదవడం లేదో చేతులెత్తండి. ఒక్కరైనా చేయి ఎత్తండి చూద్దాం.

**ఉ.9.40**

ఈ రోజున ప్రతి పేద పిల్లవాడు కూడా ఇంగ్లీషు మీడియం చదువుతున్నాడు. ఇంగ్లీషు మీడియంలో చదవని వాళ్లు ఎవరైనా ఉంటే ప్రతిపక్ష నాయకులను చేతులెత్తి చూపమనండి. ప్రతిపక్షనాయకుల భావన కరెక్టు కాదు. కేవలం మన పిల్లలే ఇంగ్లీషు మీడియం చదవాలి కానీ మన ఇళ్లల్లో పనిచేసే పనివారి పిల్లలు మాత్రం ఇంగ్లీషు మీడియం చదువకూడదు, జీవితాంతం కూలిపనులు చేసుకుంటూ జీవితం కొనసాగించాలనే కోణంలో చూడటం సబబు కాదని నా భావన. ప్రతిపక్ష నాయకులు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు.

అధ్యక్షా, పేద పిల్లలు కూడా ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటే మంచి ప్రయోజకులై ఉన్నత విద్య చదవుకుని కుటుంబానికి ఆసరాగా ఉంటారు. జగనన్న తీసుకున్న నిర్ణయాల వల్ల విద్యారంగం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ముఖ్యంగా నాడు- నేడు కార్యక్రమం అమలు వల్ల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారినాయి. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తున్నారు. తద్వారా ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమేపి తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు దొరికే పరిస్థితి కనబడటం లేదు. మాటల్లో చెప్పాలంటే చిరంజీవి సినిమా విడుదలైన రోజుల్లో టిక్కెట్లు దొరకనట్లుగా డిమాండ్ పెరిగింది. అలాంటి పరిస్థితే నేడు ప్రభుత్వ పాఠశాలల్లో దాపురించింది. "ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు ఖాళీ లేవు" అనే బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది. దేశ చరిత్రలో, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రతిపక్షపార్టీ నాయకుడు సభలో లేడు అయినప్పటికీ వారికి మనవి చేస్తున్నాను. దయచేసి నాడు- నేడు కార్యక్రమంపైన విమర్శలు చేయడం తగదు. మీరు కూడా పాఠశాలలను తనిఖీ చేయండి. మెరుగైన వసతులు, సౌకర్యాలు కళ్లకు కట్టినట్టుగా కనబడతాయి. మీ సభ్యులకు కూడా చెప్పండి. మరింత మెరుగైన సౌకర్యాల కల్పన విషయంలో అవసరమైతే ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేయండి. అంతేగానీ విమర్శించడం తగదు అని మీద్వారా ప్రతిపక్ష సభ్యులను కోరుతున్నాను.

అధ్యక్షా, నిన్న కూడా చంద్రబాబు నాయుడు గారు ఈ రాష్ట్రం ఏమైపోతోంది అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. కానీ ఏమీ అయిపోలేదు. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. జగనన్నకు ఏమి తెలియదు అని ఆయన అంటున్నాడు. కానీ, తెలిసే కదా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాడు. తద్వారా పేద ప్రజలు సంతోషంగా ఉన్నారు. అన్నీ తెలిసే కదా పేద ప్రజల కోసం జగనన్న 31లక్షల పైచిలుకు గృహాలను కట్టిస్తున్నాడు. తెలిసే కదా నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేశాడు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా పేద విద్యార్థులకు మంచి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాడు.

**శ్రీ పయ్యావుల కేశవ్ (SRI PAYYAVULA KESHAV)(ఉరవకొండ)**: (మైకు లేకుండా)

ప్రభుత్వ పథకాలన్నీ తప్పుదోవపడుతున్నాయి కదా!

**శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి (SRI BIYYAPU MADHUSUDHAN REDDY)**: వచ్చి చూడండి. తెలుస్తుంది.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: మధుసూధన్ రెడ్డి, సబ్జెక్ట్‌పైన మాట్లాడండి..... ప్లీజ్.....

**శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి (SRI BIYYAPU MADHUSUDHAN REDDY)**: కాబట్టి ఈ రోజున ఏ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లినా మెరుగైన వసతులు, సౌకర్యాలు కనబడతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చూస్తే గాంధీ గారి ఫోటో, అంబేడ్కర్ గారి ఫోటోతో పాటు జగన్మోహన్ రెడ్డి గారి ఫోటో పెట్టుకుని పూజిస్తున్నారు.

అధ్యక్షా, ప్రైవేటు పాఠశాలలు వ్యాపార ధోరణితో ఆలోచించి ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచుతున్నాయి. దాన్ని కట్టడి చేసేందుకే ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చి, నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది వివిధ దేశాల్లో, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. కొకొకోల వంటి పెద్ద పెద్ద కంపెనీలకు సీఈవోలుగా మన తెలుగువాళ్లు పనిచేస్తున్నారు.

అధ్యక్షా, ప్రతిపక్ష పార్టీ సభ్యులు అనుకున్నట్లుగా ఎక్కడైనా లోపాలుంటే చూపమనండి. వాళ్లు చెప్పిన ఏ నియోజకవర్గానికైన, ఏ ప్రభుత్వ పాఠశాలకైనా వస్తాను, చూపమనండి. కేవలం విమర్శించడమే పనిగా పెట్టుకుని ప్రభుత్వం మీద దుమ్మెత్తిపోస్తున్నారు. వాళ్ల ప్రభుత్వ హయాం నాటి పరిస్థితులు నేడు సమూలంగా మారినాయి. వారి హయాంలో ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే నేడు మన ప్రభుత్వ హయాంలో నడుస్తోన్న ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు వచ్చిందా, లేదా? వెళ్లి చూడమనండి.

(మైకు లేకుండా)

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)**: ప్రభుత్వ పాఠశాలలు సర్వనాశనం అయిపోయాయి.

**శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి (SRI BIYYAPU MADHUSUDHAN REDDY)**: వెళ్లి చూద్దాం రండి. మీరే చెప్పండి, ఏ పాఠశాలకు వెళ్దాం. నేను వస్తాను. చూద్దాం. పరిస్థితి మీకే అర్థమవుతుంది.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: మధుసూధన్ రెడ్డి, నన్ను అడ్రస్ చేసి మాట్లాడండి.

**శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి (SRI BIYYAPU MADHUSUDHAN REDDY)**: చంద్రబాబు నాయుడు గారే రాష్ట్రాన్ని ఏ విధంగా నాశనం చేయాలా అని చూస్తున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదు, పేద ప్రజలు మరింత నిరుపేదలవ్వాలి, నిరుపేదల పిల్లలు చదువుకోకూడదు అనే

ఆలోచనతో ప్రతిపక్షనాయకుడు ఉండటం దురదృష్టకరం. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది ఎవరో వాళ్లనే చెప్పమనండి. వారి హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పురుగులతో కూడిన కూడు పెట్టేవాళ్లు. కానీ ఈ రోజున జగనన్న అధికారం చేపట్టాక మన ఇళ్లల్లో మనం తినే తిండితో సమానంగా పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం క్రింద ఆహారం అందిస్తున్నారు. వాస్తవాన్ని ఒప్పుకుని నిజాయితీగా మాట్లాడితే ప్రతిపక్షపార్టీ సభ్యులకు గౌరవంగా ఉంటుంది.

అధ్యక్షా, వాస్తవాలు ఎన్ని చెప్పినా కూడా ప్రతిపక్షపార్టీ సభ్యులకు అర్థం కాదు. వారి హయాంలో విద్యార్థులకు అందించే కోడిగుడ్లు కూడా నాసిరకంగా ఉండేవి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. వారి హయాంలో నాలుగు గుడ్లు విద్యార్థికి అందించి రికార్డుల్లో నలభై గుడ్లు ఇచ్చినట్టుగా వ్రాసుకునే పరిస్థితి ఉండేది. కానీ నేడు అంతా పారదర్శకంగా జరుగుతుంది. మీద్వారా ప్రతిపక్షపార్టీ సభ్యులను కోరుతున్నాను. నాడు-నేడు మంచి కార్యక్రమం. అందరూ తోడ్పాటునందించండి. ప్రతిపక్షపార్టీ సభ్యులను కోరుతున్నాను. ప్రభుత్వానికి సహకరించండి. మీరేవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే ఇవ్వండి. ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని కార్యక్రమం మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వానికి సహకరించండి. అంతేకానీ, నాడు-నేడు కార్యక్రమం బాగాలేదు, ఇంగ్లీషు మీడియం వద్దు అనే ధోరణిని మాని అప్పుడే ప్రజల్లో కొంత మార్పు వచ్చి మీరంటే గౌరవం పెరుగుతుంది. ప్రభుత్వం అమలుచేసే ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతిపక్షపార్టీ సభ్యుల సహకారం అవసరం. దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరించవలసిందిగా మీద్వారా గౌరవ ప్రతిపక్ష సభ్యులను కోరుతున్నాను.

**శ్రీ చింతల రామచంద్రా రెడ్డి (SRI CHINTHALA RAMACHANDRA REDDY)(పీలేరు):** అధ్యక్షా, మొన్న గౌతమ్ రెడ్డి గారి మృతి కారణంగా జరిగిన సంతాప తీర్మానంపైన మాట్లాడే అవకాశం నాకు కల్పించలేదు. కానీ, ఈ రోజు ప్రశ్నకు సంబంధించి మాట్లాడే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మొట్టమొదటిసారిగా ఈ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో "మా పాఠశాలలో సీట్లు లేవు" అని బోర్డు పెట్టడమనేది చూస్తున్నాం. చరిత్రలో మొట్టమొదటిసారిగా మనం చూస్తున్నాం. అందుకు కారణం జగన్మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టి అమలుచేస్తున్న నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడమేనని నమ్ముతున్నాను. నేనే కాదు, అందరూ అదే భావనలో ఉన్నారనేది వాస్తవం. దీన్నిబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ప్రమాణాలు ఉన్నాయనేది తెలుస్తుంది.

అధ్యక్షా, దాదాపు 50 సంవత్సరాల క్రితం అంటే 1970 సంవత్సర కాలంలో నేను వాయిల్పాడు ప్రభుత్వ పాఠశాలలో పి.యు.సి. విద్య చదువుకున్నాను. ఈ రోజు అదే పాఠశాలకు దాదాపు 50 సంవత్సరాల తరవాత వెళ్లి చూస్తే చాలా మార్పు వచ్చింది. ఎన్నో ప్రభుత్వాలు అధికారం చేపట్టాయి,

పోయాయి. కానీ మొట్ట మొదటిసారిగా జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు- నేడు కార్యక్రమం అమలు కావడం వల్ల మా ఊరిలో దాదాపు రూ.85.00 లక్షలతో పాఠశాల రూపురేఖలను మార్చారు. నాకే ఆశ్చర్యం వేసింది. జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయా, ఈ విధంగా స్కూల్‌లో బల్లలు, కుర్చీలు ఉన్నాయా అని ఆశ్చర్యమేసింది.

అధ్యక్షా, నేను నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించాను. గతంలో మానవమాత్రులు తినలేని విధంగా మధ్యాహ్న భోజనం ఉండేది. విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని ఆహారాన్ని విద్యార్థులకు అందించేవారు. జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం అధికారం చేపట్టగానే జగనన్న గోరుముద్ద అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు నాణ్యమైన ఆహారం అందించడంలో భాగంగా సోమవారం నుండి శనివారం వరకు మెనూ ప్రకారం కోడిగుడ్లు, చిక్కి వంటి వాటిని విద్యార్థులకు అందిస్తున్నారు. నాడు- నేడు కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. తద్వారా విద్యార్థులకు బలవర్ధకమైన, నాణ్యతతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నారు. కోడిగుడ్లు, చిక్కి, పప్పుతో పాటు నాణ్యమైన సన్న బియ్యంతో అన్నం అందిస్తున్నారు. ఆ విధంగా వారంలో ఆరు రోజుల పాటు గోరుముద్ద కార్యక్రమం క్రింద విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారు. తద్వారా క్రమేపి ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. దానికి గల ప్రధాన కారణం జగనన్న తీసుకువచ్చిన విద్యా సంస్కరణలే. తద్వారా విద్యా ప్రమాణాలు పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగానే నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా అమలుచేస్తే విద్యా ప్రమాణాలు పెరుగుతాయనే విషయాన్ని మంత్రి గారి దృష్టికి మీ ద్వారా తీసుకొస్తున్నాను. అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపడుతుందని ఆశిస్తున్నాను. అందు నిమిత్తం మంత్రి గారు సభ ద్వారా వివరణ ఇస్తారని ఆశిస్తున్నాను.

అధ్యక్షా, మనం ముఖ్యంగా మాట్లాడుకోవల్సిన అంశం ఇంగ్లీషు మీడియం. స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మీరు, నేను శాసనసభ్యులుగా ఉన్నాం.

**ఉ.9.50**

వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారిగా సంచలనాత్మకమైన నిర్ణయాలను తీసుకుని దాదాపు రూ.90వేలకోట్లు ఖర్చుచేసి విద్యారంగంలో సమూలమైన మార్పులను తీసుకొచ్చాం. ఇది చరిత్రలో ఒక మైలు రాయిగా పేర్కొనవచ్చని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ప్రతిపక్ష సభ్యులు ఉన్న నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. ఇటువంటి మంచి కార్యక్రమాలను అమలుచేస్తోన్న ప్రభుత్వాన్ని ప్రతిపక్ష సభ్యులు కూడా అభినందించవలసిన అవసరముంది. అదనపు తరగతులు నిర్వహించాలని కొన్ని గ్రామాల్లో విజ్ఞప్తులు వస్తున్నాయి.ఈ విషయంపై కూడా మంత్రిగారు తగిన చర్యలు తీసుకోవాలని మీద్వారా మనవి చేస్తున్నాను.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: ప్రస్తుతం అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు.

**శ్రీ చింతల రామచంద్రా రెడ్డి (SRI CHINTHALA RAMACHANDRA REDDY)**: అధ్యక్షా, ముఖ్యంగా జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, అమ్మఒడి పథకాలను బాగా అమలు చేస్తున్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే మా పిల్లలు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు అవుతారనే భావన తల్లిదండ్రుల్లో ఉందని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మన రాష్ట్రంలో నాడు–నేడు కార్యక్రమం అమలుచేయడం వల్ల, ఇంగ్లీషు మీడియం విద్యను ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా నేడు ప్రవేశపెట్టడం వల్ల మా నియోజకవర్గంలో చాలామంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసించడం జరుగుతోంది. రాబోయే రెండు సంవత్సరాల్లో కూడా నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలు మరియు డిగ్రీ కళాశాలల్లో అమలుచేయాలని మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను.

**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు (SRI KINJARAPU ATCHANNAIDU):** అధ్యక్షా, ప్రతి గ్రామానికి ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల, ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల, ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంజనీరింగు కళాశాల ఉండాలని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం విద్యా రంగంలో ఒక పాలసీని ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలుసు. నాడు–నేడు అనే ఒక పథకాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. వాస్తవానికి అన్ని పాఠశాలలకు మరమ్మతులు చేసి, రంగులు వేయాలని గతంలో మేము ఆ పథకాన్ని మంజూరు చేశాం. ఈ పథకం క్రింద రూ.4వేలకోట్లు ఎప్పుడు మంజూరుచేయడం జరిగిందో తెలియజేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ఆ రోజు మేము టెండర్లను పిలవడం జరిగిందా, లేదా? ఆ టెండర్లను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసి నాడు–నేడు అనే పేరుతో ఒక కార్యక్రమాన్ని తీసుకొచ్చి మరలా టెండర్లను పిలవడం వాస్తవమా, కాదా సమాధానం చెప్పాలని మీద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, రెండవ విషయం రేషనలైజేషన్. దగ్గర దగ్గరగా ఉన్న పాఠశాలలను ఈ ప్రభుత్వం విలీనం చేయడం వల్ల 1, 2 మరియు 3వ తరగతుల్లో చదువుతున్న చిన్న పిల్లలు పాఠశాలలకు వెళ్లలేక చాలా అవస్థలు పడుతున్నారు. వారి తల్లిదండ్రులు చాలా ఆందోళనగా ఉన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా అక్కడున్న పాఠశాలలకు మరమ్మతులు చేసి, రంగులు వేసి కొన్ని పాఠశాలలను

విలీనం చేయడం వల్ల గ్రామాల్లోని కొన్ని పాఠశాలలకు తాళాలు వేయడం జరిగింది. దానివల్ల ప్రభుత్వ నిధులు వృథాగా ఖర్చయ్యాయి. ఈ పాఠశాలల విలీనం గురించి ముందుగానే ఆలోచించాలి కదా.

అధ్యక్షా, ఇటీవల చాలామంది ఉపాధ్యాయులు నా వద్దకు వచ్చి చెప్పారు. విద్యాశాఖ అనేక యాప్‌లను తీసుకురావడంతో ఆ యాప్‌లలో సమాచారాన్ని ఫిలప్ చేయడం కోసం మరియు పాఠశాల లోని బాత్‌రూమ్‌లను ఫొటోలు తీసి ఆ సమాచారాన్ని పంపించడం కోసం చాలా సమయం వృథా అవుతోందని, విద్యార్థులకు చదువు చెప్పడానికి వీలు పడడం లేదని అనేకమంది టీచర్లు నాతో చెబుతున్నారు. ఈ విషయంపై కూడా ఆలోచించాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

అధ్యక్షా, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు 4500 మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడం కోసం వెళ్లడం జరిగింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని నిలుపుదల చేశారు. చదువు పూర్తయ్యే వరకూ వారికి సహకరించవలసిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. మధ్యలోనే ఆ పథకాన్ని నిలుపుదల చేయడం వల్ల విదేశాల్లో ఉన్న ఆ విశ్వవిద్యాలయాలు విద్యార్థులను బయటకు పంపించడం జరుగు తోంది. దానివల్ల ఆ విద్యార్థులు నేడు ఎంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇది చాలా ముఖ్యమైన సమస్య. ఈ విషయాన్ని మంత్రిగారు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాలి. విదేశాల్లో చదువుతున్న ఆ విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని నేను మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అధ్యక్షా, హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు గతంలో కాస్మాటిక్స్ కోసం నిధులివ్వడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకానికి పేరు మార్చి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. తల్లులు, పిల్లలకు ఆ డబ్బులు ఇవ్వకపోవడం వల్ల హాస్టళ్లలో ఉండే పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఒక హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు డబ్బులు రాకపోవడం వల్ల ఒక విద్యార్థి మరో విద్యార్థికి హెయిర్ కటింగ్ చేస్తున్న పరిస్థితిని చూశాము. ఈ లోపాలన్నీ సరిచేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH):**అధ్యక్షా, గౌరవసభ్యులు అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు మండలానికి ఒక కళా శాల, ప్రతి నియోజవర్గానికి ఒక ఇంజనీరింగు కళాశాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ రాష్ట్రంలో మొత్తం 202 మండలాలో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వారు ఎక్కడనుంచి ఆ గణాంకాలను చెప్పారో తెలియదు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి మండలంలో రెండు జూనియర్ కళాశాలలు ఉండాలని, ప్రత్యేకంగా బాలికల కోసం ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల ఉండాలని నిర్ణయించారు. వాటన్నింటినీ ఆధునీకరించడం కోసం ఫేజ్–2లో చేర్చడం కూడా జరిగిందని మీద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

**ఉ.10.00**

ఇక యూనివర్శిటీస్ అంటారా.. వారి ఆలోచనా విధానం వేరుగా ఉంది. కార్పొరేటీకరణ, commercialization of education అన్నది వారి ఆలోచన. Level field play ఇవ్వాలి, education should be accessible, education should have equity and education should have affordability అన్నది మా ఆలోచనా విధానం. యూనివర్శిటీలు లేని విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో జెఎన్‌టియు, ఆంధ్రకేసరి యూనివర్శిటీలను ఏర్పాటు చేశామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఇక టెండర్స్ విషయం చెప్పాల్సి వస్తే నేడు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా Community Contracting టెండర్ ప్రక్రియను తీసుకొచ్చాం. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములుగా ఉంటారు. వీరిని భాగస్వాములుగా చేసినప్పుడే విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి వీలుంటుంది. ఈ విధానంలో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేసి ఆ పాఠశాల బ్యాంకు ఖాతాలో ఉంచడం జరుగుతుంది. ఆ సొమ్ముకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమన్వయ కర్తగా, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఉంటారు. ఆ సొమ్మును వారి ద్వారానే ఖర్చు చేశారు. Cheque Drawing power విషయంలో ముగ్గురు సంతకం చేయాల్సి ఉంటుంది. అప్పుడే పారదర్శకంగా ఉండగలదని ఆశించాం, మంచి ఫలితాలు వచ్చాయి. 15,715 పాఠశాలలకు గాను రూ.3,600 కోట్లు ఖర్చు చేశాం.

ఇంత తక్కువ సమయంలో ఖర్చు చేయడం, మంచి ఫలితాలు రావడం ఈ విధంగా ఏ శాఖలోను లేదు. It is the innovative method. టెండర్స్ కూడా పిలిచాం. Centralized Procurement ద్వారా we have established a High Power Committee on education. In this, State Project Director, Principal Secretary - School Education, Managing Director, Andhra Pradesh Education & Welfare Infrastructure Development Corporation (APEWIDC), Infrastructure Advisor వంటి ఐదుమంది ఐఏఎస్ అధికారులు భాగస్వాములుగా ఉన్నారు. మరో నలుగురు చీఫ్ ఇంజనీర్‌లతో కలిపి ఈఎన్‌సీ పంచాయితీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, వాటర్ సప్లైతో కలిపి రివర్స్ టెండరింగ్ ప్రాసెస్ ద్వారా సుమారు 170 నుండి 200 కోట్ల రూపాయల సేవింగ్స్ చూపించామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. Third party Auditing కూడా చేశాం. నాడు–నేడు కార్యక్రమం కింద ఖర్చు చేసిన ప్రతి రూపాయిని కూడా పారదర్శకంగా చేయడం జరిగింది. If you give me permission, I can also show you a video on this.

**MR.SPEAKER**: would you like to display?

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH)**: సమయం తక్కువగా ఉంది, ఇంకా ప్రశ్నలపై సమాధానం చెప్పాలి అధ్యక్షా, గౌరవ ప్రతిపక్ష సభ్యులు ఎలా ఆలోచన చేశారో తెలియడం లేదు కాని, Foundation School Concept ఏదైతే ఉందో It is a part of NEP (National Education Policy). విద్యా ప్రమాణాల విషయంలో వారు అడిగిన విధంగా అమలు చేయడం జరిగింది. వారు కోరిన విధంగా విద్యా ప్రమాణాలు పెంచాలంటే కచ్చితంగా subject teachers తోనే

విద్యార్థులకు పాఠాలు చెప్పించాలి. 1 నుండి 5 తరగతులు తీసుకుంటే అందులో 18 subjects ఉన్నాయి. ఎస్‌జీటీతోనే ఆ subjects చెప్పించడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరగుపడతాయి. That is the reason why, we have gone for Foundation School Concept. ఈ ఫౌండేషన్ స్కూల్స్ నాడు నేడు ద్వారా ఏవైతే పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపట్టడం జరిగిందో "అవి వృథా అయ్యాయి, ఆలోచన లేకుండా చేస్తున్నారు" అంటున్నారు. మేము దాని గురించి పట్టించుకోవడం లేదు, మూత పడుతున్నాయి అని, గౌరవ ప్రతిపక్ష సభ్యులు ఏవైతే చెబుతున్నారో అటువంటి వారందరికీ మీ ద్వారా తెలియజేయడం ఏమంటే గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు.

ప్రైమరీ స్కూల్ కాని, హైస్కూల్ కాని, ఈ ఫౌండేషన్ స్కూల్ కాన్సెప్ట్‌తో ఏ స్కూల్ కూడా మూత పడదు. ఏ ఒక్క ఉపాధ్యాయుని ఉద్యోగం కూడా పోదని స్పష్టం చేస్తున్నాం, గౌరవ ప్రతిపక్ష సభ్యులు తెలుసుకోవాలి. గౌరవ సభ్యులకు మీ ద్వారా తెలియజేసుకోవడం ఏమనగా Merger of schools కాదు Merger of classes. Subject teachersతో పాఠాలు చెప్పించాలంటే మానవ వనరులను జాగ్రత్తగా ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. గౌరవ సభ్యులు అచ్చెన్నాయుడు గారి దగ్గరకు ఏ టీచర్స్ వచ్చారో. తెలుగు నాడు టీచర్స్ యూనియన్ ఏదైనా ఉందోమో నాకు తెలియదు కాని ఒకటే చెబుతున్నాను అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు చెప్పిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ఒక్క ఉపాధ్యాయుడుని కూడా ఉపాధ్యాయ వృత్తికి తప్ప ఇతర పనులకు ఉపయోగించుకోము. ఆ విధంగా ఉత్తర్వులు కూడా ఇచ్చాం. సుమారు 1.30 లక్షల ఉపాధ్యాయులకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంచేందుకు webinars, online లో శిక్షణ ఇచ్చాం. నిర్వీర్యం అయిపోయిన DIET (District Institute of Education Training) Centers సంగతి మనం చూశాం. DIET centers are the centers of training for these teachers. ఆ కళాశాలలను నాడు నాడు నేడు కార్యక్రమం క్రింద బలోపేతం చేయవలసిందిగా ముఖ్యమంత్రి గారు ఆదేశాలు ఇచ్చారు. అంతే కాకుండా కొత్తగా ఏర్పాటు కానున్న ప్రతి జిల్లాలోనూ DIET centers ఉండాలి, అక్కడ అన్ని వసతులు ఉండాలి కంటిన్యూయస్ ప్రాసెస్‌లో టీచర్స్ ట్రైనింగ్ ఉండాలన్న కార్యాచరణను మేము తయారు చేసుకున్నాం. గౌరవ సభ్యులు అడిగినట్లుగా నాడు నేడు రెండవ దశలో ఒక్కొక్కటి రూ.12 లక్షలు చొప్పున అదనపు తరగతి గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంటున్నాం. నియోజకవర్గాల వారీగా గౌరవ సభ్యులకు ఆ సమాచారాన్ని అందిస్తాం. ప్రతి స్కూల్ లోనూ కనీసం 9 మంది సబ్జెక్ట్ టీచర్స్, ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక వ్యాయామ ఉపాధ్యాయుడితో ప్రస్తుతం 11మంది పనిచేసే విధంగా 3నుండి 10వ తరగతులు గల పాఠశాలల్లో ప్రణాళికలు తయారు చేసుకున్నాం. మరో మీడియం ఉన్న చోట అదనంగా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించుకునే విధంగా మొత్తం 14 మంది టీచర్లు పనిచేస్తారు.

2022–2023 విద్యా సంవత్సరం నుండి 9మరియు 10వ తరగతుల్లో ఇంగ్లీషు మీడియం ఉంటుంది కాబట్టి 13 మంది టీచర్లు, 2023–24 విద్యా సంవత్సరంలో12 మంది టీచర్లను నియమించాలనుకున్నాం.

(ప్రతిపక్ష పార్టీ సభ్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తమ స్థానంలో కూర్చొని అధ్యక్షా, చాలా సమయం నుండి మాట్లాడుతున్నారు అన్నారు.)

అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం విద్యపై దృష్టి సారించి పేద విద్యార్థులకు విద్య అడ్డు కాకూడదు, అందరికీ అందుబాటులో ఉండాలన్న ఆలోచనా విధానంతో డా.బీఆర్.అంబేడ్కర్ గారి ఆలోచనా విధానాన్ని అమలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగానే పథకాలను తీసుకొచ్చామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అంతే కాకుండా ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా యావత్ ప్రపంచంతోపాటుగా మన రాష్ట్రాన్ని కూడా 2020 సంవత్సరంలో కొవిడ్ ప్రభావితం చేసింది. కొవిడ్ బారిన పడి, నష్టపోయాం. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యార్థులు విద్యను కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. అందులో భాగంగా దూరదర్శన్ ఛానల్ ద్వారా విద్యామృతం ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం. "విద్యా కలశం" పేరుతో రేడియోలో పాఠాలను చెప్పించాం. ట్రైబల్ ప్రాంతాల విద్యార్థులకు ప్రత్యేకంగా యూట్యూబ్ ద్వారా విద్యాపరమైన రూపాంతరీకరణను నిర్ధారించాం.

**ఉ.10.10**

ఈ విధంగా ఎక్కడా విద్యా ప్రమాణాలను తక్కువ చేయకుండా దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ ఈ రోజు ప్రాథమిక, ఉన్నత విద్యలో ముఖ్యంగా Frontier Technologies లో కానివ్వండి, రాబోయే 21వ సెంచరీ స్కిల్స్ కానివ్వండి, వీటిలో కూడా ఉన్నత విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో మైక్రోసాఫ్ట్‌తో MoU చేసుకున్న విషయాన్ని కూడా మీద్వారా సభకు తెలియజేస్తున్నాను. మైక్రోసాఫ్ట్ స్కిల్స్ ద్వారా సుమారు 1.60లక్షల విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సులు అందించేందుకు సుమారు రూ.30కోట్లతో అగ్రిమెంట్ చేశాము. దీనిద్వారా విద్యార్థులు వారి employability.... Employability అన్నది చాలా ముఖ్యం. ఈ డిగ్రీల ద్వారా కాదు వాళ్లకు ఉద్యోగ అవకాశాలు దొరికేది. Skill is very important. ముఖ్యమంత్రిగారు ఏవిధంగా అయితే ప్రాథమిక విద్యలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే క్రమంలో మౌలికవసతులు, ఇన్‌స్టిట్యూషన్ మెకానిజం, ఫంక్షనింగ్ మెకానిజం మీద దృష్టి పెట్టారో, అదే విధంగా ఉన్నత విద్యలో కూడా skilling మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. స్కిల్లింగ్ అంటే కచ్చితంగా Hands on session. బీఏ, బీకాం, బీటెక్, సాంకేతిక విద్య ఏ కోర్సు అయినా కానివ్వండి, ఎక్కడైనా వారికి స్కిల్లింగ్ అందించినప్పుడే మార్కెట్లలో, ఇండస్ట్రీలలో వారికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి కోర్సులో దానిని employability system కింద తీసుకుని కనీసం 10నెలలు ఇంటర్న్‌షిప్ ఉండాలని తప్పనిసరి చేశాము. దానిద్వారా ఆనర్ కోర్సులు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని ఈ విధంగా విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశలో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య, ప్రతి దానిలో సంస్థాగత

మార్పులతోపాటు, అధ్యాపకుల ఫిల్లింగ్, ఖాళీలను భర్తీ చేసే క్రమంలో... విద్యార్థులకు చిన్నప్పటి నుంచి ఒక స్ట్రాంగ్ ఫౌండేషన్ ఉండాలని ఇంగ్లీషు మీడియంను కూడా ప్రవేశపెడుతూ ఈ రోజు ముందుకు పోతున్న పరిస్థితుల్లో ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే అచ్చెన్నాయుడుగారిని ఇవ్వమనండి. (బెల్) లేనిపోనివి, ఈ రోజు ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్టు చెప్పడం మంచిది కాదు. నేను చెప్పిన తరవాత కూడా అచ్చెన్నాయుడుగారికి ఇంకా ఏదైనా అనుమానం ఉంటే రాతపూర్వకంగా మొత్తం వివరాలను వారికి అందజేస్తాను.

**MR.SPEAKER:** Minister garu just a suggestion to you. If they (Opposition party) want to give any advice to the Government, please ask them to give in writing. రాతపూర్వకంగా ఇవ్వమనండి.

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH) :** వాళ్లు చేయలేకపోయారు. ఈ రోజు మేము చేస్తున్నాము. మేము చేస్తున్నప్పుడు ఈ రాష్ట్ర ప్రజలకు ఇంకా ఉపయోగపడే విధంగా, సరే మేము చేయలేకపోయాము, వారు అయినా చేస్తున్నారు, వాటితోపాటు ఇవి కూడా చేయండీ అని చెబితే సంతోషం గానీ, చేసినవి చేయలేదని చెప్పడం, వాళ్లు చేయనవి మేము చేశాము అని చెప్పడం కరెక్ట్ కాదు.

(సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పినిపె విశ్వరూపు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

**శ్రీ పినిపె విశ్వరూపు (SRI PINIPE VISWARUPU):** అధ్యక్షా, పేద పిల్లలు, మరీ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పిల్లలు విదేశాలలో చదువుకోవాలనే లక్ష్యంతో విదేశీ విద్యను ప్రవేశపెడితే "ఈ ప్రభుత్వం దానిని మూసేసింది, అదీకాక అప్పటివరకూ చదువుకున్న విద్యార్థుల చదువు పూర్తవ్వకుండా వారికి నిధులు ఇవ్వడం లేదని" ఒక అపవాదును ప్రతిపక్ష సభ్యులు ఇప్పుడు లేవనెత్తారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఈ విషయమై చెప్పాల్సిన బాధ్యత నామీద ఉంది. విదేశీ విద్యను ఈ ప్రభుత్వం మూసివేయలేదని స్పష్టంగా ఈ సభ ద్వారా మీకు తెలియజేస్తున్నాను. విదేశీ విద్య చదువుకునే విద్యార్థినీ విద్యార్థులు అప్లై చేసుకోవాల్సిందిగా ఒక సంవత్సరం క్రితమే మా శాఖ కార్యదర్శి గందం చంద్రుడుగారు ఒక ప్రకటన విడుదల చేశారు. దానిని చూసుకోవాలని తెలియజేస్తున్నాను. అదీ కాకుండా విదేశీ విద్యకు గతంలో రూ.10లక్షలు ఇస్తే, జగన్మోహన్‌రెడ్డిగారు అధికారంలోకి వచ్చిన తరవాత దానిని రూ.15లక్షలకు పెంచారు.

(ప్రతిపక్ష సభ్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మరియు శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబుచే అభ్యంతరం)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER):** ప్లీజ్.. దయచేసి కూర్చోండి.

**శ్రీ పినిపె విశ్వరూపు (SRI PINIPE VISWARUPU)ః** వీరాంజనేయస్వామి గారూ కూర్చోండి. అధ్యక్షా, సభను ఆర్డర్‌లో పెట్టండి. నేను చెప్పిన సమాచారం ఈ సభ ద్వారా ప్రజలు చూడాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నాను.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ः** రామకృష్ణ బాబుగారూ మీరు కూర్చోండి, మీకు అవకాశం ఇచ్చినప్పుడు మీరు మాట్లాడుదురు.

**శ్రీ పినిపె విశ్వరూపు (SRI PINIPE VISWARUPU)ః** అధ్యక్షా, ఈ రోజు ఈ ప్రశ్న పాఠశాల విద్యకు సంబంధించినది. కానీ మధ్యలో అచ్చెన్నాయుడుగారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో విదేశీ విద్యా విధానం గురించి మాట్లాడారు కాబట్టి చెప్పాల్సిన బాధ్యత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా నాకు ఉంది.

**MR.SPEAKER:** You give clarification. That's all.

**శ్రీ పినిపె విశ్వరూపు (SRI PINIPE VISWARUPU)ః** అధ్యక్షా, దాని గురించే చెబుతున్నాను. వారు విదేశీ విద్య గురించి మాట్లాడుతూ ఎంత మంది విద్యార్థులు వెళ్లారు, ఎంతమంది అప్లై చేశారని అడిగారు. దానికి తప్పకుండా సమాధానం చెప్పాలి. ఇవాళ చర్చకు వచ్చిన ప్రశ్న వేరు, వారు ప్రస్తావించింది వేరు. గతంలో రూ.25కోట్లు ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు రూ.50కోట్లకు పెంచాము.

(ప్రతిపక్ష సభ్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మరియు శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబుచే అభ్యంతరం)

**MR.SPEAKER**: No cross talk.

**శ్రీ పినిపె విశ్వరూపు (SRI PINIPE VISWARUPU) ः** అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు విదేశీ విద్య మీద రెవ్యూ చేసిన తరవాత 99శాతం విద్యార్థులు ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్, కజికిస్తాన్, ఉజ్‌బకిస్తాన్ వంటి చిన్న చిన్న దేశాల్లో, చిన్న చిన్న రాష్ట్రాల్లో వైద్య విద్యకు మాత్రమే వినియోగించుకుంటున్నారు. అక్కడ చదివిన విద్యార్థులు మళ్లీ మన దేశంలో క్వాలిఫై అవ్వాలన్నా, ఎంఎస్ చేయాలన్నా, వాళ్లు ఇక్కడ ఉద్యోగంలో స్థిర పడాలన్నా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ పెట్టే ఎగ్జామ్‌లో వారు పాస్ అవ్వాలి. దాంట్లో వాళ్ల ఉత్తీర్ణత చాలా తక్కువగా ఉంటుంది. ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు ఈ విధంగా చేయడం కరెక్ట్ కాదు, టాప్ 100విశ్వవిద్యాలయాలలో సీటు వస్తే తప్పకుండా మనం చదివిద్దాం. నాణ్యమైన విద్య పేద పిల్లలకు అందించాలనే లక్ష్యంతో టాప్ 100విశ్వవిద్యాలయాలు అని అనుకున్నాం. మళ్లీ మొన్న రెవ్యూ చేసుకున్నాం. అప్లికేషన్స్ తక్కువ వస్తున్నాయి కాబట్టి అవసరమైతే టాప్ 200 విశ్వవిద్యాలయాలు పెట్టుకుని వాళ్లందరికీ ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించాలన్న లక్ష్యంతో ఈ విదేశీ విద్యను తీర్చిదిద్దుతున్నాము తప్ప మరొకటి కాదు అని తెలియజేసుకుంటూ విదేశీ విద్యను ఈ ప్రభుత్వం ఆపలేదు. అదే విధంగా మధ్యలో ఆగిపోయిన, విదేశీ విద్యకు సెలెక్ట్ అయిన విద్యార్థులందరికీ వారి

విద్యా కోర్సు పూర్తయ్యేంతవరకు ఈ విదేశీ విద్యను పూర్తిగా కొనసాగిస్తాము. మధ్యలో ఆపలేదని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

(ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సభ్యులు పెండింగ్ లిస్ట్ పంపిస్తాం శాంక్షన్ చేయమనండి సార్ అన్నారు)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః ప్రశ్న నెం.1484(2) మినిస్టర్ ఫర్ ఎడ్యుకేషన్.

## ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల వేతనాలు

**ప్రశ్న నం.1484(2)**

**సర్వశ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి,అశోక్ బెందాళం,డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మంతెన రామరాజు – ఎమ్మెల్యేలు.**

**గౌరవనీయులైన విద్యా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా?**

అ) రాష్ట్రంలో 2019 నుండి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు జీతాలను చెల్లించలేదన్న విషయం వాస్తవమేనా?

ఆ) రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ల సంఖ్య, వారికి చెల్లించాల్సిన బకాయిల మొత్తం వివరాలేమిటి?

ఇ) స్వీపర్లు వారి జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఈ) అయితే, ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన విద్యా శాఖ (డా. ఆదిమూలపు సురేశ్ మంత్రి) గారి సమాధానంః**

అ) లేదండీ.

ఆ) ప్రభుత్వ పాఠశాలలో 45,483 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 2022, జనవరి వరకు రూ.159.24కోట్ల గౌరవ వేతనాన్ని చెల్లించడమయింది.

ఇ) లేదండీ.

ఈ) 2021వ సంవత్సరంలో రూ.6,000లకు జీతాలను ఇదివరకే ప్రభుత్వం పెంచినందున, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)**ః అధ్యక్షా, ముందుగా మీ విశాల హృదయానికి ధన్యవాదాలు చెబుతున్నాను. సమయం గం.10.18నిమిషాలు అయింది, ఒక ప్రశ్నతో ఇప్పటివరకు లాగారు. మరి దీంట్లో ఏం కిరికిరి ఉందో నాకైతే అర్థం కావడం లేదు. మరి రాంబాబుగారి భాషలో ఏం కిరికిరి ఉందో, ఎందుకు ఇంతసేపు ఒక్క ప్రశ్నను లాగారో నాకైతే తెలియదు. సరే, వదిలేద్దాం. ఎందుకంటే ఇందాక మంత్రిగారు కప్పదాటు

వేశారు. నాడు–నేడు ఎప్పడు శాంక్షన్ అయిందంటే మంత్రిగారు చెప్పలేదు. సరే, ఎడ్యుకేషన్ మీద మాట్లాడారు. ఇది కూడా విద్యా శాఖకు సంబంధించినదే కనుక దాదాపుగా రాష్ట్రంలో ఉన్నత విద్యా శాఖలో 10,600 పోస్టులు, పాఠశాల విద్యలో 47,000పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరి ఎడ్యుకేషన్ ఎలా అభివృద్ధి చేస్తారో నాకైతే అర్థం కావడం లేదు. ఇక పాఠశాలకు సంబంధించిన ఆయాల సమస్య. ఇవాళ పాఠశాలల్లో ఉన్న ఆయాలు బాండెడ్ లేబర్‌లా పని చేస్తున్నారు. దాదాపు 45,483 మంది ఆయాలు ఉన్నామని అన్నారు. అసలు ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, వీళ్లు స్కూల్స్ తెరవక ముందే వచ్చి పాఠశాలలను శుభ్రం చేస్తారు. మళ్లీ సాయంత్రం పాఠశాల అయిపోయిన తరవాత కూడా మళ్లీ శుభ్రం చేసి వెళతారు. బాండెడ్ లేబర్‌లా ఫుల్ టైం పని చేస్తున్నారు. అదే ఎంజీఎన్ఆర్ఇజిఎస్‌లో పనికి వెళ్తే వాళ్లకు రూ.250లు వస్తుంది. సాయంత్రం దాకా వెట్టిచాకిరీ చేయించుకుని ఆయాలకు రోజుకు రూ.200లు ఇస్తున్నారు. మరుగుదొడ్ల శుభ్రతతో సహా అన్ని పనులు చేయిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రిగారి పర్యటన సందర్భంగా వారందరికీ ఫుల్ శాలరీలు ఇస్తామన్నారు. ఫుల్ టైం పని చేయించుకుని పార్ట్ టైం శాలరీ చెల్లిస్తున్నారు. వారు కనీసం రూ.12,000లు ఇవ్వాలని డిమాండ్ చేస్తే దానిమీద ఏమి చర్యలు తీసుకొంటున్నారో మంత్రిగారు చెప్పాలి. 2021, ఫిబ్రవరి నుంచి జూలై వరకు ఆరు నెలల జీతాలు వారికి ఇవ్వలేదు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఇవ్వాలా, మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఇవ్వాలా, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ వాళ్లు ఇవ్వాలా అని క్లాజ్ పెట్టేసి వాళ్లకు ఆరు నెలల జీతాలు కూడా ఇవ్వలేదు, పెంచిన జీతాలు కూడా ఇవ్వలేదు. దానిమీద ఏమి చర్యలు తీసుకున్నారో మంత్రిగారు చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఉ.10.20**

అదే విధంగా నాడు–నేడుకు సంబంధించి అది ఎప్పుడు శాంక్షన్ అయ్యింది అంటే సమాధానం చెప్పకుండా కప్పదాటు వెయ్యక్కర్లేదు. ఏ ప్రభుత్వానికి అయినా, గత ప్రభుత్వాల బకాయిలు కంటిన్యూ అవుతాయి. ఇవన్నీ తెలియకుండా ఏదో మేమే చేసాం, గతంలో ఎవరూ చేయలేదు అని కొంతమంది మాట్లాడటం సరియైన విధానం కాదు. ఎడ్యుకేషన్‌కు, స్కూల్స్‌కు సంబంధించి, ఉపాధ్యాయుల్ని అక్కడక్కడా మీరు టాయిలెట్స్ శుభ్రపరచడానికి కూడా ఉపయోగించుకోవడం మేము పేపర్లలో చూశాము, మంత్రిగారికి తెలియదా? ఇప్పుడు ముఖ్యమంత్రిగారు చెప్పారు మేము నిర్ణయం తీసుకున్నాం, ఇతర పనులు చెప్పము అన్నారు. చాలా సంతోషం, ఉపాధ్యాయులకు ఆ మాత్రం గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది, వారిని అనేక పనులకు వాడుతూనే వున్నారు. ఇవాళ నేను అడుగుతున్నా, పాఠశాలల క్లీనింగు కోసం అమ్మ ఒడి పథకం నుంచి రూ.1000లు తీసి ఇచ్చారు. అమ్మ ఒడికి ఇచ్చి, దానిలోంచి మీరు జీవో ఇచ్చి రూ. 1000 ఈ ఆయాలకు ఇవ్వడం కోసం తీశారు. మరి సకాలంలో చెల్లించండి. 6 నెలలకు ఇచ్చారు. డిసెంబరు దాకా ఇచ్చారు. అది కంటిన్యూ చేయండి. ఏ నెలకానెల ఎలా గడుస్తుంది వాళ్ళకి? ఏ నెల పేమెంట్ ఆ నెల వెళ్లాలా, అక్కర్లేదా? ఇచ్చేదే అరకొర, అది కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా? అందువల్ల దయచేసి ఆలోచించండి. ఇంకా చాలా ఇంపార్టెంట్ క్వశ్చన్స్ ఉన్నాయి అధ్యక్షా. నేను అందుకే తమది చాలా విశాల హృదయం అన్నాను. 10 క్వశ్చన్స్ చాలా

ఇంపార్టెంట్ క్వశ్చన్స్. నిరుద్యోగుల సమస్య గురించి మేము adjournment motion ఇచ్చాము. మీరు దాని మీద ఏమీ చెప్పలేదు. కాని ఒకే క్వశ్చన్ మీద గంటా ఇరవై నిమిషాలు మాట్లాడనిచ్చారు. షార్ట్ డిస్కషన్‌లోకి తీసుకుకెళ్ళిపోయారు, ఉపన్యాసాలు చెప్పించేశారు. ఇది సరైన విధానం కాదు అధ్యక్షా. చాలా వాల్యుబుల్ క్వశ్చన్స్ వున్నాయి, చాలా ఇంపార్టెంట్, రాష్ట్రానికి సంబంధించిన అనేక సమస్యల మీద చర్చించేదాంట్లో ఒకే ప్రశ్నకు ఇంత సమయం తీసుకున్నారు. కాసేపు అయిన తరువాత సింగిల్ స్టేట్‌మెంటరీ అంటారు, మరి 10 క్వశ్చన్స్‌కు ఆన్సర్ రావాలి కదా. మరి ఆ ప్రశ్నలకు ఎంతవరకు న్యాయం జరుగుతుంది? అందువల్ల దయచేసి మంత్రిగారిని మళ్లీ కోరేది ఈ ఆయాల జీతభత్యాలు పెంచేదానికి, వాళ్లతో ఫుల్‌టైమ్ పనిచేయించుకుంటూ పార్ట్‌టైమ్ పేమెంట్ ఇవ్వడం కరెక్టు కాదు, ఫుల్‌టైం పేమెంట్ ఇవ్వాలి. వాళ్ళు రోజుకు 8 గంటలు పనిచేస్తున్నారు. వాళ్ళ జీతభత్యాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియచేయవలసినదిగా కోరుతున్నాను.

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH):** సీనియర్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారికి ముందుగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అధ్యక్షా. ఎందుకంటే మాది చేతల ప్రభుత్వమే గానీ మాటల ప్రభుత్వము కాదు.

(ప్రతిపక్షసభ్యుల నుండి అంతరాయం)

**శ్రీ అంబటి రాంబాబు (SRI AMBATI RAMBABU)(సత్తెనపల్లి):** ఆగండి. ఒక్క మాట. అధ్యక్షా ఇక్కడ పెద్దలు, సీనియర్ సభ్యులు గౌరవనీయులు బుచ్చయ్య చౌదరి గారు మీరు సుదీర్ఘమైన సమయం ఇచ్చారని బాధపడుతున్నారు. ఇవ్వకపోతేనేమో మళ్ళీ ఇవ్వలేదు అంటాడు, ఇచ్చారు అది వేరే విషయం. వినండి, వినండి. మీరు సమయం ఇచ్చారు, వాళ్లు మాట్లాడారు, వీళ్లు మాట్లాడారు. నాకు అర్థంకానిది ఏమిటంటే, అంబటి రాంబాబుగారు కిరికిరి అంటాడేంటి సార్ నాకు అర్థం కావట్లేదు.

(ప్రతిపక్షసభ్యుల నుండి అంతరాయం)

నేను మాట్లాడుతున్నాను సార్, ప్లీజ్ కూర్చోండి. నేను మాట్లాడుతున్నాను. వినండి సార్. నేను మాట్లాడాక మీరు మాట్లాడండి సార్, నాతో వద్దు. "అంబటి రాంబాబుగారు చెప్పాలి దీనిలో కిరికిరి ఉందంటే" అని ఇప్పుడు మా ముక్కులో వేలు పెడుతున్నారు? మేము ఏమన్నా అంటే బావురు బావురుమని ఏడవడం? ఏంటి ఈ పని నాకు అర్థం కాలేదు? నా ముక్కులో ఎందుకు వేలు పెట్టాలి? నేను కామ్‌గా కూర్చున్నాను కదా, అంబటి రాంబాబు గారు ఆయన కిరికిరికి సమాధానం చెప్పాలి అంటారు. ఏంటి ఈ కిరికిరి భాష, నాకర్థం కాదు. వారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. నేను కామ్‌గా కూర్చుంటే నన్ను రెచ్చగొడతారు, ఏమన్నా అంటే గందరగోళం చేస్తారు. ఇది ధర్మం కాదని మనవి చేస్తున్నా. నాపాటికి నేనేదో కూర్చున్నాను కదా. అంబటి రాంబాబు గారు ఈ కిరికిరికి సమాధానం చెప్పాలి అని సీనియర్ సభ్యులనడం సరైన పద్ధతి కాదని మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)**: అధ్యక్షా...

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ः** బుచ్చయ్య చౌదరి గారు..దయచేసి కూర్చోండి. మినిస్టర్‌గారు మాట్లాడండి.

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH)**: అధ్యక్షా, గౌరవసభ్యులు వాళ్ళ హయాంలో ఆయాలను బాగా చూసుకున్నారు, వాళ్ళ హయాంలో ఆయాలకు జీతాలు ఇచ్చారు, మన హయాంలో జీతాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి చెప్పారు అవన్నీ అవాస్తవాలు అధ్యక్షా. వాస్తవాలకు దూరంగా కొన్ని స్టేట్‌మెంట్స్ ఇచ్చారు. అధ్యక్షా. If you just give me two minutes time, వాళ్ళ ప్రభుత్వంలో ఈ ఆయాల వ్యవస్థ ఎట్లా వుంది, ఏమి చేశారు, ఎంత మంది వున్నారు, ఎంతవరకు జీతాలు ఇచ్చారు, అవి ఎన్ని పెండింగ్ పెట్టారు, మేము వాళ్ళ బకాయిలు ఎంత చెల్లించాం. ఏ విధంగా ఇచ్చాము అన్నది మీ ద్వారా సభకు వివరిస్తాను. వాళ్ళ ప్రభుత్వంలో ప్రతి స్కూల్‌కి ఒక ఆయా. Even high schools and colleges are not covered in this. మా ప్రభుత్వం వచ్చిన తరువాత based on the strength of the students ఒక ఆయా నుంచి నలుగురు ఆయాలను నియమించాం. అంటే 300 వరకు విద్యార్థులుంటే ఒక ఆయా, 300 నుంచి 600 వందల వరకు విద్యార్థులుంటే ఇద్దరు ఆయాలు, 600 నుంచి 900 మంది విద్యార్థులంటే ముగ్గురు ఆయాలు, beyond 900 స్టూడెంట్స్ వుంటే నలుగురు ఆయాలను మేము నియమించడం జరిగింది. అక్కడే ఫస్ట్ వ్యత్యాసం. వాళ్ళు only ఒక్క ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ స్కూళ్లలో మాత్రమే ఆయాలను నియమించాం. మేము in all ten managements అధ్యక్షా, రెసిడెన్షియల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అన్నిటిలో మేము ఆయాలను నియమించాం. మా strength is more than, almost 45,000 మంది అని ఇందాక సమాధానంలో చెప్పాను. వాళ్ళు కేవలం రూ.1000లు మాత్రమే ఆయాలకు జీతాలు ఇచ్చిన మాట వాస్తవం కాదా అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారిని అడుగుతున్నాను. అది కూడా తరువాత రివైజ్ చేశారు. వాళ్ళకు తెలుసు కదా, ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అధ్యక్షా ఎలక్షన్లు వస్తున్నాయంటేనే వాళ్లు పింఛన్లు విద్యార్థులకు, ఫీజు రీయింబర్స్‌మెంటు, ఆయాల జీతాలు పెంచారు. అది కూడా పెంచి, వచ్చే ప్రభుత్వాలకు వదిలిపెట్టి వెళతారు, అదీ వాళ్ళ నైజం. ఇప్పుడు కూడా ఈ ఆయాల విషయంలో రూ.1000లు ఉంటే సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన తరువాత, దాన్ని ప్రైమరీ స్కూల్‌కు రూ.2000లు, అప్పర్ ప్రైమరీ స్కూల్‌కి రూ.2500లు, హైస్కూల్‌కి రూ.4000లకు పెంచారు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత అందరికీ యూనిఫామ్‌గా రూ.1000ల నుంచి రూ.6000లకు పెంచారు.

(ఈ దశలో అధికారపక్షం సభ్యులు కరతాళధ్వనులు చేశారు)

వాళ్లు ఈ వ్యవస్థను 2016-17లో మొదలు పెట్టారు. 2016-17, 2017-18 అప్పుడు వాళ్ల ప్రభుత్వం ఉన్నంతవరకు 2014-19 వరకు కేవలం ఒక్కసారే అది కూడా రూ.45 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారు. గత ప్రభుత్వం రూ.160 కోట్లు బకాయిలు పెట్టిపోయింది. రూ.160 కోట్ల బకాయిలను మేమే ఇచ్చాం. అని మీ ద్వారా గౌరవసభ్యులకు తెలియచేస్తున్నాను. తరువాత వాళ్ళు ఇచ్చిన శాలరీ అధ్యక్షా it includes everything, అంటే ఆ ఆయా జీతంలో ఈ క్లీనింగ్ మెటీరియల్

కూడా తీసుకోవాలి. ఫినాయిలు, చీపుర్లు, మాపింగ్ బ్లేడ్స్, బక్కెట్లు, మగ్గులు అన్నీ ఆ వెయ్యి రూపాయలలోనే తీసుకోవాలి. లేదంటే తరువాత పెంచిన రెండు వేలలో చేసుకోవాలి. అధ్యక్షా మేము, రూ.6000 జీతాలు ఏదైతే ఆయాలకు ఇస్తున్నామో, అది కాకుండా, మేము ఈ రోజు క్లీనింగ్ మెటీరియల్ అంటే బాత్రూం క్లీనర్, శానిటైజర్, including air fresheners, బాత్రూములో పెట్టాలని అవి కూడా సప్లై చేశాం. క్లీనింగ్ టూల్స్, మాపింగ్ స్టిక్స్, బాత్రూమ్ వైపర్స్, టాయిలెట్ బ్రష్స్, స్ప్రే బాటిల్స్, గ్లౌజెస్, aprons reflective jackets వారికి ఇచ్చాం. కావాలంటే మీకు చూపిస్తాను అధ్యక్షా. ఇప్పుడు మీరు అనుమతి ఇస్తే I will show you, ఈ టాయిలెట్స్ ఏవిధంగా గణనీయంగా మార్పు చెందాయో, వాళ్ళ కాలంలో ఎలా వున్నాయి, ఇప్పుడు ఎలా ఉన్నాయో చూపిస్తాను. తరువాత ఒక SOP(Standard Operating Procedure)ని కూడా తయారు చేశాం. చాలా డీటెయిల్డ్‌గా ఒక బుక్‌ను తయారుచేసి ఏవిధంగా ఈ టాయిలెట్స్ మెయిన్‌టెయిన్ చెయ్యాలి, ఎన్నిసార్లు దాన్ని క్లీన్ చెయ్యాలి, just like మనం ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో టాయిలెట్స్‌కి వెళ్ళినప్పుడు ఒక మనిషి 24 / 7 అక్కడే ఉంటాడు, ఎన్నిసార్లు టాయిలెట్స్ క్లీన్ చెయ్యాలని అని ఒక లాగ్‌షీట్‌లో సిగ్నేచర్స్, వెరిఫికేషన్ కూడా వుంటుంది. ఇక్కడ కనీసం రోజుకు నాలుగుసార్లు అయినా టాయిలెట్లు క్లీన్ చెయ్యాలని, లాగ్‌షీట్ మెయిన్‌టెయిన్ చెయ్యాలని ఈ టాయిలెట్స్‌ని కూడా ముఖ్యమంత్రివర్యులు ఇన్స్‌పెక్షన్‌కి వచ్చినప్పుడు సందర్శించిన పరిస్థితిని మనం చూశాము. పునాదిపాడులో ఈ 'విద్యాకానుక' లాంచింగ్ అప్పుడు ముఖ్యమంత్రిగారు టాయిలెట్స్‌లో వాటర్ వస్తుందా లేదా అని పరిశీలించారు. రెండవసారి, మళ్లీ తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరంలో ఇనాగ్యరేషన్ అప్పుడు కూడా అక్కడి టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఈ రోజు అచ్చెన్నాయుడుగారు ఈ యాప్‌లు ఇవన్నీ తీసేయాలని అంటున్నారు. ఈ యాప్‌ల ద్వారానే అధ్యక్షా ఈ రోజు ఈ artificial intelligence సాంకేతిక పరిజ్ఞానం మనకు అందుబాటులోకి వచ్చింది, దాని ద్వారా ఈ రోజు without even visiting it టాయిలెట్స్ క్లీన్ అయ్యాయా లేదా అని చెప్పే ఒక యాప్‌ని ఈ రోజు మా ప్రభుత్వం వినియోగిస్తోందని మీ ద్వారా సభకు తెలియచేస్తున్నాను అధ్యక్షా. అంతే కాకుండా ఈ SOPతోపాటు ఒక టోల్‌ఫ్రీ నంబరును కూడా ఈ రోజు ఏర్పాటు చేశాం. ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా జీతాలను నేరుగా ఆటో–డెబిట్ క్రిందకు తీసుకొచ్చాం. ఆ జీతాలను అక్కౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసే విధంగా చర్యలు తీసుకొచ్చారు. గౌరవ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిగారూ, ముందుగా మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

**ఉ.10.30**

సభలో ఈ రోజు ప్రశ్న అడిగారు కాబట్టి ఏయే మెటీరియల్ వాడుతున్నాం, ఎంతగా దీనిని వినియోగిస్తున్నామో సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

(శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఆరు నెలల క్రితం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు)

బిల్లులు పెండింగ్‌లో ఉంటాయి. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో స్కూల్స్ మూతపడినా కూడా మానవతా దృక్పథంతో ఆయాలకు ఆరు నెలల పాటు వెయ్యి రూపాయల చొప్పున జీతాలు ఇచ్చామని

గౌరవ సభ్యులకు మీ ద్వారా తెలియజేస్తున్నాను. స్కూల్స్ మూతపడినా వారికి జీతాలు ఇచ్చాం. వాళ్లా మమ్మల్ని ప్రశ్నించేది? గత ప్రభుత్వం ఒకటిన్నర సంవత్సరం బకాయిలు పెట్టి 2018 తరవాత వారు జీతాలు పెంచేసి ఆ జీతాలు చెల్లించకుండా చేతులెత్తేసి వెళ్లిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రూ.160కోట్లు బకాయిలు చెల్లించాం.

(గౌరవ ప్రతిపక్ష సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు అభ్యంతరం వ్యక్తం చేశారు)

మీరు ఊరికినే మాట్లాడటం కాదు. ఏదో అడిగామంటే అడిగామని కాకుండా వాస్తవాలు మాట్లాడండి. నేను వాస్తవంగా చెబుతున్నాను. గౌరవ సభ్యురాలు టాయిలెట్స్ మెరుగుపరచమని ఇందాక అడిగారు. ఆయాలను నియమించడం ద్వారా, నాడు-నేడు ద్వారా టాయిలెట్స్‌ను ఆధునీకరించడం ద్వారా బాలికల్లో డ్రాపౌట్ రేషియో తగ్గింది మరియు ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. రాబోయే రోజుల్లో వీటిని ఇంకా మెరుగుపరిచే విధంగా చేస్తాం. దేశంలో ఎక్కడా లేని విధంగా టాయిలెట్స్ మెయింటినెన్స్ ఫండ్ రూ.400కోట్లు మంజూరు చేశారు. టాయిలెట్స్ మెయింటినెన్స్ ఫండ్ అంటూ ఒక ఆలోచన చేసి దానిని రెగ్యులర్‌గా మెయిన్‌టెయిన్ చేసే ఒక వ్యవస్థను ఏర్పాటు చేశామని గౌరవ సభ్యులకు, సభకు తెలియజేస్తున్నాను. అది వారికి కనిపించడం లేదు.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)**: అధ్యక్షా, కరోనా సమయంలో ఆఫీసు తెరవక పోయినా, అసెంబ్లీ పనిచేయకపోయినా, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఫుల్ జీతాలు ఇచ్చారా, లేదా? కటిక పేదలు పని చేసే స్వీపర్లకు వెయ్యి రూపాయలు ఇచ్చారని ఎలా చెబుతారు? వారికి వెయ్యి రూపాయలు ఇచ్చి ఎలా సరిపెడతారు, ఇది అన్యాయం కాదా, వాళ్లకు వెయ్యి రూపాయలు ఇవ్వడం ఏమిటి?

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH)**: అధ్యక్షా, గత ప్రభుత్వం రూ.160కోట్లు పెండింగ్ పెట్టడం అన్యాయం కాదా? మీకు వారి జీతాలు పెంచమనే హక్కు లేదు. వారిని పిలిచినప్పుడు మీరు జీతం ఇవ్వాలి కదా ! మీరు బకాయిలు పెట్టి ఎలా వెళ్లి పోతారు?

**డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA SWAMY)(కొండేపి)**: అధ్యక్షా, మా ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మంత్రిగారు అంటున్నారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. మీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద వాడుకున్నారు. గత ప్రభుత్వానికి సంబంధించిన బకాయిలను తీర్చాల్సిన బాధ్యత ఇప్పటి ప్రభుత్వానికి ఉంది. అంతేగానీ, మీ జేబులో నుంచి వారికి ఇవ్వలేదు. మీరు ప్రజాధనం నుంచి చెల్లిస్తారు. ఆ విషయాన్ని మంత్రిగారు గమనించాలి. స్కూళ్లలో పారిశుద్ధ్య కార్మికులకు మూడు సంవత్సరాలు జీతాలు ఇవ్వకుండా ఒక్క సంవత్సరం చెల్లించారు. అమ్మ ఒడి పథకానికి రూ.15,000లు ఇచ్చి మళ్లీ రూ.1000 వెనక్కి తీసుకున్నారు. ఆ తీసుకున్న డబ్బులు డిఈఓ ఆఫీసులో కట్టించుకున్నారు తిరిగి స్కూళ్లకి ఇస్తామని చెప్పారు కానీ మళ్లీ ఇచ్చిన దాఖలాలు లేవు. పేరుకి రూ.15000లు ఇస్తున్నామని అంటున్నారు. ఈ సంవత్సరం కూడా రూ.1000/-లు తగ్గించి ఇచ్చారు. ఆ తరవాత ఎక్కువ మందిని తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు లేరని పాఠశాలలు మూతవేయడం వాస్తవమా ? కాదా? మీ నియోజకవర్గంలో

చూపిస్తాను. మద్దిరేవులలో పిల్లలు వెళుతున్నారు గానీ స్కూల్స్ merge అయ్యాయని చెబుతున్నారు. నా నియోజకవర్గంలో నాడు-నేడు అని గొప్పలు చెప్పి సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఉన్న బిల్డింగ్‌ని కూల్చేసి మొండి గోడలు మిగిల్చారు. నాడు బిల్డింగు ఉంటే నేడు మొండి గోడను మిగిల్చారు. కస్తూర్బా పాఠశాల బిట్రగుంటలో మొండి గోడను వదిలేసి ఇరుకు గదుల్లో పిల్లలను పెట్టారు. మీరు నా నియోజకవర్గానికి రండి చూపిస్తాను. మంత్రిగారిది, నాది ఒక్కటే జిల్లా. మీరు, నేను, జిల్లా కలెక్టర్‌గారు అందరం వెళ్లి స్కూల్‌ని చూసి వద్దాం. ఇక్కడ పబ్లిసిటీ చేసుకోవడం కాదు. నేను వాస్తవం చెబుతున్నాను. (మైకు కట్ చేయబడింది)

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)ः** అధ్యక్షా, ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని అందరికీ తెలిసిన విషయమే. అయితే నిరంతర ప్రక్రియ అని ఎన్నికలు మూడు నెలలు ఉన్నాయనగా పింఛన్లు, అలాగే పసుపు-కుంకుమ కూడా ఇచ్చారు. ఆ బిల్లులు రూ.40,000కోట్లు works and services bill, power sector మీద, సివిల్ సప్లై మీద బిల్లులు, కంటిన్యూయస్ అనే ఒక గొడుగు కింద ఎన్నికలకు మూడు నెలల ముందు push చేయడం కరెక్టు కాదని తెలియజేస్తున్నాను. ఏదైనా బ్రాడ్‌గా చూడాలి. అమ్మ ఒడి పథకం దేశవ్యాప్తంగా అప్రిషియేట్ చేసిన ప్రోగ్రాం. మొట్టమొదటి సారిగా ఎవరైతే బాల బాలికలు పాఠశాలలకు వెళుతున్నారో వారి తల్లులను ప్రోత్సహించడం కోసం అమ్మ ఒడి కార్యక్రమం చేస్తున్నాం. అందులో భాగంగా మన పరిసరాలు మనం క్లీన్‌గా పెట్టుకోవాలి, పరిశుభ్రత అనేది పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాటు కావాలనే ఉద్దేశంతో చేస్తే, అసలు ప్రోగ్రాంను పక్కన పెట్టారు. కేవలం లైవ్ టెలికాస్ట్ ఉందని ఈ అసెంబ్లీ ద్వారా ప్రజలకు చేరుతుందని చిన్న ఇస్యూని పట్టుకున్నారు.

నాడు-నేడు మూడు ఫేజుల్లో జరుగుతోంది. మూడు ఫేజులల్లో జరిగేది పట్టించుకోరు. అసలు వారిది (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) విచిత్రమైన ఆలోచనా విధానం. వారు ఎవరికీ అర్థం కారు. ఎవరైనా బిల్డింగు కట్టేటప్పుడు దాన్ని రిపేరు చేయడం తప్పుతుందా? ఎక్కడైనా రాత్రికి ఆపేసి పొద్దున్న మొదలు పెడతారా? Dilapidated buildings ఉన్నప్పుడు ఒక్కొక్కసారి రూఫ్ తీయవలసి ఉంటుంది. రూఫ్ తీసిన తరవాత lay చేయాల్సి వస్తే కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. పెయింటింగ్‌కు ఒక రకమైన సమయం, రిపేర్లకు ఒక రకమైన సమయం పడుతుంది, రూఫ్ replace చేయాలంటే ఇంకొంత సమయం పడుతుంది. ఇవి చిన్న చిన్నవి, executionలో భాగంగా చేసిన పనులను వదిలేసి చిన్న చిన్న విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చి ప్రభుత్వాన్ని తప్పు అని అనడం సమంజసం కాదు.

**డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA SWAMY)ः** అధ్యక్షా, మంత్రిగారు, మైకు ఉంది, లైవ్‌లో వస్తోందని అంటున్నారు. ఒకప్పుడు జగన్మోహన్‌రెడ్డిగారి పక్కన బుగ్గన తిరిగేవారని జనాలందరూ చెవులు కొరుక్కుంటున్నారు. మధ్యలో బుగ్గన గారిని పక్కన పెట్టేశారని అంటున్నారు. ఇవాళ లైవ్ వచ్చింది కదా అని అవకాశం తీసుకుని మాట్లాడుతున్నారు. ఇంకొక విషయం నేను చెప్పింది వాస్తవం అని పరోక్షంగా అంగీకరించారు. బిల్డింగును కూల్చేసి మొండి గోడలు మిగిల్చింది వాస్తవం. కస్తూర్బా పాఠశాల బిట్రగుంటలో పిల్లలకు

అకామిడేషన్ ఇవ్వకుండా కొత్తగా కట్టిన బిల్డింగును అర్ధాంతరంగా కూల్చేసి నాడు-నేడు రిపేర్లు చేయడం వాస్తవం. ముప్పవరం హైస్కూల్‌లో కిటికీ తలుపులు లేకుండా ఉంటే నాడు-నేడులో పూర్తి చేశారు. వీటన్నింటికీ బిల్డింగు పనులు పూర్తి చేసి బిల్లులు చేసుకోవడం వాస్తవమా కాదా? విద్యాశాఖా మంత్రిగారిది, మాది ఒక్కటే జిల్లా. ఇద్దరం కూర్చొని, చర్చ పెడదాం, వాస్తవాలు చెబుదాం. ఇంతకుమించి నేను ఏమీ చెప్పదలుచుకోలేదు. నేను చెప్పిన స్కూల్‌కి కలెక్టరుగారు, మీరు, నేను ముగ్గురం వెళదాం. నేను చెప్పింది వాస్తవం అయితే అంగీకరించండి. నా నియోజకవర్గంలో ఉన్న సమస్యల గురించి చెప్పాను. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటివి చాలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి జీతాలు రూ.4000లు ఇచ్చిన మాట వాస్తవమని మీరు అంగీకరించారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రూ.2000లు పెంచారని చెబుతున్నారు. ఈ పెంచినది కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఈ రోజుకు కూడా ఈ రెండు పాఠశాలల్లో జీతాలు రాక అక్కడి సిబ్బంది ఇబ్బంది పడే విషయం మంత్రిగారి దృష్టికి వచ్చిందా రాలేదా అని అడుగుతున్నాను. ఒకవేళ చెల్లించని వారికి ఎప్పుడు చెల్లిస్తారని అడుగుతున్నాను. మా నియోజకవర్గంలో జీతాలు చెల్లించని వారి వివరాలు మీకు పంపిస్తాను. అదే విధంగా, కనీస వేతనం రూ.10,000లు పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలనే డిమాండ్ వారి నుంచి వస్తోంది. దానిని మీరు అమలు చేయాలని సభ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**మిస్టర్ స్పీకర్(MR.SPEAKER)** : అశోక్ బెందాళం, మంతెన రామరాజు గారు.. మినిస్టర్‌గారు..

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH)**: అధ్యక్షా, గత ప్రభుత్వ హయాంలో టాయిలెట్స్ లేక స్కూళ్లలోని విద్యార్థినులు (బాలికలు) అత్యవసరమైతే ఇంటికి వెళ్లేవారు.

( పతాక శీర్షికలో వచ్చిన పేపర్ క్లిప్పింగ్‌ను సభకు చూపించారు)

గత ప్రభుత్వ హయాంలో ఆయాల జీతాలకు సంబంధించి రూ.17కోట్లకు పైగా బకాయిలు పెట్టారు. వారందరు రోడ్డు మీదకి వస్తే కూడా పట్టించుకోలేదు. రూ.17కోట్లు కూడా బకాయిలు పెట్టారు. సుప్రీంకోర్టు అక్షింతలు వేస్తే గత ప్రభుత్వం ఆయాల జీతాలను రూ.1000ల నుంచి రూ.2000లకు పెంచింది.

**ఉ.10.40**

**డా.ఆదిమూలపు సురేశ్ (DR.AADIMULAPU SURESH)**:మేం రూ.2000 నుంచి రూ.6000 చేశాం. వారు రూ.17కోట్లు చెల్లించకుండా ఆయాలను రోడ్ల మీదకు లాగారు. (పేపర్ కటింగ్‌ను సభకు చూపిస్తూ)

(శ్రీ డోల బాలవీరాంజనేయస్వామిచే సభకు అంతరాయం)

**మిస్టర్ స్పీకర్(MR.SPEAKER)**ఃఆయన చెబుతున్నారు కదా వినండి. తరవాత మీరు మాట్లాడండి.

**డా.ఆదిమూలపు సురేష్ (DR. AADIMULAPU SURESH)**ఃలో 17కోట్ల రూపాయలు చెల్లించలేక ఆయాలను రోడ్ల మీదకు లాగిన ప్రభుత్వం వాళ్లది. వాళ్లు పెట్టిన రూ.159కోట్ల బకాయిలను మొత్తం మేము చెల్లించడమే కాకుండా దానికి అదనంగా రూ.160కోట్లను మేము చెల్లించాం. స్పీకర్ గారు అనుమతి ఇస్తే ఆ వీడియోలను ఒకసారి చూపిస్తాను.

(సభలో ఫొటోలు ప్రదర్శించారు)

సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి గారి నియోజకవర్గం కుప్పంలో పాఠశాలల ఫొటోలు కూడా చూపిస్తాం. ఏవిధంగా వాళ్లు బిల్డింగ్స్ కట్టారో తెలుస్తుంది. ఆయన ఏదో తలుపు రెక్క పడటం లేదు. తలుపుకు రెక్కలు పెట్టలేదు అని అంటున్నారు. నాడు–నేడు క్రింద టాయిలెట్లను ఏవిధంగా ఆధునీకరించామో ఒకసారి చూడమనండి.

(ఎన్ని పాఠశాలలకు చేశారు అని ప్రతిపక్షసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు)

15,715స్కూల్స్‌లో టాయిలెట్స్ ఆధునీకరించాం.

(కళ్లు ఉంటే కనిపిస్తాయి అని అధికారపక్షసభ్యులు కరణం ధర్మశ్రీ గారు అనగా, మాకు కళ్లు, చెవులు ఉన్నాయని ప్రతిపక్షసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు)

**మిస్టర్ స్పీకర్(MR.SPEAKER)** ఃధర్మశ్రీ గారు ప్లీజ్... No cross talking.

**డా.ఆదిమూలపు సురేష్ (DR.AADIMULAPU SURESH)**ఃచిత్తూరు జిల్లాలో కూడా ఉన్నాయి. ఈ రోజు పూర్తిగా saturation మోడ్‌లో ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలల్లో ఈ విధంగా టాయిలెట్స్ చెయ్యాలని ఫేజ్–2, ఫేజ్–3 కింద సుమారు రూ.16,000కోట్ల బడ్జెట్ కేటాయించామని తెలియజేస్తున్నాను. రూ.17కోట్లు చెల్లించలేక ఆయాలను రోడ్లపైకి తీసుకొచ్చిన వాళ్లు ఈ రోజు మమ్మల్ని ప్రశ్నించడం కరెక్ట్ కాదు అధ్యక్షా.

(ఎంత ఖర్చు పెట్టారు, మీరు బిల్లుల చెల్లించడం లేదని ఎక్కడ పనులు అక్కడే ఆపేశారు అని ప్రతిపక్షసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు)

ఈ రోజు ఎక్కడా కూడా వాళ్లకి ఇబ్బంది కలగకుండా ఆయాల వర్కింగ్ కండిషన్స్ గణనీయంగా మెరుగుపరిచే విధంగా వాళ్లకి అన్ని amenities ఇస్తూ, అన్ని మెటిరీయల్స్, consumables, gloves, aprons, mopping sticks అన్నీ అందిస్తూ, ఒక పర్మినెంట్ మెకానిజం ఏర్పాటు చేసి ఈ రోజు నాడు–నేడు క్రింద ఫౌండేషన్ స్కూల్స్ వస్తే అవి వృథా అయిపోతాయని వాళ్లు అంటున్నారు.

నాడు-నేడు కింద 10 ఐటమ్స్ తీసుకోవడం జరిగిందో ఆ 10 ఐటమ్స్ ద్వారానే ఈరోజు ఒక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాం. దానికి తోడు నాణ్యతా ప్రమాణాలు జోడించి ఉపాధ్యాయులలో నైపుణ్యతను పెంచి తద్వారా విద్యా ప్రమాణాలు పెంచాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి ఆలోచన. We have got a proper, perspective plan. ఏదో తూతూ మంత్రంగా ఎన్నికల ముందు చెయ్యడం కాదు. Government is a continuous process అని గతంలో వందల కోట్ల రూపాయలు విద్యార్థులకు, ఆయాలకు చెల్లించలేదు. రాష్ట్రంలో ఉన్న వృద్ధులకు పింఛన్లు ఇవ్వరు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూడలేక ఈ రోజు ఏదో ఒకటి మాట్లాడడం సరికాదని వారికి హితవు పలుకుతున్నాను.

## రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్లు

**ప్రశ్న నెం.1572 (3)**

**సర్వశ్రీ/శ్రీమతి ధర్మాన ప్రసాద రావు,ఆర్.కె.రోజా,డా.మొండితోక జగన్మోహన్ రావు, కె.వి.ఉషశ్రీ చరణ్,**

**రాజన్నదొర పీడిక, కాకాని గోవర్ధన రెడ్డి, ఎంఎల్ఏలు,**

**గౌరవనీయులైన పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా**

ఎ) ప్రభుత్వం 2014-19 మరియు 2019 నుండి ఇప్పటివరకు సంవత్సరం వారీగా మంజూరు చేసిన పింఛన్ల సంఖ్య మరియు పింఛన్లపై పంపిణీ చేసిన మొత్తం పరిమాణం ఎంత?

బి) రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ల వయోపరిమితిని 65 నుండి 60 సంవత్సరాలకు ప్రభుత్వం తగ్గించిందా?

సి) అయితే, వయో పరిమితిని తగ్గించడం వల్ల లబ్ధి పొందిన వ్యక్తుల సంఖ్య ఎంత?

**పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి(శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి) గారి సమాధానం**

ఎ) 2014-15 ఆర్థిక సంవత్సరం నుండి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు మంజూరైన పింఛన్లు మరియు పంపిణీ చేయబడిన మొత్తం పరిమాణం క్రింది విధంగా ఉంది.

| వరుస సంఖ్య | ఆర్థిక సంవత్సరం | మంజూరు చేసిన పింఛన్ల సంఖ్య | పంపిణీ చేసిన పింఛన్ల సంఖ్య | పంపిణీ చేసినవి (రూ.కోట్లలో) | నెలవారీ నగటు (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 1. | 2014-2015 | 4342515 | 4028908 | 3378.46 | 281.54 |
| 2. | 2015-2016 | 43227521 | 4022480 | 5220.26 | 435.02 |
| 3. | 2016-2017 | 4363593 | 4193102 | 5288.71 | 440.73 |
| 4. | 2017-2018 | 4619912 | 4309142 | 5472.82 | 456.07 |
| 5. | 2018-19 | | | | |
| | ఎ) ఏప్రిల్, 2018 నుండి అక్టోబర్ | 4688604 | 4266729 | 3513.17 | 501.88 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | 2018 వరకు | | | | |
| | బి) నవంబర్, 2018 నుండి మార్చి 2019 వరకు | 5387513 | 5166732 | 4814.15 | 962.83 |

2019-20 ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటివరకు మంజూరు చేసిన పింఛన్ల సంఖ్య మరియు పంపిణీ చేసిన మొత్తం పరిమాణం క్రింది విధంగా ఉంది.

| వరుస సంఖ్య | ఆర్థిక సంవత్సరం | మంజూరు చేసిన పింఛన్ల సంఖ్య | పంపిణీ చేసిన పింఛన్ల సంఖ్య | పంపిణీ చేసినవి (రూ.కోట్లలో) | నెలవారీ సగటు (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 1. | 2019-2020 (మే, 2019 నుండి మార్చి, 2020 వరకు) 11 నెలలు | 5885285 | 5561527 | 14400.48 | 1309.13 |
| 2. | 2020-2021 | 6194245 | 5908759 | 16923.86 | 1410.32 |
| 3. | 2021-2022 (ఏప్రిల్, 2021 నుండి ఫిబ్రవరి, 2022 వరకు 11 నెలలు) | 6174671 | 6116439 | 15849.45 | 1440.86 |

బి) అవునండీ, జూన్ 2019 నుండి.

సి) ఫిబ్రవరి, 2022 వరకు వయస్సును 65 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు తగ్గించినందు వలన 10,60,208 మంది పింఛనుదారులు లబ్ధి పొందారు.

**శ్రీమతి ఆర్.కె.రోజా(SMT. R.K.ROJA)(నగరి)**: అధ్యక్షా, వైఎస్సార్ పింఛను కానుక ఈ దేశంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా రికార్డు స్థాయిలో చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పుడే మా మంత్రివర్యులు చెప్పిన వివరాలు చూస్తుంటే ఇంత గొప్ప మనసున్న ముఖ్యమంత్రి ఈ రాష్ట్రంలో గతంలో ఎప్పుడైనా ఉన్నారా, ఈ దేశంలోనే ఎక్కడైనా ఉన్నారా అని అడుగుతున్నాను. ఎందుకంటే జగనన్న మండుటెండల్లో పాదయాత్ర చేస్తున్నప్పుడు ఆయన కాళ్లకు బొబ్బలెక్కినా కూడా ప్రజల కష్టాలు తెలుసుకోవాలని ఆ నడకను కొనసాగించారు. తమ కాళ్లకి

చెప్పులు లేకపోయినా, తమ ఒంట్లో సత్తువ లేకపోయినా అవ్వా-తాతలు రాజన్న బిడ్డ వస్తున్నాడు, మన కష్టాలు చెప్పుకుంటే ఆయన తీరుస్తాడన్న నమ్మకంతో వచ్చారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాను చెప్పిన విధంగా పింఛను రూ.3000 వరకు పెంచుకుంటూ వెళతానన్నారు. ఇప్పుడు రెండున్నర సంవత్సరాలు అవుతోంది. రూ.2500ల వరకు పెంచడం మనం కళ్లారా చూశాం. వైఎస్సార్ గారు రూ.200లు పింఛను ఇచ్చేటప్పుడు అవ్వా-తాతలు మమ్మల్ని గుర్తించి ఇచ్చారని గర్వంగా ఫీల్ అయ్యారు. అదే జగనన్న రూ.2500లు ఇస్తున్నప్పుడు వాళ్లకు ఆయుష్షు పెంచినట్లయ్యింది. ఎందుకంటే ఈ రోజు కన్నబిడ్డలే తమ ఇంట్లో పెద్దవాళ్లని భారంగా భావించి వదిలించుకోవాలని చూస్తుంటే ఈ రోజు అవ్వా-తాతలకు ఒక పెద్ద కొడుకులా అండగా జగన్మోహన్‌రెడ్డి గారు నిల్చున్నారు. ఈ రోజు జగనన్న ఇచ్చే పింఛనును డబ్బుగా మాత్రమే చూడడం లేదు. అవ్వా-తాతలు, వికలాంగులు, ఒంటరి మహిళలు, అభాగ్యులు అందరూ దానిని కొండంత ధైర్యంగా భావిస్తున్నారు. నెల వచ్చేసరికి మందులు లేకపోతే మనం ఏమై పోతామో డబ్బులు లేవని బాధ పడే స్థాయి నుంచి ఈ రోజు జగనన్న ఇచ్చే పింఛనుతో వాళ్లు సంతోషంగా ఉంటున్నారు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో లాక్‌డౌన్‌లో తమ పింఛను డబ్బులను తమ కొడుకు కుటుంబ అవసరానికి సహాయం చేసే స్థాయికి ఎదిగారు. కొవిడ్ సమయంలో ప్రపంచమంతా స్తంభించినా జగనన్న మాత్రం పింఛను ఆపలేదని మీ అందరికీ తెలుసు. అలాగే 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకి పింఛను వయసును తగ్గించారు. ఎందుకంటే చాలామంది పేదవాళ్లు ఉన్నారు. ఎక్కువమంది లబ్ధి పొందాలని ఆయన ఆ విధంగా 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు మార్చారు. గత ప్రభుత్వాలలో పథకాన్ని అయితే పెట్టేవాళ్లు కానీ ఆ పథకంలో ఎక్కువ మందికి లబ్ధి చేకూరకూడదని, ఏ విధంగా కోతలు పెట్టుకుంటూ వచ్చారో మనం కళ్లారా చూశాం.

**ఉ.10.50**

అధ్యక్షా, జగనన్న ప్రభుత్వంలో ఎక్కువ మందికి సంక్షేమం అందాలని ప్రతీ సంక్షేమ కార్యక్రమంలో ఆయన చూడటమే కాకుండా దానికి ఒక టైమ్ లిమిట్ పెట్టేసి ఈరోజుకి ఉన్నవారికి ఈ అయిదేళ్లు ఇవ్వాలని అనుకోకుండా ఎప్పటికప్పుడు ఎవరైనా అప్లై చేసుకుంటే వాళ్లకు అర్హత ఉందా, లేదా అనేది వాలంటీర్ల ద్వారా ఎంక్వైరీ చేసి అర్హత ఉంటే వెంటనే వాళ్లకు అప్లికేషన్లను అప్‌లోడ్ చేయడమే కాకుండా 21 రోజుల్లో కొత్త పింఛను ఇవ్వడం జగనన్నకే సాధ్యమైందని ఈ సందర్భంగా తెలియచేసుకుంటున్నాను. ఎందుకంటే మనం గతంలో చూశాం. రూ.75/- పింఛను ఇవ్వడానికి అష్టకష్టాలు పడేవాళ్లు. కొత్త పింఛను ఇవ్వాలంటే ఎవరో ఒకరు చనిపోతే గానీ ఆ పింఛను ఇంకొకరికి ఇచ్చేవాళ్లు కాదు. రాజశేఖర్ రెడ్డి గారు వచ్చిన తరువాత పింఛన్లను పెంచి లబ్ధిదారులందరికీ న్యాయం చేస్తూ ఉంటే అప్పుడు మేము కూడా రూ.1000/- పింఛను ఇస్తామని తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. ఎన్ని సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది? అప్పుడెందుకు వాళ్లకు ఐడియా రాలేదనేది నాకు అర్థం కాలేదు. రూ.1000/- పింఛను పెట్టారు. మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి జగన్మోహన్ రెడ్డి గారు రూ.2000/- పింఛను ఇస్తామనగానే కరెక్టుగా నాలుగు నెలల ముందు వీళ్లు కూడా ఇవ్వడం మొదలు పెట్టారు. వాళ్లు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎందుకు

చేయలేదు? ఎన్నికల ముందు మాత్రమే ఎందుకు ప్రజల్ని మోసం చేయాలన్న ఆలోచన చేశారో అది వాళ్లకే తెలియాలి. ఆ విషయాన్ని ప్రజలు బాగా గుర్తించారు కాబట్టే వాళ్లు చేసిన మేజిక్‌ను ఎవరూ నమ్మకుండా మోసం అని అర్థం చేసుకుని బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారు.

అధ్యక్షా, మనం చూశాం. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు వికలాంగులకు నెలకు పింఛను రూ.1500/– మాత్రమే ఇచ్చేవాళ్లు. కానీ జగనన్న రూ.3000/– ఇస్తున్నారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి రూ.2500/– తెలుగుదేశం పార్టీ ఇస్తే, జగనన్న ప్రభుత్వం రూ.10,000/– ఇవ్వడం మనం కళ్లారా చూస్తున్నాం. ఇదే కాకుండా తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా, బోదకాలు, పక్షవాతం, కండరాల క్షీణత, తీవ్ర కిడ్నీవ్యాధితో బాధపడుతున్న వారికి, కుష్టువ్యాధి, కిడ్నీ లేదా కాలేయం, గుండె మార్పిడి జరిగిన వారికి కూడా వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త పింఛనును మంజూరు చేశారు. ఎందుకంటే వీళ్లందరికీ గతంలో పింఛను ఇచ్చిన దాఖలాలే లేవు. గొప్ప మనసుతో జగన్మోహన్ రెడ్డి గారు ఆలోచించి వీళ్లందరికీ పింఛన్లు ఇస్తున్నారు.

అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, మన ప్రభుత్వం ఇచ్చిన పింఛన్లు చూస్తే అర్హులైన పేదవాళ్లు మీద ఏ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుంది. 30 లక్షల మందికి మాత్రమే వాళ్లు పింఛన్లు ఇచ్చేవారు. కానీ వై.ఎస్.ఆర్.సి.పి. అధికారంలోకి వచ్చాక జగనన్న ప్రభుత్వం దాదాపుగా 62 లక్షల మందికి పింఛను ఇస్తోందని గర్వంగా చెప్పుకుంటున్నాము. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలని కలెక్షన్ కమిటీలు పెట్టారు. వాళ్లు ముసలోళ్లు, వికలాంగులు, వితంతువులని లేకుండా, ఎవరికి పింఛను మంజూరు కావాలన్నా ఆ కమిటీలకి డబ్బులు ఇవ్వాల్సిందే. అవినీతి సామ్రాట్లుగా కలెక్షన్ చేసి, పార్టీలు, కులాలు చూసి ఏ విధంగా వాళ్లు సంతకాలు పెట్టి, అర్హులైన వాళ్లకు పింఛన్లు రాకుండా చేశారో ఎక్కడైనా చర్చకు మేము రెడీ. ఈ రోజు మేము ఛాలెంజ్ చేస్తున్నాము. గత ఐదేళ్లలో వారు ఏ విధంగా పింఛన్లు ఇచ్చారు? ఈ రోజు మేము ఎంత పారదర్శకంగా పింఛన్లు ఇస్తున్నాము. అర్హులైన వారికి వారు ఇవ్వకుండా సిగ్గుచేటు, నగరి నియోజకవర్గంలో భర్త బ్రతికి ఉంటే వితంతు పింఛన్లు కూడా తీసుకున్నారు. ఇంతకన్నా నీచమైన సంస్కృతి మనం ఎక్కడా చూడం. అది తెలుగుదేశం ప్రభుత్వ సమయంలోనే జరిగింది. కానీ ఈ రోజు మీరు చూస్తే సచివాలయాల ద్వారా వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికి అర్హత ఉందో ఎప్పటికప్పుడు చూసి, అర్హత పొందిన వారికి అప్‌లోడ్ చేసి, వారికి పింఛను మంజూరైతే దానిని బోర్డు మీద అతికిస్తున్నారు. ఎవరైనా అది కరెక్టా, కాదా చూసుకోవచ్చు. ఒకవేళ తప్పని అనుకున్నప్పుడు వాళ్లు వచ్చి వీరికి అర్హత లేదు, ఇది తప్పు అని చెబితే దానిని ఎంక్వైరీ చేసి కరెక్టుగా ఉన్న వాళ్లకే ఇచ్చే విధంగా చాలా పారదర్శకంగా పింఛన్లు ఇస్తున్న విషయాన్ని ప్రతిపక్ష సభ్యులు తెలుసుకోవాలని చెబుతున్నాను.

అధ్యక్షా, జగన్మోహన్‌రెడ్డిగారు పాదయాత్రలో కులం, మతం, పార్టీ చూడం, అర్హుడైతే చాలు ఏ పథకమైనా పేదవాడికి అందిస్తామని చెప్పారు. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులకు చెప్పిన ఒకే మాట నాకు ఓటు వేయకపోయినా పరవాలేదు, అర్హుడైతే మాత్రం కచ్చితంగా సంక్షేమ

కార్యక్రమాలు గానీ, పింఛన్లు గానీ, హౌస్ గానీ "వారికి అందించాలని" చెప్పారు. వారి మాట ప్రకారం ఈ రోజు అందరూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఎంఎల్ఏలు అందరం కూడా ఆయన మాటనే శాసనంగా భావించి పార్టీలు, కులం, మతం చూడకుండా అన్ని సంక్షేమ కార్యక్రమాలు వాళ్లకు అందుతున్నాయో, లేదో చూసి ఏదైనా టెక్నికల్ ప్రాబ్లమ్ ఉండి రేషన్ కార్డు, ఆధార్‌కార్డులో తప్పులున్నా కూడా కరెక్టు చేసి మరీ ఇస్తున్నామని ఇది అందరూ తెలుసుకోవలసిన విషయమని చెబుతున్నాను. అధ్యక్షా, మబ్బులు అడ్డం వచ్చి సూర్యుడు ఉదయించడానికి కాస్త ఆలస్యమవుతుందేమో గానీ ఒకటో తేదీ వస్తే సూర్యుడు వచ్చేలోపలే అవ్వా, తాతలకు పింఛను ఇచ్చే కార్యక్రమాన్ని జగన్ సార్ ఎంత సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారో మీరందరూ చూస్తున్నారు. మొదటి రోజే 95 శాతం పింఛన్లు అందించడమే కాకుండా ఎవరికైనా ఆరోగ్యం బాగలేక ఆసుపత్రిలో ఉన్నా అక్కడకు వెళ్లి పింఛను ఇచ్చే కార్యక్రమాన్ని చేస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీలో ఎవర్ని అడగాలి, ఎక్కడ దరఖాస్తు చేయాలి, ఎప్పుడిస్తారో తెలియదు. 10, 15 రోజులు ఆఫీసుల చుట్టూ తిరగాలి. ఆ విధానం నుంచి ఈరోజు నేరుగా ఇంటికే వచ్చి పింఛను ఇచ్చే కార్యక్రమాన్ని చేస్తున్నారంటే ఎవరి ఇంటి ముందూ నిలబడకుండా, ఎవరి కాళ్లూ పట్టుకోకుండా ఎవరికీ లంచం ఇవ్వకుండా ఇంత పారదర్శకంగా చేస్తున్నారంటే ముఖ్యమంత్రి గారికి సెల్యూట్ చేస్తున్నాను. మనం ఉదయం నుంచీ క్వశ్చన్ అవర్‌లో చూస్తున్నాం. ఎడ్యుకేషన్ సిస్టమ్ మీద గానీ లేదా వేరే ఇస్యూస్ మనం మాట్లాడుతుంటే పెద్దలు అచ్చెన్నాయుడు గారు ఇది వారే చేశామని అంటారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు అవన్నీ చేయలేని వాళ్లు ఈ రోజు వారే చేశారంటే ఎవరైనా నమ్ముతారా? మళ్లీ వాళ్లు సిగ్గులేకుండా 1000 రోజుల జగనన్న పరిపాలన మీద ఛార్జ్‌షీట్ వేశారు. వెయ్యి సంవత్సరాలు తల కిందులుగా తపస్సు చేసినా ప్రజలకు నచ్చే విధంగా, ప్రజలు మెచ్చే విధంగా మీరు ఎప్పుడూ పరిపాలించలేరనే సంగతి తెలుసుకోండని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

ఈ ప్రభుత్వంలో ఏ సంక్షేమ కార్యక్రమమైనా ఎవరి కాళ్లు పట్టుకోకుండా, ఎవరికీ లంచం ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతుంది. గుడ్ గవర్నెన్స్ అంటే ఇది. ఇదీ పరిపాలన అంటే, ఇదీ విజన్ అంటే, తెలుసుకోండి. నోరు ఉందిగదా అని రన్నింగ్ కామెంటరీ చేయడం కాదు. మీకు (తెలుగుదేశం పార్టీకి) 14 సంవత్సరాలు ప్రజలు అధికారం ఇచ్చారు. అప్పుడేమో గాడిదలు కాశారు. ఇప్పుడు ఇక్కడకు వచ్చి అరుస్తున్నారు. వీలైతే సపోర్ట్ చేయండి. అభినందించండి, లేకపోతే సైలెంట్‌గా కూర్చోండి. అధ్యక్షా, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు థ్యాంక్యూ.

**శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి(SRI KAKANI GOVARDHAN REDDY)(సర్వేపల్లి):** అధ్యక్షా, ఈ రోజు గౌరవ మంత్రివర్యులు పింఛన్ల పంపిణీ మీద మేము అడిగిన ప్రశ్నకు వివరంగా సమాధానం ఇచ్చారు. అయితే వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీ అనేది ఒక కార్యక్రమమని చెప్పవలసిన అవసరముంది. ప్రజలకు గతంలో ఏమి జరిగింది, ఈరోజు ఏమి జరిగిందనేది తెలియాల్సిన అవసరం

ఉందని అభిప్రాయపడుతున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించడమే రూ.1000/–పింఛను పంపిణీని 40 లక్షల మందితో ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 55,61,527 మందికి రూ.2250/– పింఛన్‌తో పంపిణీ ప్రారంభించింది. చివరకు 2018–19 అక్టోబర్ వరకు 42,66,000 మందికి వాళ్లు పింఛన్లు ఇచ్చి ఎన్నికలకు ముందు పింఛన్లు పెంచడం, అదనంగా పింఛన్లు ఇవ్వడమనేది వాళ్ల ఆనవాయితీ కాబట్టి చివరిలో అంటే నవంబర్, 2018లో 9లక్షల మందికి అదనంగా ఇచ్చి 51 లక్షల పింఛన్లు ఇచ్చామని చెప్పుకుంటే ఈ ప్రభుత్వం 55,61,000తో ప్రారంభించి ఈరోజు 61,16,000 మందికి పింఛన్లు ఇస్తోంది. ఆ ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో రూ.27,687కోట్లు ఖర్చు పెడితే ఈ ప్రభుత్వం 33 నెలల కాల వ్యవధిలో రూ.47,174కోట్లు ఖర్చు పెట్టిన ఘనత ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారిదని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

**ఉ.11.00**

అదే విధంగా 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పింఛను వయో పరిమితి తగ్గించడం వల్ల దాదాపుగా 10 లక్షల 60 వేల మంది ఈ రోజున లబ్ధి పొందారు. వాస్తవానికి ప్రతిపక్షంలో శాసనసభ్యులుగా ఉన్నప్పుడు పింఛను పంపిణీ ఎంత గందరగోళంగా ఉండేదంటే గ్రామాల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి. గతంలో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ప్రతిపక్ష పార్టీ శాసనసభ్యుడికి ఉండేది. ఆ పరిస్థితి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు కూడా ఎదురైంది. ఏ గ్రామానికి వెళ్లినా సరే, మాకు ఎందుకు పింఛను ఇవ్వరు, మాకు పెన్షన్ రావడం లేదని చాలా మంది ప్రశ్నించేవాళ్లు. ఈ రోజున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రిగారు తీసుకున్న నిర్ణయాల వల్ల శాసనసభ్యులు పింఛను విషయంలో తలెత్తుకుని గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉంది, గ్రామాలకు వెళ్తున్నాం. అందుకు కారణం జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం పేదవాళ్లకు అండగా నిలబడటమే. పేద ప్రజలకు ఆయనిచ్చిన భరోసానే కారణమని ప్రత్యేకంగా ఈ సందర్భంగా చెప్పాల్సిన అవసరం ఉంది.

అధ్యక్షా, గత ప్రభుత్వ హయాంలో వెయ్యి రూపాయల పింఛను అన్నారు. ఆ విషయాన్ని చంద్రబాబు నాయుడు గారు వారి పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు. దివ్యాంగులకు సంబంధించి రూ.1,500/- ల పింఛను ఇస్తానని చెప్పారు. ఈ రోజు అందరికీ తెలియాలని చెబుతున్నాను. ఎంత దారుణమైన పరిస్థితి ఆనాడు ఉండేదంటే, గ్రామాల్లో చంద్రబాబు నాయుడుగారు పర్యటించిన సందర్భంలో ఎవరైనా దివ్యాంగుడు పింఛను రాలేదంటే చంద్రబాబు నాయుడు గారు నాలుక మడతవేసి 80 శాతం అంగవైకల్యం దాటితే రూ.1,500/- లు పింఛను ఇస్తానని చెప్పానని అనేవాడు. పోనీ 80 శాతం అంగవైకల్యం పొందినవాళ్లకైనా పింఛను వస్తుందా అని చూస్తే ఎక్కడకు వెళ్లినా చివరకు వంద శాతం అంగవైకల్యం ఉన్నా సరే వైద్యులకు చెప్పించి 79 శాతం అంగవైకల్యం ఉన్నట్టుగా సర్టిఫికెట్లు జారీ చేయడం వల్ల దివ్యాంగులకు కూడా పెన్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టకుండా, న్యాయం చేయక చివరకు మొండి చెయ్యి చూపించిన గత తెలుగుదేశం ప్రభుత్వం నేడు ప్రతిపక్షంలో ఉండి పెన్షన్లపైన అన్యాయంగా మాట్లాడుతున్నారు. కానీ ఈ రోజున వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత

కార్మికులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులు, తలసేమియా, కిడ్నీ, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళలు తదితరులకు రూ.2,500/- ల నుంచి రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.10 వేల వరకు పెన్షన్ రూపంలో జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం అందిస్తోంది. గ్రామ వాలంటీర్లను లబ్ధిదారుడి ఇంటికే పంపించి ప్రతి నెల ఒకటవ తారీఖున పింఛను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. గ్రామ వాలంటీరు పింఛనుదారుడి గుమ్మం తలుపుతట్టి పింఛను మొత్తాన్ని లబ్ధిదారుడి జేబులో పెడుతున్నది వాస్తవం కాదా అని ప్రతిపక్షపార్టీ సభ్యులను అడుగుతున్నాను. ఆ ఘనత జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వానికే దక్కింది.

గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా పింఛను డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ ద్వారా పింఛను మొత్తం లబ్ధిదారుడికి అందేది. ఉదయం నుండి సాయంకాలం వరకు పింఛన్‌ను పంపిణీ చేసే పరిస్థితి ఉండేది. కానీ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి యాభై ఇండ్లకు ఒక వాలంటీర్‌ను నియమించడం వల్ల నెల తొలి రోజునే 95 శాతం వరకు పింఛను పంపిణీ కార్యక్రమం పూర్తి అయ్యే విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపుగా 99.25 శాతానికి తగ్గకుండా రెండు, మూడు రోజుల్లోనే పింఛను పంపిణీ కార్యక్రమం పూర్తి అయ్యేటట్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అనేక కారణాలున్నాయి. ఆ విధంగా పింఛను పంపిణీ చేయడానికి గల ప్రధాన కారణం ఆర్బీఐఎస్ యాప్, రియల్ టైమ్ బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ వంటివి ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. అనేక రకాల కారణాలతో గతంలో సకాలంలో పింఛను అందనివాళ్లకు ఈరోజున అవకాశం కల్గింది. అదే విధంగా కొత్త పింఛను మంజూరు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు గ్రామ సచివాలయ పరిధిలోనే ఈరోజున పింఛను మంజూరుచేసి లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. దానివల్ల పింఛను మంజూరీ కొరకు ఎవ్వరి వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి లేదు. గతంలో మాదిరిగా జన్మభూమి సభలతో పనిలేదు, జన్మభూమి కమిటీలతో పనిలేదు. ఎవ్వరి అవసరం లేకుండానే ఈరోజున నేరుగా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరుచేసి పంపిణీ చేసే ఏర్పాటు చేస్తున్నారు.

అధ్యక్షా, ఈ సందర్భంగా ఒక ఉదాహరణ చెప్పాల్సిన అవసరం ఉంది. మా నెల్లూరు జిల్లాలో ఒక దివ్యాంగుడు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి పెన్షన్ మంజూరు గురించి అడిగాడు. దుర్భర పరిస్థితి గతంలో ఉండేది. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గారు స్థానికంగా ఉన్న ఎంపీడీవోకు ఫోన్ చేసి పింఛను ఇవ్వండని చెప్పినప్పటికీ పాపం దివ్యాంగుడికి పింఛను ఇవ్వలేదు. స్థానికంగా ఉన్న ఎంపీడీవో అక్కడున్న జన్మభూమి కమిటీ సభ్యులను ప్రాధేయపడితే, అతనికి మేం పింఛను ఇవ్వము అని అంటే, అర్హత కల్గిన దివ్యాంగుడికి పెన్షన్ రాకపోయిన కారణంగా మరల జిల్లా కలెక్టర్ గారి వద్దకు వెళ్లితే, మళ్లీ జిల్లా కలెక్టర్ గారు సంబంధిత ఎంపీడీవోకు ఫోన్ చేసి అడిగితే, అందుకు ఎంపీడీవో స్పందించిన తీరు ఏమిటంటే, "నేను జన్మభూమి కమిటీ సభ్యులను బతిమలాడాను సార్, అయినప్పటికీ పింఛను కొరకు రికమెండ్ చేయలేదని" చెప్పాడు. అప్పుడు జిల్లా కలెక్టర్ గారు దివ్యాంగుడికి ఒక సలహా ఇచ్చారు. "అయ్యా నీవు ఏదో ఒక రూపంలో జన్మభూమి కమిటీ సభ్యులను బతిమలాడి సంతకం చేయించుకుంటే తప్ప నీకు

పెన్షన్ వచ్చే పరిస్థితి లేదని" తేల్చి చెప్పారు. ఎప్పుడో ఈ మధ్య ఒక సభలో, ఒక సమావేశంలో మాట్లాడేటప్పుడు దాన్ని ఉటంకిస్తే ఒక పెద్దాయన ఫోన్ చేశాడు. సార్, మీరు జిల్లా కలెక్టర్ వరకే ఆగిపోయారు, నేను పెన్షన్ మంజూరు కొరకు గవర్నర్ గారి వరకు పోయానని చెప్పాడు. ఆయన వివరాలు కూడా పంపించాడు, సార్.

ఆయన పేరు తన్నీరు రాధాకృష్ణ మూర్తి, ఇనిగల్లు గ్రామం, పర్చూరు మండలం, ప్రకాశం జిల్లా వాసి. ఆయన 19.12.2016 తేదీన సాక్షాత్తు గవర్నర్ గారికి పెన్షన్ మంజూరు కొరకు నాకు అర్హత ఉందని చెబితే గవర్నర్ గారి కార్యాలయం 16.01.2017 తేదీన దానికి సంబంధించిన రెప్రజంటేషన్ పంపిస్తే దాని మీద ఎంపీడీవో గారు వ్రాసిన లేఖ సారాంశం. "ప్రకాశం జిల్లా, పర్చూరు మండలం, ఇనిగల్లు గ్రామానికి చెందిన తన్నీరు రాధాకృష్ణమూర్తి అనే అర్జీదారుడు పింఛను మంజూరు చేయవల్సిందిగా గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గారి కార్యాలయానికి అర్జీ సమర్పించినట్టుగా ఈ కార్యాలయానికి కాపీ అందజేయడం జరిగింది. సదరు అర్జీదారు పేరును పెన్షన్ మంజూరు కొరకు ఇనిగల్లు గ్రామ జన్మభూమి కమిటీ సభ్యులు గానీ, మండల జన్మభూమి కమిటీ సభ్యులు గానీ సిఫారసు చేయని కారణంగా పెన్షన్ మంజూరు చేయలేకపోయామని ఇందుమూలంగా తెలియపరుస్తున్నాను" అని రిప్లై ఇచ్చాడు. గవర్నర్ గారు వ్రాసిన లేఖకు ప్రత్యుత్తరం వ్రాశాడు. సరే అనుకుని అంతటితో పెద్దాయన వదిలిపెట్టలేదు. ఆ పెద్దాయన మరల ముఖ్యమంత్రి గారి వద్దకు పెన్షన్ మంజూరు కొరకు వెళ్లాడు. ముఖ్యమంత్రి గారు ఎండార్స్ చేస్తూ ''అతి జరూర్'' అని దానికి సంబంధించి 2017 మార్చి మాసంలో ప్రాజెక్టు డైరెక్టర్ గారికి లేఖ వ్రాశారు. గౌరవ ముఖ్యమంత్రి గారు పై సూచికను అనుసరించి అర్జీదారు దాఖలు చేసిన అర్జీని పరిశీలించి రెండు రోజుల్లోగా దీనికి సంబంధించిన అర్జీదారునికి న్యాయం చేయండని ఆయనే కోరారు. దానికి మరల 14.03.2017 తేదీన మరల ఎంపీడీవో గారు లేఖ వ్రాశారు. గవర్నర్ గారు వ్రాశారు, మరల ముఖ్యమంత్రి గారు కూడా వ్రాసినప్పటికీ ఎంపీడీవో గారు వ్రాసిన లేఖ ఏమిటంటే, గౌరవ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ వారిని కోరిన అర్జీని సమర్పించిన మీదట సదరు అర్జీదారుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డును పరిశీలించిన మీదట పెన్షన్‌కు అర్హుడిగా గుర్తించి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా క్రింద పేరును నమోదుపర్చడమైనది, నమోదు సంఖ్య: N 5587244. కానీ గ్రామ జన్మభూమి ఆమోదంతో మాత్రమే పెన్షన్ మంజూరుచేయబడునని తెలియజేయడమైనదని చెప్పాడు. అంటే అర్హత కల్గిన వ్యక్తికి కూడా పెన్షన్ మంజూరుకాని పరిస్థితి గతంలో ఉండేది.

సార్, దీని కొస మెరుపు ఏమిటంటే, ఇందాక రోజా గారు చెప్పినట్టుగా పెన్షన్ మంజూరు కోరిన వ్యక్తి తన ఐడెంటిటీ కార్డు కూడా జతపరిచాడు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పత్రాన్ని కూడా అర్జీ వెంట జతపరిచాడు. నేను తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వ్యక్తినని తెలియజేసే ఐడెంటిటీ కార్డును కూడా అర్జీ వెంట జతపరిచాడు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నందున ఆ వ్యక్తికి సంబంధించిన వారికి ఆనాడు ఎలాగు పింఛను వచ్చేది కాదు, కనీసం తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను కూడా కనికరించే పరిస్థితి గతంలో లేదు. ఆ పెద్దాయన ఆనాడు పార్టీ కోసం పాదయాత్ర కూడా చేశాడు. ఇంతకన్నా సిగ్గుపడాల్సిన విషయం ఇంకేమి ఉంటుంది? చంద్రబాబు

నాయుడు గారు మామూలుగా మాట్లాడితే "గుడ్ గవర్నెన్స్" అంటాడు. కానీ ఇంతకన్నా దారుణమైన పరిస్థితులు ఎప్పుడైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మనం చూశామా? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్షేత్ర స్థాయిలో ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు చేసి సకాలంలో అందిస్తోంది. అనేక సందర్భాల్లో అర్హత లేకున్నా సరే పింఛను ఇవ్వాలంటే ఆనాడు ఫేక్ సర్టిఫికేట్లు జారీ చేసి అంగవైకల్యం ఉన్నట్టుగా చూపించి ప్రభుత్వ సొమ్మును గత ప్రభుత్వ పెద్దలు వృథా చేశారు. అంగవైకల్యం కల్గిన వాళ్లకు పెన్షన్ ఇవ్వకుండా అర్హతలేని వాళ్లకు ఫేక్ సర్టిఫికేట్లు ఇచ్చి వాళ్లకు పింఛన్లు మంజూరు చేయించిన వాళ్లపై కూడా విచారణ జరిపించమని మంత్రి గారిని కోరుతున్నాను. గతంలో మంజూరైన అక్రమ పింఛను విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ విషయాన్ని ఈ సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజు ఎన్నడూ లేని విధంగా పింఛన్లు మంజూరు చేయడం, ఇంటి ముంగిటే పింఛను సొమ్ము లబ్ధిదారుడికి అందిస్తున్నారు. గ్రామాల్లో తిరిగితే 99శాతం మంది సంతోషంగా ఉన్నారు. సచివాలయంలో కూర్చుని ప్రజల సమక్షంలో సమీక్షించినా సరే వాస్తవాలు తెలుస్తాయి. బ్రహ్మాండంగా ఈ రోజున పింఛను పంపిణీ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఎక్కడ కూడా పింఛన్లకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. అయితే, ఈ రోజున గౌరవ మంత్రి గారిని కోరుకునేది కొన్ని పింఛన్లు మాత్రం సాంకేతిక కారణాల వల్ల నిలుపుదల కాబడ్డాయి. ఎలక్ట్రిసిటి వల్ల గానీ, టూ వీలర్ ఉందనో రకరకాల కారణాల వల్ల పెండింగ్‌లో ఉండి నిలుపుదల కాబడిన పింఛన్లు ఇవాళ రీవెరిఫికేషన్‌కు వచ్చాయి, వాటిని కంప్యూటర్‌లో అన్‌ఫీడింగ్ చేశారు. అన్‌ఫీడింగ్ చేసి ప్రపోజ్ చేసేటప్పుడు కొన్ని పింఛన్లు అఫీషియల్ వెబ్‌సైట్లో అప్‌డేట్ అయి ఉన్నాయి కానీ ఆర్టీజీఎస్‌లో అప్‌డేట్ కానందువలన వెనక్కు వస్తున్నాయని చెబుతున్నారు కాబట్టి ఆర్టీజీఎస్ వెబ్‌సైట్లో కూడా అప్‌డేట్ చేసినట్లైతే పింఛన్లకు సంబంధించి పూర్తి స్థాయిలో అర్హులకు పింఛన్లు ఇచ్చినట్లు అవుతుంది. అదే విధంగా భర్తల స్థానంలో ఇచ్చే పెన్షన్లను భార్యలకు జాప్యం లేకుండా మంజూరు చేసే ప్రయత్నం చేస్తే బాగుంటుందని గౌరవ మంత్రి గారిని కోరుకుంటూ, ఈ రోజున ఇంత పెద్దయెత్తున పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం అధికారం చేపట్టిన 33 నెలల అనతి కాలంలో రూ. 47,174.00 కోట్ల విలువైన పింఛను మొత్తాన్ని దాదాపుగా గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో మంజూరు చేసి ఇచ్చిన మొత్తం పింఛన్లు కన్నా రెట్టింపు పింఛను మొత్తాన్ని మంజూరు చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**ఉ.11.10**

**శ్రీ పీడిక రాజన్న దొర (SRI PEEDIKA RAJANNA DORA):** అధ్యక్షా, పెన్షన్ల గురించి మంత్రిగారు మరియు గౌరవ సభ్యులు చాలా విషయాలను చెప్పారు. గతంలో స్వర్గీయ డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు రూ.50లు, రూ.75ల పింఛను రూ.200లకు పెంచి నిరుపేదలందరినీ ఆదుకుని మానవత్వమున్న మనిషిగా ఆనాడు నిరూపించుకున్నారు. నేడు మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిగారు మంచి మనసుతో పేద ప్రజలందరికీ సామాజిక భద్రతను కల్పించాలనే ఉద్దేశంతో

రూ.2500లు పింఛను మన రాష్ట్రంలో ఇవ్వడమనేది ఒక చరిత్ర. మన పొరుగు రాష్ట్రం ఒడిశాలో రూ.300ల నుంచి రూ.500లు ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలోని మరే ఇతర రాష్ట్రంలో పేదవారికి ఇంత భారీగా పెంచన్లుచెల్లించడం లేదు. దానికి ప్రధాన కారణం పేదల పట్ల మానవత్వంతో వ్యవహరిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు మరియు గౌరవ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారని చెప్పవచ్చు. మన రాష్ట్రంలో సుమారు 62లక్షల మందికి దాదాపు రూ.48వేల కోట్లు పెన్షన్ల రూపంలో చెల్లించడం జరుగుతోంది. కొంతమందికి మనవడిగా, ఇంకొంత మందికి కొడుకుగా, మరికొంత మందికి సోదరుడిగా ఒక అమ్మకు ఆపద వచ్చినా, ఒక చెల్లికి ఆపద వచ్చినా, ఒక తాతకు ఆపద వచ్చినా, ఒక అవ్వకు ఆపద వచ్చినా అందరికీ నేనున్నానంటూ భరోసానిస్తూ ఎన్నో రకాల పింఛను గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అందించడం జరుగుతోంది.

అధ్యక్షా, పెన్షన్ తీసుకునే వయస్సును తగ్గించి 10,60,203 పెన్షన్లను గౌరవ ముఖ్యమంత్రి గారు కొత్తగా మంజూరు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో గిరిజనుల కోసం 50 సంవత్సరాలకు పెన్షన్ ఇస్తామని జి.ఒ. ఇచ్చారు గానీ వారు ఎప్పుడూ దానిని సరిగా అమలు చేయలేదు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత 50 సంవత్సరాలు వయస్సు గల గిరిజనులందరికీ పెన్షన్‌ను చెల్లించడం జరుగుతోంది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 24 కేటగిరీలకు పెన్షన్‌ను చెల్లిస్తున్నారు. ఇన్ని కేటగిరీల పెన్షన్లు మన దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వడం లేదు. రూ.3వేల చొప్పున సుమారు 7.46లక్షల మందికి, రూ.5వేల చొప్పున 29,932 మందికి, రూ.10వేల చొప్పున 13,750 మందికి, అభయహస్తం ద్వారా రూ.500ల చొప్పున 1.43లక్షల మందికి, వికలాంగులు, వితంతవులు, ఒంటరి మహిళలకు రూ.2500ల చొప్పున మొత్తం 52,40,772 పెన్షన్లను మన రాష్ట్రంలో పేదవారికి చెల్లించడం జరుగుతోంది. మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ దళితులు, గిరిజనులు, బడుగు, బలహీన వర్గాలు, అగ్రవర్ణాలకు చెందిన పేద వారంతా బాగుండాలనే మంచి ఆలోచనతో గౌరవ ముఖ్యమంత్రి గారు ఇంత భారీఎత్తున పెన్షన్లను అందించడం జరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 18.37 లక్షల పింఛన్లను పెంచడం జరిగింది. ఇంతమంది పేద ప్రజలకు సేవచేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి గారు ఎల్లవేళలా బాగుండాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు.

అధ్యక్షా, చిన్న చిన్న సాంకేతిక లోపాల వల్ల, కొన్ని ఆప్షన్లు లేకపోవడం వల్ల, లబ్ధిదారులు కొన్ని సర్టిఫికెట్లు సమర్పించడం ఆలస్యమవుతున్న కారణంగా అక్కడక్కడ కొద్దిమందికి పెన్షన్ల చెల్లింపులో ఆలస్యం అవుతోంది. అవి రద్దు కాలేదు. దానిని కూడా ప్రతిపక్షం వారు రాజకీయంగా రాద్ధాంతం చేస్తున్నారు. ఈ విషయంపై దృష్టిపెట్టి వారికి కూడా పెంచన్లుసకాలంలో అందేలా చూడాలని గౌరవ మంత్రిగారిని మీద్వారా నేను కోరుతున్నాను.

అధ్యక్షా, అభయహస్తం పెన్షన్ కోసం రూ.500లు చెల్లిస్తున్నాము. ఆ పెన్షన్ వచ్చే మహిళకు భర్త చనిపోతే వితంతువు పెన్షన్ వస్తుంది. ఆ పెన్షన్ కోసం లాగిన్‌లో మార్పు చేయడానికి జిల్లాల్లో కొన్ని

ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదాయపు పన్నుకు సంబంధించిన ఆప్షన్ కూడా లేదు. వాటిని సరి దిద్దినట్లయితే సరిపోతుంది.

అధ్యక్షా, గతంలో ఇచ్చిన ఆధార్ కార్డులకు eKYC జరగలేదు. eKYC జరిగి దానిని మార్పు చేసే విధంగా సరైన ఆప్షన్ ఇస్తే 24 కేటగిరీల్లో ఉన్న వారందరికీ పింఛన్లు సకాలంలో వస్తాయి. 70 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి కూడా ఆధార్ కార్డులో తక్కువ వయస్సు నమోదు కావడం వల్ల వారికి పింఛన్లు రావడం లేదు. వారికోసం ఓటర్ కార్డును పరిగణనలోకి తీసుకుని వారికి కూడా అవకాశమిస్తే మరికొంతమంది పేదవారికి పింఛన్లు వచ్చే అవకాశముంది. ఈ విషయాలపై సంబంధిత కార్యదర్శి, సి.ఇ.ఒ.,కమీషనరు, గౌరవ మంత్రిగారు తగిన చర్యలు తీసుకున్నట్లయితే ఏ పార్టీకి కూడా మన ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం ఉండదు. దీనివల్ల మన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారికి ఇంకా మంచిపేరు వస్తుందని మీద్వారా తెలియజేస్తున్నాను.

**డా.మొండితోక జగన్మోహన రావు (DR.MONDITHOKA JAGANMOHANA RAO)(నందిగామ):** అధ్యక్షా, వృద్ధాప్య పింఛన్ల విషయంలో గతంలో ఉన్న విధానాలను సమూలంగా మార్పులు చేస్తూ, అట్టడుగు స్థాయి వ్యక్తికి ఇంటి వద్దనే పెన్షన్ వచ్చే విధంగా చర్యలు చేపట్టిన ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారికి నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, గతంలో ప్రభుత్వ విధానాలు ఎలా ఉన్నాయో, మన ప్రభుత్వ పరిపాలన పేద ప్రజల ఇంటి వద్దకే ఏ విధంగా వచ్చిందో గౌరవ సభ్యులు ఇంతకుముందే వివరంగా చెప్పారు. ఆసుపత్రుల్లో ఉన్న వారికి కూడా వాలంటీర్లు వారి వద్దకే వెళ్లి పింఛన్లు ఇచ్చిన సందర్భాలు కూడా మనం చూశాము. ఈ క్రమంలో కొన్ని చిన్నచిన్న సమస్యలను మీద్వారా మంత్రిగారికి తెలియజేస్తాను.

అధ్యక్షా, ముఖ్యంగా వృద్ధాప్య, వితంతువు పింఛన్ల విషయంలో కొంచెం ఇబ్బందిగా ఉంది. ఉదాహరణకు, ఒక ఇంటిపెద్ద చనిపోతే ఆ ఇంట్లో ఉన్న మహిళకు పింఛన్లు ఇచ్చే విషయంలో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాస్తవానికి వృద్ధాప్య మరియు వితంతువు పింఛన్లు కూడా ఆ ఇంటికి చాలా అవసరం. వివిధ కారణాల వల్ల ఆధార్ కార్డులో వయస్సు తక్కువగా నమోదు కావడం వల్ల కొంతమంది వృద్ధులకు పింఛన్లు రావడం లేదని గౌరవ సభ్యులు రాజన్న దొర గారు ఇంతకుముందే చెప్పారు.

**ఉ.11.20**

వివిధ కారణాలవల్ల కొంత మంది ఆధార్ కార్డుల్లో వయసు మార్పించుకుంటున్నారు. అందులో నిజం ఉండచ్చు లేకపోవచ్చు. ఆధార్ కార్డు నమోదు సమయంలో చదువు లేని కారణంగా కచ్చితమైన వయస్సు తెలియని కారణంగా ఎక్కువగా నమోదు చేయించుకున్నారు. నిజంగా వయసు ఎక్కువగా ఉండి ఆధార్ కార్డులో వయసు తక్కువగా ఉన్నందువలన వారికి వృద్ధాప్య పింఛను అందడం లేదు. వయస్సు మార్చుకున్నా కూడా పింఛను ఇవ్వడం లేదు. వయసు ఉండి వివిధ కారణాల చేత ఆధార్

కార్డులో వయసు తక్కువగా నమోదు చేసిన వారిని గుర్తించి అటువంటి వారికి కూడా పింఛను ఇచ్చే ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను.

ఎంత మందికి పింఛన్లు ఇచ్చామని కాదు, అర్హతలున్న ఏ ఒక్కరు కూడా పింఛను పొందకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి గారి ఉద్దేశం. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే వారి ప్రధాన ఉద్దేశం. రాష్ట్ర ప్రభుత్వం పింఛనుతోపాటు, కేంద్ర ప్రభుత్వం పింఛను కూడా వస్తుందని రాష్ట్రంలోని వృద్ధకళాకారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని పింఛన్లు గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. నిజమైన వృద్ధ కళాకారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పింఛను ఇవ్వాలని మీ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను. గతంలో ఆలస్యంగా పింఛన్లు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి గారి చొరవ కారణంగా ప్రతి నెలా ఒకటి, రెండు తారీఖుల్లో లబ్ధిదారులకు పింఛను అందుతోంది. ఈ విషయాలను ప్రభుత్వం పరిశీలించవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుకుంటున్నాను.

**శ్రీమతి కె.వి. ఉషశ్రీచరణ్(SMT.K.V.USHASRICHARAN)(కళ్యాణదుర్గం)**: అధ్యక్షా, వృద్ధాప్య పింఛన్ల దస్త్రంపై ముఖ్యమంత్రి గారు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సంతకం చేశారు. జనవరి 1వ తేది నూతన సంవత్సరం సందర్భంగా న్యూ ఇయర్ పింఛను కానుకగా సెలిబ్రేషన్స్ చేసుకున్నారు. అది రాష్ట్రంలోని వృద్ధులందరికీ ఆత్మగౌరవం పెంచే విధంగా ఉంది. ఈ పింఛన్ల పంపిణీ విషయమై గత ప్రభుత్వంతో సరి చూసుకుంటే జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే పింఛన్లు ఇచ్చేవారు. ఇప్పుడు గ్రామ సచివాలయాల ద్వారా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అర్హతలు కలిగిన వారందరికీ ఇస్తున్నాము. గత ప్రభుత్వ పదవీ కాలం ముగింపు సమయంలో, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పింఛను రూ.1000 నుండి రూ.2000 లకు పెంచారు. ఆ విషయాన్ని పసిగట్టి ఆ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో భారీగా ఓడించడాన్ని మనం చూశాం.

(గౌరవ ఉప సభాపతి అధ్యక్ష స్థానం వహించారు.)

ఈ ప్రభుత్వం పింఛను మొత్తాన్ని రూ.2000ల నుండి రూ.3000ల వరకు పెంచుకుంటూ పోవాలనుకుంది. ఈ సంవత్సరం రాష్ట్రంలో అర్హతలున్న వృద్ధులందరికీ నెలకు రూ.2500ల చొప్పున ఇస్తున్నాము, స్వతంత్రంగా బ్రతికేందుకు ఈ పింఛన్లు ఉపయోగపడుతున్నాయంటూ చాలా సంతోషంగా ఉన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకే అప్పటికప్పుడు ఆ ప్రభుత్వం పింఛన్లను పెంచింది. There is no medicine for jealousy. మన ప్రభుత్వం పెంచిన పింఛన్లను చూసి వారు అసూయతో విమర్శలు చేస్తున్నారు. There is really no medicine for jealousy అని చెబుతున్నాను.

మన ప్రభుత్వం పెంచిన పింఛన్లను చూసి వారు అసూయతో విమర్శలు చేస్తున్నారు. పారదర్శకత కనిపిస్తోంది. Each and every step from Secretariat, Volunteers, MPDO Office and our Collectors are also, అర్హతలు ఉండి పింఛన్లు పొందలేకపోయిన వారందరినీ గుర్తించి పారదర్శకంగా స్థానిక అధికారులంతా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అర్హతలున్నప్పటికీ వైఎస్ఆర్ పార్టీకి చెందిన వారు అని పింఛన్లు ఇవ్వకపోవడాన్ని గత ప్రభుత్వంలో చూశాం. గత

ప్రభుత్వంలో వృద్ధుల వయోపరిమితి 65 సంవత్సరాలు ఉండగా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి ఆ వయోపరిధిని 65 నుండి 60 సంవత్సరాలకు తగ్గించారు. ఆ విషయాన్ని పింఛనుదారులంతా మనసులో ఒక తీపి జ్ఞాపకంగా దాచుకున్నారు. నా నియోజకవర్గం కర్ణాటక సరిహద్దున ఉంది. సమీప సరిహద్దు కర్ణాటక రాష్ట్రానికి జీవనోపాధి నిమిత్తం ప్రజలు వెళ్లారు. అక్కడ పనులు చేసుకునే నా నియోజకవర్గానికి చెందిన పింఛను దారుల వద్దకు గ్రామ సచివాలయ సిబ్బంది నెల పింఛను అందిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా చూసినట్లైతే బిహార్ రాష్ట్రంలో రూ.500లు, మహారాష్ట్రంలో రూ.600లు, ఉత్తర ప్రదేశ్‌లో రూ.800లు, తమిళనాడులో రూ.1000లు, కర్ణాటకలో రూ.1200ల చొప్పున ఇస్తున్నారు. On the whole, India ను ఒక discussion కు తీసుకుంటే. only Andhra Pradesh State is giving Rs.2,500/- pension. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.2500 ల పింఛను ఇచ్చిన గౌరవం, ఘనత మన ప్రభుత్వానికి, మన ముఖ్యమంత్రి గారికే దక్కుతున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. వృద్ధాప్య, వితంతు పింఛను ఏ పింఛను తీసుకున్నా In all the 29 states of India, only Andhra Pradesh Stands First. దాని కోసమే మన ముఖ్యమంత్రి గారికి Good Governance award దక్కింది. There are some points to be raised on the Old age pensions. శాచ్యురేషన్ మోడ్‌లో పింఛన్లు ఇవ్వాలనుకుంటున్నాము కాబట్టి కొన్ని సార్లు ఈకేవైసీలో బయోమెట్రిక్ ద్వారా తీసుకోవడం జరుగుతోంది. ఫింగర్ ఐడెంటిటీ విధానంలో సర్వర్ సపోర్ట్ చేయక చాలా మంది బాధపడుతున్నారు. ఆ విధానాన్ని సరిచేసుకుని ముందుకు వెళ్లాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుకుంటున్నాను. గ్రామాలలో చూసినట్లైతే కొన్ని చోట్ల మహిళలు తమ భర్త చనిపోయిన కారణంగా పుట్టింటికి వచ్చి నివసిస్తున్నారు. ఒకే ఇంటిలో నివసించే ఇద్దరు మహిళలలో ఒకరు వృద్ధులు కాగా, మరొకరు వితంతు మహిళగా ఇద్దరూ పింఛను పొందవలసి ఉంటుంది. ఈ విషయంలో కూడా ప్రభుత్వం వారి అర్హతలను పరిశీలించి మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి అర్హతలున్న ఆ ఇద్దరు మహిళలకూ పించన్లు ఇవ్వాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

We are covering lot of diseases like Kidney Dialysis, Thalassemia and Sickle cell anaemia. Present life style కారణంగా చాలామంది విద్యార్థి దశలోనే క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. వారిలో ఆర్థిక స్థోమత లేని వ్యాధి గ్రస్తులను గుర్తించి, వారి వైద్య ఖర్చులను భరించే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టాలని మీ ద్వారా కోరుతున్నాం. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పడ్డాయి కాబట్టి వయసు తక్కువగా నమోదయ్యి పింఛన్లు పొందలేకపోతున్న వారు తమ ఆధార్ కార్డులో వయసు సరిచేసుకునే విధంగా చేస్తే అర్హతలున్న వారికి పింఛన్లు అందగలవని ఆశిస్తున్నాను.

**ఉ.11.30**

**శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి (SRI PEDDIREDDI RAMACHANDRA REDDY)**: అధ్యక్షా, మా సభ్యులు చాలా విషయాలు లేవనెత్తారు. వాటన్నిటికీ చివర్లో సమాధానం చెబుతాను. ఈ

పింఛన్ల నేపథ్యం అనేది మా ముఖ్యమంత్రిగారి ఆలోచనా సరళికి అద్దం పట్టే విధంగా, గుంటూరు ప్లీనరీలో వారు పార్టీ అధ్యక్షులుగా ఆ రోజు నవరత్నాలను ప్రకటించారు. వాటిలో ప్రధానంగా పింఛన్ల గురించి అనేక విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో వారు ముఖ్యమంత్రిగా అయిన తరవాత మొట్ట మొదటి సంతకాన్ని ఈ పింఛన్ల గురించే చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. దాదాపు సంవత్సరం పాటు 3,648కిలోమీటర్ల పాదయాత్రలో ఆయనకు అనేక విజ్ఞప్తులు వచ్చాయి. ఆ విజ్ఞప్తులన్నింటినీ పురస్కరించుకుని కేవలం రెండు పేజీల మేనిఫెస్టోలో అన్ని అంశాలను పొందుపరిచి అవన్నీ ఈ రోజు అమలుచేస్తున్నామంటే ఇది కేవలం వారి మంచితనం, వారి సహృదయం, చెప్పిన మాట నిలుపుకోవడం వారి ప్రధాన సంకల్పంగా భావించాలని మీకు మనవి చేస్తున్నాను. ఆ రోజు ఏ సమావేశం జరిగినా ముఖ్యమంత్రిగారు మాట్లాడితే "మేము కులం చూడం, మతం చూడం, రాజకీయాలు చూడం, రాజకీయ పార్టీలు చూడం, కేవలం పేదరికాన్నే ఒక కొలబద్దగా, అర్హతగా తీసుకుని అర్హులందరికీ ఇచ్చే పద్ధతిని మనం చేపట్టాం, అదే పద్ధతిని మనం అమలుచేద్దాం" అని చెప్పిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు 600 హామీలు, వంద పేజీల మేనిఫెస్టో ఉండేది. ఆ విధంగా కాకుండా కేవలం రెండు పేజీల మానిఫెస్టోలో ఎన్ని విషయాలు పొందుపరిచారో అవన్నీ కూడా నూటికి నూరు శాతం అమలు చేస్తున్న ఘనత మా ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గారిది. నవరత్నాలే కాకుండా అనేక అంశాల్లో పారదర్శకంగా ఉండాలని, భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేవలం 21రోజుల్లోనే అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నాము. అదే విధంగా పింఛను కానుక కూడా ఇస్తున్నామని మీకు మనవి చేస్తున్నాను. ఎవరైనా దరఖాస్తు పెట్టుకుంటే 21రోజుల లోపల అప్‌లోడ్ చేసే పరిస్థితి ఈ ప్రభుత్వం చేస్తుందని గమనించాలని మీకు మనవి చేస్తున్నాను.

గతంలో మనం చూశాం. ఏ పింఛను కావాలన్నా, ఏ సంక్షేమ పథకం అమలు చేయాలన్నా, ప్రతి గ్రామానికి జన్మభూమి కమిటీ ఉండేది. ఆ జన్మభూమి కమిటీల్లో వారు నియమించుకున్న వారే సభ్యులుగా ఉన్నారు. మేము కోర్టులను కూడా ఆశ్రయించాము. కానీ ఫలితం లేకుండా పోయింది. గత 5సంవత్సరాల్లో జన్మభూమి కమిటీలే అవన్నీ అందజేసే పరిస్థితి. ఆ జన్మభూమి కమిటీల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, లేదా సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయినవాళ్లు, లేకపోతే వార్డ్ మెంబరుగా ఓడిపోయిన వాళ్లు, వాళ్లకు మళ్లీ రాజకీయ పదవి ఇవ్వాలని చెప్పి వాళ్లనే జన్మభూమి కమిటీల్లో సభ్యులుగా చేసి, ఆ సభ్యుల ద్వారా పింఛన్లు ఇవ్వాలంటే వాళ్లు ఎందుకు ఇస్తారు అధ్యక్షా? పారదర్శకంగా చేయాలంటే అర్హత చూసి ఇవ్వాలి గానీ, పార్టీ లేదా బంధుత్వం, లేకపోతే వాళ్లకు డబ్బులు ఇచ్చిన వారికి ఆ రోజు ఇచ్చే పరిస్థితి ఉండేదని మీకు మనవి చేస్తున్నాను. ఆ విధంగా కాకుండా ఈ రోజు భారతదేశంలో మనం అందరికీ ఆదర్శప్రాయంగా ఉన్నాము. కర్ణాటక రాష్ట్రం కూడా ఈ రోజు సచివాలయ వ్యవస్థను అమలుచేస్తోంది. అదే విధంగా తమిళనాడు రాష్ట్రం వాళ్లు వచ్చి చిత్తూరు జిల్లాలో

పరిశీలించి వెళ్లారు. ఈ విధంగా పక్క రాష్ట్రాల వాళ్లు కూడా మెచ్చుకునే విధంగా ఈ సచివాలయ వ్యవస్థ ఉంది కాబట్టి ఈ రోజు ఇన్ని కార్యక్రమాలను పారదర్శకంగా అమలుచేస్తున్నాము.

మేము పింఛన్లు పెంచిన విషయం చూస్తే, 2019–20లో 7,58,550 పింఛన్లు, 2020–21లో 6,15,156 పింఛన్లు, 2021–22లో 5,01,634 పింఛన్లు పెంచాము. కేవలం ఈ మూడు సంవత్సరాల్లో 18,75,440పింఛన్లు పెంచామంటే ఇంతకంటే గొప్ప ప్రభుత్వం, గొప్ప ముఖ్యమంత్రి ఎవరైనా ఉంటారా అని అడుగుతున్నాను. అదే విధంగా పింఛనుకు సంబంధించి మనం వయో పరిమితిని 65నుంచి 60 సంవత్సరాలకు తగ్గించాము. దానివల్ల 60సంవత్సరాలు పైన ఉన్న వారు దాదాపు 10,60,108మంది అర్హులు లబ్ధి పొందుతున్నారు. ఇందాక చాలామంది సభ్యులు దీనిని మంచి పథకంగా కొనియాడారు. రాష్ట్ర ప్రజలు కూడా అదే విధంగా ఈ పింఛను కానుకను ఎన్నో విధాలుగా కొనియాడుతున్నారు. అర్హులు, అనర్హుల జాబితాను సచివాలయం నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్నాము. సోషల్ ఆడిట్ చేసుకోడానికి కూడా ముఖ్యమంత్రిగారు అవకాశం కల్పించారు. ప్రతి సంక్షేమ పథకం జాబితాను మనం సచివాలయ నోటీసు బోర్డులో అర్హులను, అనర్హులను ప్రదర్శించిన పిమ్మట వారు వెరిఫై చేసుకుని మళ్లీ దరఖాస్తు పెట్టుకున్నా గానీ దానిని కూడా మళ్లీ 21 రోజుల లోపు పరిశీలించి అర్హత ఉంటే వెంటనే అప్‌లోడ్ చేసే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పిస్తుందని మీకు మనవి చేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చినట్టు కాకాణి గోవర్ధన్ రెడ్డిగారు చెప్పారు. తప్పకుండా దాని మీద కూడా ఎంక్వైరీ చేపిస్తాము. అట్లాగే అప్‌లోడ్ చేసే దాంట్లో రెక్టిఫికేషన్ చేయాలన్నారు. అది కూడా చేస్తాము. అభయ హస్తంలో డిజిటల్ అసిస్టెంట్ అప్‌లోడ్ చేసేదానిలో సమస్య ఉందని గౌరవ సభ్యులు పీడిక రాజన్నదొరగారు చెప్పారు. అది కూడా పరిశీలిస్తాము. అదే విధంగా గౌరవ సభ్యులు డా.మొండితోక జగన్మోహన రావు గారు డప్పు కళాకారులకు వృద్ధాప్య పింఛను కాకుండా కళాకారుల పింఛనే కావాలని చెప్పారు. అది కూడా పరిశీలిస్తాము. ప్రతి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కొన్ని అర్హతలున్నాయి. ఆ కేటగిరిలో వారు అర్హులైతే తప్పకుండా వారందరికీ పింఛను వచ్చే పరిస్థితి ఉంటుంది. అదే విధంగా గౌరవ సభ్యులు కె.వి.ఉషశ్రీ చరణ్‌గారు శాచ్యురేషన్ మోడ్‌లో పింఛన్లు ఇస్తున్నారు, బయో మెట్రిక్‌లో సమస్యలున్నాయని చెప్పారు. బయో మెట్రిక్‌లో కూడా ప్రస్తుతం ఏమీ సమస్య లేదు. ఐరిస్‌ను ప్రామాణికంగా తీసుకుని కూడా ఇస్తున్నాము. బయో మెట్రిక్ ద్వారా కూడా ఇస్తున్నాము. బయోమెట్రిక్ కింద నాలుగు శాతమే ఉన్నాయి. జనవరిలో 5శాతం, ఫిబ్రవరిలో 5శాతం, మార్చిలో 5శాతం ఉన్నాయి. అదే విధంగా Real time Beneficiary Identification System (RBIS) కింద కూడా ఇస్తున్నాము. అవి చాలా తక్కువగా ఉన్నాయి. RBIS కింద అక్టోబరులో 1శాతం, నవంబరులో 2శాతం, డిసెంబరులో 2శాతం, జనవరిలో 2శాతం, ఫిబ్రవరిలో 2శాతం వరుసగా ఉన్నాయి. ఈ విధంగా RBIS కింద, ఐరిస్ కింద, బయో మెట్రిక్ కింద మూడు రకాలుగా పింఛన్లు ఇస్తున్నాము.

ఆధార్ కార్డులో కొన్ని మార్పులు చేయాలన్నారు. పింఛను మంజూరుకు ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం చేస్తామని తెలియజేస్తున్నాను. ఉమెన్ అండ్ డాటర్‌లో ఇద్దరిలో ఒక్కరికే పింఛను వస్తోందని గౌరవ సభ్యులు కె.వి.ఉషశ్రీ చరణ్‌గారు చెప్పారు. అదే విధంగా చాలామంది

విద్యార్థులు క్యాన్సర్‌తో బాధపడేవారు ఉన్నారని చెప్పారు, వాళ్లకు కూడా పింఛను ఇచ్చే విధంగా పరిశీలించమని చెప్పారు. తప్పకుండా అది కూడా పరిశీలిస్తాము. ఏదేమైనా కూడా ఈ రోజు మా ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగారు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఐదారు లక్షల మంది తప్ప దాదాపు కోటి మందికి పైగా లబ్ధి పొందతున్నారు.

**ఉ.11.40**

పింఛను కానుకకు సంబంధించి ఏవైనా అమలు చేసే విధంగా మీరు (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) సూచనలు ఇవ్వండి. ఎన్నికల కోసం నవంబర్‌లో మీరు రూ.2,000లు పింఛను పెంచారు. అంటే ఎన్నికల నోటిఫికేషన్ మార్చిలో వస్తుందని అనగా మూడు, నాలుగు నెలల ముందు పెంచారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పసుపు-కుంకుమను తీసుకొచ్చారు. ప్రజలందరూ గమనిస్తున్నారు. 14,200 మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు మీరు చెప్పారు, కానీ మాఫీ చేయలేదు. ఆసరా పథకం కింద దాదాపుగా 25లక్షల కుటుంబాలకు మా ప్రభుత్వం రూ.25,217కోట్లు నాలుగు విడతల కింద చెల్లిస్తోంది. అదే విధంగా పింఛను కానుకలో మార్పులు, చేర్పులు ఉంటే చేస్తాం. మా ముఖ్యమంత్రి గారు జనవరిలో రూ.2500కు పింఛను పెంచారు. వచ్చే ఎన్నికల లోపల రూ.250లు పెంచుకుంటూ తప్పకుండా రూ.3,000లు చేస్తామని మీకు మనవి చేస్తున్నాను. ఇంత మంచి పథకాన్ని ప్రవేశ పెట్టిన మా ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**MR.DEPUTY SPEAKER:** The remaining questions are deemed to have been answered.

## 14TH & 15TH FINANCE COMMISSION FUNDS TO PANCHAYATS

**LAQ No.1535(4)** **Notice given by**
Sri Payyavula Keshav, MLA.,
Dr. Nimmala Rama Naidu, MLA.,
Sri Anagani Satya Prasad, MLA.,
Dr. Dola Sree Bala Veeranjaneya Swamy, MLA.,
Sri Nimmakayala China Rajappa, MLA.,

Will the Minister for Panchayat Raj & Rural Development be pleased to state:

a) the details of amounts released and credited into the accounts of Gram Panchayaths from the funds of 14th and 15th Finance Commission during the years 2019-20, 2020-2021 and 2021-2022;
b) the amounts spent on Electricity charges, dues and development out of the aforesaid funds during 2019 to 2022; and
c) the details of dues on Electricity paid and yet to be paid during 01.06.2019 to 31.01.2022?

**SRI PEDDIREDDI RAMACHANDRA REDDY (PANCHAYATI RAJ & RURAL DEVELOPMENT; MINES & GEOLOGY**

a.

| S.No | FC Grant | Year | Rs. In Crores | |
|---|---|---|---|---|
| | | | **Releases** | Credited(adjusted) |
| 1 | 14 FC | 2019-20 | 2118.12 | 2118.12 |
| 2 | 15 FC | 2020-21 | 1837.50 | 1837.50 |
| | | 2021-22 | 678.65 | 678.65 |
| | | **Total** | **2516.15** | **2516.15** |

b. An amount of Rs.2524.86Crores has been spent on Electricity charges, and an amount of Rs.1839.78Crores are pending dues of Electricity Charges and an amount of Rs.2534.59Crores are utilised for development from the aforesaid funds during 2019 to 2022.

c.

| Grant | Electricity Bills Paid from 01.06.2019 to 31.01.2022 **(Rs.in Crores)** | Electricity Bills to be paid by Gram Panchayats as on 01.02.2022 **(Rs. In Crores)** |
|---|---|---|
| 14th FC Funds | 1478.99 | 1839.78 |
| 15th FC Funds | 1045.87 | |
| **Total** | **2524.86** | |

## EKALAVYA MODEL SCHOOLS

**LAQ No.1552(5)**

**Notice given by**
Smt. Nagulapalli Dhanalakshmi, MLA.,
Smt. Kottagulli Bhagya Lakshmi, MLA.,
Smt. Viswasarayi Kalavathi, MLA.,
Sri Rajanna Dora Peedika, MLA.,

Will the Deputy Chief Minister for Tribal Welfare be Pleased to state:

a. the steps taken by the Government for setting up of the Central Government Ekalavya Model Schools in the State;
b. if so, the details of the Schools; and
c. the steps taken by the Tribal Welfare Department to enhance the athletic abilities in the Tribal Students?

**SMT. PAMULA PUSHPA SRIVANI (DEPUTY CHIEF MINISTER – TRIBAL WELFARE)**

a) (i) Sir, the Ministry of Tribal affairs, Government of India have established National Educational Society for Tribal Students (NESTS) to provide quality education to Tribal Boys and Girls with a nomenclature of **Ekalavya Model Schools** on the lines of Navodaya Vidyalayas. The NESTS have sanctioned (632) Ekalavya Model Residential Schools across the country from Class 6th to 12th class. Out of 632 schools, 367 schools are fully functional.

(ii) The National Educational Society for Tribal Students (NESTS), Ministry of Tribal Affairs (MoTA) have sanctioned (28) Ekalavya Model Schools to the State of Andhra Pradesh. Out of which (19) schools are fully functional. (9) New Schools were started with 6th class from this academic year 2021-22 in temporary accommodations. At the state level, these schools are being run by the Andhra Pradesh Tribal Welfare Residential Educational Institutions (APTWREI) Society (Gurukulam) fully funded by National Educational Society for Tribal Students (NESTS), Ministry of Tribal affairs (MoTA).

b) The Details of the Schools:

| S. No. | District | Name of the EMRS | Classes from to | Strength | Enrolled for 2021-22 |
|---|---|---|---|---|---|
| 1 | Srikakulam | Bhamini | 6thto 9th | 240 | 239 |
| 2 | Srikakulam | Meliaputi | 6thto 9th | 240 | 237 |
| 3 | Vizianagaram | Anasabhadra | 6th to 10th | 300 | 199 |
| 4 | Vizianagaram | Kurupam | 6th to 10th | 300 | 273 |
| 5 | Vizianagaram | Kotikapenta | 6th to 10th | 300 | 216 |
| 6 | Vizianagaram | G L Puram | 6thto 8th | 180 | 177 |
| 7 | Visakhapatnam | G.K.Veedhi | 6th to 12th | 480 | 496 |
| 8 | Visakhapatnam | Dumbriguda | 6th to 10th | 300 | 333 |
| 9 | Visakhapatnam | Munchigput | 6th to 10th | 300 | 300 |
| 10 | Visakhapatnam | Chintapalli | 6thto 8th | 180 | 180 |
| 11 | East Godavari | Y.Ramavaram | 6th to 10th | 300 | 367 |
| 12 | East Godavari | Maredumilli | 6th to 10th | 300 | 288 |
| 13 | East Godavari | Chintoor | 6th to 8th | 180 | 178 |
| 14 | East Godavari | Rajavommangi | 6thto 8th | 180 | 170 |
| 15 | West Godavari | Buttayagudem | 6thto 8th | 180 | 179 |
| 16 | Prakasam | Dornala | 6th to12th | 480 | 475 |
| 17 | Nellore | Kodavaluru | 6th to 12th | 480 | 446 |
| 18 | Nellore | Ojili | 6th to 10th | 300 | 281 |
| 19 | Chittoor | B.N. Khandriga | 6th to 10th | 300 | 275 |
| 20 | Visakhapatnam | Pedabayalu | 6th | 60 | 56 |
| 21 | Visakhapatnam | Anantagiri | 6th | 60 | 60 |
| 22 | Visakhapatnam | Hukumpeta | 6th | 60 | 60 |
| 23 | Visakhapatnam | Paderu | 6th | 60 | 60 |
| 24 | Visakhapatnam | G.Madugula | 6th | 60 | 60 |
| 25 | Visakhapatnam | Koyyuru | 6th | 60 | 60 |
| 26 | Visakhapatnam | Araku | 6th | 60 | 60 |
| 27 | East Godavari | RC Varam | 6th | 60 | 60 |
| 28 | East Godavari | Addateegala | 6th | 60 | 59 |

c)(1)The Tribal students are bestowed with natural strength, endurance, speed, accuracy and good robust physical posture which are very much essential to excel in Sports & Games activities. Already the students of Ekalavya Model Schools have been participating in State & National level Sports meet every year. It is contemplated to introduce a special sports event in each and Every EM School.

(2) A proposal was submitted to Government of India for sanction of Center of Excellence for Sports at EMRS, Kurupam, Vizianagaram District in the State of Andhra Pradesh.

## PROMOTIONS OF CIRCLE INSPECTORS

**LAQ No.1474(6)** **Notice given by**
Dr. Dola Sree Bala Veeranjaneya Swamy, MLA.,
Sri Ashok Bendalam, MLA.,
Sri Mantena Ramaraju, MLA.,

Will the Minister for Home be pleased to state:

(a) Whether it is a fact that 37 Circle Inspectors belong to same community have been promoted as Deputy Superintendent of Polices prior to 2019 elections in the State:
(b) the details of 37 persons who were promoted; and
(c) the steps being taken by the Government to do justice to persons affected by these promotions?

**SMT. MEKATHOTI SUCHARITHA (MINISTER FOR HOME AND DISASTER MANAGEMENT)**

(a) No Sir
(b) List enclosed
(c) No injustice was done to any one and objections were resolved in the DPC process.

ANSWER FOR QUESTION (b) LAQ NO.1474 (Starred)

The following 35 Inspector of Police's were promoted on adhoc basis for the panel years 2014-2015 and 2015-2016

| Sl.No | Name of the Officer S/Sri | Date of Birth | Notional Date of Promotion as DSP |
|---|---|---|---|
| 1 | A. Sreenivasulu | 01-02-1966 | 02-09-2014 |
| 2 | M. Venkatadri | 09-05-1968 | 02-09-2014 |
| 3 | N. Yughandar Babu | 15-08-1967 | 02-09-2014 |
| 4 | G. Hussain Peera | 02-07-1965 | 02-09-2014 |
| 5 | B. Venkata Rama Rao | 17-08-1960 | 02-09-2015 |
| 6 | D.L.N.Varma | 15-06-1961 | 02-09-2015 |
| 7 | K.Janardhana Naidu | 09-051967 | 02-09-2015 |
| 8 | M.Mohan Rao | 18-06-1963 | 02-09-2015 |
| 9 | L. Nageswari | 13-01-1963 | 02-09-2015 |
| 10 | Patrini Srinivasa Rao | 05-04-1965 | 02-09-2015 |
| 11 | K. Vijaya Paul | 07-05-1964 | 02-09-2015 |
| 12 | D.Muralidhar | 01-10-1962 | 02-09-2015 |
| 13 | V. Narayana Swamy Reddy | 15-04-1963 | 02-09-2015 |
| 14 | L.Mohana Rao | 04-11-1966 | 02-09-2015 |
| 15 | A.Trinadha Rao | 18-02-1963 | 02-09-2015 |
| 16 | T.S.K. Ravi | 30-03-1962 | 02-09-2015 |
| 17 | N.B.M. Murali Krishna | 01-071964 | 24-11-2015 |
| 18 | A.Satyanarayana | 01-07-1960 | 24-11-2015 |
| 19 | P.Bhaskara Rao | 02-04-1960 | 24-11-2015 |
| 20 | B.Narasappa | 08-05-1960 | 24-11-2015 |
| 21 | I.Ramakrishna | 04-06-1966 | 24-11-2015 |
| 22 | M.Raja Rao | 01-08-1964 | 24-11-2015 |
| 23 | K.Prakash Babu | 01-07-1965 | 02-04-2016 |
| 24 | Y.Malleswara Reddy | 25-05-1965 | 02-04-2016 |
| 25 | G. Naga Subbanna | 13-06-1962 | 02-04-2016 |
| 26 | G. Veera Raghava Reddy | 08-08-1967 | 02-04-2016 |
| 27 | K.S.Vinod Kumar | 04-04-1966 | 02-04-2016 |
| 28 | T.Murali Krishna | 01-06-1962 | 02-04-2016 |
| 29 | Y. Srinivasa Reddy | 14-11-1964 | 02-04-2016 |
| 30 | B.Sada Lakshmi | 14-08-1963 | 02-04-2016 |
| 31 | P.Veeranjaneya Reddy | 01-04-1963 | 02-04-2016 |
| 32 | K.V.Ramana | 12-10-1966 | 19-04-2016 |
| 33 | P.Vijaya Kumar | 27-03-1963 | 19-04-2016 |
| 34 | K.Prabhakar | 09-08-1962 | 01-08-2016 |
| 35 | G.Rama Krishnaiah | 15-03-1959 | 01-08-2016 |

Out of 35 promotions as DSP,s, 15 for OC,s, 12 for BC,s, 05 for SC,s and 03 for ST,s .

P.T.O.

The following 36 Inspector of Police's were promoted on adhoc basis for the panel years 2016-2017 and 2017-2018.

| | | | |
|---|---|---|---|
| 1 | G.Rama Krishnaiah | 15-03-1959 | 01-09-2016 |
| 2 | U.Suryanarayana | 10-06-1961 | 01-12-2016 |
| 3 | A.S. Chakravarthi | 19-08-1966 | 01-03-2017 |
| 4 | K.Ravi Manohara Chari | 21-06-1967 | 01-05-2017 |
| 5 | V.Giridhar | 08-05-1961 | 01-07-2017 |
| 6 | A.Rama Chandra | 03-05-1962 | 01-07-2017 |
| 7 | A.Prasad Kumar | 01-07-1961 | 01-07-2017 |
| 8 | G.Nageswara Reddy | 01-06-1965 | 01-07-2017 |
| 9 | G.Muralidhar | 01-07-1969 | 01-08-2017 |
| 10 | S.Mahaboob Basha | 01-07-1967 | 01-09-2017 |
| 11 | R.Vasu Devan | 17-06-1966 | 01-09-2017 |
| 12 | Valluri Srinivasa Rao | 01-06-1964 | 01-09-2017 |
| 13 | B.Vijaya Kumar | 01-06-1965 | 01-12-2017 |
| 14 | Y.J.Rama Subba Reddy | 01-09-1960 | 01-12-2017 |
| 15 | P.Narayana Rao | 01-10-1964 | 01-12-2017 |
| 16 | K.Nageswara RAo | 30-07-1963 | 01-01-2018 |
| 17 | B.Nageswara Rao | 24-06-1961 | 01-02-2018 |
| 18 | Bukkapuram Sreenivasulu | 04-04-1970 | 01-03-2018 |
| 19 | D.Rama Varma | 01-07-1962 | 06-03-2018 |
| 20 | Muthyala NAgabhushanam | 04-07-1966 | 06-03-2018 |
| 21 | J.Babu Prasad | 30-06-1967 | 06-03-2018 |
| 22 | Ch. Murali Naidu | 01-07-1960 | 06-03-2018 |
| 23 | S.V.V. Prasada Rao | 16-08-1961 | 06-03-2018 |
| 24 | M. Kamalakar Rao | 01-06-1966 | 06-03-2018 |
| 25 | S. Ganga Raju | 09-09-1959 | 06-03-2018 |
| 26 | K. Prakasha Rao | 11-10-1961 | 06-03-2018 |
| 27 | K.Ramesh Babu | 25-08-1963 | 01-05-2018 |
| 28 | B.Seetha Ramaiah | 21-08-1966 | 01-05-2018 |
| 29 | P.Ramachandra Rao | 31-07-1968 | 01-06-2018 |
| 30 | K.Ranga Raju | 01-07-1961 | 02-06-2018 |
| 31 | [redacted]Muthyala Naidu | 01-07-1962 | 01-07-2018 |
| 32 | M.Raja Gopal Reddy | 01-05-1965 | 03-07-2018 |
| 33 | S.Ramakanth | 29-05-1963 | 01-08-2018 |
| 34 | P. Srikanth | 30-08-1965 | 01-08-2018 |
| 35 | S.Sharufuddin | 20-05-1963 | 02-08-2018 |
| 36 | J.Jogeswara Rao | 13-08-1960 | 01-12-2017 |

Out of 36 promotions as DSP,s, 17 for OC,s, 12 for BC,s, 06 for SC,s and 01 for ST,s .

## CASES AGAINST MISLEADING INFORMATION AND STATEMENTS

**LAQ No.1580(7)** **Notice given by**
Sri Kunduru Nagarjuna Reddy, MLA.,

Will the Hon'ble Minister for Home be pleased to state:

a. the details of cases that are reported, registered and inquired into the last ten years basing on the misleading information and statements posted in Newspapers, Internet, SMS, Phone calls etc., in the Statement; and

b. Whether there are any proposals with the Government to establish mechanism to verify the genuinity of such information; and the action taken by the Government on such cases?

**SMT. MEKATHOTI SUCHARITHA (MINISTER FOR HOME AND DISASTER MANAGEMENT)**

a. A total of 3686 cases were registered in the last Ten years and as now they are under different stages of investigation.

b. Answer:

- NEO Portal (Citizen Financial Cyber Fraud Reporting and Management System) is being operated in A.P., CID to take complaints on Cyber Frauds through a toll-free Helpline No. 1930. It is integrated with all banks and

payment gateways. So far, 256 cases (190 in 2021 and 66 in 2022) were registered in Cyber crimes, CID, AP.

- 4S4U Portal is introduced in the month of August, 2020 to take complaints from the public on any cyber crimes including frauds. So far, 04 cases were registered.
- During COVID Pandemic AP CID cyber crimes wing introduced "Fact check" facility to the public to verify the veracity of any news. This fact check option is available on AP CID Whatsapp No 9071666667.
- The main Objection of AP CID's 4S (Stay Safe Stay Smart) helpline is to Dispel fake news (Fact Check) and to deal with cyberbullies through a dedicated Whatsapp number +91-9071666667. This is the first time such an initiative taken by the State of Andhra Pradesh, which is being led by CID.
- In the year 2020, the helpline received 275 fact check requests and responded promptly to each request with credible information.
- In the year 2021, the helpline received 243 fact check requests and responded promptly to each request with credible information.
- So far, in the year 2022, the helpline received 22 fact check requests and responded promptly to each request with credible information.
-

## FILLING UP OF VACANT POSTS

**LAQ No.1488(8)**

**Notice given by**
Sri Ashok Bendalam, MLA.,
Sri Anagani Satya Prasad, MLA.,
Sri Mantena Ramaraju
Sri Yeluri Sambasiva Rao, MLA.,

Will the Minister for Finance be pleased to state:

a. The Department-wise details of number of vacant posts in the State; and
b. The steps being taken by the Government to fill up those vacancies?

**SRI BUGGANA RAJENDRANATH (MINISTER FOR FINANCE, PLANNING AND LEGISLATIVE AFFAIRS)**

a. Sir, the total number of vacant posts in the State is enclosed at Annexure to the reply.
b. The Government have recruited 1,26,000 employees in Village and Ward Secretariats all over the State. The Government vide G.O.Ms.No.50, Transport, Roads & Building (TR.II) Department, dated:30-12-2019 have absorbed 51,488 employees of APSRTC into Transport, Roads and Buildings Department and named the Department as Public Transport Department. Orders have been issued in G.O.Ms.No.39, Finance (HR.I-Plg.&Policy) Department, dated:18-06-2021 for releasing of Annual Calendar of Recruitment for the year 2021-22 for filling up of a total number of 10,143 posts of various categories in different Government Departments. Further, Government have accorded permission for sanction and filling up of 22,306 posts vide G.O.Ms.No.60, HM&FW Department, dated:10.06.2020 & G.O.Ms.No.61 HM&FW Department, dated:10.06.2020 and G.O.Ms.No.686, HM&FW Department, dated:09.11.2020 & G.O.Ms.No.140, 141, 144 &

G.O.Rt.No.615 of HM&FW Department, dated:17.11.2021. Further, Government have decided for preparation of Job Calendar every year is under way.

**ANNEXURE**

| Sl. No. | Name of the Department | No. of Sanctioned posts | No. of Regular Employees | No. of Outsourcing / contract Employees | Total No. of employees | Vacancies |
|---|---|---|---|---|---|---|
| 1 | A&C Department | 11,329 | 6,906 | | | |
| 2 | AHDD&F Department | 10,017 | 6,228 | | | |
| 3 | BC Welfare Department | 3,831 | 2,093 | | | |
| 4 | EFS & T Department | 5,459 | 2,890 | | | |
| 5 | Higher Education Department | 15,818 | 5,193 | | | |
| 6 | Energy Department | 154 | 87 | | | |
| 7 | School Education Department | 2,20,266 | 1,73,713 | | | |
| 8 | CAF&CS Department | 1,889 | 1,105 | | | |
| 9 | Finance Department | 5,750 | 3,873 | | | |
| 10 | GAD Department | 8,057 | 4,859 | | | |
| 11 | GWS-GW Department | 5 | 3 | | | |
| 12 | HM&FW Department | 47,926 | 26,094 | | | |
| 13 | Home Department | 87,784 | 69,869 | | | |
| 14 | Housing Department | 31 | 17 | | | |
| 15 | Water Resources Department | 20,853 | 13,817 | | | |
| 16 | I & I Department | 471 | 155 | | | |
| 17 | I&C Department | 1,745 | 970 | **1,75,000** | **7,04,868** | **66,309** |
| 18 | ITE&C Department | 29 | 12 | | | |
| 19 | LFB&IMS Department | 2,843 | 1,596 | | | |
| 20 | LAW Department | 12,791 | 8,053 | | | |
| 21 | Legislature Department | 812 | 326 | | | |
| 22 | MA & UD Department | 86,678 | 56,282 | | | |
| 23 | Minorities Welfare Department | 105 | 67 | | | |
| 24 | PE Department | 22 | 7 | | | |
| 25 | Planning Department | 1,383 | 1,004 | | | |
| 26 | PR&RD Department | 1,50,293 | 98,944 | | | |
| 27 | Revenue Department | 35,344 | 23,517 | | | |
| 28 | RTG-Department | 4 | 2 | | | |
| 29 | SD&T Department | 8,395 | 3,985 | | | |
| 30 | Social Welfare Department | 16,598 | 10,160 | | | |
| 31 | TR&B Department | 8,331 | 4,649 | | | |
| 32 | WCDA & SC Department | 5,071 | 2,768 | | | |
| 33 | YAT&C Department | 1,093 | 624 | | | |
| | **Total** | **7,71,177** | **5,29,868** | **1,75,000** | **7,04,868** | **66,309** |

## PROGRESS OF POLAVARAM PROJECT

**LAQ No.1485(9)**

**Notice given by**
Sri Nimmala Rama Naidu, MLA.,
Sri Gorantla Butchaiah Chowdary, MLA.,

Sri Anagani Satya Prasad, MLA.,
Sri Nimmakayala China Rajappa, MLA.,

Will the Minister for Irrigation (Water Resources) be pleased to state:

a. The year-wise details of Progress of Polavaram Project works from 2014 in the state;
b. The stage at which the project works stand at present; and
c. The time by which the project will be completed?

**SRI POLUBOINA ANILKUMAR (MINISTER FOR WATER RESOURCES (IRRIGATION)**

a. The details of progress of Polavaram Irrigation Project from 2005 onwards Upto Jan 2022 is as follows.

| Sl. No. | Item of Work | Unit | Progress During the Year | | | | Remarks |
|---|---|---|---|---|---|---|---|
| | | | 2005-14 | 2014-19 | 2019-22 (up to 1/2022) | Total | |
| 1. | Component of Works (Head Works, Right Main Canal and Left Main Cana) | % (Finan-cial) | 32 | 36.31 | 9.81 | 78.12 | |
| 2. | Land Acquisition | Acres | 73206.98 | 35882.00 | 3679.00 | 112767.98 | |
| 3. | Rehabilitation & Resettlement | No.of Houses | 714 | 3066 | 8498 | 12278 | 12278 units are completed and 5440 Housing units are in progress. |

b. The present stage of Polavaram Irrigation Project is as follow:
i) Spillway of (Length 1118 Mts) has been completed.
ii) Erection of 42 Radial gates out of 48 Gates has been completed
iii) Erection of 10 Nos of Sluice gates has been completed.
iv) Approach Channel works – 75% completed.
v) Upstream Coffer Dam (2340 M) to a Maximum level of +42.50 M completed.
vi) Downstream Coffer Dam (1637 M) to a Maximum level of +35.50 M completed except scoured portion.
vii) ECRF Dam Gap-III Concrete Dam (162 M) to a Maximum level of +53 M completed.
viii) Godavari River flow diversion through approach channel, Spillway and through Spill Channel completed to facilitate execution of ECRF Dam across the main river.
ix) All the above works have been completed between May, 2019 to February, 2022.

c) The Polavaram Irrigation Project is programmed to be completed by June 2023 subjected to Designs approval by Central Water Commission (Competent Authority) in the scoured area of ECRF Dam (Main Dam)

## ENCROACHMENT OF WALF LANDS

**LAQ No.1464(10)** **Notice given by**
Sri Alla Rama Krishna Reddy, MLA.,

Will the Deputy Chief Minister (Minorities Welfare) be pleased to state:

a) Whether the Government has noticed the encroachment of Wakf Lands in the State;
b) whether there is any proposal with the Government to constitute a House Committee to inquire into the said encroachments; and
c) if so, the details thereof?

**SRI AMZATH BASHA SHAIK BEPARI (MINISTER FOR MINORITIES WELFARE)**

a) Yes Sir. Statement Annexed
b) No Sir.
c) Does not arise.

("టీడీపీ సభ్యులు వారి వారి స్థానాల్లో నిలుచొని ఎందుకు పారిపోతున్నారు, ఏం, ఏం, భయపడుతున్న ప్రభుత్వం, వాస్తవాలు తట్టుకోలేకపోతోంది" అన్నారు)

## సంతాప తీర్మానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ శాసన సభ సభ్యులు డా.కొణిజేటి రోశయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

డా.రోశయ్య గారు ఆచార్య ఎన్.జి.రంగా స్ఫూర్తితో రాజకీయాల్లో ప్రవేశించి, తనదైన శైలిలో రాజకీయాల్లో ముద్ర వేశారు. యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మహా మనిషిగా పేరు తెచ్చుకున్నారు డా.రోశయ్య గారు. ఒక వైపు తనదైన వాగ్ధాటితో మరో వైపు దానికి సమానమైన చతురత కలిగిన మేటి రాజకీయ నాయకుడు, రాష్ట్రంలోని అతి కొద్ది మంది రాజకీయ నాయకుల్లో మొదటి శ్రేణికి చెందిన వ్యక్తి, రాజకీయాల్లోని ఆటుపోట్లను సునాయాసంగా ఎదుర్కొనగల నిబ్బరం, నిబద్ధత ఉన్న నేత డా. రోశయ్య. తన వాక్చాతుర్యంతో పండితుల, పామరుల ప్రశంసలను సమానంగా పొందిన మహా నాయకుడు డా. రోశయ్య గారు.

డా.రోశయ్య గారు 1933 సంవత్సరము, జులై 4వ తేదీన గుంటూరు జిల్లా పాత తెనాలి తాలూకాలోని వేమూరులో జన్మించారు. కొల్లూరులో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసిన పిమ్మట

గుంటూరు హిందూ కళాశాలలో బీ.కాం. పట్టా పొందారు. కాలేజీ దశలోనే ఆయన గుంటూరు హిందూ కాలేజీ విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా వ్యవహరించారు.

డా.రోశయ్య గారు1968, 1974, 1980, 2009 సంవత్సరాల్లో అసెంబ్లీ నియోజకవర్గం (ఎమ్మెల్యే కోటా) నుండి శాసన పరిషత్ సభ్యునిగా నాలుగు పర్యాయాలు ఎన్నికైనారు. వీరు 1989, 2004 సంవత్సరాల్లో చీరాల నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా ఎన్నికైనారు.

1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. ప్రజా ప్రతినిధిగా తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో జవహర్ లాల్ నెహ్రూ నుండి మన్‌మోహన్ సింగ్ వరకు ఉన్న భారతదేశ ప్రధాన మంత్రులందరి నుండి మన్ననలను పొందారు.

రాజకీయ చతురుడైన డా. రోశయ్య గారు అనేక పదవులను నిర్వహించారు. 1976-1978 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా, 1979 లో మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రోడ్లు, భవనాల శాఖా మంత్రిగా, తిరిగి 1989-90 సంవత్సరాల్లో ఆర్థిక, విద్యుచ్ఛక్తి, చేనేత, జౌళి, శాసనసభా వ్యవహారాల మంత్రిగా, అలాగే 1981 సంవత్సరంలో అంజయ్య గారి మంత్రివర్గంలో గృహ నిర్మాణ, రవాణాశాఖ మంత్రిగా, 1982వ సంవత్సరంలో హోంశాఖ మంత్రిగా పని చేశారు. శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రి వర్గంలో 1991-92 సంవత్సరాల్లో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రిగా, 1992-94 సంవత్సరాల్లో శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రి వర్గంలో ఆర్థిక, విద్యుచ్ఛక్తి శాఖల మంత్రిగా పనిచేశారు.

రాష్ట్ర ఆర్థిక మంత్రిగా వరుసగా 7 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత డా.రోశయ్య గారిది. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో మొత్తంగా 16 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కీర్తి డా.రోశయ్య గారిది.

1974లో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, 1976 నుంచి 1996 వరకు ఉపాధ్యక్షుడిగా పని చేసిన వీరు 1995-1997 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వహించారు.

1983-1985 మధ్య కాలంలో శాసన పరిషత్‌లో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. 1992లో శాసనసభలో అధికారపక్ష నాయకుడిగా వ్యవహరించి అందరి మన్ననలను పొందారు.

2004వ సంవత్సరము నుండి 2009వ సంవత్సరం వరకు డా.వై.ఎస్ రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంలో ఆర్థిక, శాసనసభా వ్యవహారాల శాఖలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు.

ఐదుగురు ముఖ్యమంత్రుల మంత్రి వర్గంలో పనిచేసిన డా.రోశయ్య గారు అందరికీ ఆప్తుడిగా, సమర్థుడుగా పేరు తెచ్చుకున్నారు.

డా.వై.ఎస్ రాజశేఖరరెడ్డి గారి ఆకస్మిక మృతి కారణంగా వీరు 2009, సెప్టెంబర్ 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, 2010 నవంబరు 24వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

వీరు ఆగస్టు 31, 2011 నుండి సెప్టెంబరు 1, 2016 వరకు తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా సేవలు అందించారు. ఇదే కాలంలో కర్ణాటక రాష్ట్రానికి రెండు నెలల పాటు తాత్కాలిక గవర్నరుగా సేవలు అందించారు.

వీరు 2021వ సంవత్సరము డిసెంబర్ 4వ తేదీన మరణించారు.

**శ్రీ బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసు) (SRI BALINENI SRINIVASA REDDY (VASU)**: అధ్యక్షా, డా.కొణిజేటి రోశయ్య గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారు. అంతకుముందు ఐదు సార్లు మంత్రిగా కూడా పని చేశారు. రోశయ్య గారు మా ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గం నుంచి రెండు సార్లు అసెంబ్లీకి ఎన్నిక అయ్యారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారి కేబినెట్‌లో మంత్రిగా పని చేశాను. రోశయ్యగారు చనిపోయిన రోజు ఆయన గుర్తుగా ప్రకాశం జిల్లా ఒంగోలులో కాంస్య విగ్రహం పెడతామని చెప్పాం. అందుకు ముఖ్యమంత్రిగారు అంగీకరించారు. కచ్చితంగా ఒంగోలులో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి, ఒక కార్యక్రమం చేసి తప్పకుండా రోశయ్యగారికి నివాళి అర్పిస్తాం. రోశయ్య గారు ప్రకాశం జిల్లాకు చేసిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. వారి రుణం తీర్చుకునేందుకు తప్పకుండా కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలియజేస్తున్నాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ వెల్లంపల్లి శ్రీనివాసరావు (SRI VELLAMPALLI SRINIVASA RAO)** : అధ్యక్షా, రోశయ్య గారి మరణం తెలుగు వారందరికీ బాధాకరమైన వార్త. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తెలుగుదనం ఉట్టి పడే విధంగా రాజకీయాల్లో మంత్రిగా అదే విధంగా ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, తమిళనాడు, కర్ణాటకకు గవర్నర్‌గా పనిచేసిన వ్యక్తి. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అందరికీ చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అనేక కార్యక్రమాలు చేసిన వ్యక్తి. వారి మరణం చాలా బాధాకరం. వారు ఫైనాన్స్ మినిస్టర్‌గా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అలాగే వైఎస్ రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏడు సార్లు నేరుగా ఆర్థిక మంత్రిగా వారు బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యక్తి. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చాలా మంచి కార్యక్రమాలు చేసి ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు ప్రజలందరికీ మంచి చేసే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేశారు.

**ఉ.11.50**

వారి ఆత్మకు శాంతి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, అదే విధంగా వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. తెలుగుదేశం నాయకులు చాలామంది అసెంబ్లీ రూల్స్ తెలిసిన వ్యక్తులు. రోశయ్య గారి మరణాన్ని కూడా రాజకీయం చేసే విధంగా మాట్లాడడం చాలా బాధాకరం. అసెంబ్లీ రూల్స్ అన్నీ తెలిసి కూడా కేవలం వాళ్ల పార్టీ ఆఫీసులో ప్రెస్‌మీట్‌లు పెట్టడం, వాళ్లకున్న మీడియాలో దుష్ప్రచారం చెయ్యడం చేస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రికి ఎప్పుడైతే ఈ వార్త తెలిసిందో ఆయన వారి కుటుంబంతో మాట్లాడడం, ముగ్గురు మంత్రులను ఆ కార్యక్రమానికి బాధ్యత వహించమని చెప్పడం, సంతాప దినాలు ప్రకటించడం వంటి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్లారు. తెలుగుదేశం నాయకులు మన సిట్టింగ్ మంత్రివర్యులు చనిపోతే దానిని కూడా రాజకీయం

చేసే విధంగా మాట్లాడితే, జనసేన నాయకులలో ఒకరు (శ్రీ నాదేండ్ల మనోహర్ గారినుద్దేశించి) ఆయన ఇంతకుముందు స్పీకర్‌గా కూడా పనిచేశారు, వారు కూడా రాజకీయం చేయడం మానుకోవాలి. తెలుగుదేశం నాయకులకు శవ రాజకీయం చెయ్యడం బాగా అలవాటు.

(సర్ ఇది సంతాప తీర్మానమా, ఇది రాజకీయమా అని ప్రతిపక్షసభ్యులు పయ్యావుల కేశవ్ అన్నారు)

(ప్రతిపక్షసభ్యులచే అంతరాయం)

దయచేసి ఇటువంటి కార్యక్రమాలు మానుకోవాలి.

(రాజకీయాలు మేము కూడా మాట్లాడతాం అని ప్రతిపక్షసభ్యులు డా.డోల శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు)

(గౌరవ సభాపతి అధ్యక్షస్థానం వహించారు)

ఎందుకంటే ఇందాక రోశయ్య గారి సంతాప తీర్మానం పెడితే గొడవ చేస్తున్నారు. వాళ్లు సభలో ఒక రకంగా, బయట ఒక రకంగా మొసలి కన్నీరు కారుస్తారు. వాళ్ల మాటలను నమ్మవద్దని తెలియపరుచుకుంటూ రోశయ్య గారి మరణానికి ఈ సభ తరఫున ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఆనం రామనారాయణరెడ్డి (SRI ANAM RAMANARAYANA REDDY)**: అధ్యక్షా, గౌరవనీయులు కీర్తి శేషులు అయిన డా.కొణిజేటి రోశయ్యగారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నరుగా పనిచేసి ఇటీవల కాలం చేశారు. ఈ వార్త ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఆయనకు అత్యంత సన్నిహితులు, ఆప్తుల అయిన అనేక మందిలో ఒక బాధ, ఆయన లేని లోటు, ఆయనతో ఉన్న సహచర్యం ఇవన్నీ గుర్తు చేసుకునే అవకాశాలు వచ్చాయి. రాజకీయ చరిత్ర పుటల్లో రోశయ్య గారిది ఒక విలక్షణమైన అధ్యాయం. ఆయన ప్రతిపక్షంలో ఉండి అధికారపక్షాన్ని, అలాగే అధికారంలో ఉండి ప్రతిపక్షాన్ని కేవలం మాటలతో, వాగ్బాణాలతో రాజకీయంగా అన్ని పార్టీలను ఏ విధంగా నిలువరించగలిగేవారో మనందరం కూడా సభల్లో చూశాం. అయిదుగురు ముఖ్యమంత్రులతో కలిసి పని చేసిన వ్యక్తి. ఆయన ముఖ్యమంత్రి కాబోయే ముందు చివరగా డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారి మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఆర్థిక మంత్రిగా ఉండి వరుసగా ఏడు బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన వ్యక్తి. అంతటి శక్తి, సామర్థ్యం కలిగిన వ్యక్తి. ఆయన రాజకీయ జీవితంలో మంత్రిగా ఎక్కువ బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన వ్యక్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలలో నిలిచిపోయారు. రోశయ్య గారు ఆర్థిక మంత్రిగా ఉన్నన్ని రోజులు నేను వారిని పూర్తిగా గమనించాను. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చాలామంది శాసనసభ్యులుగా పని చేశాం. తరవాత కొంతకాలం మంత్రిగా పని చేశాను. ఆయన ఆర్థిక పరిపుష్టి ఎలా ఉంటుందంటే ఆయన ఏ ఆర్థిక శాస్త్రాన్ని చదవలేదు. మనిషి జీవితాన్ని, ప్రభుత్వ విధానాలను చదివారు. ఆ విధానాలతో ప్రభుత్వ పరిపాలనను ఏ విధంగా ముందుకు సాగించాలి, సామాన్య ప్రజలకు ఏ విధంగా మనం ఇవ్వాలనే దాంట్లో నాటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారితో కలిసి ఆయన ప్రయాణం చేశారు. ఏడు సంవత్సరాలు ఆయన ఏడు బడ్జెట్‌లను ప్రవేశపెట్టినా ఏనాడు ways&

means కు, ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లలేదు. ఇదే విషయాన్ని ఆయన శాసనసభలో ప్రస్తావన చేస్తే అప్పుడు నాటి ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు కొంత అవహేళన కూడా చేశారు. Ways and means లేదా overdraft అనేది ప్రభుత్వ విధానంలో భాగం. అలా తీసుకోవడంలో తప్పు లేదన్నారు. కానీ దానికి రోశయ్య గారు అంగీకరించలేదు. విధానాలు ఉన్నాయని, పాలసీలు చెయ్యవచ్చని ఇష్టమైన రీతిలో అప్పులు చెయ్యడానికి నేనైతే సిద్ధంగా లేను అని చాలా కచ్చితంగా ప్రతిపక్షానికి జవాబు చెప్పిన వ్యక్తి. అలాంటి విధానాలతో నిక్కచ్చిగా నాటి ముఖ్యమంత్రి గారికి తోడుగా ఉండి ప్రభుత్వ విధానాలను ముందుకు నడిపించిన వ్యక్తి రోశయ్య గారు. వయసులో ఆయన కన్నా మేమంతా చాలా చిన్న వాళ్లం. ఎప్పుడైనా నేను కూడా అప్పుడప్పుడు పరుషంగా మాట్లాడేవాడిని. ఆయన అన్ని కూడికలు, తీసివేతలు వేసి ఇప్పుడు ఈ డబ్బు ఖర్చు పెట్టలేం. కనీసం మంత్రులకు మేం విమాన టిక్కెట్లు ఇవ్వలేం, రైలు ఛార్జీలు కూడా కట్టలేం అంటే మంత్రులుగా మా డబ్బులు పెట్టుకుని మేం కేంద్రం దగ్గరకు వెళ్లాలంటే ఎలా అని మేం గట్టిగా కేబినెట్‌లో మాట్లాడేవాళ్లం. మాట్లాడినప్పటికీ ఆయన నవ్వుతూ మమ్మల్ని సముదాయించి పరిపాలనను ముందుకు తీసుకెళ్లిన ఒక మహత్తరమైన వ్యక్తి. ఆయనకు ఒక స్థిరమైన అభిప్రాయం ఉండేది. ఈ రాష్ట్ర ఆర్థిక ప్రగతి పైన, రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి పైన ఒక స్థిర చిత్తంతో పనిచేసిన వ్యక్తిగా రోశయ్య గారిని చెప్పాల్సిన అవసరం ఉంది. తరవాత రాజశేఖర రెడ్డి గారి అకాల మరణం. దాంతో రాష్ట్రం, కాంగ్రెస్ పార్టీ అంతా కూడా ఇబ్బంది పడి మనిషిని కోల్పోయాం అనే ఆలోచనలో ఉంటే ఆ సందర్భంలో పెద్ద దిక్కుగా ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఉన్నది కొద్దికాలమైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎక్కడా గీటు దాటకుండా సక్రమమైన రీతిలో నడిపించిన వ్యక్తి గౌరవనీయులు రోశయ్య గారు.

రోశయ్య గారి గురించి ఇంకొక విషయం తమ ద్వారా ఈ సభలో చెప్పాల్సిన అవసరం ఉంది. ఆనాడు ఉన్న పరిస్థితుల్లో కృష్ణా వరదల ప్రవాహం ఎప్పుడు లేనంతగా వచ్చింది. శ్రీశైలం డ్యామ్ overflow అయ్యే ప్రమాదం వచ్చింది. దాదాపు 18 నుంచి 20 లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యామ్ నిండిపోయి గేట్లు కూడా ఓవర్‌ఫ్లో అయ్యే పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన ఆ వయసులో కూడా సెక్రటేరియట్‌లో నిద్రపోయి అక్కడే ఉండి అధికారులను పంపించి మానిటర్ చేసి ఆనాడు ఉన్న ఇరిగేషన్ శాఖాధికారులు ఎస్.పి టక్కర్, ఆదిత్యనాథ్ దాస్ లాంటి వాళ్లు సీనియర్ చీఫ్ ఇంజనీర్లందరినీ శ్రీశైలం ప్రాజెక్టుకు పంపితే వేకువజామున ఐదు గంటలకు వాళ్లు తిరిగి వచ్చి శ్రీశైలం ప్రాజెక్టుకు ఐదు కిలోమీటర్లు దగ్గరకు వెళ్లేటప్పటికే మొత్తం ప్రాజెక్టు viabrationలో ఉంది, ఇక భగవంతుడే మనల్ని, ఈ ఆంధ్రరాష్ట్రాన్ని రక్షించాలి అని అన్నప్పుడు ఆయన ఎంతో ఓర్పుతో వాళ్లను సముదాయించి ఈ ప్రాజెక్టును మనం కాపాడుకుందాం అనే ఒక ధైర్యాన్ని ప్రదర్శించారు. తన కేబినెట్ సహచరులందర్నీ దగ్గర పెట్టుకుని మానిటర్ చేశారు. ఆ తెల్లవారుజాము నుంచే వరద recede అవ్వడం మొదలయ్యింది. ఈ ప్రాజెక్టులన్నీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి ఉండాలని ఒక సంకల్పంతో, ఆలోచనతో, పట్టుదలతో దృఢ చిత్తంతో పనిచేసిన వ్యక్తి రోశయ్య గారు.

**మ.12.00**

పెద్దలు రోశయ్య గారు ఐదుగురు ముఖ్యమంత్రులతో పనిచేశారు. ప్రతిపక్షంలో ఉండి కూడా అధికార పక్షాన్ని అన్ని విధాలుగా ప్రశ్నిస్తూ, ఎక్కడ ఏది మాట్లాడాలో అంత వరకే మాట్లాడేవారు. అధ్యక్షా, తమరికి కూడా తెలుసు. 1983లో మొదటిసారి మనం శాసనసభలోకి వచ్చినప్పుడు మనకు ఆనాడు శాసనసభలో ఉన్న లెజిస్లేచర్ కార్యదర్శిని, అయ్యా మేమందరం కొత్తగా ఎన్‌టి రామారావు గారి నాయకత్వంలో వచ్చాము, ఈ శాసనసభ ప్రొసీజర్స్, విధానాలు ఏమిటని అడిగితే అప్పుడు శాసనసభ సచివాలయంలో ఉన్న అధికారులు ఇచ్చిన సమాచారం "మీకు సమయం దొరికినప్పుడల్లా కౌన్సిల్‌కు వెళ్లండి. కౌన్సిల్‌లో పెద్దలు రోశయ్య గారి ప్రసంగం ఉన్నప్పుడల్లా మీరు వినండి. అదే మీకు మార్గదర్శకం అవుతుందని" చెప్పిన సందర్భాలను మనం గుర్తు చేసుకోవాలి. ఇవాల్టికీ ఆ రికార్డులున్నాయి. ఇవాల్టికీ అవన్నీ ఆనాడు పెద్దలు, మేధావులు కౌన్సిల్ సభ్యులుగా చేసిన ప్రసంగాలు శాసనసభ్యులకు మార్గదర్శకాలుగా ఉన్నాయి. అందుకనే నేను తమరి ద్వారా ప్రభుత్వానికి, తమ సెక్రటేరియట్‌కు మనవి చేసేదేమంటే ఆ రోజు డిజిటలైజేషన్ చేశారు. డిజిటలైజేషన్ ఆడియో టేపులే కాకుండా, డిజిటలైజేషన్ వీడియో టేపులు ఉంటే అవి కూడా రికార్డు చేయించి ఇప్పటి తరానికి, రేపటి తరంలో రాబోయే శాసనసభ్యులకు ఇలాంటి స్పీచెస్ ఇస్తే మార్గదర్శకం అవుతుంది. పెద్దలు, పూర్వీకులు పరిపాలనా విధానంలో భాగస్వాములు, ప్రతిపక్ష సభ్యులుగా, అధికార పక్ష సభ్యులుగా ప్రభుత్వ పరిపాలన ఏ విధంగా కొనసాగించారనే విషయాలు చాలా వరకు మనం తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా వీడియో సిస్టమ్ ఎక్కువైపోయింది కాబట్టి వీడియోలున్నా వీడియో టేపులను తయారు చేయించి ఆ సీడీలను, రికార్డెడ్ క్యాసెట్స్‌ను సభ్యులందరికీ ఇచ్చే విధంగా ఒకసారి మనం కూడా ఆలోచన చేస్తే బాగుంటుందని తమరికి ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, రోశయ్య గారి గురించి చెప్పాలంటే చాలా విషయాలున్నాయి. కానీ అన్నీ మనం చెప్పుకోలేము. సమయం తక్కువ ఉంది. అలాంటి పెద్ద మనిషి, స్థిరచిత్తం కలిగిన మనిషి, అందరికీ ఆలోచనాపరుడిగా మార్గదర్శకాన్ని చూపించిన వ్యక్తి చనిపోయిన తరువాత ఈ సభలో ఆయనకు సంతాప తీర్మానం పెట్టిన తరువాత అన్నీ తెలిసిన వాళ్లు కూడా వివాదం చేయడమనేది సరైన విధానం కాదు. గౌరవ సభ్యులు ఎవరైతే వివాదాన్ని బయటకు తీసుకొచ్చారో ఆ సభ్యులందరికీ మనవి చేస్తున్నాను. మనం కొన్ని రూల్స్, ప్రొసీజర్స్‌కు అనుగుణంగా ఈ సభను నడుపుకుంటున్నాం. అది అందరికీ తెలుసు. అనేక సందర్భాల్లో మీరు కూడా పరిపాలనలో ఉన్నారు. సభ ఏ విధంగా నడుస్తుందో తెలిసీ దీనిని వివాదం చేయాలనుకోవడం మంచిది కాదు. ముఖ్యంగా రోశయ్య గారి విషయంలో మనం ఇటువంటి వివాదాన్ని తీసుకురావడం మంచిది కాదు. రోశయ్య గారి స్పీచెస్ ఉన్నాయి. గతంలో ఇదే శాసనసభలో అధికార పక్షంలో ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారున్నప్పుడు ఆయన మాట్లాడిన స్పీచెస్ ఇవాల్టికీ ఉన్నాయి. అవి చూస్తే ఆయన మరణాన్ని వివాదం చేయాలా, లేదా అనేది వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నాను. దయచేసి కొన్ని కొన్ని సందర్భాల్లో మనకు

మనం restrain కావాలి. కొన్ని విషయాల పట్ల ఆవేశంతోనో, లేదా కొందరి మీద నిందలు వేసి మనం పబ్బం గడుపుకోవాలంటే అవి రాజకీయ ప్రయోజనాలనే ఆశిస్తాయి తప్ప నిజమైన నివాళిని ఆ పెద్ద మనిషికి మనం ఇవ్వలేము. కాబట్టి దయచేసి అటువంటి ప్రయత్నం లేకుండా రోశయ్య గారి ఆత్మకు శాంతి చేకూరేందుకు తమరి ద్వారా ఈ సభలోని సభ్యులందరూ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో వారి ఆత్మకు శాంతి చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకుంటూ, శోకతప్త హృదయులైన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు అన్ని విధాలా తోడుగా ఉండి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాను. మన ఆర్థిక పరిస్థితిని మరింత వేగవంతంగా ముందుకు తీసుకు వెళ్లడం ద్వారా ఆయనకు నిజమైన నివాళిని అర్పించిన వారమవుతామని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు(SRI KINJARAPU ATCHANNAIDU):** దివంగత నేత కొణిజేటి రోశయ్య గారి సంతాప తీర్మానాన్ని తెలుగుదేశం శాసనసభాపక్షం బలపరుస్తున్నది. రోశయ్య గారు రైతు బాంధవుడు ఎన్.జి.రంగా శిష్యుడిగా రాజకీయ అరంగ్రేటం చేసి రైతుల, వర్తక, వాణిజ్య సమస్యలపైన నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో రోశయ్య గారిది ఒక ప్రత్యేకమైన ముద్ర అని మనమందరం ఒకసారి గుర్తు చేసుకోవాలి. విలువలతో కూడిన రాజకీయం చేసేవారు. నిబద్ధతకు మారు పేరుగా రోశయ్య గారు వ్యవహరించిన తీరు ప్రత్యక్షంగా మనం చాలా సందర్భాల్లో చూశాం. ఆయన మరణం చెందిన విషయం తెలుసుకుని వెంటనే మా పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారు వారి ఇంటికి వెళ్లి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శ చేసిన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. రోశయ్య గారు చేయని పదవి లేదు. శాసనసభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా నాకు తెలిసి తెలుగు రాజకీయాల్లో ఇన్ని పదవులు చేసిన వ్యక్తి ఇంకొకరు లేరని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. నేను కూడా ఆయనతో 2004 నుంచి 2009 వరకూ శాసనసభలో ఉన్న విషయాన్ని ఒకసారి గుర్తు చేస్తున్నాను. ఏ విషయమైనా చాలా స్పోర్టివ్‌గా తీసుకునే వారు. అప్పుడు మేము ప్రతిపక్షంలో ఉన్నాం. మేము చాలా విషయాలు ప్రభుత్వంలో ఉన్న మంత్రులను, ఆ రోజున్న ముఖ్యమంత్రిని ఎత్తిచేటప్పుడు ఎక్కువసార్లు ఆయనే స్పందించి చాలా స్పోర్టివ్‌గా సమాధానాలు చెప్పిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

రోశయ్య గారు ఈ రాష్ట్రానికి ముఖ్యంగా ఉమ్మడి రాష్ట్రానికి ఎనలేని సేవలను అందించారు. ఆయనను మనం చిరస్థాయిగా గుర్తు పెట్టుకోవలసిన అవసరముంది. దీనిని రాజకీయం చేయాలనే ఆలోచన మాకు లేదు. ఎందుకు ఆ విధంగా మాట్లాడారో మాకర్థం కాలేదు. దాని గురించి నేను ప్రస్తావించను. ఎవరమైనా సరే రాష్ట్రానికి సేవలందించిన వ్యక్తులు, ముఖ్యులు ఎవరు చనిపోయినా సరే అందరం గౌరవించుకోవలసిన అవసరముంది. గతంలో మీరూ ఉన్నారు. చాలా మంది పెద్దలున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెంగళరావు గారు చనిపోయినా ఆ రోజు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఆయన పేరిట ఒక పార్కును ఏర్పాటు చేసి వారి విగ్రహం పెట్టి గౌరవించారు. కోట్ల

విజయభాస్కర రెడ్డి గారు చనిపోయినా ఆయన గురించి సభలో సంతాపం తెలియచేసి ఆయన పేరిట ఒక పార్కు పెట్టి గౌరవించారు. ఎవరైనా సరే రాష్ట్రానికి సేవలందించిన వ్యక్తి ఏ పార్టీకి చెందినా మనమందరం గౌరవించుకోవలసిన అవసరముందని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 15 సార్లు సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన చరిత్ర ఆయనకు ఉంది. ఇప్పుడే పెద్దలు రాంనారాయణ రెడ్డి గారు కూడా చెప్పారు. చాలా కష్టాలు రాష్ట్రానికి వచ్చినా, ఆర్థికంగా చాలా సమస్యలు వచ్చినా సరే ఎక్కడా కూడా డైవర్ట్ కాకుండా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి రోశయ్య గారని ఈ సందర్భంగా తెలియచేస్తూ ముఖ్యమంత్రి గారిని, ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నాను. ఆయన సేవలు తెలుగు రాష్ట్రాలు గుర్తు పెట్టుకునే విధంగా ప్రతీ ఒక్కరూ, రేపటి తరం రోశయ్య గారిని ఆదర్శవంతంగా తీసుకునే విధంగా మంచి కార్యక్రమాలు చేయమని, ఒక మంచి పేరు ఈ రాష్ట్రంలో ఉండే విధంగా, ఆయన పేరు చిరస్థాయిగా ప్రతీ ఒక్కరూ చెప్పుకునే విధంగా ఒక మంచి కార్యక్రమాన్ని తీసుకోమని మీద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతూ రోశయ్య గారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ పక్షాన కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

**మ.12.10**

**శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (SRI Y.S.JAGANMOHAN REDDY)**: అధ్యక్షా, ఈ రోజు రోశయ్య గారి సంతాప తీర్మానం సభలో ప్రవేశపెట్టడం చర్చ జరగడం, పలువురు గౌరవ సభ్యులు స్వర్గీయ రోశయ్య గారి గురించి మాట్లాడారు. అందులో భాగంగా నేను మాట్లాడుతున్నాను. రోశయ్య గారు విద్యార్థి నాయకుడి స్థాయి దగ్గర్నుంచి శాసనపరిషత్ సభ్యుడిగా, శాసనసభ్యుడిగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా చివరకు గవర్నర్‌గా వారు సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో కొనసాగారు. ఏ బాధ్యత నిర్వర్తించినా కూడా అందరికీ ఆదర్శవంతంగా, అందరూ కొనియాడే మనిషిగానే రోశయ్య గారు తన రాజకీయ జీవితాన్ని గడిపారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోశయ్య గారు ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేయడమే కాకుండా నాన్న గారి హయాంలో కూడా రోశయ్య గారు ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో కూడా వారిద్దరి మధ్య సత్సంబంధాలు ఉండేవి. ఇద్దరూ మంచి స్నేహితులుగా మెలిగారు. అలాంటి రోశయ్య గారు ఇవాళ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఆయన ఆత్మకు శాంతికలగాలని మనసారా కోరుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ సభ్యులు స్వర్గీయ సర్వశ్రీ వల్లూరి నారాయణ మూర్తి గారు; వి.వి.ఎస్.ఎస్. చౌదరి గారు; కడప ప్రభాకర రెడ్డి గారు; మంగమూరి శ్రీధర కృష్ణా రెడ్డి గారు; గారపాటి సాంబశివరావు గారు; శ్రీమతి టి.ఎన్.అనసూయమ్మ గారు; శ్రీ పాటిల్ వేణుగోపాల్

రెడ్డి గారు; ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి గారు; యడ్లపాటి వెంకట్రావు గార్లందరి మృతికి కూడా ఈ సభ ద్వారా తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

**మిస్టర్ స్పీకర్(MR.SPEAKER)**: సభ ఈ గౌరవ సభ్యుల మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మనం లేచి నిలబడి మౌనంగా నిశ్శబ్దాన్ని పాటిద్దాం.

(మధ్యాహ్నం గం.12.13 ని.ల నుండి గం.12.15 ని.ల వరకు సభ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించింది).

## వాయిదా తీర్మానం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం గురించి శ్రీ కింజారాపు అచ్చెన్నాయుడు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడమైనది.

Now, the House is adjourned for Tea-break

(The House then adjourned at 12.16 p.m.)

**మ.12.30**

(తేనీటి విరామానంతరం సభ మధ్యాహ్నం గం.12.39ని.లకు ప్రారంభమైంది.)

(గౌరవ సభాపతి అధ్యక్షస్థానం వహించారు.)

**డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA)**: (లేచి నిలబడి) సార్, వాయిదా తీర్మానం.

**MR.SPEAKER**: That has been rejected. I have already announced. All the Papers included in the agenda are deemed to have been laid on the Table of the House.

## PAPERS LAID ON THE TABLE

1. "A copy of the Andhra Pradesh Public Employment (Regulation of Age of Superannuation) (Amendment) Ordinance, 2022 (A.P. Ordinance No.1 of 2022), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India."

2. "A copy of the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Ordinance, 2022 (A.P. Ordinance No.2 of 2022), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India."

3. "A copy of the Andhra Pradesh (Regulation of Trade in Indian Made Foreign Liquor, Foreign Liquor) (Amendment) Ordinance, 2022 (A.P. Ordinance No.3 of 2022), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India."

4. The copies of:

"i) 6th Annual Report of the Andhra Pradesh Metro Rail Corporation Limited for the year 2020-2021, as required under section 395 of the Companies Act, 2013.

ii) Second and Third Annual Reports of the Amaravati Development Corporation Limited for the years 2016-17 and 2017-18, as required under sections 394 & 395 of the Companies Act, 2013, along with reasons for delay."

5. "The copies of 43rd, 44th, 45th and 46th Annual Reports of the Andhra Pradesh State Film Television and Theatre Development Corporation Limited for the years 2017-18, 2018-19, 2019-20 and 2020-21, as required under section 394(2) of the Companies Act, 2013."

6. The copies of:

"i) 20th Annual Report of Southern Power Distribution Company of Andhra Pradesh Limited for the year 2019-20, as required under section 394(2) of the Companies Act, 2013.

ii) Annual Statement of Accounts of Transmission Corporation of Andhra Pradesh Limited for the year 2019-20, as required under section 394(2) of the Companies Act, 2013.

iii) Annual Report of the Andhra Pradesh Power Development Company Limited for the year 2019-20, as required under section 394(2) of the Companies Act, 2013.

iv) Annual Report of the Andhra Pradesh Power Generation Corporation Limited for the year 2019-20, as required under section 394(2) of the Companies Act, 2013.

v) 20th & 21st Annual Reports of the Eastern Power Distribution Company of Andhra Pradesh Limited for the years 2019-20 and 2020-21, as required under section 394(2) of the Companies Act, 2013.

vi) 1st & 2nd Annual Reports of the Andhra Pradesh Central Power Distribution Corporation Limited for the years 2019-20 & 2020-21, as required under section 394(2) of the Companies Act, 2013.

vii) Annual Reports of the Andhra Pradesh Solar Power Corporation Private Limited for the years 2018-19 & 2019-20, as required under section 394(2) of the Companies Act, 2013.

viii) 6th Annual Report of the Andhra Pradesh Electricity Regulatory Commission for the year 2019-20, as required under sections 104 & 105 of the Electricity Act, 2003.

ix) Notifications issued in G.O.Rt.No.153, Energy (OP.A3) Department, dated 3rd November, 2021 and G.O.Rt.No.177, Energy (OP.A3) Department, dated 10th December, 2021, as required under section 2(2) of Andhra Pradesh Essential Services Maintenance Act, 1971."

7. The copies of:

"i) G.O.Ms.No.5, Animal Husbandry, Dairy Development & Fisheries (Fish) Department, dated 8th February, 2022, as required under section 49(6) of the Andhra Pradesh Fisheries University Act, 2020.

ii) G.O.Ms.No.38, Animal Husbandry, Dairy Development & Fisheries (AH-1) Department, dated 25th August, 2021, as required under section 49(2) of the Andhra Pradesh Animal Feed (Regulation of Manufacture, Quality Control, Sale and Distribution) Act, 2020."

**MR.SPEAKER**: I would like to make some announcements.

## ANNOUNCEMENTS

1. "I have to acquaint the House that on 7th March, 2022, the Governor was pleased to Address the Members of this House and a true copy of the Address has been laid on the Table of the House".

2. "I am to announce to the House that amendments to the Motion of Thanks on Governor's Address will be received by the Secretary to State Legislature up to 2.00 P.M. today i.e. 10th March, 2022."

Now, I request the Government Chief Whip to move the Motion of Thanks on Governor's Address.

(తెలుగుదేశం పార్టీ సభ్యులంతా వెల్‌లోనికి వచ్చి వాయిదా తీర్మానం కోసం అడిగారు.)

## GOVERNMENT RESOLUTION

**SRI GADIKOTA SRIKANTH REDDY (GOVERNMENT CHIEF WHIP):** Sir, I beg to move.

"That the Members of Andhra Pradesh Legislative Assembly assembled in the Eighth Session of the Fifteenth Legislative Assembly are deeply grateful to the Hon'ble Governor for the Address which he has been pleased to deliver to the Legislative Assembly on 07th March, 2022".

**MR.SPEAKER:** Sri Jogi Ramesh will second the Motion.

**SRI JOGI RAMESH:** Sir, I second the Motion.

(జాబ్ కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సభలో తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు.)

**మ.12.40**

**MR.SPEAKER:** Motion moved, Now discussion on the Governor's Address. ఆనం రామ నారాయణ రెడ్డి గారు..

గవర్నరు గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

**శ్రీ ఆనం రామనారాయణరెడ్డి(SRI ANAM RAMANARAYANA REDDY)** : అధ్యక్షా,— ఈ సభ టీ బ్రేక్ కు ముందు అజెండాలో ఉన్న అంశంపై ప్రస్తావిస్తూ వాయిదా తీర్మానం గురించి ప్రతిపక్ష సభ్యులు అడిగారు. టీ బ్రేక్‌కు వెళ్లక మునుపే వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు తమరు అనౌన్స్ చేశారు. ఇప్పుడు ఆ అంశంపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష సభ్యులు కోరుతున్నారు. ప్రొసీజర్‌కు వ్యతిరేకంగా అలా అడగటం సబబు కాదు. వాయిదా తీర్మానం తిరస్కరించిన తరవాత తదుపరి అంశంలోకి వెళ్లాల్సిందే తప్ప వెనుకకు వెళ్లి మాట్లాడాలని పట్టుపట్టడం మంచిది కాదు.

(ప్రతిపక్ష సభ్యులు తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరసాగారు.)

**శ్రీ గడికోట శ్రీకాంత్‌రెడ్డి (SRI GADIKOTA SRIKANTH REDDY)**: గవర్నర్ బడ్జెట్ ప్రసంగం చదువుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరును ఖండిస్తున్నాను. సమాజం సిగ్గు పడేలా వ్యవహరించారు. ఈ ప్రభుత్వం కరోనా కష్ట కాలంలో ఉన్నప్పటికీ పేదలకు సంక్షేమ కార్యక్రమాలను నూరు శాతం అమలు చేసింది, ఇంకా కొనసాగించనుంది. గతంలో ఈ సభలో సభ్యులుగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య గారు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు, గౌతు లచ్చన్న, తరిమెళ్ల నాగిరెడ్డి వంటి వారంతా సభా సంప్రదాయాలను పాటించారు. సభలో ప్రజా సమస్యలు ఏవిధంగా ప్రస్తావనకు తెచ్చారో వారి ప్రవర్తన ఏ విధంగా ఉండేదో ఒకసారి సభ్యులు గమనించుకోవాలి. కేవలం పబ్లిసిటీనే వారి విధానం అంటూ, రోజురోజుకు రాజకీయాలను దిగజార్చడం చాలా తప్పు. ప్రతిపక్ష సభ్యులంతా నైతిక విలువలు పాటించే విధంగా ఉండాలని, సభా సంప్రదాయాలు పాటించాలని మీ ద్వారా వారికి తెలియజేస్తున్నాను. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. వారి ప్రభుత్వం అధికారం నుండి దిగిపోయే సమయానికి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.80వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించలేదు. సుమారు రూ.3లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి దిగిపోయారు. జగన్మోహన్‌రెడ్డి గారు ప్రమాణ స్వీకారం చేసిన నాటికి.. ప్రతిపక్ష పార్టీ గెజిట్‌గా అనుకునే ఈనాడు దిన పత్రికలోనే రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు కూడా లేవు అని ప్రచురించిన విషయాన్ని మనందరం చూశాము. జగన్మోహన్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయక మునుపు, పాదయాత్ర సందర్భంగా గమనించిన విషయాలను గుర్తుంచుకుని పేద ప్రజలకు సేవ చేయాలి, ఈ రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలి, ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హులైన ప్రతి పేదవానికీ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా ఈ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర సగటు ఆదాయం పెరుగుదల రేటు 16.82 శాతానికి చేరుకోవడం సంతోషదాయకం. అదే విధంగా తలసరి ఆదాయం రూ.1,76,707 నుండి రూ.2,04,758లకు చేరింది. సుమారు 16 శాతం పెరుగుదల కనిపించింది. కరోనా సమయానికి, తోడుగా సంక్షేమ పథకాలు కనుక లేకుంటే రాష్ట్రంలో పేదవాని పరిస్థితి చాలా ఘోరంగా ఉండేది, వలస పోవడాన్ని చూసేవారం. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఈ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండటానికి కారణం ముఖ్యమంత్రి గారు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు అని చెప్పుకోవచ్చు. సంక్షేమ పథకాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

గౌరవ ప్రతిపక్షనాయకులు తన గురించి చాలా గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. ఆయన నందమూరి తారక రామారావు గారిని వెన్నుపోటు పొడిచి 1995లో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు, 2004 వరకు పరిపాలన చేశారు. 2004 నాటికి రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. రాష్ట్ర

వ్యాప్తంగా పూరి గుడిసెల్లో నివసిస్తూ, కరవు కాటకాలతో ప్రజలు పేదరికంలో మ్రగ్గుతుండే వారు. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత పేద ప్రజలను ఎలా ఆదుకోవాలని ఆలోచించారు. ఆనాటి సమైక్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి తోనే పేదలను ఆదుకునే కార్యక్రమం మొదలయింది, పేదవాని జీవన విధానం మారింది. అప్పటి నుండే అభివృద్ధి మొదలయింది. ఆయన ముఖ్యమంత్రి అయిన సంవత్సరంలోగా శాంతి భద్రతల సమస్య తొలగిపోయింది. ప్రజా ప్రతినిధులుగా గ్రామీణ ప్రాంతానికి ధైర్యంగా వెళ్లే పరిస్థితులు తీసుకొచ్చారు. ఆ విధంగా ప్రజలకు సేవ చేశారు కాబట్టి 2019 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఏకమైనప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోరాడి ప్రజాభిమానంతో గెలుపొంది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారు రాజశేఖరరెడ్డి గారి తనయుడిగా, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. చంద్రబాబు నాయుడు గారు తానే అంతా అభివృద్ధి చేశాను, హైదరాబాద్, సైబరాబాద్‌ను నిర్మించాను అని చెప్పుకుంటూ గ్రాఫిక్స్ చూపించారు, పబ్లిసిటీ చేసుకున్నారు. విజయవాడ లోని కనకదుర్గ వంతెన పనులు కూడా పూర్తి చేయకుండానే దిగిపోయారు. అటువంటి వ్యక్తి ఒక రాజధానిని ఎలా నిర్మిస్తారో ఒకసారి ఆలోచన చేసుకోవాలి. కేవలం వారి సొంత మీడియాతో పొగిడించుకుంటుంటారు ప్రతిపక్ష నాయకుడు.

ముఖ్యమంత్రి గారు బాధ్యతలు చేపట్టిన తరువాత జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, మత్స్యకారుల భరోసా, వైఎస్ఆర్ పింఛను కానుక, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ బీమా, వైఎస్ఆర్ కాపు నేస్తం, వైఎస్ఆర్ నేత నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్ఆర్ లా నేస్తం, వైఎస్ఆర్ వాహన మిత్ర, ఆరోగ్య శ్రీ ఆసరా, ఎంఎస్ఎంఇల పునరుద్ధరణ అగ్రీగోల్డ్ బాధితులను ఆదుకోవడం వంటివన్నీ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**మ.12.50**

వైట్ కార్డ్ హోల్డర్స్‌కు స్పెషల్ కొవిడ్ అస్యూరెన్స్ కూడా ఇచ్చాము. నేరుగా డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ డెబిట్‌లో దాదాపు రూ.1,75,000 కోట్లు నేరుగా పేద ప్రజలకు చేర్చిన మహా వ్యక్తి జగన్మోహన్‌రెడ్డిగారు. ఇంత విపత్కర ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎటువంటి ఆటంకాలు, పైరవీలు లేకుండా, నేరుగా వారికి చేర్చిన పథకాలు.

అదే రకంగా ఆయన ఒక మార్పు కోరుతున్నారు. పేదవాడికి ఎలా ఈ ప్రభుత్వం ఉపయోగపడాలన్న ఆయన ఆలోచనలో భాగంగా ముఖ్యంగా ఆయన టేకప్ చేసింది విద్య, వైద్యం. ఈ రోజు విద్య, వైద్యం చూసుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు దేశమంతా చూసేట్టుగా ఆయన ఆకట్టుకున్నారు. ప్రతి రోజు మన రాష్ట్రంపై విమర్శ చేసిన పక్క రాష్ట్ర ముఖ్యమంత్రులు కూడా ఈ రోజు మనల్ని చూసి నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన పాఠశాలల్లో చేసినదానిని వారు రోల్ మోడల్‌గా తీసుకున్నారు. కారణం ఇక్కడ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి, పేదరికాన్ని తగ్గించాలంటే విద్య ముఖ్యం. ఈ రాష్ట్రంలో చదువుకునే విద్యార్థులే ఈ రాష్ట్ర ఆస్తి అవుతారని చెప్పిన నాయకులను గతంలో

ఎప్పుడూ మనం చూడలేదు. ప్రస్తుతం అదే కరెక్ట్ అనిపిస్తోంది. విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ, తను ఏదైతే నాడు-నేడు కింద స్కూల్స్‌ను టేకప్ చేశారో, ఇంతకు ముందు మన విద్యా శాఖ మంత్రిగారు కూడా దాని గురించి సుదీర్ఘంగా చెప్పారు. స్కూల్స్‌కు సంబంధించి నాడు-నేడులో మూడు ఫేజెస్‌గా తీసుకుని, ఫస్ట్ ఫేజ్ కింద దాదాపు 14,000స్కూల్స్‌ను పూర్తిగా కార్పొరేట్ స్కూల్స్‌లా తీసుకొచ్చామని ఈ రోజు ధైర్యంగా చూపిస్తున్నాము. మీరు కొన్నే చేశారు కదా అని ఈ రోజు ప్రతిపక్షం అంటోంది. వాళ్లు ఎప్పుడూ బురద చల్లే కార్యక్రమం చేస్తుంటారు. రాష్ట్రంలో దాదాపు 60,000స్కూల్స్ ఉంటే, ఫస్ట్ ఫేజ్ కింద 14,000 స్కూళ్లు, రెండు, మూడో విడత కింద మిగిలిన స్కూల్స్ చేస్తామని తెలిసినా కూడా బురద చల్లే కార్యక్రమాలు చేస్తున్నారు.

ఈ రోజు స్కూల్‌కు వెళ్లే పిల్లల గురించి వాళ్ల తల్లిదండ్రులకంటే ఎక్కువ ఆలోచన చేసే వ్యక్తి జగన్మోహన్ రెడ్డిగారు. పిల్లలు కార్పొరేట్ స్కూల్స్‌కు వెళ్లేలా వాళ్లకు బెల్టు, బ్యాగు, షూస్, 1 నుంచి ఐదవ తరగతి వరకు Pictorial Dictionary, ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఒక ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, యూనిఫాం క్లాత్, అది కుట్టించుకునేందుకు తల్లిదండ్రులకు డబ్బులు, సమయానికి నోట్ బుక్స్, text books ఈ రకంగా విద్యా దీవెన కింద పిల్లలకు అవన్నీ అందజేసి వాళ్లు రోడ్డు మీద వెళ్లేటప్పుడు కార్పొరేట్ స్కూల్‌కు వెళ్తున్నట్టుగా మనందరం చూస్తుంటాము. స్కూల్ డ్రెస్సులు వేసుకుని స్కూలుకు వెళుతున్న పిల్లల ఆనందాన్ని చూసినప్పుడు జగన్మోహన్ రెడ్డిగారు నిజంగా విజయం సాధించారని నాకు అనిపిస్తుంది. చాలామందికి ఇది నచ్చకపోవచ్చు. కొంతమంది సినిమాల్లో అయితే ఇంగ్లీషు మీడియం పెడతామంటే క్లాప్స్ కొడతారు. కానీ ఇక్కడ ఇంగ్లీషు మీడియం పెడతామంటే కొంతమంది ఏడుస్తారు. అది ఎందుకో అర్థం కాదు. పేదవాడు చదువుకోకూడదని ఆటంకాలు సృష్టించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. వాళ్లు ఏదీ చేయరు, మమ్మల్ని చేయనీయరు. అందుకే చంద్రబాబునాయుడుగారు ఎప్పుడు ఏ రోజు కూడా ఈ రాష్ట్రం మంచి గురించి ఆలోచన చేసిన వ్యక్తి కాదు అని మీద్వారా తెలియజేస్తున్నాను.

స్కూల్సే కాదు, హయ్యర్ ఎడ్యుకేషన్ స్కూల్స్ పాలసీ విధానంలో, స్కూల్స్ మ్యాపింగ్‌లో, జూనియర్ కళాశాలలు తీసుకోవడంలో విద్యకు ఏ రకమైన ప్రాధాన్యత ఇచ్చారో వీటి గురించి ఇంతకుముందు కూడా చర్చ జరిగింది. వాటి గురించి డీప్‌గా చెప్పనవసరం లేదు. ఇంత చక్కగా విద్యా విధానం గురించి ఆలోచన చేసి, విద్య కొరకు దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు పెట్టని విధంగా బడ్జెట్‌ను ఖర్చు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిగారిని అభినందించాలి. పేదవాడికి కావాల్సింది విద్య అని ముఖ్యమంత్రి గారి ఆలోచన. అదే విధంగా పేద పిల్లలను స్కూల్‌కు పంపించేందుకు అమ్మ ఒడి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కార్యక్రమాలు. ప్రతి తల్లి కూడా బిడ్డ గురించి ఆలోచించాలని చెప్పి వారి అకౌంట్లో డబ్బులు వేస్తున్నారు. ఇది ఆ తల్లి కాలేజ్‌కు వెళ్లి తన బిడ్డ పరిస్థితి ఎలా ఉంది అని కనుక్కోడానికి ఆయన కల్పించిన అవకాశం. ఎందుకంటే తల్లులు స్కూల్‌కు వెళ్లి ఆ ప్రిన్సిపల్‌తో మాట్లాడితే ఆ పిల్లాడికి బాధ్యత కూడా తెలుస్తుంది. దీనిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకునేట్లుగా చూడాలని మాకు కూడా ఎప్పుడూ చెబుతుంటారు.

విద్య తరవాత, అత్యంత ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది ఆరోగ్యానికి. పేదవాడికి కావాల్సింది విద్య, ఆరోగ్యం. ఆరోగ్యం విషయం మనం తీసుకున్నప్పుడు ఒక విప్లవాత్మకమైన మార్పు. కరోనా లాంటి పరిస్థితులను మనం తీసుకుంటే దాదాపు రూ.4,000కోట్లు పైగా రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు అయింది. వ్యాక్సినేషన్‌లో తీసుకుంటే దేశంలోనే మనం ఆదర్శం. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, డాక్టర్లు ప్రతి ఒక్కరి సహాయసహకారాలతో గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 96శాతం వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయడం చాలా గ్రేట్. దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 96శాతం వ్యాక్సినేషన్ జరగడం చాలా చాలా ఆనందదాయకం. ఈ వ్యాక్సినేషన్ విషయంలోనే కాకుండా దాదాపు ప్రతి ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లు, ఆక్సిజన్ బెడ్స్ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం స్పందించిన విధానం చాలా గొప్పగా, ఒక ప్రజా ప్రతినిధిగా నాకు చాలా సంతోషం అనిపించింది. ఇవన్నీ చాలా గొప్పవి.

అదే రకంగా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 108, 104 వాహనాలను నేడు ఒకేసారి వేలాది వాహనాలను పూర్తిగా తీసుకొచ్చి పల్లెలకు పంపించడం. ఆ 108 వాహనాలను ఎంతోమంది సద్వినియోగం చేసుకుని వాళ్ల ప్రాణాలను కాపాడుకున్నారు.

అదే రకంగా రాజశేఖరరెడ్డిగారు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీని మళ్లీ బలోపేతం చేస్తూ ఎన్నో వేల వ్యాధులను అందులో జత చేసి ఎప్పటికప్పుడు ఆసుపత్రుల బిల్లులను వేల కోట్ల రూపాయల్లో చెల్లిస్తూ వేలాది మంది ప్రాణాలను ప్రభుత్వం కాపాడింది. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా 50శాతం బెడ్లు పేద ప్రజలకు ఇవ్వాలని ముఖ్యమంత్రిగారు ఆదేశాలు ఇచ్చారు. ఒక నాయకుడిగా పేదవాళ్ల గురించి ఆయన ఆలోచనా తత్వాన్ని మనం మెచ్చుకోవాలి.

దీంతోపాటు కంటి వెలుగు. చాలామంది పేదవాళ్లకు, స్కూల్‌కు వెళ్లే పసిపిల్లలకు వాళ్లకు సైటు ఉందో లేదో తెలియని అంశం. నేనే కొన్ని స్కూల్స్‌కు విజిట్‌కు వెళ్లినప్పుడు వాళ్లు వెనుకన కూర్చొని బోర్డు వైపు ఇలా చూస్తుంటారు. వాళ్లకు సైటు ఉందని తెలియదు, తల్లిదండ్రులకు చెప్పలేరు. జగన్మోహన్ రెడ్డి గారికి ఎలా ఆలోచన వచ్చిందో గాని, ప్రతి స్కూల్లో కూడా కంటి వెలుగు కార్యక్రమం పెట్టారు. కంటి వెలుగు ద్వారా స్కూల్స్‌లో దాదాపు 67లక్షల మంది విద్యార్థులకు కంటి టెస్టులు చేసి దాదాపు 1.67లక్షల మందికి కంటి అద్దాలు, దాదాపు 3,097మందికి సర్జరీలు కూడా చేయించాము. అదే రకంగా, పేదవాళ్లు అంటే ఎక్కువగా అభిమానించే జగన్మోహన్ రెడ్డిగారు 60సంవత్సరాలు దాటిన అవ్వా, తాతలకు కూడా ఈ పథకం ద్వారా 18.5లక్షల మందికి టెస్టులు చేసి 9లక్షల మందికి అద్దాలు పంపిణీ చేశారు. దానితోపాటు మూడు లక్షల మందికి క్యాటరాక్ట్ సర్జరీలు కూడా చేశారు. ఈ విధంగా గతంలో ఎవరైనా ఆలోచన చేశారా? ప్రభుత్వం అంటే దేనికి అధ్యక్షా? పేదవారికి అండగా ఉండాలని, పేదవారికి అవసరమైనప్పుడే కదా మనం చేయగలిగేది, ఆ పేదవాడికి, ప్రతి అడుగులో పూర్తిగా అండగా నిలబడాలనే ఆయన తత్వం చాలా అభినందనీయం.

అదే రకంగా హెల్త్ పింఛన్లు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి పబ్లిసిటీ లేకుండా పింఛన్లు ఇవ్వడం, ఇవన్నీ గొప్ప కార్యక్రమాలు చేశారు. బయటివారు నవ్వుకునే విధంగా పబ్లిసిటీ చేసుకునే చాలామందిని చూశాను. జగన్మోహన్ రెడ్డిగారు ప్రజలకు నేరుగా డబ్బులు అందించే విధానం ప్రజలకు నచ్చి, నలుగురు పేదవారు ఎక్కడైనా టీ బంకుల్లో గుమికూడినప్పుడు వాళ్లు మాట్లాడుకుంటున్నారు. చాలామంది నాకు కూడా చెబుతుంటారు. అదీ మన ఆంధ్ర రాష్ట్రంలోనే. వాళ్లు గుమికూడినప్పుడు "అన్నా ఈ ప్రభుత్వంలో గతంలో లాగా ఒకరిని అడుక్కోవలసిన పని లేదు, ఒకరి దగ్గరకు కాళ్లు అరిగేలా తిరగాల్సిన అవసరం లేదు. వాలంటీర్లు వస్తున్నారు నాకు అర్హత ఉంటే పథకాలు నేరుగా నా ఇంటికే చేరుతున్నాయి" అని చెప్పి మా నాయకున్ని పొగుడుతున్నారు. చంద్రబాబునాయుడుగారిని కూడా గతంలో టీ బంకుల్లో పొగిడేవారు. కానీ ఏ బంకుల్లో అంటే, మన దేశంలో కాదు, స్విట్జర్లాండ్‌లో అంట. ఒక కాఫీ హౌస్‌లో అని కొన్ని పత్రికల్లో రాశారు. చంద్రబాబునాయుడుగారు అది మళ్లీ చూడాలి. ఆ పత్రికల్లో ఏమి రాశారంటే స్విట్జర్లాండ్‌లో కాఫీ హౌస్‌లో కూర్చొని చంద్రబాబునాయుడుగారు what a Leader he is అని అతని గురించి చర్చ అంట. "మన స్విట్జర్లాండుకు ఇట్లాంటి వ్యక్తి ఉంటే చాలా బాగుండు కదా" అని వాళ్లు మాట్లాడారని రాసుకుంటారు. దీనిని ఏమంటారు? స్విట్జర్లాండ్‌లో వాళ్లకు ఆంధ్రప్రదేశ్ గురించి తెలిసి ఈ చంద్రబాబునాయుడుగారి గురించి రాసుకుంటారా? ఏమయ్యా? పబ్లిసిటీకి ఒక అర్థం ఉండాలి. ఇలాంటి పబ్లిసిటీ స్టంట్స్‌తో, అంటే వాళ్లు కాఫీ షాపులో మాట్లాడుకున్నది ఎలా ప్రొజెక్టు చేశారో మనం చూశాం. ఇక్కడ పేదరికంలో ఉన్నవారు జగన్మోహన్‌రెడ్డిగారిని ఏ విధంగా మెచ్చుకుంటారనేది మనం చూడొచ్చు.

**మ.1.00**

నాడు-నేడు, ఆరోగ్యం, ఇవన్నీ తీసుకున్నప్పుడు కొన్ని ప్రాంతాలకు మాత్రమే అభివృద్ధి పరిమితం కాదు, రాష్ట్రమంతా అభివృద్ధి జరిగింది. ఎందుకు ఈ మాట అంటున్నానంటే నిజంగా అభివృద్ధి జరిగింది కాబట్టే మొన్న జరిగిన స్థానిక ఎన్నికల్లో వన్‌సైడ్ తీర్పు వచ్చింది. కుప్పంలో ఆయన ఓడిపోయాడని ఒప్పుకోకుండా ఇంకొక రకంగా మాట్లాడుతున్నాడు. చంద్రబాబునాయుడుగారికి ఒక నైజం ఉంది. ప్రజలు ఆయన్ని ఓడిస్తే వారు ఒప్పుకోరు. ప్రజల మైండ్ సెట్ బాగోలేదని అంటారు లేకపోతే ఈవీఎం తప్పు అని అంటారు. చంద్రబాబునాయుడు గారిని చూసి అఖిలేష్ యాదవ్ గారు రెండు అడుగులు ముందుకు వేసి వారు కౌంటింగ్ రాకముందే ఈవీఎం తప్పు అని అంటారు. ఇవి వికృత చేష్టలు. వీరు ప్రజాభిమానం పొందాలి, ప్రజలు ఎందుకు ఓడించారు, తిరిగి ప్రజల మన్ననలు పొందాలనే ఆలోచన చేయాలి కానీ ఈవీఎంలు తప్పు అని మాట్లాడతారు, లేకపోతే ప్రజల మైండ్ సెట్ గురించి విమర్శిస్తారు. ఇదా నాయకత్వం అంటే? వీరు పనిచేయకపోతే ఓటు వేసి ఉండరు. ప్రజల మన్ననలు పొందాలని అనుకోవాలి. ఈ రోజు రాజశేఖర రెడ్డిగారి పేరు చెబితే కొన్ని వందల పథకాల గురించి చెప్పవచ్చు. రైతులకు ఉచిత విద్యుత్, శాచ్యురేషన్ మోడ్‌లో పింఛన్లు, అందరికీ ఇళ్లు 104, 108 వాహనాలు ఇలా ఎన్నో రాజశేఖర రెడ్డిగారి గురించి చెప్పుకోవచ్చు. జగన్మోహన్‌రెడ్డి గారిని చూస్తే అమ్మ ఒడి, ఆసరా, చేయూత లాంటి పథకాలు కొన్ని వందలు అని చెప్పవచ్చు. అదే రకంగా చంద్రబాబునాయుడుగారు

14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రజలకు చంద్రబాబునాయుడుగారు గుర్తుకు వచ్చే ఒక్క పథకం కూడా లేదు. వారు ఏం నాయకులో, వారు, వారి నాయకులు ఆలోచన చేసుకోవాలి. కుప్పం ఎన్నికల ఫలితాల గురించి చర్చకు వస్తుందని చెప్పి ఆ రోజు సభలో వింతగా ప్రవర్తించి, బయటికి పోవడం చూశాం, దేనికి బయటికి వెళ్లాడు, ఎవరు ఏమనకపోయినా అన్నారు అని చెప్పి, ఆ రోజు ఇస్యూ చేసి, వారు ఇంటికి చేరుకున్నారు. ఇంటికి చేరుకొని అక్కడ నుంచి హడావుడిగా పార్టీ ఆఫీసుకి వెళ్లారు. అక్కడ కూర్చుని ఎందుకు ఆవిధంగా ఏడ్చారో నిజంగా ఆశ్చర్యంగా ఉంది. ఎవరైనా మన అనుచరులు పక్కన పది మంది ఉన్నప్పుడు మనకు కన్నీళ్లు వస్తే సడెన్‌గా మన భుజం పట్టుకుంటారు. అదేమి చోద్యమో కానీ 20ని.లు ఎక్కిళ్లు పెట్టుకొని ఏడుస్తుంటే ఎవరూ రావొద్దని అడ్డుకున్నారు. ముందుగానే ప్రిపేర్ అయి ఏడ్చిన ఏడుపు అని అర్థం అవుతోంది. మీరు కూడా చూసి ఉంటారు. సాటి మనిషి కన్నీళ్లు పెట్టుకుంటే ప్రెస్ వాళ్లు అయినా ఎవరైనా మన భుజాలు పట్టుకుంటారా, లేదా? ఇరవై నిమిషాలపాటు వారు వెక్కిళ్లు పెట్టి ఏడుస్తుంటే ఒక్కరు కూడా వెళ్లలేదంటే అది డ్రామా అని ఆలోచన చేయాలి. కేవలం సింపతీ కోసం ప్రయత్నం చేశారు. వారిని ప్రజలు కుప్పంలో ఓడించారన్న బాధ, ఆ బాధ నుంచి తప్పుదోవ పట్టించడానికి ఇంకొక అడుగు. ఇలాంటి అడుగులు వేసుకుంటూ పోవడం అన్నది నిజంగా ఆశ్చర్యకరం.

ఆరోగ్యం విషయంలో, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ప్రతి గ్రామంలో ఒకటి ఉండాలని దాదాపుగా 10వేలకు పైగా హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేశారు. దానికి రూ.1700కోట్లు ఖర్చు చేశారు. అదే రకంగా నాడు-నేడు కార్యక్రమం కింద రిపేర్లు, కొత్త నిర్మాణాలకు సంబంధించి ఇంతకుముందే మంత్రి గారు చెప్పారు, మేము అప్పుడే ఆలోచన చేశాం, మండలానికొక జూనియర్ కాలేజీ, రెండు పిహెచ్‌సీలు ఉండాలని సుమారుగా రూ.1125కోట్లు ఖర్చు చేశాం. ప్రతి గ్రామీణ ప్రాంతాలలోని పేదవారికి వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో 176పిహెచ్‌సీలు శాంక్షన్ చేశారు. **344** Urban Health centres మునిసిపాలిటీ ఏరియాల్లో కడుతున్నారు. దాదాపుగా రూ.400కోట్ల నిధులను శాంక్షన్ చేశారు. మేము ఆరోగ్యానికి అంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఏరియా ఆసుపత్రులకు, కమ్యూనిటి హెల్త్ సెంటర్స్‌కి రూ.1,550కోట్లు మంజూరు చేశారు. ఈ రకంగా చూసుకుంటే చాలా గొప్ప అడుగులు వేశారు. మెడికల్ కాలేజీలపైనా దృష్టి పెట్టారు. 11 existing medical colleges, 16కొత్త మెడికల్ కాలేజీలు, ఐదు ట్రైబల్ మల్టీ స్కిల్డ్ డెవలప్‌మెంట్ హాస్పిటల్స్, పాత ప్రభుత్వ వైద్యశాలలు, గుంటూరు, కర్నూలు లాంటి నిర్వీర్యమైన ఆసుపత్రుల ఆధునీకరణ కోసం రూ.12,300కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ రాష్ట్రానికి 1,850 ఎంబిబిఎస్ సీట్లు, 960 నర్సింగ్ సీట్లు అదనంగా పెరిగాయి. విజన్ అంటే ఇది. ఇదీ వ్యక్తిత్వం. అట్లా కాకుండా ఎప్పుడో ఏదో చేశామని చెప్పుకోవడం కాదు. ఒక లీడర్ అనే వ్యక్తి ఈ రాష్ట్రానికి ఏమి చేశారన్నది చూసుకోవాలి. మనం ఆలోచన చేయాలి. గతంలో స్కూళ్లు, ఆసుపత్రుల పరిస్థితి ఏమిటి, ఇప్పటి పరిస్థితి ఏమిటి అనేది ఒకసారి ఆలోచన చేయాలి. గతంలో ఆసుపత్రుల్లో పోస్టులు ఎలా ఉన్నాయి, ఇప్పుడు ఎలా ఉన్నాయి. ఈ రెండే ప్రాధాన్యత గల అంశాలు. గతంలో ప్రాధాన్యత ఎవరైనా

ఇచ్చారా? ఇవి ప్రతి ఒక్క పేదవాడికి ఉపయోగపడేవి. ఇవన్నీ చేస్తూ ముఖ్యమంత్రి గారు వేరే రంగాల్లో తగ్గిస్తున్నారా అంటే ఏమీ లేదు.

తరువాత అత్యంత ప్రాధాన్యత ఉమెన్ వెల్ఫేర్‌కి ఇచ్చాం అధ్యక్షా. ఉమెన్ వెల్ఫేర్ గురించి చెప్పాలంటే ఎంతైనా చెప్పవచ్చు. దాదాపు రెండు గంటల పైన మాట్లాడవచ్చు. 80లక్షల మంది మహిళలకు మంత్రిగారు చెప్పిన విధంగా రూ.25,000కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేసి రెండు విడతల్లో రూ.12,800కోట్లు వాళ్ల అకౌంట్లో డిపాజిట్ చేసిన గొప్ప వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి గారని తెలియజేస్తున్నాను.

గత ప్రభుత్వం సున్నా వడ్డీ పథకాన్ని నిర్వీర్యం చేసింది. ఇప్పుడు సున్నా వడ్డీ కింద రూ.2,280కోట్లు వాళ్ల అకౌంట్‌లో వేశారు. బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.61,000కోట్లు వారికి రుణాలిచ్చారు. చేయూత లాంటి పథకాన్ని అవహేళన చేస్తే ఈ ప్రభుత్వం చేయూత ద్వారా దాదాపుగా రూ.18,750కోట్లు చెల్లించింది. ప్రతి ఒక్కరికి నాలుగు విడతలుగా రూ.70,000లు మహిళలకు చెల్లించడమే కాకుండా, వారికి ఆర్థికంగా స్వావలంబనగా ఉంటున్నారు. ఇప్పుడు ఖర్చులు పెరిగాయి. వాస్తవంగా చెప్పాలంటే ధరలు కూడా పెరిగాయి. దీనిని తట్టుకోవాలంటే ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలి. అది జగన్మోహన్‌రెడ్డి గారి ఆలోచన. చాలా మంది హేళనగా మాట్లాడతారు. నేడు భార్య, భర్తలిద్దరు సంపాదించకపోతే ఇల్లు గడవలేని పరిస్థితి. ఇద్దరు చేయి, చేయి కలిపి సంపాదిస్తేనే కుటుంబాల్లో చదివించుకునే శక్తి పెరుగుతోంది. కుటుంబంలో కూడా సంతోషంగా ఉంటారు. సున్నా వడ్డీ వచ్చినప్పుడు, డ్వాక్రా రుణాలు మాఫీ చేసే డబ్బు, చేయూత పథకం డబ్బులు లబ్ధిదారుల అకౌంట్‌లో పడ్డాయి. ఆ డబ్బులు వచ్చిన్నప్పుడు చాలా మంది పేదవారి దగ్గరికి వెళ్లి ఆ డబ్బులు ఏమి చేస్తున్నారని అడిగాం. మాకు జగనన్న ఇచ్చిన డబ్బులతో పశువులు కొనుక్కున్నామని కొంతమంది, అంగళ్లు పెట్టుకున్నామని కొంతమంది, టైలరింగ్ నేర్చుకొని టైలరింగ్ షాపులు పెట్టుకున్నామని మరి కొంతమంది చెప్పారు. ఏ ఒక్క మహిళ కూడా ఆ డబ్బులు దుర్వినియోగం చేయలేదు. నిజంగా చాలా సంతోషమనిపించింది. దీనిని ఏ రకంగా విమర్శిస్తారో, ఒకసారి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలి. దాంట్లో ఏ తప్పు ఉంది. ప్రతి పేదవాళ్లకి నేరుగా డబ్బు రావడం వల్ల వాళ్లు ఆర్థికంగా అభివృద్ధి చెందడం చూసి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారు తప్పితే వాళ్లు విమర్శ చేసేందుకు ప్రభుత్వం ఏ తప్పు చేయలేదు. ఈ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడే ప్రభుత్వమని మనందరికీ తెలుసు. వాళ్ల లాగా పబ్లిసిటీ లేకున్నా ఈ రాష్ట్రానికి మంచి అవార్డులు కూడా వచ్చాయి. ప్రతి ఒక్కరూ మన రాష్ట్రాన్ని అభినందిస్తున్నారు. వాళ్ల మాదిరి తప్పుడు ప్రచారం చేసుకోలేదు. రీసెంట్‌గా SKOCH Governance రిపోర్టు వచ్చింది. మామూలుగా ఇది చిన్నదేమో అని అనుకున్నాను. తరవాత దీని గురించి చదివాను. SKOCH లో పాలసీ మేకర్స్‌గా ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. వీళ్లంతా కూడా అమిత్ సిన్హా, ఇంకా బాగా పేరున్న వారు. ఈ సంస్థ, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంబర్ వన్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిగారని ఇవ్వడం గర్వ కారణం. ఇలాంటివి ఎప్పుడూ కూడా రియాల్టీగా ఉండేవి. వాళ్లు గంటలో డాక్టరేట్ వచ్చిందని చెప్తారు. హడావుడిగా టీవీల్లో వేస్తారు. న్యూస్ ఏమైనా వచ్చిందా అని చూస్తే ఏమీ ఉండదు.

ఇలాంటి పబ్లిక్ సర్వీస్‌లు కాకుండా నిజంగా ఈ ప్రభుత్వం మంచి చేసింది కాబట్టే ఈ రోజు దేశంలో నంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలబడింది. ఆ సంస్థ గురించి మీరు ఇంటర్నెట్‌లో ఎప్పుడైనా బ్రౌజ్ చేసుకోవచ్చు. బ్రౌజ్ చేసుకుంటే SKOCH group ఎంత మంచి సంస్థ అనేది వారికే తెలుస్తుంది. ఉమెన్ వెల్ఫేర్, ఆర్థికంగా, విద్యకు, ఆరోగ్యానికి, మహిళల సంక్షేమం గురించి ఎంత ప్రాధాన్యత ఇచ్చామో చెప్పుకున్నాం.

అదేరకంగా వ్యవసాయం. ఒక్క రైతు భరోసా కిందనే ఈ రెండున్నర సంవత్సరాల్లో రూ.20,117కోట్లు రైతులకు నేరుగా చెల్లించిన ప్రభుత్వం ఇది. వారి గత ఐదు సంవత్సరాల పాలనలో రైతులకు రూ.14,000కోట్లు కూడా ఇవ్వలేకపోయారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన తరవాత మూడు సంవత్సరాల లోపే రూ.20,117కోట్లు ఇవ్వడమే కాకుండా, nature calamity fund కింద రూ.2,000కోట్లు, price stabilization fund కింద రూ.3,000కోట్లు పెట్టి, దానిని కూడా ప్రతి నిత్యం ప్రజలకు ఉపయోగించుకుంటున్నారు. సున్నా వడ్డీని కూడా మరలా పునరుద్ధరించారు.

**మ.1.10**

దాదాపు 10,770 ఆర్‌బికెలను మనం కడుతున్నాం. గత ప్రభుత్వం వరదలు, తుపాన్ల వల్ల రైతు నష్టపోతే ఏ రోజూ సమయానికి నష్టపరిహారం ఇచ్చేది కాదు. రైతు ఎప్పుడు ఏ పంట నష్టపోతాడో అదే పంట సీజన్ అయిపోయే లోపు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2000కోట్లు చెల్లించిన ప్రభుత్వం ఇది. దేశంలో ఎక్కడా ఈ విధంగా లేదు. రైతుల తరపున ఫ్రీగా ఇన్సూరెన్స్ కడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇస్తున్నాం. ఇన్‌పుట్ సబ్సిడీ మాత్రమే కాకుండా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్‌లో దాదాపు రూ.37,000 కోట్ల వరిని సేకరించాం. ఏరకంగా చూసుకున్నా రైతులకు ఈ ప్రభుత్వం ఉపయోగపడుతోంది. గతంలో "విద్యుత్తును బాగా ఇచ్చేవాళ్లం. పవర్‌కట్స్ లేవని చెప్పే వాళ్లు". ఈ రోజు రైతులకు పగటిపూట తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్తును ఇస్తున్న ప్రభుత్వం మాది.

(ఇవ్వడం లేదు అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

దాదాపు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి తొమ్మిది గంటల పాటు పగటి పూట కరెంటు ఇస్తున్న ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం.

(ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదు అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

మీరు అరచి గొడవ చెయ్యకపోతే ప్రతి ఒక్క అంశం చెబుతాను. రైతులకు ఉచిత విద్యుత్ గురించి మాట్లాడుతుంటే వాళ్లు అక్కడ నుంచి మాట్లాడుతున్నారు. ఏవో కేకలు వేస్తున్నారు. గతంలో ఉచిత విద్యుత్ రాజశేఖర్ రెడ్డి గారు ఇస్తానంటే ఆ కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకునే పరిస్థితి వస్తుంది. ఉచిత విద్యుత్ పెట్టకూడదు అని రైతులకు సంబంధించి కరెంటు బిల్లులు పెంచడమే కాకుండా బషీర్‌బాగ్‌లో రైతులను చంపిన వాళ్లు ఈ రోజు ఏదో మాట్లాడుతున్నారు. ఉచిత విద్యుత్ గురించి గతంలో చంద్రబాబునాయుడు ఏం మాట్లాడారో ఒకసారి చూడండి. ఎవరు ఉచిత విద్యుత్ చేసింది, ఏ సమయంలో రైతులకు వచ్చింది, ఉచిత విద్యుత్ ఇవ్వనప్పుడు రైతుల పరిస్థితి ఎలా ఉంది, ఉచిత

విద్యుత్ ఇచ్చిన తరవాత ఎలా ఉందనేది ఒకసారి శాసనసభ్యులు analyse చెయ్యండి. తమ ఊళ్లకు వెళ్లి తిరగండి. అప్పుడు చంద్రబాబునాయుడు గారు ఏమన్నారో, చేసింది ఎవరో కనుక్కోండి.

(ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదు అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

ఈ ప్రభుత్వం బ్రహ్మాండంగా పని చేస్తోంది. ఇప్పటికి పదివేల బోర్లకు పైగా జల కళ ద్వారా పేద ప్రజలకు బోర్లు వేశాం. ఏ అంశంపై ఆలోచన చేసినా నేరుగా పేదవారికి ఎలా చెయ్యాలి అని గొప్పగా ఆలోచన చేసే ప్రభుత్వం ఈ ప్రభుత్వం. ఎటువంటి కష్టాలు వచ్చినా అదరకుండా, బెదరకుండా నేను చెయ్యాల్సిన కార్యక్రమాలు సమయానికి చెయ్యాలి, నేను చెప్పిన టైం కోసం ప్రజలు ఎదురుచూస్తుంటారు, వాళ్లకు తోడుగా, నీడగా ఉండాలని సమయానికి చేయాలనే గొప్ప మనస్తత్వం ఉన్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి గారు. మిగతా వారిలా పబ్లిసిటీ సెన్స్ లేదు.

ఈ రాష్ట్రంలో మనం వింత పరిస్థితులు చూస్తున్నాం. సినిమా టిక్కెట్ల వ్యవహారంపై ఏదో ఈ రాష్ట్రానికి జరిగిపోతోందని ఏదేదో న్యూసెన్స్ చేశారు. ఆ సినిమాలకు సంబంధించిన వాళ్లు తమకు కావలసిన దానిపై గౌరవ ముఖ్యమంత్రిని కలిస్తే అది కూడా హేళన చేస్తూ వాళ్లతో దణ్ణం పెట్టించుకున్నారని మాట్లాడారు. ప్రతిపక్షంగా వాళ్లు చెయ్యాల్సింది ఇవా? ఈ మూడు సంవత్సరాలలో ప్రతిపక్షంగా సక్రమంగా వ్యవహరించిన రోజు ఒక్కటైనా ఉందా? ఒక్కసారి రికార్డులు చూడండి. కేవలం బురద జల్లాలి, ప్రతిపక్షంగా వ్యవహరించి అమరావతి రైతులను కాపాడుకోవడం ఒక్కటే వారి బాధ్యత అనే విధంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారు అనే ఆలోచన లేకుండా ద్వేషిస్తూ, అనునిత్యం ఏదో రకంగా జగన్మోహన్‌రెడ్డి గారిపై బురద జల్లుతూ, పర్సనల్ అటాక్ చేయడమే టీడీపీ వాళ్లు పనిగా పెట్టుకున్నారు. ప్రతి నియోజకవర్గంలో కొంతమంది వ్యక్తుల ద్వారా రాంగ్ న్యూస్ పంపిస్తూ, ఇష్టం వచ్చినట్లు హేళన చేస్తూ, మనుషులను అవమానించే స్థాయికి దిగజారారు. ఇవన్నీ చెయ్యడమెందుకు? ప్రజల మన్ననలను పొందవచ్చు కదా ! వారికి ఎప్పుడూ అలాంటి ఆలోచన ఉండదు. గౌరవ ముఖ్యమంత్రి వద్దకు సినిమా వాళ్లు వస్తే ఏడుపు ఇండస్ట్రీస్ వస్తే ఏడుపు, ఎప్పుడూ ఈర్ష్య, ద్వేషంతో రగిలిపోతుంటారు. కానీ అవేమి పట్టించుకోకుండా ఈ రాష్ట్రానికి మంచి చెయ్యాలని చిరునవ్వుతో ఆలోచన చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి గారు. ఆ చిరునవ్వు చూసి భరించలేరు. ఆ చిరునవ్వు చూస్తే వాళ్లకు కోపం ఎక్కువ. దానితో frustrate అయ్యి ఏదేదో మాట్లాడుతున్నారు. వారికి ఆ నవ్వు రాదు. ఎందుకంటే మంచి చెయ్యలేరు, వారిది అంతా artificial గా వ్యవహరించే తత్వం. ప్రజలకు మంచి చేస్తున్నారు కాబట్టే, ఏ ఆలోచన చేసినా ప్రజల కోసం అనే ఆలోచన ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి గారు. అందుకనే ఆయన రాత్రి పడుకునేటప్పుడు సంతోషంగా పడుకుంటారు. ఆయన ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు ఎందుకు ఉంటుందంటే ఆయన ఏ తప్పు చేసిన వ్యక్తి కాదు. ఆయన అనుకున్న కార్యక్రమాలు పేద ప్రజలకు చేరుతున్నాయి అనే సంతోషమే ఆయన ముఖంలో చిరునవ్వు. అది గమనించకుండా ముఖ్యమంత్రి గారిపై ద్వేషంతో ఆయన నవ్వుతున్నా ఓర్చుకోలేని పరిస్థితుల్లో వారు వ్యవహరిస్తున్నారు. వాళ్లకు ఉన్న మీడియా శక్తి, మిగతా శక్తులతో ఇష్టానుసారం వారి బ్లడ్ వేరు, బ్రీడ్ వేరు లాంటి మాటలతో రాష్ట్రంలోని ప్రజలందరినీ అవమానిస్తూ, వాళ్లు వేరొక గ్రహం

నుంచి వచ్చినట్టు గొప్పగా మాట్లాడుతున్నారు. నిజంగా ఆశ్చర్యకరం. రక్తం ఎవరికైనా వేరుగా ఉంటుందా? ఇలాంటి మాటలతో రెచ్చగొట్టే రీతిలో వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధానాన్ని మనం చూస్తున్నాం. రాష్ట్రం బాగా అభివృద్ధి పథంలో సాగుతోంది. జగన్మోహన్ రెడ్డి గారిని ప్రజలు అభినందిస్తున్నారంటే చూసి తట్టుకోలేరు. ఎక్కడో తాగుబోతులు ఎన్టీఆర్ విగ్రహంపై పడ్డారని, దానిని ఏదో పెద్ద న్యూస్‌గా క్రియేట్ చేశారు. ఈ ప్రభుత్వం తప్పు చేసిన వాళ్లని వెంటనే అరెస్టు చేసింది. అదే వారి హయాంలో రాజశేఖరరెడ్డి గారి విగ్రహాలు, ఎన్ని దేవాలయాలు ధ్వంసం చేశారు? ఎక్కడో తాగుబోతు చిన్న విగ్రహంపై రాయి వేస్తే దానిని పెద్దగా క్రియేట్ చేసి, రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని ఏదో ఒక రకంగా ఈ ప్రభుత్వాన్ని అస్థిర పరచాలనే ఆలోచనతో ఉన్నారు. గవర్నరు గారు ప్రసంగిస్తుంటే వాళ్లు వ్యవహరించిన తీరు తమరు కూడా పక్కన ఉండి గమనించారు. ఆ దౌర్జన్యం, ప్రెస్‌మీట్‌లలో వాళ్ల నాయకులు 24గంటలు ద్వేషించే తీరు, ఇంక వేరే పని ఉండదు. మనుషులను ఇష్టానుసారం విమర్శించడమే వాళ్లు పోషించే ప్రతిపక్ష పాత్ర. ఇదే కాకుండా రోడ్ల విషయంలో శ్రద్ధ పెట్టి గత ఆరు నెలల నుంచి పనులు ఎలా జరుగుతున్నాయో మనం చూస్తున్నాం. రాబోయే మార్చికి మొత్తం మెయిన్‌రోడ్లు అన్నీ అద్దంలా తయారు అయ్యేటట్లు ప్రణాళిక రూపొందించి పనులు యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు.

అధ్యక్షా, అర్బన్ ప్రాంతంలో మండల హెడ్ క్వార్టర్స్‌లో కానీ, జిల్లా కేంద్రాల్లో ఒక పేదవాడు స్థలం కొనుక్కోవాలంటే అందుబాటులో లేని పరిస్థితి. ఇల్లు శాంక్షన్ చేసినా భారం అనుకుని కట్టుకోలేని పరిస్థితి. అటువంటిది 30లక్షల మంది అక్క-చెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఎక్కడైనా జరిగిందా? ఎంత మంచి ఆలోచన. దానిపై కూడా కోర్టులకు వెళ్లి ప్రతిపక్షం వారు స్టే తెచ్చారు. వాళ్ల ఆలోచనలకు చాలా బాధ వేస్తోంది. ఇక్కడ ల్యాండ్ పూలింగ్ చేశామన్నారు. ల్యాండ్ పూలింగ్ చేసి అమరావతిని అభివృద్ధి చేద్దాం. దీనిని కూడా ఒక రీతికి తీసుకొద్దామని ముఖ్యమంత్రి గారు ఆలోచన చేస్తే ద్వేషిస్తారు. ఇక్కడ అందరికీ ఇళ్లు ఇస్తే తద్వారా ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రజల స్లోటింగ్ పెరుగుతుందని పేదవారికి ఇళ్ల పట్టాలు ఇస్తే, దానిపై స్టే తెచ్చారు. పేదవారు ఇక్కడికి వస్తే democratic imbalance వస్తుంది. మేము ఆర్థిక స్థితిమంతులం. ఇక్కడ ఉండడానికి అవ్వదు అని ఒక అఫిడవిట్ కోర్టులో ఇచ్చారు. అంటే పేదవాడు రావాలి వాళ్ల ఇంటిలో పని చెయ్యాలి, వాళ్ల ఇళ్లు కట్టాలి, సాయంత్రానికి వెళ్లిపోవాలి కానీ దానిలో నివశించకూడదు. ఇలాంటి వ్యవహారాలు చెప్పుకుంటూ పోతే కొన్ని వందలు ఉన్నాయి. ఇలాంటి చీప్ ట్రిక్స్‌తో పబ్బం గడుపుకుంటూ వచ్చారు. అలా కాకుండా జగన్మోహన్ రెడ్డిగారు పేదవాడు ఏ కులమైనా, మతమైనా అతని అర్హతే ప్రాధాన్యతగా పథకాలు అందిస్తున్నారు. రూ.1,75,000కోట్లు డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ డిపాజిట్‌ల ద్వారా పేద ప్రజలకు ఇచ్చారు. దీంట్లో ఏదైనా వివక్ష చూపించామని ఒక ఉదాహరణ చూపించమనండి. తెలుగుదేశం పార్టీ వాళ్లు ఎంతమంది ఉంటారు, ఎంతమందికి రూ.1,75,000కోట్లలో ఎంత డబ్బు వాళ్లకు చేరిందో లిస్ట్ తియ్యమనండి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వాళ్లనే వెతుక్కోమనండి. ఈ ప్రభుత్వం ఎక్కడైనా వివక్ష చూపిస్తోందా? లింగ భేదం, కులాలు చూపిస్తోందా? ప్రతి ఒక్కరు బాగుండాలనే ఉద్దేశంతోనే ఈ

కార్యక్రమం చేస్తున్నాం. ఈ రాష్ట్రానికి సంబంధించి ప్రతి ఒక్క అంశం తాకట్టు పెట్టారు. ఆ రోజు ఈయన (శ్రీ నారా చంద్రబాబునాయుడు నుద్దేశించి) స్వలాభం కోసం దిల్లీకి వెళ్లి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి వచ్చారు. ఏమిటయ్యా అంటే ప్యాకేజ్ బాగుందని అర్ధరాత్రి స్టేట్‌మెంట్లు ఇచ్చారు.

(మీరు అమ్మేశారు అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

ఈ రోజు ప్రత్యేక హోదా అంటూ మళ్లీ మాట్లాడతారు. ఆ రోజు వాళ్లే క్లియర్‌గా చెప్పారు. "మీరే ప్రత్యేక హోదా వద్దన్నారు కదా. ప్యాకేజీ బాగుందని తీసుకున్నారు కదా" అని మేమడిగితే మాట్లాడరు. ఈ రోజు ప్రత్యేక హోదాపై డిఫెండ్ చేసుకుంటూ మేము గట్టిగా పోరాడుతున్నాం. మేము ఏమీ ఆ సబ్జెక్ట్‌ను వదల లేదు. ఎప్పుడు దిల్లీకి వెళ్లినా ప్రత్యేక హోదా గురించి డిఫెండ్ చేస్తున్నాం, దాని గురించి అడుగుతున్నాం. వారు ఈ రాష్ట్రంలో కొన్ని ఇంటరెస్ట్‌ల వల్ల తాకట్టు పెట్టడమే కాకుండా హైదరాబాద్ నుండి పారిపోయి వచ్చి ప్రీప్లాన్డ్‌గా ఈ రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారు. ఈ రాష్ట్రం ఆయన వల్లే నిర్వీర్యం అయిపోయింది. ఆ అయిదు సంవత్సరాలు నీట్‌గా ప్లాన్ చేసి ఒక ఎస్టాబ్లిష్డ్ సిటీని కనుక చేసుంటే మనం హైదరాబాద్‌కు ధీటుగా డెవలప్ అయి ఉండేవాళ్లం. ఆ విధంగా ఆలోచన చెయ్యలేదు. ఆయన సొంత అజెండా పెట్టుకుని స్వార్థంతో ఈ రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారు. మాలాంటి వాళ్లకు చాలా బాధ కలుగుతుంది. మళ్లీ మా మీద బురద జల్లే కార్యక్రమం చేస్తారు. ఎక్కడ ఏది జరగాలో అది జరగాలి. అప్పుడే ఈ రాష్ట్రానికి మేలు జరుగుతుంది. దాని ద్వారా మన రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది, గుర్తింపు కూడా వస్తుంది. ప్రజలలో ఫ్లోటింగ్ పెరుగుతుంది. అలా చెయ్యకుండా వ్యక్తిగత టార్గెట్‌లు, వ్యక్తిగత అజెండాలు పెట్టుకుంటే ఫెయిల్యూర్స్ వస్తాయి, రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ఎందుకు అంత ద్వేషం? కర్నూలులో హైకోర్టు ఎందుకు ఉండకూడదు? ఎందుకు రాయలసీమలో ఏమి రాకూడదంటారు? అసలు రాయలసీమ, ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల గురించి ఏ రోజైనా వాళ్లు ఆలోచన చేశారా?

**మ.1.20**

అధ్యక్షా, ఈ రోజున మేం నిజంగా చెబుతున్నాం. అనంతపురం జిల్లాలో రైతులు గర్వంగా ఉన్నారు, రైతులు వ్యవసాయపరంగా కొత్త ఒరవడి సృష్టిస్తున్నారంటే అందుకు గల ప్రధాన కారణం డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు. నిన్న కొంత మంది ప్రతిపక్షపార్టీ సభ్యులు మాట్లాడారు. కియా కంపెనీ అనంతపురం జిల్లాలో మీ తండ్రి గారు తెచ్చారా, ఇంకొకరు తెచ్చారా అని అసభ్యంగా ముఖ్యమంత్రి గారి గురించి అన్నారు. నిజంగా వాళ్లకు ఒక్కటే సమాధానం చెబుతున్నాను. కియా కంపెనీ ఎలా వచ్చిందో కానీ కియా కంపెనీ ఏర్పాటు మాత్రం కేవలం గొల్లపల్లి రిజర్వాయర్‌ను చూసి పెట్టిందే. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించింది దివంగతనేత డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు. అదీ ఆయన ఆలోచన. హంద్రీ నీవా లాంటి ప్రాజెక్టు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు శంకుస్థాపన చేయగా డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టును అనంతపురం జిల్లా మీదుగా తీసుకుపోతుంటే చంద్రబాబునాయుడు గారి హయాంలో సంబంధిత జీవోను రద్దు చేసి కేవలం తాగునీటికే పరిమితం చేశారు. 1999 సంవత్సరంలో హంద్రీ నీవా సుజల

స్రవంతి రిజర్వాయర్ ద్వారా కేవలం తాగునీటి అవసరాలు మాత్రమే తీరాలనట్టుగా చంద్రబాబు నాయుడు గారి హయాంలో జీవో విడుదల కాబడింది. 2004 సంవత్సరంలో డా.రాజశేఖరరెడ్డి గారు అధికారం చేపట్టగానే ఆ జీవోను రద్దు చేసి హంద్రీ నీవా సుజల స్రవంతి నిర్మాణం చేపట్టడం వల్లనే ఈ రోజున అనంతపురం జిల్లాలో కొన్ని వందల టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకోగల్గుతున్నాం. జిల్లాలోని కొన్ని చెరువులకు నీటిని చేరవేయగల్గుతున్నాం. అటువంటి ఆలోచన చేసింది రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం, తరవాత జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. రైతాంగానికి మేం చేసిందేమిటంటే ఎన్నో చెప్పుకోవడానికి ఉన్నాయి. అందులో భాగమే గండికోట రిజర్వాయర్ నిర్మాణం. గత ప్రభుత్వ హయాంలో గండికోట రిజర్వాయర్లో 13 టీఎంసీల నీరు కూడా నిల్వ ఉంచలేకపోయారు. కానీ అదే రిజర్వాయర్లో 25 టీఎంసీల నీటిని నిల్వ చేసే విధంగా నిర్మాణం చేపట్టిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు. అదే విధంగా వెలిగొండ, వెలుగోడు రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. గతంలో ఎక్కువగా నీటి స్టోరేజి ఉండేది కాదు. అదే విధంగా బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు. ఏ రోజు కూడా కనీసం 4 టీఎంసీల నీరు దాటించే పరిస్థితి ఉండేదికాదు. ఫుల్ స్టోరేజీకి మన ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇవన్నీ మేము చేసిన పనులు, అధ్యక్షా.

ఇవన్నీ ముందుచూపు ఆలోచనతో చేసిన పనులు కావా? చివరకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. దాని గురించి హేళనగా మాట్లాడతారు. ప్రతి ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుదోవ పట్టించే విధానం వారిది. వాళ్ల నాయకుడికి ఏ అర్హత ఉందని పోలవరం ప్రాజెక్టు గురించి వాళ్లు మాట్లాడుతున్నారు. 2004 సంవత్సరంలో అధికారం నుంచి దిగిపోయే ముందు పోలవరం ప్రాజెక్టుకు ఫీజిబిలిటీ లేదని మాట్లాడిన వ్యక్తి చంద్రబాబు నాయుడు గారు. కానీ రాజశేఖరరెడ్డి గారు తన కలలకు సాకారంగా కేంద్రం నుంచి అనేక అనుమతులు తీసుకొచ్చి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పోలవరం నిర్మాణానికి అసలైన కారకులు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు. అదే బాటలో ఇవాళ జగన్మోహన్ రెడ్డి గారు పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలనే ఉద్దేశంతో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. రాజశేఖరరెడ్డి గారి ముద్రపడిన ప్రతి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నది జగన్మోహన్ రెడ్డి గారు. కేవలం పబ్లిసిటీ మాత్రం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగింది. అది చేస్తాం, ఇది చేస్తామని కేవలం గొప్పలు మాత్రమే గత ప్రభుత్వం చెప్పుకుంది. నేను ఒకటే అడుగుతున్నాను. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబు నాయుడు గారి కాలంలో పూర్తి చేసిన ప్రాజెక్టు ఏమిటో కూడా చెప్పుకోలేని పరిస్థితి కనబడుతోంది. కేవలం మొదలుపెట్టడం, పూర్తిచేయకపోవడమే వారి పనిగా పెట్టుకుని పరిపాలన సాగించారు. ఆయన ఒక నాయకుడా? కేవలం ప్రభుత్వం మీద బురదజల్లే కార్యక్రమం ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్నారు. ఎంతసేపు డ్రామాలు ఆడే వ్యవహారం తప్ప మరొకటి కాదు. కానీ అది కాదు. నిజంగా మనసు ఉండి చేయాలి. వారి హయాంలో ఏమేమి చేసింది

మనమే చూస్తున్నాం. అదే విధంగా జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కూడా మనం చూస్తున్నాం. ఎంత వ్యత్యాసమో ప్రజలు గమనిస్తున్నారు.

అధ్యక్షా, గతంలో చంద్రబాబు నాయుడు గారు రాజధాని "అమరావతి" అన్నాడు. ప్రతి గ్రామం నుంచి కొంత పుట్టమన్ను తీసుకురమ్మన్నాడు. ఆ సమయంలో మీరు కూడా చూసే ఉంటారు. తీసుకొచ్చిన పుట్టమన్నును తట్టల్లో పెట్టుకుని తమ్ముళ్లంతా ఊరేగుతూ ఒక చోట కుప్పగా చేర్చారు. మళ్లీ అక్కడకు వెళ్లి అఖండ దీపం పెడతానని అన్నారు. అఖండ దీపం పెడతానన్నవాడు కనీసం రెండు రోజులు కూడా దీపం పెట్టకుండా ఎత్తివేశారు. ప్రతిదీ డ్రామానే. హెలికాప్టర్ ఎక్కి అమరావతి అంతా నీళ్లు చల్లుతానని అన్నాడు, పునీతం అవుతుందని అన్నారు, నీళ్లు చల్లే కార్యక్రమాన్ని చేశారు. చివరకు రాష్ట్రాన్ని నవ్వులపాలు చేశారు. నిజంగానే మంచి ఉద్దేశం ఉండి, కట్టాలి, నిర్మించాలి, మంచి చేయాలనుకుంటే ప్రణాళికబద్ధంగా ఎప్పుడైనా చంద్రబాబు నాయుడు గారి హయంలో ముందుకు వెళ్లారా? ప్రతిదీ తాత్కాలికంగా చేస్తాం, మళ్లీ పూర్తి స్థాయిలో నిర్మాణం చేపడతామని చెప్పేవారు. ఏదో రకంగా వారి హయాంలో సమయం వృథా చేసి సొంత అజెండా అమలుకు చేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదు.

అధ్యక్షా, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అనేది మంచి ఆలోచన. మంచి ఎవరు చేసినా మంచిని మంచే అని అంటాం. గతంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు తాలుకా వ్యవస్థ నుంచి మండల వ్యవస్థను తీసుకొచ్చారు. మంచి కార్యక్రమమే. ప్రజలకు బాగా ఉపయోగపడింది. అదే కోణంలో ప్రజలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామంలోనే ప్రతి ప్రభుత్వాధికారి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, ప్రజలకు దగ్గర్నుంచి సేవ చేసే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి గారు చాలా గొప్పగా ఆలోచించారు. అదే విధంగా శాచ్యురేషన్ మోడ్‌లో పింఛన్లు మంజూరు చేయడం కూడా మంచి ఆలోచనే. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సమయం ప్రభుత్వం చేపట్టిన, అమలుచేస్తోన్న కార్యక్రమాల గురించి మాట్లాడుకోవచ్చు. ప్రతిపక్షపార్టీ సభ్యులు పింఛన్ల గురించి మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వం పింఛను మొత్తాన్ని రూ.2 వేలకు పెంచింది జనవరి 2019లో మాత్రమే.

అధ్యక్షా, ఎన్నికలకు కేవలం రెండు, మూడు నెలలకు ముందు పింఛనను పెంచి, పింఛను మొత్తాన్ని పెంచామని చెప్పుకోవడం వారి హయాంలో జరిగిందని ఆర్థిక శాఖ మంత్రి గారు చెప్పారు. కానీ మా విధానం ఏమిటి? చెప్పిన సమయానికే పింఛను మొత్తాన్ని పెంచాం. అధికారంలోకి రాగానే రూ.250/- ల మేరకు పింఛను మొత్తాన్ని పెంచాం. మరో రూ.250/- ల చొప్పున పింఛను మొత్తాన్ని పెంచాం. ఇలా పింఛను మొత్తాన్ని పెంచుకుంటూ పోతామని ముందే చెప్పాం. ఒక మాట మీద నిలబడాలి. కేవలం ఎన్నికల ముందు ప్రజలకు మంచి చేశామనేది కాదు. 2018 అక్టోబర్ మాసం వరకు యావరేజ్‌గా గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల క్రింద ఇచ్చింది మొత్తం కేవలం రూ.500.00 కోట్లు. కానీ

ఈ ప్రభుత్వం ఈ రోజున పింఛన్ల కోసం వెచ్చిస్తోన్న మొత్తం దాదాపుగా రూ.1,600.00 కోట్లు. రెండు ప్రభుత్వాల మధ్య ఎంత వ్యత్యాసమో చూడండి. ఇదంతా పేద ప్రజల సంక్షేమం కోసం కాదా? ఏ రకంగా చూసినా కూడా గత ప్రభుత్వ హయాంలో 2018 అక్టోబర్ వరకు 42 లక్షల పింఛన్లే. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 62 లక్షల పింఛన్లు మంజూరు చేసింది.

అధ్యక్షా, ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంత చిత్తశుద్ధితో వ్యవహరించిదనడానికి ఇది తార్కాణం. నేటికీ మేమంతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను దగ్గర పెట్టుకుని తిరుగుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల మేనిఫెస్టోను వాళ్లేమి చేశారు? చివరకు వెబ్‌సైట్ నుంచి తీసేసి మాయం చేశారు. చాలా ఆశ్చర్యకరం. మేనిఫెస్టోనే మాయం చేశారంటే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే తత్వం వాళ్లకు లేదు. ప్రజలకు చెప్పిన మాటను నిలబెట్టుకునే తత్వం రావాలి, ప్రభుత్వం ముందు ఎన్ని కష్టాలున్నా పర్వాలేదు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకుని ఆలోచన చేసే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు. అందుకనే మా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న హామీల్లో దాదాపుగా 96 శాతం అమలుచేసి, మిగిలిన హామీలను నెరవేర్చే క్రమంలో ప్రణాళికను రూపొందించుకుని ముందుకుపోతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ, గవర్నర్ గారు తన ప్రసంగంలో చెప్పిన అంశాలన్నింటినీ బలపరుస్తూ, ఈ ప్రభుత్వం ఎల్లకాలం చల్లగా ఉండాలని, రాబోయే కాలంలో వృద్ధి రేటు అనుకున్న దానికన్నా మెరుగ్గా పెరిగి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ, ఒక నాయకుడిగా జగన్మోహన్ రెడ్డి గారు ప్రజల మన్ననలను పొందుతున్న విధానాన్ని అభినందిస్తూ, జగన్మోహన్ రెడ్డి గారిని దేవుడు చల్లగా చూడాలని, ఈ ప్రభుత్వం చల్లగా ఉండి ఇదే రకంగా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని మీద్వారా కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ అంబటి రాంబాబు (SRI AMBATI RAMBABU):** అధ్యక్షా, 2022-23 బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నరు గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో సభనుద్దేశించి నాలుగు మాటలు మాట్లాడే అవకాశం కల్పించిన మీకు ముందుగా నా హృదయపూర్వక నమస్కారాలు.

గౌరవ గవర్నరు బిశ్వ భూషణ్ హరిచందన్ గారు మార్చి నెల ఏడవ తారీఖున తన ప్రసంగ పాఠంలో ఈ ప్రభుత్వం చేస్తున్న, చేయబోతున్న అనేక అంశాలను, ఆర్థికపరమైన అభివృద్ధి గురించి చాలా స్పష్టంగా వివరంగా ప్రసంగించారు. ఆద్యంతం ప్రసంగాన్ని పరిశీలించిన తరవాత ఒక విషయం చాలా స్పష్టంగా గోచరమవుతుంది. అదేమిటంటే, రెండు సంవత్సరాల కాలంలో కొవిడ్ మహమ్మారి రాష్ట్రాన్నే కాదు, దేశాన్నే కాదు, ప్రపంచాన్ని, మానవాళినే అతలాకుతలం చేసేసింది. ప్రపంచమంతా, దేశమంతా, రాష్ట్రమంతా గగ్గోలు పెట్టేశారు. ఆర్థికంగా రాష్ట్రాలు, భారతదేశం, చివరకు ప్రపంచంలోని అన్ని దేశాలు కుంగిపోయిన సందర్భం. అలాంటి సందర్భంలో కూడా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ

కార్యక్రమాలు ఆగకుండా అద్భుతాన్ని చూపెట్టిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారని చెప్పడానికి నిజంగా గర్వపడాలని మనవి చేస్తున్నాను. అలాంటి మహోన్నతమైన కార్యక్రమాన్ని ఈ రాష్ట్రంలో చేపట్టారు. మీరూ ప్రత్యక్షంగా చూశారు. ప్రజలందరూ గమనించారు. కొవిడ్ విషయంలో కానివ్వండి, సంక్షేమ కార్యక్రమాల్లో కానివ్వండి, అభివృద్ధి కార్యక్రమాల్లో కానివ్వండి, ఎక్కడ కూడా వెనకడుగు వేయకుండా రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికే దక్కుతుందనేది చాలా స్పష్టంగా అర్థమవుతున్న అంశం.

అయితే అధ్యక్షా, నా ఉపన్యాసానికి ముందు ఒక విషయాన్ని ఇక్కడ ప్రస్తావించకుండా ఉండలేకపోతున్నాను. అది ఎందుకంటే ఆ రోజు నేను ఇక్కడే కూర్చున్నాను. గవర్నరు గారు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. శాసనపరిషత్తు చైర్మన్ గారు ఆ ప్రక్కన కూర్చున్నారు. ఇటువైపున మీరూ కూర్చున్నారు. ఇది చాలా అరుదైన సమావేశం. ఈ సమావేశంలో గవర్నరు గారు మాట్లాడుతున్నప్పుడు సభలో గౌరవ సభ్యులందరూ ఎంతో హుందాగా వ్యవహరించాల్సి ఉంటుంది. గవర్నరు గారంటే రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించిన వ్యక్తి. అతనేమి ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన వ్యక్తో లేదా ఒక వర్గానికి సంబంధించిన వ్యక్తో కాదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన పదవిలో ఉన్న గవర్నరు గారు ఉపన్యాసాన్ని ప్రారంభించినప్పుడు సభలో ప్రధాన ప్రతిపక్షం ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులా కనిపించిందని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.

(గౌరవ ప్యానల్ స్పీకర్ శ్రీ శంబంగి వెంకట చిన అప్పల నాయుడు మధ్యాహ్నం గం.1.28 ని.లకు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

ప్రతిపక్ష సభ్యులు వారి స్థానాల్లో నిలబడ్డారు. నిలబడి ''గవర్నర్ గో బ్యాక్'' అని అరిచారు. అక్కడే కూర్చుని, అరిచి ఏదో నిరసన తెల్పుతారేమోనని నేను అనుకున్నాను. కాసేపు చూశారు. గవర్నర్ గారు వారి ప్రసంగాన్ని చదువుకుంటూ వెళ్తున్నారు.

**మ.1.30**

మీరు ఒకవైపు, చైర్మన్ గారు మరోవైపు కూర్చున్నారు. ఒక ఫ్రస్ట్రేషన్. అక్కడి నుంచి రెండడుగులు ముందుకు వేసి వెళ్లారు. అక్కడితో ఆగారా, ఆగలేదు. వెల్‌లోకి వెళ్లారు. వెల్‌లోకి వెళ్లిన తరువాత కూడా ఆగారా, ఆగలేదు. పోడియం మీదకు దూసుకుపోవాలనే ఒక ప్రయత్నం ప్రధాన ప్రతిపక్షం చేసింది. అప్పుడు సుమారు 50, 60 మంది మార్షల్స్ వచ్చి పోడియంకు, వారికి మధ్యన దడి కట్టి నుంచొని రక్షణ వలయంగా ఉండవలసిన పరిస్థితిని కల్పించిన ప్రతిపక్షాన్ని ఏమనాలి? ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతేనా? ప్రజలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఈ విషయమై ఆలోచించాలని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. తరువాత ఇంకా దూసుకు వెళ్లడానికి ప్రయత్నం చేశారనుకుంటాను. ఇద్దరు శాసనమండలి సభ్యులను మార్షల్స్ ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన తరువాత ఏమనుకున్నారో ఏమో మరి, గవర్నర్ గోబ్యాక్, గోబ్యాక్ అంటూ వాళ్లు గాన్‌బ్యాక్ అయ్యారు. వెళ్లిపోయారు. అక్కడేదో

గందరగోళం. నేను ఈ సందర్భంగా వాస్తవంగా చెప్పదలచుకున్నది ఏమిటంటే అసలు ప్రతిపక్షానికి ఒక దశ, దిశ ఉందా? బయటకు వెళ్లి వాళ్లు బాయ్‌కాట్ చేశారని చెప్పారు. బాయ్‌కాట్ చేసేటప్పుడు మామూలుగా బాయ్‌కాట్ చేసి వెళ్లాలి కదా, ఎందుకు దూసుకెళ్లారు? మార్షల్స్ వాళ్లను భుజాన పెట్టుకుని తీసుకువెళ్లిన పరిస్థితి ఎందుకు వచ్చింది? నిరసన చెప్పే పద్ధతి ఇదేనా? నేను ఏమంటానంటే ప్రతిపక్షానికి బుర్ర పోయింది. ఎందువల్ల పోయిందో నాకు తెలియదు. చిన్న మెదడు చితికిపోలేదు. అసలు చిన్నదానికి మెదడే లేదు. ఏమిటిది? వారేమి చేయదలచుకున్నారు, వారికి అసలు ఒక స్పష్టత ఉందా? స్పష్టతే లేదు. స్పష్టత లేని ఒక అసహనం, గందరగోళం, ఏదో దుగ్ధ. ఎక్కడ నుంచో రిమోట్‌తో నడపాలనే ప్రయత్నం. ఆ విషయాలు కూడా మనం తరువాత మాట్లాడుకుందాం. ఎందుకంటే దీనిని మాట్లాడకుండా గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పడం సరైన పద్ధతి కాదనే ఉద్దేశంతో దీనిని కోట్ చేస్తున్నాను. ఇది ప్రజలందరూ గమనించాలి. దుర్మార్గమైన ఆలోచన చేశారు. అంటే మార్షల్స్ రాకపోతే ఏమి జరిగేది. గవర్నర్ గారి మీద, స్పీకర్ గారి మీద, కౌన్సిల్ చైర్మన్ మీద దాడి చేసేవారా? నాకు అనుమానం. లేదండీ మేము దాడి చేసేవాళ్లం కాదంటే ఊరికే అక్కడి దాకా వెళ్లామంటే కుదురుతుందా, what is your gesture? ఇది ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించవలసిందేనని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. రాష్ట్రంలో ఈ రోజున ప్రధాన ప్రతిపక్షం ఈ విధంగా చేస్తోంది. దీనిని ప్రజలందరూ గమనించాలి.

మిగతా విషయాలకొచ్చినప్పుడు గవర్నర్ గారు వయసులో చాలా పెద్దవారు. 87 సంవత్సరాలున్నాయి. వాళ్లెంత గందరగోళం చేస్తున్నా, ఎంత మంది మాట్లాడుతున్నా ఆయన చక్కగా తన ప్రసంగాన్ని వినిపించారు. ఆయన న్యాయకోవిదుడు. The tallest personality. ఆయనంటే గౌరవం లేదా అని అడిగితే మా చంద్రబాబు నాయుడు గారికి వయసు లేదా, ఆయనంటే మీకు గౌరవం లేదా అన్నారు. ఎందుకు లేదు మాకు గౌరవం? మీరు పారిపోతే ఎలా, నాకర్థం కాదు. ఇందాక ఎవరో అటువైపు నుంచి అంటున్నారు. మీరు భయపడ్డారు, పారిపోయారని మమ్మల్ని అంటున్నారు. ఎవరు భయపడ్డారు, ఎవరు పారిపోయారు? అసలు ఈ శాసనసభ నుంచి పారిపోయింది ఎవరు? మేమా, వారా, వాళ్ల నాయకుడా? ఎందుకు పారిపోయారు? శాసనసభకు ఎందుకు రాలేకపోతున్నారు? ఏదో వంక పెట్టి నన్ను వాళ్లన్నారు. వీళ్లన్నారు, ఏమిటిది నాకర్థం కాలేదు. చిన్న పిల్లల ఆటలా మాట్లాడే పరిస్థితికి వాళ్లు దిగజారిపోయారనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. గవర్నర్ గారు వారి ప్రసంగంలో చాలా విషయాలు ప్రస్తావన చేశారు. ఒక్క విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. రెండున్నర సంవత్సరాలు అంటే 50% of the tenure. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీకి జగన్మోహన్ రెడ్డి గారికి ఇచ్చిన 50% tenure అయిపోయింది. రెండో అంకం లోకి ప్రవేశించాము. ఎన్ని చక్కని కార్యక్రమాలు, ఎన్ని అద్భుతమైన కార్యక్రమాలు ఇవాళ అందించామో గవర్నర్ గారు చాలా వివరంగా చెప్పారు.

అధ్యక్షా, మనవి చేస్తున్నాను. బహుశా ఈ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదని చెప్పడానికి గర్వపడుతున్నాను. విద్య విషయంలో భారతదేశంలో సగటున నిరక్షరాస్యత శాతం 27, కానీ దురదృష్టవశాత్తూ ఆంధ్రప్రదేశ్ నిరక్షరాస్యత 33శాతం. ఆంధ్ర రాష్ట్రంలో యావరేజీ కన్నా చాలా ఎక్కువగా ఉంది. కారణాలు ఏవైనా కావచ్చు. పూర్వం పరిపాలకులు దానిని సక్రమంగా పట్టించుకోక పోవడం వలనో లేక ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడం వలనో, ప్రోత్సాహం లేకపోవడం వలనో ఈ విధంగా జరిగిందని కాసేపు అనుకుందాం. నేను మనవి చేస్తున్నాను. జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతీ పేదవాడు విద్యను అభ్యసించాలని భావించారు. ధనాన్ని సంపాదిస్తే దొంగిలిస్తారు. ఆస్తులు సంపాదిస్తే పోయే అవకాశం ఉంది. కానీ విద్యను సంపాదించ గలిగితే అతను పరిపూర్ణమైన మానవుడిగా ప్రపంచంలో చలామణి అవుతాడని నమ్మిన జగన్మోహన్ రెడ్డి గారు విద్యపై శ్రద్ధ పెట్టారు.

అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చైనా మీద శ్రద్ధ పెట్టారు. చైనా అంటే చైతన్య, నారాయణ. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలలన్నీ బూజు పట్టే పరిస్థితి. డబ్బులున్న వాడికి కార్పొరేట్ విద్య. డబ్బు లేనివాడికి చెట్టుకింద కూడా విద్య లేదు అనే స్థాయికి వారు విద్యను తీసుకువచ్చారంటే వారు ప్రతిపక్షంలో ఉన్నా సిగ్గుపడవలసిన పరిస్థితి ఉందని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారు ఎంత విశాల హృదయంతో ప్రతీ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాల కన్నా అద్భుతంగా తీర్చిదిద్దే విధంగా ఈ రోజు నాడు-నేడు కార్యక్రమంలో చేస్తున్నారా, లేదా? ఎన్ని పాఠశాలలను దశల వారీగా బాగు చేశారో ఇందాక మన విద్యా శాఖ మంత్రి గారు చూపించారు. ఇంగ్లీషు మీడియం తీసుకొచ్చి అద్భుతమైన విద్యను పేద ప్రజలకు అందించాలని తాపత్రయ పడుతున్న ముఖ్యమంత్రిని వారు అభినందించ లేకపోతే మానేయండి. కానీ గుచ్చి గుచ్చి ఏదేదో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదని ఈ సందర్భంగా సభ ద్వారా వారికి తెలియపరుస్తున్నాను.

ఆరోగ్యమే మహాభాగ్యం. అందరికీ ఆరోగ్యం చాలా అవసరం. డబ్బులున్నవారు గుండె ఆపరేషన్‌కి హైదరాబాద్, బెంగళూరు వెళతారు. ఎక్కడికైనా వెళ్లి వైద్యం చేయించుకోగలరు. కానీ పేదవాడికి పెద్ద జబ్బు వస్తే ఎక్కడ వైద్యం చేయించుకుంటాడు? భార్య పుస్తెలు అమ్ముతాడా? ఉన్న పశువులు, ఎకరం పొలం అమ్ముతాడా? పేదవాడికి కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం జరగాలని ఆలోచన చేసిన మొదటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారనే విషయాన్ని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. ఆరోగ్యశ్రీని డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు తీసుకొచ్చారు. ఆ రోజున కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు కాబట్టి దానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ అని రాజశేఖర రెడ్డి గారు నామకరణం చేశారు. మీరు (తెలుగుదేశం పార్టీ) అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని ఎంతో భ్రష్టు పట్టించారు. 108, 104 కుయ్ కుయ్ కుయ్‌మని ఫోన్ చేయగానే వచ్చే సదుపాయాన్ని కలిగించిన మహానుభావుడు

డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు కాదా? వారు వచ్చి వాటన్నింటినీ మూలన పెట్టారు. మరలా జగన్మోహన్ రెడ్డి గారు దానిని లైన్‌లోకి తీసుకొచ్చే కార్యక్రమం చేస్తున్నారు. అంతే కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు అన్నింటినీ అద్భుతంగా తయారు చేసి పేదవాడికి ఆరోగ్యాన్ని ఇచ్చే వైద్యాన్ని అందించాలని తాపత్రయపడుతున్న గౌరవ ముఖ్యమంత్రిని అది లేదు, ఇది లేదు అని వారు విమర్శ చేస్తుంటారు. అదేంటో నాకర్థం కాలేదు.

**మ.1.40**

అధ్యక్షా, జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలను ప్రారంభించారు. ఎప్పుడైనా గతంలో ఆయన ఆ విధంగా ఆలోచించారా? 40 ఏళ్ల అనుభవం, 14 సంవత్సరాల పరిపాలన అని చెప్పుకునే ఆయన పేదవాడి గురించి 14 నిమిషాలైనా ఆలోచించే వ్యక్తా అని మీద్వారా అడుగుతున్నాను. వైద్య రంగాన్ని కూడా అభివృద్ధి చేసి పేదవాడి ఆరోగ్యం గురించి ఆలోచించే జగన్మోహన్ రెడ్డి గారు మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, పేదలందరికీ ఇళ్లు. ఇది ఎంత మంచి కార్యక్రమం? భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఇళ్లు లేని పేదలు ఎంతోమంది ఉన్నారు. ఈ రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదని భావించి 30.76లక్షల ఇళ్లపట్టాలను ఇచ్చిన ఘనత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారికే దక్కుతుందని మనవి చేస్తున్నాను. నా చిన్నప్పటి నుంచి కమ్యూనిస్టులను చూస్తున్నాను. పేద వారికి ఇళ్లు ఇవ్వాలని, దున్నేవాడికి భూమిని ఇవ్వాలని వారు పెద్ద పెద్ద ఉద్యమాలు చేసేవారు. నేను 1989 నుంచి 1994 వరకూ శాసనసభ్యునిగా ఉన్నప్పుడు పేదవారికి ఇళ్లపట్టాలను ఇప్పించడం కోసం ముఖ్య మంత్రి గారిని, కలెక్టరు గారిని అనేకసార్లు ప్రాధేయపడ్డాను. ఆనాడు ఏదో 5గురికి లేదా 6గురికి ఇళ్ల పట్టాలను ఇచ్చేవారు. కానీ, ఏ రాష్ట్రంలో గానీ, రష్యా, చైనావంటి కమ్యూనిస్టు దేశాల్లో కూడా ఇంత పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టిన సందర్భం లేదు. పేదవాడి కోసం ఇంత భారీఎత్తున ఇళ్ల కార్యక్రమం మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఒక్క జగన్మోహన్ రెడ్డి గారే మన రాష్ట్రంలో ప్రారంభించారనే విషయాన్ని గర్వపడుతూ ఈ శాసనసభలో మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ప్రతి పేదవాడు తలదాచుకోవడానికి ఒక సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి గారు ఇల్లు ఇస్తే, ఆ ఇల్లు జగన్మోహన్ రెడ్డి గారి బాత్‌రూమ్ అంత లేదని ఒకాయన చెబుతాడు. జగన్మోహన్ రెడ్డి గారి బాత్‌రూమ్‌ను వారు ఎప్పుడు చూశారో నాకు తెలియదు. మేము పేదవారి కోసం ఒక చక్కని చిన్న ఇల్లు ఇస్తూంటే దానికి కూడా వారు పేర్లు పెడుతున్నారు. 40 ఏళ్ల అనుభవం ఉండి రాష్ట్రాన్ని 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించిన వారు ఆ చిన్న ఇల్లు కూడా ఎందుకు ఇవ్వలేకపోయారు? పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో 1983వ సంవత్సరంలో ఎన్.టి. రామారావు గారు పార్టీని స్థాపించారు. 1989 నుంచి 1994 సంవత్సరం వరకూ ఈ ఊరికి 15, ఆ ఊరికి 20

ఇళ్లు అని కోటా మాదిరిగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ విధంగా కాకుండా అర్హత కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మరో విషయం ఒ.టి.ఎస్. గురించి ఇక్కడ ప్రస్తావించాలి. 1983వ సంవత్సరంలో హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా అప్పటి ప్రభుత్వం పేదవాడికి ఇల్లు నిర్మించాలని ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. రూ.3వేలు లోనుగా, సబ్సిడీగా రూ.3వేలు కలిపి మొత్తం ఒక ఇంటికి రూ.6వేల చొప్పున ఆనాడు ఇళ్లను నిర్మించారు. ఆ తర్వాత రూ.6వేల నుంచి రూ.8వేలు, రూ.1లక్ష వరకూ ఆ మొత్తం పెరిగింది. లోనుగా ఆనాడు తీసుకున్న రూ.3వేలు ఇంతవరకూ ఎవరూ కట్టకపోవడం వల్ల ఆ మొత్తం చాలా పెరిగింది. ఆ ఇళ్లపట్టాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఆ ఇళ్లు లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్నాయి. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ఒక మంచి ఆలోచన చేసి ఒ.టి.ఎస్. విధానాన్ని తీసుకొచ్చారు. గ్రామాల్లో ఉన్నవారు ఆ ఇంటి అప్పు మొత్తం ఎంత ఉన్నా రూ.10వేలు, పట్టణాల్లో ఉన్నవారు రూ.15వేలు, కార్పొరేషన్‌లో ఉన్నవారు రూ.20వేలు కడితే ఇంటిపట్టా తీసుకొచ్చి మీకు ఇస్తారని ఒ.టి.ఎస్. విధానాన్ని ప్రవేశపెడితే, ఒ.టి.ఎస్. తీసుకురావడానికి మీరెవరు అని ప్రధాన ప్రతిపక్షం అడుగుతోంది. 1983వ సంవత్సరం నుంచి ఇప్పటివరకూ 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన ఎప్పుడైనా ఒ.టి.ఎస్. గురించి లేదా లోన్ల రద్దు గురించి ఆలోచించకుండా గొంతు చించుకుని అరుస్తున్నాడంటే పేదవాడికి ఇల్లు, పట్టా ఉండకూడదనేది ఆయన ఉద్దేశం. పేదవాడి పేరున ఇంటి పట్టా ఉంటే భవిష్యత్తులో వారి అవసరాలకు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ఆలోచిస్తుంటే దానిని కూడా దుర్మార్గంగా ప్రతిపక్షం వారు అడ్డుకుంటున్నారు.

అధ్యక్షా, పేదవారి కోసం పింఛను కానుక పథకం ద్వారా 1వ తారీఖున ఉదయాన్నే వృద్ధాప్య, వితంతువు పింఛనుగా రూ.2500లు, వికలాంగులకు రూ.3వేలు ఇస్తున్నారు. ఇంకా ఒంటరి మహిళలకు, డప్పు కళాకారులకు, చేనేత కార్మికులకు, వృద్ధ కళాకారులకు పింఛన్‌ను మన రాష్ట్రంలో అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక పూట లేటయినా, పేదవారి కోసం పింఛను ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి గారు అమలు చేస్తున్నారు.

గత నెలలో 1వ తారీఖున నా నియోజకవర్గంలో ఉన్న రెడ్డిగూడెం అనే గ్రామానికి నేనే స్వయంగా వెళ్లి మొత్తం 359 పింఛన్లను జగనన్న ఇచ్చిన కానుక అని వారి చేతులకు ఇచ్చాను. అంతే గాక, నందిగామ అనే గ్రామంలో 887 పింఛన్లను ఉదయం 6గంటలకు వెళ్లి ఇచ్చాము. వారు పింఛన్లు తీసుకుంటున్న సమయంలో వారి కళ్లలో, వారి కుటుంబంలో ఆనందం చూసినపుడు చాలా తృప్తిగా ఉంటుంది. ఒక ముసలమ్మ నాతో మాట్లాడుతూ, "అయ్యా, నా కొడుకు కూలి పని చేస్తాడు. తన సంపాదన తనకే సరిపోదు, నాకు అన్నం పెట్టలేని పరిస్థితిలో ఉన్నాడు. కానీ, 1వ తారీఖున జగనన్న పంపించే రూ.2500లతో మూడు పూటలు తిని నేను హాయిగా బ్రతుకుతున్నాను " అని చెప్పింది. ఆ విధంగా ఆమె చెప్పినపుడు మనకు ఎంతో తృప్తిగా ఉంటుంది.

అధ్యక్షా, ఒకాయన వచ్చి ఈసారి 160 సీట్లు వస్తాయని గట్టిగా చెబుతాడు. వారికి 160 కాదు, 6 సీట్లు కూడా రావని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో విధాలుగా పాటుపడుతున్న జగన్మోహన్ రెడ్డి గారిని ఓడించడం వారివల్ల కాదు. ఇది వాస్తవం. ఈ వాస్తవాన్ని చూడకుండా వారు భ్రమల్లో బ్రతుకుతూ జగన్మోహన్ రెడ్డి గారిని విమర్శిస్తున్నారు.

అధ్యక్షా, స్వచ్ఛ భారత్ విషయానికి వస్తే, ప్రతి గ్రామంలో మరియు పట్టణంలో చెత్త సమస్య పెరుగుతూ ఉంది. ఈ విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. తెలుగుదేశం ప్రభుత్వంలో Solid Wealth Processing Centres (SWPC) sheds అని ఊరి బయట ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం ద్వారా నిర్మించారు. వాటికి పచ్చ రంగు వేశారు. అక్కడ గ్రీన్ అంబాసిడర్‌లు గానీ, చెత్తను పోగు చేసేవారు గానీ లేరు. కానీ, ఆనాడు అందరూ బిల్లులు మాత్రం చేసుకుని వెళ్లిపోయారు.

**మ.1.50**

అధ్యక్షా, ప్రతి రోజు ఉదయాన్నే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిందిగా ఈ ప్రభుత్వం పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. చాలా చోట్ల వర్క్‌షెడ్స్ నిర్మించాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు శుభ్రంగా ఉండాలని ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో క్లీన్ అండ్ గ్రీన్ కింద ఎన్ఆర్ఈజిఎస్ పథకంతో గ్రామాల్లో షెడ్స్ నిర్మించి బిల్లులు పొందారు తప్ప క్లీన్ అండ్ గ్రీన్ పనులు మరచిపోయారు. నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లులు పొంది పాడుబెట్టిన ఆ షెడ్లను వాడుకలోకి తెచ్చే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం చేపట్టింది. జగన్మోహన్‌రెడ్డి గారి గురించి.. నా వయస్సంత అనుభవం లేదని గత ప్రభుత్వ పెద్దలు ఆనాడు మాట్లాడుతుండే వారు. అది నిజమే కాని జగన్మోహన్‌రెడ్డి గారి తండ్రితోపాటు వారూ రాజకీయ ప్రవేశం చేశారు. వారి కుమారుడికి ఉన్న వయస్సు మాత్రమే ఉంది. జగన్మోహన్‌రెడ్డి గారు అంటే అంత భయమెందుకు అని మీ ద్వారా వారిని ప్రశ్నిస్తున్నాను. భయం లేకుంటే సభకు రాకుండా పారిపోవడం ఎందుకు? శాసనసభకు వచ్చి సమాధానం చెప్పొచ్చుగా? అటువంటివేమి చెప్పకుండా ఏవేవో మాట్లాడడం ఏంటి? వారు వృద్ధాప్యంలో కూడా ఇటువంటి తుంటరి మాటలు మాట్లాడటం ధర్మం కాదని మీ ద్వారా వారికి చెప్పదలచుకున్నాను. వారు మరొక మాట మాట్లాడుతూ, ఇది గౌరవసభ కాదు, కౌరవసభ అంటున్నారు. అయితే వారి నాయకులు రాకుండా వారి సభ్యులు ఎందుకు వచ్చారు అని అడుగుతున్నాను. వాళ్ల నాయకుడు ఇది గౌరవ సభ అయితే వస్తాను అన్నారు. అంటే ఈ సభ గౌరవ సభగా మారాలంటే ఆయన ముఖ్యమంత్రి కావాలి అంటున్నారు. ఆయన గారు.. ముఖ్యమంత్రి అయినప్పుడు ఈ సభ గౌరవసభ అవుతుంది, ప్రతిపక్ష నాయకుడు అయితే మాత్రం గౌరవ సభ కాదు! ఏమిటి ఈ అన్యాయం? నాకు అర్థం కాలేదు.

అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రతిపక్ష నాయకునిగా పని చేసిన కాలంలో శాసనసభను బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లారు. ఆ రోజున మా సైన్యంలో ఏ ఒక్కరు కూడా శాసనసభకు రాలేదు. ఆరోజు జగన్మోహన్‌రెడ్డి గారు సభ నుండి బయటకు వెళ్లిపోయి పాదయాత్ర చేపట్టారు. చంద్రబాబు నాయుడు గారికి బాధవేసి ఈ సభ నుండి వెళ్లిపోయారు. ఆయనకు అంతటి బాధ కలిగినా కూడా

ప్రతిపక్ష పార్టీ సభ్యులుగా వారికెందుకు బాధ కలగలేదు అని మీ ద్వారా ఆ సభ్యులను అడుగుతున్నాను. అధ్యక్షా, మీ ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేసుకునేదేమనగా చంద్రబాబు నాయుడు గారు బాధపడి ఏడ్చిన ఏడుపు అంతా భూటకమని తెలియజేసుకుంటున్నాను. ఈ అన్యాయం ఏమిటి? ప్రతిపక్ష నాయకుడిగా సభకు రాకుంటే ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా సభకు రాకుండా మానేయమనండి. లేదా ప్రతిపక్ష నాయకుడిని శాసనసభకు తీసుకు రండి. నాయకుడు లేని నావ మునిగిపోతుంది. జగన్మోహన్ రెడ్డి గారు బాయ్‌కాట్ చేసి సభ నుండి బయటకు వెళ్లినప్పుడు ఆనాటి అధికారపక్ష నాయకులు కొంతమంది మాట్లాడిన మాటలు మీ ద్వారా ఈ సభ దృష్టికి తీసుకొస్తున్నాను. "అసెంబ్లీ అంటే గౌరవం లేదు, జగన్మోహన్ రెడ్డి గారికి రాజకీయ పరిపక్వత లేదు అందుకే బాయ్‌కాట్ నిర్ణయం తీసుకున్నారు, ఆ నిర్ణయంతో వైఎస్ఆర్ పార్టీకే నష్టం అని" ఆనాడు అన్నారు. నేడు ప్రధాన ప్రతిపక్ష నాయకుడే సభకు రాకుండా ఉన్నారు. అది వారికి వర్తించదా? రాజకీయ పరిపక్వత కలిగిన ప్రతిపక్ష నాయకుడు బాయ్‌కాట్ చేసి ఎందుకు వెళ్లారు? అందుకు సమాధానం చెప్పకున్నా వారి మనస్సుకు సమాధానం చెప్పుకోవాలని, వారి కార్యకర్తలకు, ప్రజలకు సమాధానం చెప్పుకోవాలని మీద్వారా కోరుతున్నాను. ఆ పార్టీలో కొందరు పెద్దలు మాట్లాడుతూ పులివెందుల కూడా మాదేను, రాబోయే ఎన్నికల్లో 173 శాసనసభ స్థానాలను గెలుచుకుంటాము అంటున్నారు. ఒకప్పుడు కూడా అలాంటి ప్రగల్భాలు పలికారు. తదుపరి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారు పులివెందుల నుండి గెలుపొంది ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. నేడు మేము ఏమంటున్నామంటే.. కుప్పం కూడా మాదే.. కుప్పం నియోజకవర్గంలో వారు గెలుస్తారా? మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కుప్పంలో ఓడిపోయారు. చంద్రబాబు నాయుడు గారు కుప్పంలో గెలుస్తారా లేక కప్పగంతులేస్తూ చంద్రగిరి నియోజకవర్గానికి వస్తారా? లేకపోతే మంగళగిరి నియోజకవర్గానికి వస్తారా? ఎక్కడకు వచ్చి గెలుస్తారో నాకు అర్థం కావడంలేదు. ఇటువంటి దుర్మార్గమైన ప్రవర్తన కలిగిన వ్యక్తులున్నారు. ముందస్తు ఎన్నికలు వస్తున్నాయి అంటున్నారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దాగి మాట్లాడుతున్నారు. జగన్మోహన్‌రెడ్డి ముందస్తు ఎన్నికలకు వెళ్లే యోచన చేస్తున్నారు అంటున్నారు. అలా అనకుంటే తన క్యాడర్ సంఖ్య తగ్గిపోతుంది, ఇప్పటికే పారిపోయారు. ప్రస్తుతం సభకు 23 మందికి గాను ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు.

(ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం, మంత్రి పదవి పొందటానికే ఇలా మాట్లాడుతున్నారు అని అన్నారు. )

చంద్రబాబు నాయుడు గారు లైవ్ చూస్తుంటారు, బాధ పడుతారు. నేను మంత్రి పదవి గురించి కక్కుర్తి పడే వాడిని కాదు. ఈ రాష్ట్ర ప్రజలు పరిపాలన వికేంద్రీకరణ కావాలని ఒక పాలసీ ఉండాలని కోరుకుంటున్నారు. ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై గౌరవ సీనియర్ సభ్యులు శ్రీ ధర్మాన ప్రసాదరావు గారు ముఖ్యమంత్రి గారికి లేఖ రాశారు. 1983వ సంవత్సరంలో ఎన్నికై నేను ఈ సభకు వచ్చినప్పుడు వారు కూడా ఉన్నారు, మంత్రిగా పని చేశారు. ఆ అంశంపై ప్రత్యేకంగా సభను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెబుతూ ముఖ్యమంత్రి గారికి లేఖ రాశారు. Separation of powers

అన్న విషయంపై సభలో చర్చ జరగాలని నేను కూడా కోరుకుంటున్నాను. శాసన, న్యాయ, కార్యనిర్వహక వ్యవస్థలనేవి గౌరవప్రదమైనవే. Separation of powers are more important. ఒకరి వ్యవస్థలో మరొకరు చొరబడకుండా ఉండాలని కోరుకుంటున్నాను. ఆ విషయంపై ఏకీభవిస్తూ ఒక ప్రత్యేక సభను ఏర్పాటు చేసి చర్చించాల్సిన అవసరం ఉందని కోరుకుంటున్నాను. ఆరోగ్యకరమైన వాతావరణంలో అన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. నేను కూడా న్యాయ శాస్త్రంలో పట్టా పొందాను. నాకు కూడా న్యాయ వ్యవస్థ మీద గౌరవం ఉంది. ఇప్పటి విపత్కర పరిస్థితుల్లో ధర్మాన ప్రసాదరావుగారు కోరిన విధంగా చర్చ జరగవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను.

**మ.2.00**

(గవర్నరు గారి ప్రసంగంపై మాట్లాడేందుకు థర్డ్ స్పీకర్‌గా ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వడం ఆనవాయితీ అని ప్రతిపక్ష సభ్యులు డా. నిమ్మల రామానాయుడుగారు మరియు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు అన్నారు)

**డా. నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU) (పాలకొల్లు):** ధన్యవాదాలు అధ్యక్షా. గవర్నర్‌గారి ప్రసంగం ఒక పాలసీ డాక్యుమెంట్. ఎందుకంటే ప్రభుత్వ విధి విధానాలు, ప్రజల సమస్యలు పరిష్కారం, ఆ సమస్యలను ప్రతిబింబించే విధంగా గవర్నరుగారి ప్రసంగం ఉండాలి. అయితే ఆ ప్రసంగం చూస్తూ ఉంటే, దురదృష్టవశాత్తు ప్రజలను మభ్య పెట్టే విధంగా, ఒక తప్పుల తడక మాదిరిగా ఉన్న పరిస్థితి. అంతే కాకుండా క్షేత్ర స్థాయిలో జరిగే దానికి, గవర్నరు గారి ప్రసంగానికి అసలు పొంతనే లేని పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే ఈ రోజు ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే నాకు తెలిసి ప్రధానంగా నాలుగు అంశాలు. (1) వ్యవసాయపరంగా అభివృద్ధి చెంది ఉండాలి, (2) పారిశ్రామికాభివృద్ధి చెంది ఉండాలి, (3) రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ బాగుండాలి, (4) లా అండ్ ఆర్డర్ అదుపులో ఉండాలి. కానీ దురదృష్టం ఏంటంటే, ఈ ప్రభుత్వంలో ఈ మూడు సంవత్సరాల్లో ఈ అంశాలన్నీ తిరోగమనంలో ఉన్న పరిస్థితి కళ్లకు కట్టినట్టు కనిపిస్తోన్న పరిస్థితి.

అందులో ప్రత్యేకించి వ్యవసాయరంగం మనం తీసుకున్నట్లయితే, గవర్నరుగారి ప్రసంగంలో చెప్పినట్లుగా "వ్యవసాయానికి మరింత సాయం అంది ఉంటే", ఇవాళ చాలా క్లియర్‌గా భారతదేశంలోనే రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడవ స్థానంలో ఎందుకు ఉంది? అదే విధంగా కౌలు రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండవ స్థానంలో ఎందుకు ఉందనేది ఇవాళ ఈ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

అదే విధంగా రైతు భరోసా అని రూ.13,500లు ఇస్తున్నామని ఈ రోజు చెబుతున్నారు. కానీ 2017లో నిర్వహించిన ప్లీనరీలోనే రూ.12,500లు ఇస్తామని చెప్పారు. 2019లో పి.ఎం.కిసాన్‌లో రూ.6,000లు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. అంటే మొత్తం రూ.18,500లు అందుతుందని రైతులు అనుకుంటే ఈ రోజు కేవలం రూ.13,500లు మాత్రమే వారి చేతిలో పెట్టడం ద్వారా ఒక్కొక్క

రైతు సంవత్సరానికి రూ.5,000ల చొప్పున అంటే ఐదు సంవత్సరాల్లో రూ.25,000ల చొప్పున రైతు భరోసాలో నష్టపోతున్న పరిస్థితి. అంతేకాకుండా ఆ రోజు మొదటి సెషన్‌లో 65 లక్షల మందికి రైతు భరోసా ఇస్తామని చెప్పి ఈ రోజు 45లక్షల మందికే పరిమితం చేశారు. అందులో ప్రత్యేకించి 15లక్షల మంది కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని చెప్పి ఈ రోజు కేవలం 49,000మందికే ఇవ్వడం వలన కౌలు రైతుల పట్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది.

ఇంతకంటే అన్యాయం ఏంటంటే ఇవాళ మేము కష్టపడి పంట పండించాము. మేము పండించిన మా ధాన్యం పంటకు ఇవాల్టికి కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితి. ఈ రోజుకి కూడా సాల్వా పంటకు సంబంధించిన డబ్బులు, ఇప్పుడు రబీ పంట వచ్చినా కూడా మాకు అందని పరిస్థితి. అంటే మేము ఆరుగాలం కష్టపడి పండించిన మా ధాన్యం డబ్బులు మాకు ఇవ్వకపోతే, గత పంటకు తెచ్చిన అప్పులకు వడ్డీలు ఎలా కట్టాలి, ఈ పంటకు పెట్టుబడులు మళ్లీ ఎలా పెట్టాలని ఇవాళ రైతులంతా ఎంతో ఆవేదన పడుతున్నారు.

ఎంత అన్యాయం అంటే ఇవాళ ఎరువులకు సంబంధించి, చాలా దారుణంగా ఎరువులు అందని రీతిలో ధరలు పెరగడమే కాకుండా, ఇవాళ యూరియా బస్తా రేటు రూ.265లు ఉంది. 2014-2019, 5 సంవత్సరాల్లో ఎప్పుడూ కూడా యూరియా బస్తా కోసం రోడ్డు మీదకు వచ్చి క్యూ లైన్లలో ఉన్న పరిస్థితి లేదు. కానీ ఇవాళ యూరియా బస్తా బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కునే పరిస్థితి, దుస్థితి.

ఈ మూడు సంవత్సరాల్లో డ్రిప్ ఇరిగేషన్‌ను ఎగ్గొట్టిన పరిస్థితి. ఆ రోజు వంద శాతం మైక్రో న్యూట్రియంట్స్ సబ్సిడీతో ఇస్తే అవి ఈ రోజు ఎగ్గొట్టిన పరిస్థితి.

ఇన్‌పుట్ సబ్సిడీ. తిత్లీ తుపాను వచ్చినప్పుడు హెక్టారుకు రూ.20,000ల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే, ఈ రోజు ధరలు పెరిగి, డీజిల్, పెట్రోలు ఖర్చులు కూడా పెరిగాయి. కాబట్టి ఆ రూ.20,000ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవాళ రూ.30,000లు లేదా రూ.35,000లు చేస్తారని ఆశిస్తే దానిని రూ.16,000కు తగ్గించి ఈ రోజు అర కొర ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నారు.

అదే విధంగా సున్నా వడ్డీ గురించి మొదటి సెషన్‌లోనే ముఖ్యమంత్రిగారు చెప్పారు. సున్నా వడ్డీకి సంవత్సరానికి కనీసం రూ.3,000కోట్లు కావాలని ఆ రోజు ఇదే అసెంబ్లీలో చెప్పారు. మరి ఈ రోజు మనం చూస్తే...

(శాసనసభ వ్యవహారాలు మరియు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌గారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ప్యానల్ చైర్మన్‌ను కోరారు)

తరవాత మాట్లాడతారు కదా సార్, మళ్లీ వాళ్లు రిప్లై ఇస్తారు. వాళ్లు మాట్లాడినప్పుడు మేము ఏమీ అనలేదు. (మైకు కట్ చేయబడింది)

(ప్రతిపక్ష సభ్యులచే అభ్యంతరం)

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)ः** అధ్యక్షా, మాట్లాడేదానికి అవకాశం ఉంది కదా అంటే ఇదా? ఒక్కటి కూడా నిజం ఉండదు. 2020-21, 2021-22 ఎటువంటి సంవత్సరాలు? కొద్దిగా అయినా ఆలోచన, మానవత్వం, అనుభవం, రాజకీయ అనుభవం ఉండేవాళ్లు ఎవరైనా గానీ 2020-21, 2021-22 సంవత్సరాలు ప్రపంచ చరిత్రలో పాత వాటితో పోలుస్తారా అధ్యక్షా? ఇటువంటి కొవిడ్ పరిస్థితుల్లో కూడా ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది, మన ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులున్నా కూడా రైతుల తరఫున బీమా కడుతున్నాము. వారం లేదా పది రోజులు ఆలస్యమైనా ఎంఎస్‌పి ప్రకారం ప్రొక్యూర్‌మెంట్ చేస్తున్నాము, ఎంఎస్‌పి ప్రకారం ఒక్క ప్యాడీనే కాకుండా మొట్టమొదటిసారిగా ఆరు అదనపు పంటలను కూడా ప్రొక్యూరు చేస్తున్నాము. కేవలం అవకాశం ఉంది కదా అని ఈ సభ ద్వారా ప్రజలందరికీ తప్పుడు సమాచారం పంపించాలనే ఆలోచన చేయడం చాలా తప్పు. వ్యవసాయానికి సంబంధించి రాజశేఖరరెడ్డిగారి లెగసీ ప్రకారం ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, ఈ రోజు వరకూ పద్ధతి ప్రకారం పరిపాలన చేస్తుంటే ఈ రోజు అన్యాయంగా, అంతా తప్పుడు సమాచారం ఇవ్వడం చాలా దురదృష్టకరం. అంత ఎందుకు అధ్యక్షా, ఇక్కడే ఫిగర్స్ ఉన్నాయి.

(సభ్యులు డా. నిమ్మల రామానాయుడు తన స్థానం వద్ద నిలబడి నేను రెండు నిమిషాలే మాట్లాడాను, వారు రెండు గంటలు మాట్లాడారు, వారు నోట్ చేసుకుని తరవాత సమాధానం చెప్పవచ్చు అన్నారు)

2018-19సంవత్సరానికి రూ.8,163కోట్లు ఖర్చు అయితే, కొవిడ్ సంవత్సరంలో రూ.10,179కోట్లు ఖర్చు పెట్టాము. వారు ఏ కేటగిరిలో మాట్లాడినా అది అన్యాయమైన మాటలే అని తెలియజేస్తున్నాను.

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)ः** అధ్యక్షా, ఈ రోజు క్వశ్చన్ అవర్‌లో కూడా కనీస అవకాశం లేకుండా క్లోజ్ చేసిన పరిస్థితి. గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద ఇద్దరు అధికార పార్టీ సభ్యులు రెండు గంటలు మాట్లాడినప్పుడు మేము సైలెంట్‌గా విన్నాము. తరవాత నేను రెండు నిమిషాలు మాట్లాడితే ...

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ः రెండు గంటలు కాదు, ఎన్ని గంటలకు స్టార్ట్ అయిందో నాకు తెలుసు.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ः ఏదైనా ఉంటే వారు నోట్ చేసుకుని రిప్లైలో చెప్పవచ్చు. నేనేదో అసత్యాలు చెప్పడానికి ఇక్కడికి రాలేదు. నేను కూడా రైతు బిడ్డను. నేను కూడా వ్యవసాయం చేస్తున్న వ్యక్తిని. ఈ రోజుకి కూడా ధాన్యం బకాయిలు ఇవ్వాల్సిన పరిస్థితి

ఉంది. ఇది వాస్తవమని చాలా స్పష్టంగా చెబుతున్నాను. గత పంట డబ్బులు ఈ రోజుకు కూడా రాలేదు, ఇది వాస్తవం అని చెబుతున్నాను.

అంతే కాదు. ఉచిత విద్యుత్తుకు మంగళం పాడే విధంగా ఈ రోజు రాష్ట్రంలో మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారు. "మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదిరిగా చేయడం లేదు, మా రాష్ట్రంలో మీటర్లు బిగించడం లేదు, అక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలో మోటార్లకు మీటర్లు బిగించడం మొదలుపెట్టారని" సాక్షాత్తు పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి కెసిఆర్‌గారు చెప్పారు. ఈ రాష్ట్రంలో ఎందుకు ఉచిత విద్యుత్తుకు మంగళం పాడుతున్నారో ఈ ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రెండవది యువత. 2,30,000పోస్టులు యువతతో ఫిల్ చేస్తామని ఆ రోజు చెప్పారు. ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పారు. కానీ నేటికి మూడు సంవత్సరాలు అయింది. పక్కనే తెలంగాణ రాష్ట్రంలో నిన్ననే చూశాము. 91,000పోస్టులు ఖాళీలుంటే మొత్తం 91,000పోస్టులకు కూడా నోటిఫికేషన్లు ఇచ్చారు. కానీ, ఈ రాష్ట్రంలో మూడు సంవత్సరాల్లో ఆ 2,30,000పోస్టులకు ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు, ఈ మూడు సంవత్సరాల్లో ఒక్క డిఎస్సీ కూడా ఎందుకు నిర్వహించలేదో యువతకు ఇవాళ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి. అంతకంటే ముఖ్యంగా ఇవాళ 6,00,000మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రద్దు చేసిన పరిస్థితి, దుస్థితి ఈ రాష్ట్రంలో ఉంది. ప్రభుత్వ సెక్టారులో ఈ రకమైన పరిస్థితి ఉంది, పోనీ ప్రైవేటు సెక్టారులో అయినా సరే ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని ఆశ పడితే అక్కడ కూడా జీరో.

**మ.2.10**

2014-19లో ప్రైవేటు సెక్టార్‌లో 39,450 యూనిట్లు ఆంధ్రప్రదేశ్‌లో గ్రౌండ్ చేశాం. అదే విధంగా ప్రైవేటు సెక్టార్‌లో 5,13,351 జాబ్స్‌ను క్రియేట్ చేశాం. ఇది నేను చెప్పింది కాదు. సాక్షాత్తు తేదీ 10.07.2019న స్వర్గీయ గౌతమ్ రెడ్డిగారు కౌన్సిల్‌లో సమాధానం ఇచ్చారు. ఆ రకంగా అటు పబ్లిక్ సెక్టార్‌లో, ఇటు ప్రైవేటు సెక్టార్‌లో కూడా ఉద్యోగావకాశాలు ఈ రాష్ట్రంలో లేని పరిస్థితుల్లో యువత రోడ్డు ఎక్కిన పరిస్థితి. ఈ రోజు యువత నిర్వీర్యమై అటు డ్రగ్స్, ఇటు గంజాయి, హెరాయిన్ రాష్ట్రంలో పెరుగుతున్న పరిస్థితికి ఇది ఒక కారణం. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే 2,30,000 పోస్టులను భర్తీ చేయాలని, అలాగే డిఎస్సీని కూడా వెనువెంటనే నిర్వహించాలని, ప్రైవేటు సెక్టార్‌లో కూడా జాబ్స్ క్రియేట్ చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

అదే విధంగా పనికి తగ్గ వేతనం కావాలని చిరుద్యోగులైన వీఆర్ఓలు, వీఆర్ఏలు సుమారుగా 20రోజుల నుంచి ఈ రాష్ట్రంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, బీమా ఉద్యోగులందరూ రోడ్డెక్కుతున్న పరిస్థితి. కాంట్రాక్టు లెక్చరర్స్‌ను, ఔట్‌సోర్సింగ్ పోస్టులను రెగ్యులరైజ్ చేస్తామని ఆనాడు పాదయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ

అధికారంలోకి వచ్చి ఇప్పటికి మూడు సంవత్సరాలు అయింది. గవర్నర్ గారి ప్రసంగంలో ఎక్కడా కూడా వాళ్ల మాట, ఊసే లేని పరిస్థితి. ఇది చాలా దురదృష్టకరమని మీ ద్వారా తెలియజేస్తున్నాను. అదే విధంగా విభజన చట్టం కాల పరిమితి పది సంవత్సరాలు. ఇంకొక రెండు సంవత్సరాల్లో కాలపరిమితి కూడా పూర్తి అవుతోంది. ఆ రోజు జగన్మోహన్‌రెడ్డిగారు 25మంది ఎంపీలను ఇవ్వండి కేంద్రం మెడలు వంచుతాం, ప్రత్యేక హోదా తెస్తాం, ప్రత్యేక హోదా వస్తే ఉద్యోగాలు వస్తాయి, ఉపాధి వస్తుందని చెబితే, తెలుగుదేశం పార్టీ తేలేకపోయింది జగన్మోహన్‌రెడ్డిగారు అయినా తెస్తారనే నమ్మకంతో 22మంది ఎంపీలను ప్రజలు గెలిపించారు. 22మంది ఎంపీలు, ఆరుగురు రాజ్యసభ సభ్యులు మొత్తం 28మంది ఎంపీలు ఉంటే, కేంద్రం మెడలు ఎందుకు వంచలేకపోయారు? ప్రత్యేక హోదా ఈ రోజుకి కూడా ఎందుకు తీసుకురాలేదో చెప్పమని ప్రశ్నిస్తున్నాను. (మైకు కట్ చేయబడింది)

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH) :** అధ్యక్షా, ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు వారికి ఉందా అని అడుగుతున్నాను. 2016వ సంవత్సరంలో రాత్రికి రాత్రి వెళ్లి తాకట్టు పెట్టి రాత్రిపూట ఒక ప్రత్యేక ప్యాకేజీని తెచ్చి, పోలవరం ప్రాజెక్టును నీరు గార్చేస్తే, పోలవరం ప్రాజెక్టును సున్నా చేస్తే, ఈ రోజు మేము ఇబ్బందిపడి, కష్టపడి మళ్లీ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్రాన్ని ఒప్పించాం. ఈ రోజు వాళ్లు పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడతారా? వాళ్లు పునర్ వ్యవస్థీకరణ చట్టంలో లేని అంశం ఒకటైనా తెచ్చారా? ప్యాకేజీలో ప్రత్యేక హోదా అని చెప్పి నీరు గార్చి, రాష్ట్రం మొత్తం సర్వనాశనం చేసి ఈ రోజు వారు మాట్లాడుతున్నారు. 1,28,000మంది విలేజ్ వార్డు వాలంటీర్లు ఇచ్చాం, అది జాబ్ క్యాలెండర్ కాదా? విలేజ్ వార్డు సెక్రటేరియట్‌లలో ఇచ్చిన 1,28,000 ఉద్యోగాలు పర్మినెంట్ జాబ్స్ కాదా అని అడుగుతున్నాను. ఈ రోజుకి పదివేల చిల్లర నోటిఫికేషన్ ఇచ్చినవి జాబ్స్ కాదా అని అడుగుతున్నాను. 1,28,000 గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, 51,488 మంది ఏపీఎస్ఆర్‌టీసి ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కాబడినవారున్నారు. ఈ విషయం వారికి తెలిసి కూడా తెలియనట్లు నటిస్తున్నారు. మొత్తం 10,143 పోస్టులు జాబ్ క్యాలెండర్ ద్వారా తీసుకున్నాము. అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖలోనే దాదాపు 20,000 పోస్టులకు గాను, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 5,701, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ existing vacancies 804, అడిషనల్ పోస్టులు 2,190, డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ద్వారా 1,952 పోస్టులు, మొత్తం కలిపితే దాదాపు 20,000 పోస్టులు. ఇవి కాక 1,26,000 పోస్టులు భర్తీ చేశాం.

వాళ్ల చిత్తశుద్ధి ఎలాంటిదో సభ ద్వారా చెబుతాను. వారిది ఎటువంటి అమోఘమైన, అపారమైన చిత్తశుద్ధి అంటే ఉక్రెయిన్ దేశంలో తెలుగు విద్యార్థులు సంక్షోభంలో ఉన్నవారికి అభినందనలు తెలుపుతారు. అంతటితో ఆగక ఎక్కడెక్కడో ఏదో ఇబ్బంది జరిగితే వారే ఏదో సమస్య తీర్చినట్టుగా నాలుగు మీడియా సంస్థలు పెట్టుకొని చిత్రీకరిస్తారు. ఉక్రెయిన్‌లో చదివే తెలుగు విద్యార్థులు బయటికి రాలేకపోతున్నామంటే, "అక్కడ బాంబులు పడుతున్నాయని, ఇక్కడ నుంచి పెద్ద మనిషి కమాండర్ పట్టాభి గూగుల్ మ్యాప్ తీసుకొని బాంబులు ఎక్కడెక్కడ పడ్డాయో కనుక్కోమని" చెబుతారు. ఇదీ వాళ్ల

చిత్తశుద్ధి. ఈ విధంగా ఉన్నారు. సంక్షోభంలో ఉన్నవారికి చంద్రబాబునాయుడుగారు అభినందనలు తెలియజేస్తారు. వారి కుమారుడు అయితే చనిపోయిన వారికి అభినందనలు తెలియజేస్తారు. వారి బావ మరిది అయితే స్వాతంత్ర్య గణతంత్ర్య దినోత్సవం అని మాట్లాడతారు. వాళ్లు మాకు నేర్పిస్తారు, మేము నేర్చుకోవాలంట! సుమారుగా 1,26,000 ఉద్యోగాలు కాదా అని అడుగుతున్నాను. 23,000 ఉద్యోగాలు కాదా అని అడుగుతున్నాను. 2,00,000 చిల్లర మంది వాలంటీర్లకు ఇచ్చేది honorarium కాదా అని అడుగుతున్నాను. రెండు సంవత్సరాలు కొవిడ్ ఉన్నప్పుడు ఇంతకంటే చేసేవారు ఎవరైనా ఉన్నారా ? మా నాయకుడు చెప్పిన మాట ప్రతి ఒక్కటి నెరవేరుస్తున్నారు. వారు చెప్పేది చాలా అన్యాయం. సంక్షోభంలో ఉన్న వారికి అభినందనలు తెలపడం మానుకోవాలని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ः అధ్యక్షా, సబ్జెక్టు డీవియేట్ కాకుండా మాట్లాడుతున్నాను. బుగ్గన గారు చెప్పిన పిట్ట కథలు, బుర్ర కథల వల్ల ఉపయోగం లేదు. సబ్జెక్టుకి సమాధానం చెప్పమనండి. సిపిఎస్ వారం రోజుల్లోనే రద్దు చేస్తామన్నారు. ఈ రోజుకి ఎన్ని వారాలు అయిందో సమాధానం చెప్పాలి కానీ కథలు చెబితే ఎట్లా? హౌసింగ్ గురించి ఆ రోజు చెప్పారు. జగనన్న కాలనీలో 15,60,000 ఇళ్లు కడుతున్నామని గవర్నర్ గారి ప్రసంగంలో చదివారు. ఈ మూడు సంవత్సరాల్లో ఎన్ని ఇళ్లు కట్టారో కూడా చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు. మేనిఫెస్టోలో సంవత్సరానికి 5లక్షల ఇళ్లు కడతామని చెప్పారు. ఇప్పటికి మూడు సంవత్సరాలు అయింది. మేనిఫెస్టోలో చెప్పినట్లు ఇప్పటికి మూడు సంవత్సరాలకు 15,00,000 ఇళ్లు కట్టాలి కానీ మొన్న పార్లమెంట్‌లో ఒక క్వశ్చన్ వేస్తే నరేంద్రసింగ్ తోమర్ ఇచ్చిన రిప్లైలో మూడు సంవత్సరాల్లో 5ఇళ్లు కట్టినట్లుగా చాలా క్లియర్‌గా సమాధానం చెప్పారు.

(షేం , షేం అని టీడీపీ సభ్యులు అన్నారు)

**మ.2.20**

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఏవైతే ఉన్నాయో అవి నిరుపయోగంగా పల్లపు ప్రాంతాలలో ఉన్నాయి. నివాసయోగ్యం కాని ప్రాంతాలు. మీరే కట్టిస్తామని మొదట్లో ఆప్షన్ ఇచ్చారు. ఈ రోజు ఆ ఆప్షన్ తీసేశారు. మూడవది సిమెంట్, ఐరన్, ఇసుక ధరలన్నీ పెరిగిపోయాయి. (బెల్) నేను ఇప్పటికి మాట్లాడింది ఆరు నిమిషాలు. కావాలంటే నోట్ చేసుకోండి. సిమెంట్, ఇసుక, ఐరన్ రేట్లు పెరిగిపోయాయి. ఇటువంటి స్థితిలో పేదవాడు ఇల్లు కట్టుకోవాలంటే కనీసం రూ.8-10 లక్షలు ఖర్చు పెట్టినా ఇల్లు పూర్తవ్వదు. ఈ రోజు ఈ ప్రభుత్వం రూ.1,80,000లు ఇస్తోంది. అది ఏమూలకి సరిపోదు. ఆ రూ.1,80,000లలో కూడా రూ.1,50,000లు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. రూ.30,000లు MGNREGS కింద ఇస్తున్నారు. గతంలో అర్బన్‌లో రూ.1,50,000లు కేంద్ర ప్రభుత్వం ఇస్తే చంద్రబాబునాయుడి గారి హయాంలో

రూ.1,00,000లు వేసి మొత్తం రూ.2,50,000లు మేం అర్బన్ ప్రాంతంలో ఇచ్చాము. నేను కూడా శాసనసభ్యుడిగా మా పాలకొల్లులో 380 ఇళ్లకు ఇచ్చాను.

(అధికారపక్షసభ్యులచే అంతరాయం)

కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరవాత కేంద్రం ఇచ్చే రూ.1,80,000లకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.2,00,000లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఆ రకంగా చూస్తే పేదవాడు ఇంటి నిర్మాణం చేసుకునే పరిస్థితి లేదు. (మైక్ కట్ చేయబడింది)

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)** : గౌరవ సభ్యులకు అన్నీ తెలిసి కూడా తెలియనట్లు మాట్లాడుతున్నారు. దాదాపు రూ.10 వేల కోట్ల ఖర్చుతో ప్లాట్లు ఇచ్చాం. ఏ ప్రభుత్వం కూడా ఈ సాహసం చెయ్యలేదు. రూ 10 వేల కోట్ల విలువ గల ప్లాట్లు ఇచ్చినది సంక్షేమంలో భాగం కాదా? గౌరవ సభ్యులు మేము ఇచ్చినట్లుగా మీరు లక్ష రూపాయలు ఎందుకు ఇవ్వడం లేదని అడుగుతున్నారు. రూ.5 లక్షల నుంచి 10 లక్షలు ఒక్కొక్క లబ్ధిదారునికి ప్లాటు ద్వారా ఇచ్చాం. అది మీకు తెలియదా? రూ. 10వేల కోట్లు పైచిలుకు అంటే ఇంచుమించుగా కొన్ని లక్షల మందికి రూ.5 లక్షల నుంచి 10 లక్షలు ఖరీదు చేసే ప్లాటు ఇచ్చిన మాట వాస్తవమా కాదా? అది రాష్ట్ర కంట్రిబ్యూషన్ అని తెలియజేస్తున్నాను.

(ప్రతిపక్ష సభ్యులచే అభ్యంతరం)

**డా. నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)** : సర్ ఇల్లు అనేది పేదవాడి సొంతింటి కల. గతంలో సిమెంట్ ధర బస్తాకు రూ.220లు ఉంటే ఈ రోజు అదే బస్తా రూ.480లు. ఆ రోజునే రాష్ట్ర ప్రభుత్వ వాటా క్రింద లక్ష రూపాయలు కలిపాం. ఈ రోజు ఎందుకు కలపడం లేదని అడిగాను. అదే విధంగా ఈ రోజు ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లు. ఆ రోజు మహిళల సొంతింటి కల నెరవేర్చాలని మొదటి, రెండవ విడతగా రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 3,15,000 ఇళ్లకి 2,65,000 ఇళ్లు 80 శాతం నుంచి 90 శాతం పూర్తయినట్లు ఇదే శాసనసభలో బొత్స సత్యనారాయణ గారు సమాధానం ఇచ్చారు. నేను అడిగేది 2019నాటికే 80 శాతం నుంచి 90 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ఈ మూడు సంవత్సరాలలో మిగిలిన 10 శాతం ఎందుకు పూర్తి చెయ్యలేకపోయారు? పేదవాడికి ఆ పది శాతం పూర్తి చేసి ఎందుకు ఇవ్వలేకపోతున్నారో సమాధానం చెప్పాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

(షేమ్, షేమ్ అని ప్రతిపక్షసభ్యులు అన్నారు)

రెండవది జగన్మోహన్ రెడ్డి గారు తన పాదయాత్రలో "ప్రభుత్వం వారు బ్యాంకులకు పంపిస్తున్నారు, మిమ్మల్ని రుణగ్రస్తుల్ని చేస్తున్నారు, మీరు బ్యాంకులకు పోతే ప్రతి నెలా రూ.3000ల చొప్పున కట్టుకుంటూ పోవాలి" అని పెద్ద దీర్ఘం తీసి ప్రతీ మీటింగులోను చెప్పారు. నా పాలకొల్లు

నియోజకవర్గంలో కూడా చెప్పారు. కానీ ఈ రోజు అధికారంలోకి వచ్చిన తరవాత కేవలం 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల ఇళ్లు అని బ్యాంక్‌కు పంపిస్తూ ఆ రోజు రూ.3,65,000లు ఉన్న అప్పును ఈ రోజు రూ.8,00,000లు చేసి ప్రతి నెలా ఎందుకు కట్టించుకుంటున్నారని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.. వారు ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగులతోపాటుగా 365, 430 చదరపు అడుగుల ఇళ్లు మంజూరు చేశారు. ఆ మూడు కేటగిరీల వారు తెల్లరేషన్ కార్డు దారులే. పేదవాళ్లే. మూడు కేటగిరీలకు ఆ పదిశాతం పూర్తి చేసి ఉచితంగా ఇవ్వాలని మీద్వారా ఈ ప్రభుత్వానికి తెలియజేసుకుంటున్నాను. (బెల్) అధ్యక్షా కనీసం అరగంట అయినా ఇస్తామన్నారు. నేను ఇప్పటికి మాట్లాడింది ఆరు నిమిషాలు మాత్రమే.

(అధికారపక్ష సభ్యులచే అభ్యంతరం)

నేను వారిని అడుగుతున్నాను. సంక్షేమం గురించి గవర్నర్ గారి ప్రసంగంలో చాలా గొప్పగా చెప్పారు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ः** రామానాయుడు గారూ, ముఖ్యమంత్రి గారి రిప్లై ఉంది తొందరగా ముగించండి.

**డా. నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)ः** సర్ రిప్లై అంటే ఎట్లా సార్? ప్రతిపక్షం నుంచి మాట్లాడేది నేను ఒక్కడినే. సంక్షేమం గురించి మాట్లాడుతున్నాం. గతంలో ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షలు ఇచ్చే చంద్రన్న బీమా ఈ రోజు అందకుండా పోతోంది. ఎవరైనా రాష్ట్రంలో ఆడకూతురు పెళ్లి చేసుకుంటే రూ.లక్ష ఇచ్చే చంద్రన్న పెళ్లి కానుక ఈ రోజు మాయమైపోయింది. రూ.2000లు నిరుద్యోగ భృతి అందడం లేదు. సంక్రాంతి, రంజాన్, క్రిస్‌మస్ వస్తే కానుకలు అందడం లేదు. ఐదు రూపాయలకే అన్నం పెట్టే అన్న క్యాంటిన్, రూ.15లు పెడితే మూడు పూటలా పేదవాడి ఆకలి తీర్చే అన్నా క్యాంటిన్‌లను ఈ రోజు రద్దు చేశారు. ఇది అన్యాయం.

అదే విధంగా వైఎస్సార్ పింఛను గురించి ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడడానికి మాకెవ్వరికి అవకాశం ఇవ్వలేదు. చాలా గొప్పగా చెప్పారు. సంతోషం. ఆ రోజు జగన్మోహన్ రెడ్డి గారు పింఛను రూ.3000లకు పెంచుతామని చెప్పారు. ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నాలుగు వాయిదాలు చేశారు, సాక్షి పేపర్‌లో కూడా చాలా క్లియర్‌గా ఉంది. (పేపర్ క్లిప్పింగ్‌ను సభకు చూపిస్తూ)రూ.1,50,000ల రైతు రుణమాఫీని నాలుగు వాయిదాలు చేస్తే మమ్మల్ని విమర్శించి, రూ.1000లను రూ.250ల చొప్పున నాలుగు వాయిదాలు చేశారు. ఓ.కె. 2019 జూలై 8వ తేదీన రాజశేఖర రెడ్డి గారి పుట్టిన రోజుకు రూ.250లు పెంచుతున్నాం. తరవాత సంవత్సరం రూ.250, తరవాత సంవత్సరం రూ.250, ఆ తరవాత సంవత్సరం రూ.250 అని ఆ రోజు జగన్మోహన్ రెడ్డి గారు మొట్టమొదట సంతకం పెట్టి చెప్పిన మాటలు సాక్షి పత్రికలో కూడా వచ్చింది. (సభకు సాక్షి పత్రికను చూపిస్తూ) 2019లో రూ.250 పెంచారు. 2020 జూలై 8న మరో రూ.250/– ఇవ్వలేదు. 2021 జూలై 8న ఇవ్వలేదు. మొన్న 2022

జనవరికి మాత్రం ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇప్పుడు పెరిగిన ఖర్చులను బట్టి వాటిని అందించాలని కోరుతున్నాను.(బెల్) ప్రశ్నోత్తరాల సమయంలో కూడా అలాగే చేశారు. అసెంబ్లీకి ఎందుకు వచ్చారని ఒకళ్లు అడుగుతారు. వస్తే ఏం చేస్తారని ..... అసెంబ్లీకి వచ్చింది ప్రజా సమస్యలు చర్చించడానికి . వారు మెరిట్స్ చెబుతారు. మేం డీమెరిట్స్ చెబుతాము.

(అధికార సభ్యులచే అంతరాయం)

నేను గం.12.30లకు మొదలు పెట్టాను. అందులో నాకు ఇచ్చి 15 నిమిషాలు లేక 16 నిమిషాలు అయ్యింది. అందులో నాకంటే ఎక్కువగా బుగ్గన రాజేంద్రనాథ్ గారు మాట్లాడారు. కావాలంటే రికార్డులు చూడండి. నేను ఎంతసేపు మాట్లాడాను. వారు ఎంతసేపు మాట్లాడారు?

(సోది చెబుతున్నారు అని అధికారపక్ష సభ్యులు అన్నారు)

సోది అనుకుంటే వారికే ఆ మాటలు మిగులుతాయి. విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నాడు-నేడు అని చెప్పారు. నాడు-నేడు ఇంత ప్రాధాన్యత కలిగి ఇంత చేస్తే నీతి ఆయోగ్ రిపోర్టులు చూస్తే 2018లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడవ స్థానంలో ఉంటే 2020 వచ్చేటప్పటికీ 19వ స్థానంలోకి వెళ్లిపోయింది.

(అధికార సభ్యులచే అంతరాయం)

మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం అని చాలా క్లియర్‌గా ఇచ్చారు. మూడంచెలలో మద్యపాన నిషేధం చేస్తామని చెప్పారు. కానీ ఈ రోజు మూడు సంవత్సరాలు అయ్యింది. (మైక్ కట్ చేయబడింది) కానీ ఇప్పటికీ మద్యపాన నిషేధం లేదు.

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH) :** అధ్యక్షా, వాళ్లతో ఇదే ఇబ్బంది. ఏదైనా factual గా, perfect గా ఉంటే ఎవరైనా interrupt చేస్తారా? అన్నీ ఇటువంటివే.

(ఇది మీ మేనిఫెస్టో కాదా అని వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో సభకు చూపిస్తూ ప్రతపక్షసభ్యులు అన్నారు)

నీతి ఆయోగ్‌కు సంబంధించి Sustainable Development Goals (SDG)s ఉంటాయి. విద్యాశాఖలో ఒక్కొక్కదానికి దాదాపు అయిదు లేక ఆరు ఇండికేటర్లు ఉంటాయి. ఒక ఇండికేటర్ పట్టుకుని 19 అని చెబుతున్నారు. తమరు ఒకసారి తెప్పించుకోండి. ఒకవేళ అది తప్పు అయితే తమరు కచ్చితంగా వారిపై చర్య తీసుకోవాలి. దయచేసి తమరు తెప్పించుకోండి. విద్యాశాఖమంత్రి గారు ఇక్కడే ఉన్నారు. ఈ రోజు భారతదేశ వ్యాప్తంగా దిల్లీకి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా Education లో మాత్రం the best performance State is Andhra Pradesh అని చెబుతున్నారు.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరిచారు)

(ప్రతిపక్షసభ్యులచే అభ్యంతరం)

వాళ్లు సంక్షేమం గురించి అడుగుతున్నారు. అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమం గురించి వేలెత్తి చూపించడానికి ఎవరికైనా హక్కు ఉందా? సంక్షేమం చేస్తుంటే సంక్షేమం ఎందుకు చేస్తున్నారని వాళ్లే అంటారు. సంక్షేమం ఎక్కువ చేస్తున్నారు. అనవసరంగా చేస్తున్నారని అంటారు. సంక్షేమం చేస్తుంటే ఈ రోజు చెయ్యడం లేదని అంటున్నారు.

**మ.2.30**

వెల్ఫేర్ చేస్తుంటే వెల్ఫేర్ చేయడం లేదంటున్నారు. ఇంత అన్యాయమైన ప్రతిపక్షం ఎక్కడా ఉండదు. దయచేసి మీరు మాత్రం 19 అని ఏదైతే వారు అన్నారో అవి మీరు తెప్పించుకోవాలని కోరుతున్నాను.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ः రామానాయుడు గారూ, నీతి ఆయోగ్ చెప్పింది మరొకసారి అధ్యయనం చేసుకుని వాళ్లిచ్చిన different levels of parameters స్టడీ చేసి చెప్పండి. లేకపోతే సభను తప్పుదారి పట్టించినట్లవుతుంది.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ः మా దగ్గర పేపర్స్ ఉన్నాయి సార్. పంపిస్తాను.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ः హౌస్‌ను మిస్‌లీడ్ చేస్తే మీమీద యాక్షన్ ఇనిషియేట్ చేయవలసి వస్తుంది. మాట్లాడండి.

(ఈ సందర్భంలో శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాయింట్ ఆఫ్ ఆర్డర్ అన్నారు)

బుచ్చయ్య చౌదరి గారూ కూర్చోండి. రామానాయుడు గారూ మాట్లాడండి. కూర్చోండి సార్, ముందు రామానాయుడు గారిని పూర్తి చేయనివ్వండి.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)** (మైకు లేకుండా)ः మంత్రి గారు యాక్షన్ తీసుకోమని అన్నారు. అంటే మా గొంతులు నొక్కుతారా?

(అంతరాయం)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ः ఒక్క నిమిషం.

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)**ः అధ్యక్షా, గౌరవ సభ్యులకు బాగా అనుభవం ఉంది. మాట మాట్లాడితే పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంటారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంటే అర్థం ఏమి? ఇప్పుడు హౌస్ ఆర్డర్‌లోనే ఉంది కదా? హౌస్ ఆర్డర్‌లో ఉన్నప్పుడు పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఎక్కడి నుంచి వచ్చిందో నాకర్థం కాలేదు.

(శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరిచే సభకు అంతరాయం)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః ఒక్క నిమిషం బుచ్చయ్య చౌదరి గారూ. ఇది శాసనసభ.. అత్యున్నతమైన చట్టసభ. ఈ సభలో మాట్లాడే ప్రతి మాటకూ అకౌంటబిలిటీ ఉంటుంది. నేను ఏమంటున్నానంటే రామానాయుడు గారు పర్టిక్యులర్‌గా నీతి ఆయోగ్‌ని కోట్ చేశారు. నేను కూడా స్టడీ చేశాను. చాలా పేరామీటర్స్‌ని నీతి ఆయోగ్‌లో ఇచ్చారు. మీరు హౌస్‌ని మిస్‌లీడ్ మాత్రం చేయకండి. ప్రభుత్వం చేస్తున్నదని నీతి ఆయోగ్ లాంటి సంస్థలు ప్రశంసించినప్పుడు మీరు మిస్‌లీడ్ చేస్తే ప్రభుత్వం కచ్చితంగా రియాక్ట్ అవుతుంది. మీరు మా గొంతు నొక్కుతారా అంటారు. అలాగని గొంతు ఉందని ఏదిపడితే అది మాట్లాడటానికి కూడా కాదు. బుచ్చయ్య చౌదరి గారూ... మీరు కూర్చోండి సార్. రామానాయుడు గారూ మాట్లాడండి.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః అధ్యక్షా, ఏవైతే సత్యదూరమైన మాటలు....

**MR.SPEAKER**: Only two minutes.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః సార్, నాకిచ్చిన సమయం ఎంత, నేను మాట్లాడింది ఎంత?

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః ముఖ్యమంత్రి గారు రిప్లై ఇవ్వాలి. మరో సభ్యుడు కూడా ఇంకా మాట్లాడాలి.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః సత్యదూరమైన మాటలు, అసత్యం అనేది మాకే వర్తిస్తుందా? సత్యదూరమైన మాటలు అసత్యం గురించి చెప్పాలంటే....

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః ఇప్పుడు సమయం మ.2.33 గం.లు అయింది. మ.2.35 గం.లకు మీరు క్లోజ్ చేయాలి. ఇంకా సభ్యులు కూడా మాట్లాడవలసి ఉంది.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః సార్, నేను పది నిమిషాల్లో ముగిస్తాను. ప్లీజ్ సార్. ఎవర్నీ ఇంటర్‌ఫియర్ కావొద్దని చెప్పండి. పది నిమిషాల్లో ముగిస్తాను.

**MR.SPEAKER**: You must complete within two minutes.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః సత్యదూరమైన మాటలు, అసత్యాల గురించి శాసనసభ్యులు చెబుతున్నారు. చాలా సంతోషం. నేనందుకే ఒకటే అడుగుతున్నాను. ఈ రోజు అసెంబ్లీలో ఒక ప్రశ్న వేశాము. ఏదైతే 36 మంది సి.ఐ.లు డిఎస్పీలుగా ప్రమోట్ అయ్యారో వాళ్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారని గతంలో జగన్మోహన్ రెడ్డి గారు చెప్పారో దానిమీద మేము ఒక ప్రశ్న వేస్తే దానికి ఈ రోజు మీరు సమాధానం ఇచ్చారు. ఈ రోజు ఇచ్చిన సమాధానంలో చూస్తే 36 మందిలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి కమ్మ సామాజిక వర్గం ఐదుగురే ఉన్నారు.

కాపులు ముగ్గురు, బ్రాహ్మణులు ముగ్గురు, రెడ్డి ముగ్గురున్నారు. మైనారిటీకి చెందిన వారు ఒకరున్నారు. క్షత్రియులు ఇద్దరున్నారు. బీసీలు 12 మంది, ఎస్సీలు ఆరుగురున్నారు. (మైకు కట్ చేయబడింది)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః రమేశ్ గారూ మాట్లాడండి.

(టీడీపీ సభ్యులు డా.నిమ్మల రామానాయుడు స్థానం వద్దకు వచ్చి
ఆయనకు మైకు ఇవ్వాలని కోరారు)

రామానాయుడు గారూ మీరు సభా సమయాన్ని వృధా చేస్తున్నారు. కూర్చోండి. రమేశ్ మాట్లాడండి.

**డా. నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః అధ్యక్ష....

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః మీకు సమయం ఇచ్చాను. మీరు ఉపయోగించుకోలేదు.

**డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA SWAMY)** (మైకు లేకుండా)ః సార్, మాకు సమయం ఇవ్వండి. మీరు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః వీరాంజనేయులు గారూ ఎందుకు అరుస్తున్నారు? దయచేసి కూర్చోండి. మీరేమైనా అనుకోండి.

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)ః** సార్, లెక్క ప్రకారం మా సభ్యులు 151 మంది ఉన్నారు. టీడీపీ సభ్యులు 23 మంది ఉన్నారు. వాళ్లకు లెక్క ప్రకారం ఎంత టైమ్ వస్తే అంత టైమ్ ఇవ్వాలి. మీరు విశాల హృదయంతో ఇప్పటికే వారికి అరగంట సమయం ఇచ్చారు. ఇంకా ఎంతసేపు ఇస్తారు? మావైపు గంట మాట్లాడితే వాళ్లకు ఆరు నిమిషాల సమయం రావాలి. ఇప్పటికే అరగంట సమయమైంది. అన్నీ సత్యదూరమైన మాటలు మాట్లాడారు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః రామానాయుడు గారూ కన్‌క్లూడ్ చేయండి. దయచేసి అందరూ కూర్చోండి.

**డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (DR. DOLA SREE BALA VEERANJANEYA SWAMY)**ః (మైకు లేకుండా) సార్, మీరు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః నాకు తెలుసు కూర్చోండి. మీరు చెబితే నేర్చుకోవలసిన అవసరం నాకు లేదు. కూర్చోండి. రామానాయుడు గారూ మాట్లాడండి.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**ః సార్, నాకు పది నిమిషాల సమయమివ్వండి. ఎందుకంటే క్వశ్చన్ అవర్‌లో కూడా ఈ రోజు మాకు అవకాశం ఇవ్వలేదు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**ః మీకెందుకు అవకాశం ఇవ్వలేదు. క్వశ్చన్ అవర్‌లో మాట్లాడిన వారందరూ ఎవరు?

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: సార్, వాళ్లెందుకు ఉలిక్కిపడుతున్నారో నాకు తెలియదు గానీ ఈ రోజు క్వశ్చన్ అవర్‌లో నాకు Government of Andhra Pradesh ఇచ్చిన దానినే చెప్పాను సార్. వేరే ఉద్దేశం కాదు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని నిన్న గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పారు. చాలా సంతోషం. కానీ ఇవాళ ఎన్‌టిఆర్ బేబీ కిట్స్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, మహా ప్రస్థానం, ముఖ్యమంత్రి ఐ కేంద్రం, ఇవన్నీ పడకేసిన పరిస్థితి. ఇప్పుడే బుగ్గన గారు కొవిడ్ గురించి చెప్పారు. కొవిడ్‌కు సంబంధించిన మృతులు ఎవరైతే ఉన్నారో ఆ కొవిడ్ మృతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.50,000 ఇవ్వకపోతే సాక్షాత్తూ హైకోర్టు కాదు, మన చీఫ్ సెక్రటరీ గారు సుప్రీం కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి వచ్చిందంటే ఈ ప్రభుత్వం సిగ్గుపడవలసిన పరిస్థితి. రెండోది కొవిడ్‌కు సంబంధించి...

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)**: సార్, పదే పదే తప్పుడు సమాచారం ఇచ్చి సభను, ప్రజల్ని తప్పుదారి పట్టించడం తప్పు. ఈ రోజు భారతదేశంలో మీరు ఎక్కడైనా విచారించండి. The facts speak for themselves. కొవిడ్ విషయంలో టెస్టింగ్ గానీ, రికవరీ రేటు గానీ, అతి తక్కువ మోర్టాలిటీ రేటు గానీ, ఒకేసారి వందల, వేల సంఖ్యలో అంబులెన్స్‌లు గానీ చివరకు ఏ రాష్ట్రం సాహసం చేయలేదు. బ్లాక్ ఫంగస్ వలన ఒక్కో పేషెంట్‌కు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చు పెట్టాము. Covid patients are covered under Aarogyasree. ఇది ఏ రాష్ట్రం ఏ చేస్తోంది? అంటే ఇన్ని రకాల మంచి పనులు చేసిన తరువాత ఎక్కడో ఒకచోట వాళ్ల పాత స్కీము అమలు చేయకపోతే అది మాత్రం తప్పని అంటారు. ప్రతీ ప్రభుత్వానికి వాళ్ల స్కీము, వాళ్ల ప్రోగ్రామ్ వాళ్లకుంటుంది. ఈ రోజు వాళ్లు ఎన్ని చెప్పినా భారతదేశ వ్యాప్తంగా చదువు, విద్య, వైద్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరువాతనే వేరే ఏ రాష్ట్రమైనా అని చెప్పవచ్చు.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: అధ్యక్షా, కొవిడ్ కష్టకాలంలో కూడా బాగా పని చేశారని ఇప్పుడే చెప్పారు. సంతోషం. నేనడుగుతున్నాను. కొవిడ్ సమయంలో ఒక్కొక్కరికి కేంద్రం ఇచ్చిన రూ.1000/-లు తప్ప ఇతరత్రా ఎందుకు మన ప్రభుత్వం నుంచి సాయం అందించలేకపోయాం? ఎందుకంటే మహారాష్ట్ర రూ.5476 కోట్లు, తమిళనాడు రూ.4153 కోట్లు, కర్ణాటక రూ.1250 కోట్లు ఈ విధంగా ప్రతీ రాష్ట్రం కేంద్రం ఇచ్చిన రూ.1000/-తోపాటు అదనంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సాయమందిస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొవిడ్ రోగులకు ఒక్క రూపాయి కూడా సాయం అందని విషయం ఈ ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. (బెల్) ఇంతకు ముందే సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని చాలా అద్భుతంగా చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ఈ రాష్ట్రంలో ఇంత అద్భుతంగా పనిచేస్తుంటే మొన్న కొవిడ్ వచ్చినప్పుడు ఎంపీలు, మంత్రులు ఆర్థికంగా బలవంతులు హైదరాబాద్, బెంగళూరుకు ఎందుకు వెళ్లారు? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎందుకు వైద్యం అందించలేకపోయారు? మన అంబులెన్స్‌లు సరిహద్దుల్లో (మైకు కట్ చేయబడింది).....

**మ.2.40**

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: కూర్చోండి రామానాయుడు గారూ.....

(ప్రతిపక్షపార్టీ సభ్యులు వారి వారి స్థానాల్లో నిల్చొని సభకు అంతరాయం కల్గించసాగారు)

కూర్చోండి సార్..... కూర్చోండి.....

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: అధ్యక్షా..... సమయం ఇవ్వండి.....

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: చెప్పండి.

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: వీళ్లెక్కడికి పోయారు, వాళ్లెక్కడికి పోయారు అని రామానాయుడు గారు మాట్లాడుతున్నారు. ఇవాళ వారిని సూటిగా అడుగుతున్నాను. వాళ్ల నాయకుడు గత ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేశాడు. కానీ కొవిడ్ సమయంలో వాళ్ల నాయకుడు ఎక్కడ ఉన్నాడు? కొవిడ్ సమయంలో వాళ్ల నాయకుడు ఎక్కడ వైద్యం చేయించుకున్నాడు? ఇక్కడే చేయించుకుని ఉంటే తెలిసేది. ఎందుకు హైదరాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాలి?

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

అసలు విషయాన్ని మర్చిపోయి ఆ రోజున ఎంపీలు అక్కడ వైద్యం చేయించుకున్నారు, ఇక్కడ ఎందుకు వైద్యం చేయించుకోలేదని మాట్లాడటం ఎంత వరకు కరెక్టు సార్?

అధ్యక్షా, ప్రతిపక్షానికి కేటాయించే సమయం ఎంత? అధికార పక్షానికి గంట సమయం కేటాయిస్తే ప్రతిపక్షానికి ఆరు నిమిషాలు మాత్రమే కేటాయించాల్సి ఉంది. కానీ మీరు పెద్ద మనస్సుతో అర్ధం చేసుకుని పదహేను నిమిషాల సమయాన్ని ప్రసంగించే నిమిత్తం కేటాయించారు. కానీ సభ్యులు అరగంట పైనే మాట్లాడారు. ఇదెక్కడి న్యాయం సార్? కేటాయించిన సమయాన్ని తగ్గించి ప్రసంగాన్ని ముగించమని చెప్పండి. కొవిడ్ సమయంలో వాళ్లు ఇంట్లోంచి బయటకు రాలేదు. జూమ్ యాప్ ద్వారా మీటింగ్‌లు పెట్టుకునేవాళ్లు. భయంతో ఇళ్లల్లో దాక్కున్నారు సార్, వాళ్లు. వాళ్లా మాట్లాడేది. ఇళ్లల్లో దాక్కున్నారు.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: కేవలం రెండు నిమిషాల సమయం ఇస్తున్నాను. రామానాయుడు గారూ, ప్రసంగాన్ని త్వరగా ముగించండి. ఇప్పుడు సమయం మధ్యాహ్నం గం.2.42 ని.లు అయింది గం.2.44 ని.లకు ప్రసంగాన్ని క్లోజ్ చేయండి. తప్పకుండా ప్రసంగాన్ని ముగించాల్సిందే.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: అధ్యక్షా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి చెబుతూ గవర్నరు గారు తన ప్రసంగంలో 77 శాతం నిర్మాణాన్ని పూర్తి చేశాం, 2023, జూన్ మాసాంతానికి పోలవరం పూర్తి నిర్మాణాన్ని చేపడతామని చెప్పడాన్ని మనం చూశాం. కానీ ఆ రోజు ఇదే అసెంబ్లీలో 2021 జూన్ మాసాంతానికి పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఇదే అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. తరవాత మళ్లీ 2021 జూన్ మాసం కాదు, 2021 డిశంబర్ మాసానికి పూర్తి చేస్తామని బల్లలు కొట్టి చెప్పారు. మేం ఆరోజున మంత్రి గారిని అడిగాం. 2021 డిశంబర్ మాసానికి పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు కానీ పోలవరం నిర్మాణం పనులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఆ విషయమై ప్రశ్నించిన మమ్మల్ని ఇదే అనీల్ కుమార్ గారు ఎద్దేవా చేశారు. రెండు శాతమా, మూడు శాతమా, అర శాతమా అని కాదు 2021 డిసెంబర్ మాసానికి పోలవరం నిర్మాణం పనులను పూర్తి చేస్తాం, మీ పార్టీ నాయకుడు (తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రి) ఉమామహేశ్వరరావు గారిని కూడా ప్రారంభోత్సవానికి పిలుస్తామని ఆ రోజున చెప్పారు. కానీ ఈ రోజుకు 2021 డిసెంబర్ మాసం పూర్తి అయింది. మళ్లీ ఈ రోజున వాళ్లు 2023 సంవత్సరం అని అంటున్నారు. ఈ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రశ్నార్ధకమైంది. రైతులందరూ ఆందోళనలో ఉన్నారు. అది మొదటి అంశం. రెండవ అంశం చెప్పి ప్రసంగాన్ని ముగిస్తాను.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: రామానాయుడు గారూ, మీకిచ్చిన సమయం అయిపోయింది. కూర్చోండి.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: మీరిచ్చిన రెండు నిమిషాల సమయంలోనే ప్రసంగాన్ని ముగిస్తాను. దయచేసి అవకాశం ఇవ్వండి.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: అధ్యక్షా..... సమయం ఇవ్వండి.....

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: చెప్పండి.

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: అధ్యక్షా, ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి మాట్లాడుతున్నాడు. ఇదే శాసనసభలో వాళ్ల నాయకుడు మాట్లాడారు. నాకు తెలిసి ఆ సమయంలో రామానాయుడు గారు ఉన్నారో, లేరో నాకు తెలియదు. నేను ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్నాను. గతంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన దేవినేని ఉమామహేశ్వర రావు గారు మాట్లాడారు. ఏమనంటే ''వ్రాసుకో జగన్మోహన్ రెడ్డి, 2018 సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేస్తామని'' ఇదే సభలో చెప్పాడు.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

అధ్యక్షా, మేం కూడా చెప్పాము. 2021సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పాం. కానీ ఈ రోజు పోలవరం ప్రాజెక్టుకు శాపంగా మారింది వాళ్లే. ఈ రాష్ట్రానికి కూడా తెలియాల్సి ఉంది.

అధ్యక్షా, స్పిల్‌వే పనులు పూర్తి అయిన తరవాత వాళ్లు కాఫర్‌డ్యామ్, డయాఫ్రమ్ వాల్స్ కట్టాల్సిందిపోయి రెండు ఒకేసారి కట్టిన కారణంగా రెండూ అసంపూర్ణంగా ఉండిపోయాయి. అందువల్ల రెండు కిలోమీటర్ల మేర పారాల్సిన గోదావరి నీరు 300 మీటర్ల మేరకు కాఫర్‌డ్యామ్‌కు ఇటువైపు, మరోవైపు 300 మీటర్లు పెట్టడం వల్ల 25 లక్షల క్యూసెక్కుల ఫ్లడ్ వాటర్ రావడం వల్ల, వాళ్లు చేసిన నిర్వాకం వల్ల ఈ రోజున డయాఫ్రమ్ వాల్ డ్యామేజీ అయిన కారణంగా గత సంవత్సర కాలంగా నిర్మాణ పనులకు ఆటంకం కల్గుతోంది. దేశంలో ఇప్పటి వరకు ఇటువంటి ఘటనలు జరగలేదు. డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్ జరగడమనేది గతంలో ఎక్కడా జరగలేదు. రెండు కాఫర్ డ్యామ్స్ నిర్మాణం పూర్తి అయిన తరవాత స్పిల్ వే పనులు చేస్తారు. కానీ వాళ్లు గత ప్రభుత్వం హయాంలో చేసిందేమిటంటే స్పిల్‌వే పనులు సగం చేశారు, కాఫర్ డ్యామ్‌లు కట్టారు. అసంపూర్తిగా పనులు చేసిన కారణంగా ఫ్లడ్స్ వచ్చిన కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. గత సంవత్సర కాలంగా వాళ్లు చేసిన నిర్వాకం వల్ల పనులకు అంతరాయం కల్గుతోంది. గత సంవత్సర కాలంగా మెఘడాలజీ కొరకు మేమంతా ఫైటింగ్ చేస్తున్నాం. నిన్న కూడా కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గారు పోలవరం ప్రాజెక్టును విజిట్ చేశారు. బయటి నుంచి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి డయాఫ్రమ్ వాల్‌ను, లోయర్ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మేం ముందుకు వెళ్తున్నాం. వాళ్లు చేసిన తప్పును సరిచేయడం కోసం సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇది వాళ్ల నిర్వాకం కాదా, సార్.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

నిన్న కూడా సెంట్రల్ మినిస్టర్ గారు మీటింగ్‌లో గతంలో వాళ్ల పార్టీలో ఉన్న రాజ్యసభ సభ్యుడు, ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతోన్న రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ గారు ఒక మాట అడిగారు. ఇప్పుడైనా సరే డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు పూర్తిచేసిన వెంటనే కాఫర్ డ్యామ్ పనులను పూర్తిచేయమని చెప్పండి సార్ అని అన్నాడు. వాళ్లు చేసిన వెధవ పని అది సార్. రెండు కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి చేసిన తరవాత డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్ పనులను పూర్తి చేసి డ్యామ్‌ను సాధ్యమైనంత త్వరలో పూర్తిచేస్తాం.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

Yes, 2021 లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పాం. కొవిడ్ సమయంలో పనులు జరగకపోయినా, రాష్ట్రం అంతా ఇళ్లల్లో దాక్కున్నా మూడు వేల మంది వాళ్ల ప్రాణాలను సైతం ధారపోసి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి దోహదపడ్డారు. అనేక మంది ఇంజనీర్లు వాళ్ల ప్రాణాలను సైతం ప్రాజెక్టు నిర్మాణానికి ధారపోశారు. కానీ కాఫర్‌డ్యామ్ అనేది 2020 సంవత్సరంలో వచ్చిన 25 లక్షల పైచిలుకు వరద వచ్చిన కారణంగా దెబ్బతింది. తరవాత మేం పరిశీలించాం. 300 మీటర్ల చొప్పున రెండు కిలోమీటర్లు పోవల్సిన వరద కేవలం 600 మీటర్లు మాత్రమే పోయినందువల్ల 13 వెలాసిటీతో డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్ అయింది. అందువల్ల పనులకు ఆలస్యమైంది. దాన్ని తీసుకొచ్చి బ్యారేజ్ నిర్మాణ పనులు జరగడంలేదని చంద్రబాబు నాయుడు గారు పదే పదే చెబుతున్నారు. ఈ రోజు చెబుతున్నాం. 53.32 రాక్‌ఫిల్ డ్యామ్ ఏదైతే ఉందో, కావాలంటే కొలత వేసుకోండి, అంగుళం కూడా తగ్గకుండా పనులను పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను. ఆ రోజున వారు చేసిన పొరపాటు వల్ల ప్రాజెక్టు నిర్మాణ పనులకు అంతరాయం కల్గుతోంది.

**శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOWDARY)**: (మైకు లేకుండా) కాఫర్‌డ్యామ్ పనులు పూర్తిచేయలేదు.

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: అధ్యక్షా, బుచ్చయ్య చౌదరి గారు చెబుతున్నారు. కాఫర్ డ్యామ్ పనులు పూర్తిచేయలేదని మాట్లాడుతున్నాడు.

సార్, ఒక పక్క స్పిల్‌వే పనులు పూర్తి చేయలేదు. ఒక పక్క స్పిల్ వే పనులు పూర్తిచేయకుండా, వాటర్‌ను డైవర్ట్ చేయకుండా కాఫర్‌డ్యామ్‌ను ఎలా కడతారు సార్? ఎలా పూర్తి చేస్తాం, సార్? వాళ్లు చేసిన అనాలోచిత పని కారణంగానే ఈరోజున డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్ అయింది. మళ్లీ ఆయన మాట్లాడుతున్నాడు. మీకేమి తెలుసు?

**శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు (SRI VELAGAPUDI RAMAKRISHNA BABU):** (మైకు లేకుండా) నీకేమి తెలుసు?

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: Yes, నీకన్నా నాకు బాగా తెలుసు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మీ అందరికన్నా నాకు బాగా తెలుసు. ఈ రోజున వాళ్లను అడుగుతున్నాను. ఎక్కడైనా, ఏ డ్యామ్ అయినా కట్టేటప్పుడు రెండు కాఫర్‌డ్యామ్‌ల నిర్మాణం కంప్లీట్ చేసి డ్యామ్‌లు కడతారా, లేదా స్పిల్‌వే, కాఫర్‌డ్యామ్‌లను రెండింటిని అసంపూర్ణంగా వదిలేసి డ్యామ్‌లు కడతారా, ఒక్క మాటలో వాళ్లను చెప్పమనండి, సార్. వాళ్లలాగా ఎక్కడైనా కట్టారా?

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

వారు చేసిన నిర్వాకం వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతోంది. మళ్లీ మాట్లాడేందుకు వాళ్లకు సిగ్గు లేదు. మాట్లాడడానికి సిగ్గుండాలి.

ఇదే సభలో మిమ్మల్ని అడుగుతున్నాను. కాఫర్‌డ్యామ్‌లు రెండింటిని కంప్లీట్ చేయకుండా డ్యామ్‌లు కడతారా?

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)**: అధ్యక్షా.....

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: చెప్పండి.

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ (SRI BUGGANA RAJENDRANATH)**: సార్, మా సహోదరులు చెప్పినట్లు ఎందుకు ఆ పని చేయలేకపోయినారంటే చాలా unfortunate. పాపం, వాళ్ల నాయకుడు ప్రతి సోమవారం పోలవరం అని చెప్పి, ప్రతి సోమవారం నాడు పోలవరం ప్రాజెక్టు వద్దకు పోయి వాళ్లు చేసిన పనేమిటంటే ''జయం జయం చంద్రన్న'' అనే పాట పాడించుకోవడం తప్ప కాఫర్‌డ్యామ్ ఎప్పుడు వస్తుంది, స్పిల్‌వే పనులు ఎప్పుడు చేయాలి అనే ఆలోచనే వాళ్లకు కల్గలేదు.

(సభలో నవ్వులు)

**మ.2.50**

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: అధ్యక్షా, పోలవరం ప్రాజెక్టు చాలా ముఖ్యమైన ప్రాజెక్టు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ఒక వరం, జీవనాడి. ఆవేశపడకుండా, ప్రశాంతంగా వారిని చర్చించమనండి. పశ్చిమగోదావరి జిల్లా రైతుగా మాట్లాడుతున్నాను. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రెండు విషయాలను ప్రభుత్వం క్లారిఫై చేయవలసిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం నుంచి పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55వేలకోట్లు తెచ్చుకోలేక 45.15 మీటర్లు ఉండవలసిన పోలవరం ప్రాజెక్టు నీటిసామర్థ్యం ఎత్తు 41.75 మీటర్లకు తగ్గిస్తున్నారు. దానివల్ల పోలవరం ప్రాజెక్టు ఒక బ్యారేజిగా లేక ఒక ఎత్తిపోతల పథకంగా మారిపోతుందనే భయం నేటి రైతుల్లో ఉంది. ఎందుకంటే, రెండు లేదా మూడు మీటర్లు తగ్గించుకుంటే నష్టం లేదని,మా భద్రాచలం కూడా ముంపుకు గురవుతుందని, జగన్ గారు కూడా సుముఖంగా ఉన్నారని సాక్షాత్తూ కేసీఆర్ గారు కూడా తెలంగాణ శాసనసభలో తేది.15.09.2019 నాడు మాట్లాడారు. దానిని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఖండించ లేదు. అందుచేత, వాస్తవం ఏమిటనేది తెలియడం లేదు.

**మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)**: రామానాయుడు గారూ, మీరు కంక్లూడ్ చేయండి. మంత్రిగారు క్లారిఫికేషన్ ఇస్తారు.

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: అధ్యక్షా, పోలవరం ప్రాజెక్ట్ భద్రత విషయం గురించి ఇక్కడ మాట్లాడాలి. ఎందుకంటే, రివర్స్ టెండరింగ్ పేరు చెప్పి ఏమాత్రం అనుభవం లేని ఒక చిన్న కంపెనీకి ఆ ప్రాజెక్టు పనులను అప్పగించారు. పోలవరం ప్రాజెక్టు అంటే 194 టిఎంసీల నీరు నిల్వ ఉండే ప్రాజెక్టు. వరద సమయంలో ఒక్కరోజే 50లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో రాజీపడి ఏదైనా ప్రమాదం ఏర్పడితే ఉభయ గోదావరి జిల్లాలు కూడా బంగాళాఖాతంలో కలిసిపోయే పరిస్థితి ఉంది. అందుచేత, భద్రత విషయంలో రాజీ

పడకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలనే విషయాన్ని ఒక గోదావరి బిడ్డగా మీద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల అభివృద్ధికి కట్టుబడి 2014లో తెలంగాణ ఉద్యోగులతో సమానంగా 43శాతం ఫిట్‌మెంట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చాము. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నేడు అశుతోష్ మిశ్రా కమిటీ 27 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేస్తే, 23 శాతానికి తగ్గించి ఉద్యోగులకు ఫిట్‌మెంట్‌ను ఇచ్చింది. (మైకు కట్ చేయబడింది)

**శ్రీ పోలుబోయిన అనిల్‌కుమార్ (SRI POLUBOINA ANILKUMAR)**: అధ్యక్షా, పోలవరం ప్రాజెక్టు ఎత్తును అంగుళం కూడా తగ్గించడం లేదని అనేకసార్లు ఈ సభలో చెప్పాను. కావాలంటే టేపు తెచ్చుకుని వారిని కొలిచి చూసుకోమనండి. నీటి సామర్థ్యం గురించి కూడా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 190 టిఎంసీలు ఉన్నప్పటికీ ఒకే రోజు మొత్తం 190టీఎంసీలను ప్రాజెక్టులోకి తీసుకురాము. ప్రాజెక్టులో నీటిని నింపడానికి కూడా ఒక ప్రొటోకాల్ ఉంటుంది. ముందుగా 1/3వ వంతు, ఆ తర్వాత 10శాతం నీటిని నింపుతూ వెళుతూ మొత్తం 190 టిఎంసీల నీటిని నింపుతాము. ప్రారంభంలో సుమారు 40 లేదా 41 మీటర్ల వరకూ మాత్రమే నీటిని నింపుతాము. అక్కడ నుంచి ప్రాజెక్టులో నీటిని పెంచుకుంటూ పోతాము. ముందుగా 41 అడుగుల contour వల్ల జరిగే ముంపు ప్రాంతాల వరకూ మేము రిహాబిలిటేషన్ చేద్దామని అనుకున్నాము. ఎందుకంటే, ఆ ముంపుకు గురయ్యే 17900 ఇళ్లను మేము ముందుగా తీసుకొని వాటిలో 8000 ఇళ్లను షిఫ్ట్ చేశాము. మరో రెండు నెలల్లో పూర్తిగా 17900 ఇళ్లకు రిహాబిలిటేషన్ చేయబోతున్నాము.

అధ్యక్షా, నేడు ఆర్ అండ్ ఆర్ గురించి వారు అంతగా బాధపడుతున్నారు కాబట్టి వారిని రెండు విషయాలు అడుగుతాను. వారు చేసిన 5సంవత్సరాల్లో కనీసం ఒక్కరినైనా రిహాబిలిటేట్ చేయగలిగారా? ఈ రోజు మేము రూ.55వేలకోట్లు తెచ్చుకోలేకపోతున్నామని రకరకాలుగా వారు మాట్లాడుతున్నారు. ఫిబ్రవరి, 2017వ సంవత్సరంలో కేవలం 50వేల ఇళ్లకు రిహాబిలిటేషన్ కోసం కేబినెట్ ఒప్పందం చేసుకుని, మూడు నెలల తర్వాత ఆ సంఖ్యను 90వేల ఇళ్లకు మార్చారు. అదే ఇప్పుడు చిక్కుముడిగా మారింది. వారు ముందుగానే లక్ష ఇళ్లకు రిహాబిలిటేషన్ చేయాలని కేబినెట్ ఒప్పందంలో చేసుకుని ఉంటే నేడు ఈ సమస్య వచ్చేది కాదు. ఆనాడు వారు ప్యాకేజి కోసమో లేక దేని కోసమో అరుణ్ జైట్లీగారు చెప్పిన తర్వాత కేబినెట్‌లో హడావిడిగా ఒప్పందం చేసుకోవడం వల్ల రిహాబిలిటేషన్ ఒక శాపంగా మారింది. 2014 నుంచి 2017వరకు మూడు సంవత్సరాల పాటు పోలవరం ప్రాజెక్టులో కనీసం ఒక తట్ట మట్టి కూడా వేయకుండా వారు కాలయాపన చేశారు. తర్వాత రెండు సంవత్సరాలు మాత్రమే ఆ ప్రాజెక్టు పనులు చేశారు. 70శాతం వరకూ పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిచేశామని వారు పదేపదే చెప్పుకుంటారు. 2014వ సంవత్సరానికి ముందే 32శాతం పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత వారు ప్రాజెక్టు పనులు మొదలుపెట్టారు. మనం ఏదైనా ఇల్లును కాంక్రీట్

వేసి రెండు అంతస్తుల భవనం కట్టడానికి కేవలం రెండు నెలల సమయం పడుతుంది. ఆ ఇంటి ఫినిషింగ్ కోసం ఒక సంవత్సర సమయం పడుతుంది. 50 మీటర్లకు పైగా చేయవలసిన చోట కూడా వారు 32మీటర్లు దాటి పనులు ఎక్కడా చేయలేదు. కరోనా వచ్చినపుడు ఎవరూ బయటకు రాని సమయంలో కూడా 3వేల మంది కార్మికులు పోలవరం ప్రాజెక్టు కోసం పని చేశారు. ఎంతోమంది కార్మికులు, ఇరిగేషన్ డిపార్టుమెంటుకు చెందిన కొంతమంది ఇ.ఇ.లు, డి.ఇ.ఇ.లు కూడా కరోనా వల్ల చనిపోయారు.

అధ్యక్షా, నేడు డయాఫ్రమ్ వాల్ డ్యామేజి అనేది ఒక అడ్డంకిగా మారింది. ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఒక డ్యామును నిర్మించినపుడు కాఫర్ డ్యామును పూర్తిచేసిన తర్వాత ప్రాజెక్టు పనులు చేపడతారా లేక కాఫర్ డ్యామును పూర్తిచేయకుండా ప్రాజెక్టును నిర్మిస్తారా? నేడు స్పిల్‌వే నిర్మాణాన్ని పూర్తిచేసి నీటిని డైవర్ట్ చేసి, రెండు కాఫర్ డ్యాములు నిర్మించిన తర్వాత డయాఫ్రమ్ వాల్ ఓపెన్ చేస్తున్నారు. 21 డిశంబరు నాటికి ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తామని ఎలా చెప్పారని ఒకాయన నన్ను అడిగాడు. డయాఫ్రమ్ వాల్ ఆ విధంగా డ్యామేజి అవుతుందని మేము ఏనాడూ ఊహించలేదు. ఎందుకంటే, 20లక్షల క్యూసెక్కుల నీరు ఒక్కసారే వస్తుందని ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయలేదు. గతంలో వారు చేసిన పనుల వల్ల 20లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినపుడు గంటకు ఒకటి లేదా రెండు కిలోమీటర్ల ఉండవలసిన వేగం, 13 కిలోమీటర్ల వేగంతో రావడం వలన డయాఫ్రమ్ వాల్ డ్యామేజి అయింది. చివరకు కాఫర్ డ్యాము కూడా డ్యామేజి అయింది. ఇప్పటివరకూ డయాఫ్రమ్ వాల్ డ్యామేజి అయిన పరిస్థితి ఎక్కడా లేదు. ఇటీవల కేంద్రమంత్రి గారు మన రాష్ట్రానికి వచ్చి ఒక రెవ్యూ మీటింగును నిర్వహించారు. మన దేశంలో కాకపోతే ప్రపంచంలో ఎక్కడనుంచైనా నిపుణులను రప్పించి వారి సహకారంతో డయాఫ్రమ్ వాల్ డ్యామేజి పనులను త్వరలోనే పూర్తిచేయడం కోసం ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుంది. డ్యామును పూర్తి చేసిన తర్వాత నీటిని దశల వారీగా నిల్వ ఉంచడం, మొదలైన పనుల కోసం కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుంది.

అధ్యక్షా, మేము ప్రస్తుతం రిహాబిలిటేషన్ పనులను చేపట్టాము. వారు అధికారంలో ఉండగా ఒక్క ఇంటికి కూడా రిహాబిలిటేషన్ చేయలేదు. రిహాబిలిటేషన్ కోసం అక్కడ ఎక్కువమంది గిరిజనులు ఉన్నారు. ప్రతి సోమవారం కాంక్రీటు పనులు మాత్రమే పూర్తిచేసి గ్రావిటీతో నీరు ఇవ్వాలని వారు పనులు చేయడం జరిగింది. దానివల్ల మాకు ఇబ్బంది జరుగుతోంది. నేడు జగన్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తిచేయడం కోసం మేము స్పష్టంగా అడుగులు ముందుకు వేస్తున్నామని మీద్వారా సభకు తెలియజేస్తున్నాను.

**మ.3.00**

**డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU)**: అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ఇటీవల కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ గారితో పోలవరం ప్రాజెక్టును

సందర్శించారు. ఆ సందర్భంలో కేంద్ర మంత్రి గారికి తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనా కాలంలో నిర్మించిన ఇందుకూరిపేట నిర్వాసితుల కాలనీని చూపించారు. మూడు సంవత్సరాల ఈ ప్రభుత్వం కాలంలో పనులు చేయకుండా కూర్చొని దానివల్ల చేయలేకపోయాం, దీనివల్ల చేయలేకపోయామంటూ వారి చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడమనేది కరెక్ట్ కాదు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా అందించాలి. ఈ ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం ద్వారా ఉత్తరాంధ్రా ప్రాంతంలోని సుజల స్రవంతి ప్రాజెక్టుకు గోదావరి జలాలు వెళ్లాలి, బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా ప్రకాశం జిల్లా నుండి సోమశిల ప్రాజెక్టుకు నీరు అందాలి, సాగర్ అనుబంధ ప్రాజెక్టు కింద శ్రీశైలం నుండి లిఫ్ట్ ద్వారా రాయలసీమకు నీరు అందాలి. అదీ పోలవరం యొక్క అర్థం, పరమార్థం. అందుకు భిన్నంగా, నీటి సామర్థ్యాన్ని దెబ్బతీసే విధంగా నీటి సామర్థ్యపు ఎత్తును తగ్గించారు. కేంద్రం నుండి రూ.55వేల కోట్లను తీసుకురాలేకపోతున్నారు. ఏ భయంతో తీసుకురాలేకపోతున్నారో నాకు అర్థం కాలేదు. వారికున్న కేసుల భయమా? వారి ఆస్తుల భయమా? వారి బెయిల్ రద్దవుతుందనే భయమా.. (మైక్ కట్ చేయబడింది.)

(అధికార పక్ష సభ్యులచే అంతరాయం. ప్రతిపక్ష సభ్యులు వారివారి స్థానాలనుండి లేచి మైక్ ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు. )

**MR.SPEAKER** : Don't go into personal details. దయచేసి కూర్చోండి.

**శ్రీ జోగి రమేశ్ (SRI JOGI RAMESH)(పెడన)** : అధ్యక్షా, యథారాజ తథా ప్రజా అన్నట్లుగా కుక్క తోక వంకరగానే ఉంటుంది. అటువంటి వ్యక్తులు ఎన్నడూ మారరు. గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం. మాట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరసాగారు)

**MR.SPEAKER** : Please go and sit in your place. Every time you are all standing and coming. This is not correct. Don't dictate the Chair. Please talk nicely. Please sit down.

**శ్రీ జోగి రమేశ్ (SRI JOGI RAMESH)**: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి మనసున్న మనిషిగా సంక్షేమ ఫలాలకు నిలుపుటద్దమై ఉన్నారు. రాజశేఖరరెడ్డి గారి ఆశయాలు, ఆలోచనలు, ప్రస్ఫుటంగా గవర్నర్ గారి ప్రసంగంలో కనిపిస్తున్నాయి. పుట్టబోయే బిడ్డ నుండి పండు ముసలి వయస్సు గల వారి వరకు వారికి ఏమి కావాలి, ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల కష్టాలను చూశారు. ఆ కష్టాల ఫలితమే ఎన్నికల ప్రణాళిక. గత రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో ఈ ప్రభుత్వం 9,53,35,429 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడం జరుగుతోంది.

(ప్రతిపక్ష సభ్యులు సభనుండి బయటకు వెళ్లిపోయారు)

ప్రతిపక్ష సభ్యులు మేము మాట్లాడుతుంటే బయటకు వెళ్లుతున్నారు. రూ.9,53,35,429 రూపాయలతో అభివృద్ధి సంక్షేమ ఫలాలు, 1,75,37,664 కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమచేస్తుంది ఈ ప్రభుత్వం. దేశ చరిత్రలో ఇన్ని సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి లేరు. అత్యధిక సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గారే అని సువర్ణ అక్షరాలతో లిఖించవచ్చు. గడచిన రెండు సంవత్సరాలుగా కరోనా కష్టకాలం ఉన్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు, కష్టాలలో ఉన్న అందరికీ నేనున్నాను అని ధైర్యం ఇస్తూ ఇన్ని అభివృద్ధి ఫలాలు అందిస్తున్నారు. సుమారు 45 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి చేకూర్చింది ఈ ప్రభుత్వమే. 90 లక్షల మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా సుమారు రూ.90 వేల కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తుంది ఈ ప్రభుత్వం. అమ్మ ఒడి ద్వారా లబ్ధి పొంది ఆయా పేద కుటుంబాల పిల్లలందరు చదువుకుని, ప్రయోజకులు కాగలరని ఆశించి ఇంతటి మంచి పథకాలను తీసుకొచ్చారు ముఖ్యమంత్రి గారు. పాఠశాల విద్యార్థులకు విద్యాకానుక కిట్, గోరుముద్దలు, మంచి మెనూతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందడం ద్వారా పేద విద్యార్థులంతా చక్కగా చదువుకుంటున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దింది ఈ ప్రభుత్వం. కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉన్నత విద్యనభ్యసించేందుకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తుంది ఈ ప్రభుత్వం. సూర్యుడు తాను వెలుగుతూ అందరికీ వెలుగును ఇస్తాడు, చంద్రుడు అందరికీ వెన్నెలను పంచినట్లుగానే మన ముఖ్యమంత్రి గారు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు వెలుగులు నింపుతున్నాడు. రాష్ట్రంలోని ప్రజలంతా జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. గతంలో బలవంతులు బలహీనులను బెదిరించారు. ఈ రోజు ఆ బలహీనుల పక్షాన జగన్మోహన్‌రెడ్డి అనే బలమైన నాయకుడు ఉన్నారంటూ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు గర్వపడుతున్నారు.

**మ.3.10**

అధ్యక్షా, ఇంగ్లీషు మీడియం గురించి చాలామంది చెప్పారు. ఇంగ్లీషు మీడియం చదువుకుంటే తప్పా? బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పిల్లలు బడికెళ్లి ఇంగ్లీషు మీడియం చదువుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం పెడతామని జగన్మోహన్‌రెడ్డిగారు చెబితే అందరం ఆనందించాము. కానీ కొంతమంది ప్రబుద్ధులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. ఎంత దుర్మార్గం? అంటే బలహీనవర్గాలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీ, మైనారిటీల పిల్లలు ఇంగ్లీషు మీడియం చదువుకుంటే తప్పా? ఇంత దుర్మార్గమైన ఆలోచనతో ఈ రోజు ఎన్నో చెబుతున్నారు.

అధ్యక్షా, "జగన్మోహన్ రెడ్డిగారి వెయ్యి రోజుల పాలన విధ్వంసం" అని ప్రతిపక్షం నిన్న ఒక ఛార్జిషీటు విడుదల చేసింది. ఈ రోజున 45లక్షల మంది అక్క చెల్లెమ్మలకు అమ్మ ఒడి ద్వారా నేరుగా డబ్బులు వేస్తున్న జగన్మోహన్ రెడ్డిగారి పాలన విధ్వంసమా అధ్యక్షా? పిల్లలు స్కూల్‌కు వెళ్లేటప్పుడు విద్యా కానుక కిట్ ఇస్తూ జగనన్న గోరుముద్దలు పెడుతూ, ఆ తల్లుల అకౌంట్‌లో అమ్మ ఒడి డబ్బులు వేస్తుంటే ఇది విధ్వంసమా అధ్యక్షా? 52లక్షల మంది రైతన్నలకు నేరుగా రైతు భరోసా ద్వారా డబ్బులు వేస్తుంటే వ్యవసాయానికి ముందుగానే పెట్టుబడి పెడుతుంటే ఇది విధ్వంసమా అధ్యక్షా? చేయూత ద్వారా 25లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలకు సంవత్సరానికి రూ.18,750ల చొప్పున రూ.75,000లు నేరుగా ఇచ్చి ఆ కుటుంబాలు ఆర్థికంగా, బ్రహ్మాండంగా స్థిరపడుతూ, వాళ్లు వ్యాపారాలు చేసుకుంటూ ఉంటే ఇది విధ్వంసమా అధ్యక్షా? ప్రతిపక్షం వారు దుర్మార్గులు అధ్యక్షా. 31లక్షల మంది అక్క చెల్లెమ్మలకు గూడు లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో పాదయాత్రలో వాళ్ల కన్నీళ్లు తుడిచిన జగనన్న 31లక్షల మంది అక్కచెల్లెమ్మలకు నేరుగా పట్టాలిచ్చే కార్యక్రమానికి, 16లక్షల మందికి ఇళ్లు కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడితే ఇది 1,000 రోజుల పాలన విధ్వంసమా అధ్యక్షా?

అధ్యక్షా, 80లక్షల మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు భరోసాగా ఆసరా ఇస్తూ మొత్తం నాలుగు విడతలుగా రుణ మాఫీ చేస్తూ వాళ్ల అకౌంట్లలో నగదు జమ వేస్తుంటే, వాళ్లు సంతోషంగా ఉంటే వాళ్ల కుటుంబాలన్నీ ఆర్థికంగా ముందుకు వెళుతూ ఉంటే ఇది విధ్వంసమా అధ్యక్షా? ఇన్ని పథకాలు. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా అమలుకానన్ని పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ఒక్క జగన్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు శెభాష్ అని మెచ్చుకొంటున్న పరిస్థితులు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంబర్ వన్, జగన్మోహన్ రెడ్డిగారు నంబర్ వన్ అని నిన్ననే స్కోచ్ గవర్నెన్స్ ఒక నివేదిక ఇచ్చింది.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

ఇంత అభివృద్ధి, ఇంత సంక్షేమం జరుగుతుంటే, ఇంత దుర్మార్గంగా... అధ్యక్షా, కులం కూడు పెడుతుందా, మతం మంచి నీళ్లు ఇస్తుందా? సంస్కారం సాయం చేస్తుంది. ఆ సంస్కారవంతుడే ఈనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారు అధ్యక్షా.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, మానవత్వం, మంచితనం ఉండాలి. నిజమైన ప్రేమ, నిజమైన మానవత్వం ఈ నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారిది. అటువంటి మానవతావాది కాబట్టే పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు వారికి ఏం కష్టం కలిగినా సరే నేను ఉన్నానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారు. జగనన్న గోరు ముద్ద, అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, పింఛను కానుక, 61 లక్షల మందికి పింఛన్లు ఇచ్చే కార్యక్రమం, ఈ రోజున ఎన్నో

పథకాలు. కరోనా కష్ట కాలంలో కూడా, ఆర్థిక ఇబ్బందులున్నా లెక్క చేయకుండా అక్క చెల్లెమ్మలకు, అన్నదమ్ములకు నేరుగా పథకాలు అందాలని జగన్మోహన్‌రెడ్డిగారు తపించేవారు.

అధ్యక్షా, ఈ రోజు కులాలను అంటగడుతున్నారు. కులం కూడు పెట్టదు. కులం కాదు కావల్సింది గుణం కావాలి. ఏ కులం ఉందని చెప్పి 45లక్షల మంది అక్క చెల్లెమ్మలకు అమ్మ ఒడి ద్వారా జగన్మోహన్ రెడ్డిగారు డబ్బులు వేస్తున్నారు? ఏ కులం అని చెప్పి 52లక్షల మంది రైతన్నలకు రైతు భరోసా ద్వారా డబ్బులు వేస్తున్నారు? ఏ కులం అని చెప్పి 61లక్షల మంది అవ్వ, తాతలకు, అక్క చెల్లెమ్మలకు పింఛన్లు ఇస్తున్నారు? ఏ కులం అని చెప్పి 25లక్షల మందికి చేయూత, 50లక్షల మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆసరా ఇస్తున్నారు? జగన్మోహన్ రెడ్డిగారు మా కులం, మా బీసీ, మా ఎస్సీ, మా ఎస్టీ, మా మైనారిటీ అని ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకొని చూస్తున్నారు. కానీ ప్రతిపక్షం చెబుతోంది జగన్మోహన్ రెడ్డిగారి 1000 రోజుల పాలన విధ్వంసం అని. కులాలు కూడు పెడతాయా? కులాలు పెద్దన్న పాత్ర పోషించాలని ఈ మధ్యే ఒక నాయకుడు చెప్పాడు. కులాలు పెద్దన్న పాత్ర పోషించవు, గుణవంతుడే పెద్దన్న పాత్ర పోషిస్తాడు. ఏ కులం అని చెప్పి ఈ 151మంది ఎమ్మెల్యేలం అయ్యాము, ఏ కులం అని చెప్పి 22మంది ఎంపీలను గెలిపించారు? ఒంటి చేత్తో జగన్మోహన్ రెడ్డిగారిని గెలిపించినవారిది ఏ కులం అధ్యక్షా? జగన్మోహన్ రెడ్డిగారి కులం.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, కులం కూడు పెడుతుందా? మనసున్నవాడు ఆకలిని, ఆకలి కడుపును చూసి అన్నం పెట్టేవాడే లీడర్. ఆ పెట్టే అన్నం కూడా పర్మినెంట్‌గా పెట్టేవారు జగన్మోహన్ రెడ్డిగారని జనం అన్నారు. అన్ని వర్గాల వారికి పర్మినెంట్‌గా పెడుతున్నారు కూడా.

అధ్యక్షా, ఈ రోజు మీరు ఆ సీట్లో కూర్చున్నారు. స్పీకర్ స్థానంలో బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి, ఆ పక్కనే శాసన మండలి చైర్మన్‌గా షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి, శాసన మండలి వైస్ చైర్మన్ ఒక మైనారిటీ. గతంలో సామాజిక న్యాయం అని గొంతు చించుకుని అరిచేవాళ్లం. 74ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని పాటించిన గొప్ప వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిగారే అధ్యక్షా.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

గతంలో "సామాజిక న్యాయం కావాలి" అనే మాట వినీ వినీ గొంతెత్తి అరిచినా ఎక్కడా సామాజిక న్యాయం జరగలేదు అధ్యక్షా. ఈ రోజున మంత్రివర్గం కూర్పు, స్పీకర్ స్థానం, చైర్మన్ స్థానం, వైస్ చైర్మన్ స్థానం, ఎంపీ పదవులు, ఎమ్మెల్యే పదవులు రాజ్యాంగంలో ఉంటాయి కానీ, రాజ్యసభ సీట్ల గురించి రాజ్యాంగంలో ఉండదు. నాలుగు ఎంపీ స్థానాలుండగా వాటిలో రెండు స్థానాలు బీసీలకు ఇచ్చారు. 32 ఎమ్మెల్సీ స్థానాలుంటే సామాజిక న్యాయం ప్రకారం 18 స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు

కేటాయించారు. 13 జిల్లా పరిషత్ చైర్మన్లు ఉంటే 9 జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చిన గొప్ప నేత సామాజిక న్యాయానికి రూపకర్త జగన్మోహన్ రెడ్డిగారు.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, 13 నగర కార్పొరేషన్ చైర్మన్ల పదవులకు గాను రిజర్వేషన్ ప్రకారం 12 చైర్మన్ల పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చారు. రిజర్వేషన్ కాని జనరల్ స్థానాల్లో సైతం మా బలహీనవర్గాలు అయిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలను కూర్చోబెట్టిన చరిత్ర. ఈ విధంగా ఎవరు చేస్తారు?

**మ.3.20**

నా చిన్నప్పుడు మార్కెట్ యార్డు డైరెక్టర్ పదవి కోసం నాయకులు దగ్గరికి వెళ్లే వాళ్లం. ఆ నాయకులు లోపలకి వెళ్లి, సర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పదవి కోసం మా వాడిని తీసుకొచ్చామంటే, వారు చూద్దాంలేవయ్యా అనేవారు. ఈ రోజు 196 మార్కెట్ యార్డు చైర్మన్లు ఉంటే, 118 మార్కెట్ యార్డు చైర్మన్లు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, ఇది గుండెల్లోంచి, మనసులో నుంచి వస్తోంది. మన ముఖ్యమంత్రి గారికి మనసు ఉంది కనుకనే ఈ రోజు ఇంత సామాజిక న్యాయం జరుగుతోంది. ఈ రోజు చాలా మందిని చూశాం. మేము అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయింది. మేము గ్రామాల్లోకి వెళుతున్నప్పుడు అమ్మ, అక్కా, చెల్లి, అన్న, తమ్ముడు, అవ్వా, తాతల మాట ఏమంటే "జగన్ బాబు ఉన్నాడు కాబట్టే నాకు పింఛను వస్తోంది, జగనన్న ఉన్నాడు కాబట్టే నాకు అమ్మ ఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా డబ్బులు వస్తున్నాయి, కల కాలం జగన్మోహన్‌రెడ్డి గారు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని చెప్పి ప్రతి అవ్వా, తాత, అన్న, అక్కా, చెల్లి" గొంతెత్తి చాటుతున్నారు. 13 జిల్లాలను ఈ రోజు 26 జిల్లాలుగా వికేంద్రీకరణ చేస్తున్నారు. పరిపాలన వికేంద్రీకరణ, ప్రజల వద్దకు పాలన. దీని గురించి ఎందుకు చెబుతున్నానంటే ఒక జిల్లాకు ఎన్టీరామారావుగారి పేరు పెట్టారు. ఎన్టీరామారావు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశారు. అదే విధంగా జాతీయ నాయకుల్లో ఆయన ఒకరు. మన ముఖ్యమంత్రిగారు ఉన్నత విలువలు ఉన్న వ్యక్తి కాబట్టి ఒక జిల్లాకు ఎన్టీఆర్ గారి పేరును సిఫార్సు చేశారు. మేము ఎన్టీరామారావు గారి పేరుని ఒక జిల్లాకి పెడితే వారు ఎన్టీరామారావు గారికి వెన్నుపోటు పొడిచి, ఆయనను రాళ్లతో, చెప్పులతో కొట్టి, వైశ్రాయ్ హోటల్‌లో ఆయనను అవమానపరిచి, దాడి చేశారు. చంద్రబాబునాయుడుగారు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఒక జిల్లాకు ఎన్టీరామారావుగారి పేరును పెట్టాలనే ఆలోచన వారికి ఎప్పుడైనా వచ్చిందా? ఈ రోజు మా జగన్మోహన్‌రెడ్డిగారికి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎన్టీరామారావు గారి అభిమానులందరు కూడా జగన్మోహన్‌రెడ్డిగారికి జేజేలు పలుకుతున్నారు. వారు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నా ఎన్టీరామారావు గారి పేరు వారికి గుర్తుకు రాలేదు. వారు అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంతో ఎన్టీరామారావుగారికి భారతరత్న ఇప్పించాలనే ఆలోచన కూడా వారికి రాలేదు. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం ఎన్టీరామారావుగారి పేరు

పెట్టాలని గొంతెత్తి అరుస్తారు. చనిపోయిన ఎన్టీరామారావు గారిని వైఎస్ జగన్మోహన్‌రెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్రతికించారని ఈ రోజు గర్వంగా వారి అభిమానులకు చెబుతున్నాను. ఈ రోజు ఇంతగా, ఇన్ని వర్గాల ప్రజలందరూ తన వాళ్లుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా బలహీన వర్గాల ఆత్మబంధువుగా బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను, మైనారిటీలను ప్రోత్సహిస్తూ, సమ సమాజ నిర్మాణానికి జగన్మోహన్‌రెడ్డిగారు కంకణం కట్టుకున్నారు. చంద్రబాబునాయుడుగారు తన సామాజిక వర్గానికి ప్రతినిధి అయితే, జగన్మోహన్‌రెడ్డిగారు సమ సమాజ నిర్మాణానికి ప్రతినిధి. ఇది నిజంగా గొప్ప విషయం. చంద్రబాబునాయుడుగారు తన సామాజిక వర్గం గురించి మాత్రమే ఆలోచిస్తారు. జగన్మోహన్‌రెడ్డిగారు మా వర్గాల గురించి ఆలోచించి మాకు చేయి ఇచ్చి మమ్మల్ని గొప్ప గొప్ప సీట్లలో కూర్చోపెట్టారు. మీకు (టీడీపీ నుద్దేశించి) చాలా పత్రికలు ఉన్నాయి. మీరు రోజూ పని కట్టుకొని విషపు రాతలు రాసి విషం కక్కుతున్నారు, దాడి చేస్తున్నారు. ప్రజల చేత విశ్వాసం పొందిన ప్రభుత్వం మీద దాడి చేస్తూ, ప్రతి రోజూ సాయంత్రానికి చర్చలు పెడతారు. పెయిడ్ అర్టిస్టులను పెట్టుకొని వారికి సూటు, బూటు వేసి చర్చలు పెట్టి, జగన్మోహన్‌రెడ్డిగారిని, జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వాన్ని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నిందించడమే పనిగా పెట్టుకున్నారు. ఇది దుర్మార్గమైన ఆలోచన. నిన్న అండమాన్‌లో రిజల్ట్స్ వచ్చాయి. టీడీపీకి రెండు సీట్లు వచ్చాయి. అండమాన్‌లో టీడీపీ రెండు వార్డులు గెలుచుకుంది. వారు సంబరాలు చేసుకున్నారు. నేను ఒక్కటే చెబుతున్నాను. రెండు సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ ఈ రాష్ట్రం నుంచి ఖాళీ అవ్వబోతోంది. తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ నుంచి అండమాన్ వెళ్లిపోబోతోంది. తెలంగాణాలో వారి పార్టీ చచ్చిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ పార్టీ కనుమరుగైపోతోంది. చంద్రబాబునాయుడు గారు అండమాన్ పారిపోతున్నారు.

కరోనా కష్ట కాలంలో, ఇక్కడున్న సహచర ఎమ్మెల్యేలు, మిత్రులు, మంత్రులు కరోనాని ఎదుర్కొని, అవసరమైతే ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రెండు సంవత్సరాలు ప్రజల కోసం ఇబ్బంది పడ్డాం. కానీ చంద్రబాబునాయుడుగారు కరోనా సమయంలో హైదరాబాదు పారిపోయారు. వారు నీతులు చెబుతారు. కరోనా కష్ట కాలంలో మా ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజలు కష్టాల్లో ఉన్నారని ముఖ్యమంత్రిగారి ఆదేశాలతో ప్రతి రోజు, ప్రతి నిత్యం ప్రజలతో ఉన్నారు. కానీ చంద్రబాబునాయుడు గారు, వారి కొడుకు కరోనా సమయంలో హైదరాబాదు పారిపోయి ఇప్పుడు వచ్చి నీతులు చెబుతారు.

పోలవరం గురించి మాట్లాడారు. పోలవరాన్ని ఏటిఎంగా మార్చుకుని ప్రతి రోజు పోలవరం గురించి పోలవరాన్ని సోమవారం అని చెప్పి అక్కడికెళ్లి సోది కబుర్లు చెప్పి "జయము జయము చంద్రన్న" అని పాటలు పాడుకొని, చిడతలు పట్టుకొని వాయించే వీళ్లు చెబుతారు. అధ్యక్షా, మనసున్న వాడు, మంచి మనిషి, ఒక వీరుడు, ఒక ధీరుడు, ఒక ధీశాలి నాయకత్వంలో ఈ రోజు ఎప్పుడు ఎన్నికలు జరిగినా సరే 151స్థానాలు కాదు, 175 స్థానాలకు గాను 151 పై చిలుకు స్థానాలు గెలవడానికి జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో మేము సిద్ధంగా ఉన్నాం అని చెబుతున్నాము. ఈ మధ్య TDP

కార్యకర్తలతో చంద్రబాబునాయుడుగారు ఆదాయ వనరులను అన్వేషిస్తామని చెప్పారు. ఇంకేముంది ఆదాయం? మొత్తం దోచుకున్నారుగా. జన్మభూమి కమిటీల పేరుతో మీరు మొత్తం దోచుకున్నారు. ఈ రోజు మా జగనన్న ప్రభుత్వంలా ప్రజా సంక్షేమం కొరకు ఇన్ని పథకాలు భారతదేశ చరిత్రలో ఎవరూ కూడా చేయరు. రూ.1,75,37,664కోట్లతో అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరుస్తున్న జగన్మోహన్ రెడ్డిగారికి సలాం కొడుతూ, జై జై అని పలుకుతూ జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి. ధన్యవాదాలు.

**మ.3.30**

**శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (SRI Y.S.JAGANMOHAN REDDY)**: అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద ప్రసంగించే ముందు ఇక్కడ జరిగిన కొన్ని సంఘటనలు తెలియజేస్తాను. తెలుగుదేశం పార్టీ వారి అసభ్య, అనుచిత ప్రవర్తనకు ఈ గౌరవ సభ వేదిక కాగా, ఇక్కడికి మన ఆహ్వానం మేరకు వచ్చిన గవర్నర్ గారిని ఏ రకంగా వాళ్లు అవమానించారో మనమంతా చూశాం. ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ గారి ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా విధానాలను ప్రస్తావించే అంశం. ఇది కొత్తగా మన ప్రభుత్వంలో జరుగుతున్న అంశం కాదు. ప్రతి బడ్జెట్ సమావేశాలలోను గవర్నర్‌గారు రావడం, ప్రసంగించడం ప్రభుత్వ పరిపాలనా విధానాలను ప్రస్తావించి అందులోని అంశాలను చెప్పడం పరిపాటిగా సాగుతోంది. ఇందులో ఏవైనా అంశాలతో విభేదించాలనుకుంటే ప్రతిపక్ష నాయకుడికి కూడా మాట్లాడేందుకు సమయం ఇస్తారు. ఈ రోజు రామానాయుడు గారు తెలుగుదేశం పార్టీ తరఫున మాట్లాడారు. అదొక పద్ధతి. ఎవరైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడవచ్చు. ఏదైనా చెప్పాలనుకుంటే చెప్పవచ్చు. గవర్నర్ గారి ప్రసంగం పై ఏదైనా విభేదించాలనుకుంటే విభేదించవచ్చు. ఒక పద్ధతి ప్రకారం చెప్పవచ్చు. కానీ ఇక్కడ ఏం జరిగిందో తమరు చూశారు. వాస్తవంగా ప్రతిపక్షనాయకుడు చంద్రబాబునాయుడు గారే ఇక్కడకు రావచ్చు. చంద్రబాబునాయుడు గారిని సభకు రావద్దని మేమైతే చెప్పలేదు. ఆయన సభకు ఎందుకు రావడం లేదో, ఆయన రాకుండా ఆయన తరఫున వారి అనుయాయులను ఎందుకు పంపించారో, ఇక్కడకు రావడానికి ఆయనకు ఎందుకు మొహం చెల్లుబాటుకావడం లేదో ఆయనకే తెలియాలి. Governor is the Constitutional Head in the State. రాజ్యాంగ పెద్ద అన్నది ఒక aspect అయితే, ఆయన 87 సంవత్సరాల పెద్దాయన. మనం మన పెద్దవాళ్లకి ఏవిధంగా గౌరవం ఇస్తున్నామో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. రాజ్యాంగం ప్రకారం, ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రంలో ఆయన ప్రథమ పౌరుడు. అలాంటి వ్యక్తి ఈ గౌరవ సభకు వచ్చినపుడు దాదాపుగా దాడి చేసిన పరిస్థితిని మనం చూశాం. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా గవర్నర్ గారు ప్రసంగించేటప్పుడు ఏ రోజు ఈ విధంగా చెయ్యలేదు. చివరికి వాళ్లు ఏ స్థాయికి వెళ్లిపోయారంటే గవర్నర్ గారి ప్రసంగం అయిపోయిన తరవాత ఆయనను సాగనంపే కార్యక్రమంలో గౌరవ సభాపతిగా మీరు, నేను ఉన్నప్పుడు ఆ లాబీల్లో నిలబడి గవర్నర్ గో బ్యాక్, డౌన్ డౌన్ అంటూ గవర్నర్‌కు అతి

దగ్గరగా వచ్చి ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఇవన్నీ చూస్తుంటే చంద్రబాబుకు రాజ్యాంగ వ్యవస్థలంటే ఎంతటి కడుపుమంటో అర్థమవుతోంది. కేవలం ఆయన సీట్లో లేరు, that is the only problem. గవర్నర్ వైఎస్సార్ పార్టీకో, తెలుగుదేశం పార్టీకో, సంబంధించిన వ్యక్తి కాదు. ఆయనొక న్యూట్రల్ వ్యక్తి. అటువంటి వ్యక్తిపై అవమానకరంగా ప్రతిపక్షం ప్రవర్తించిన తీరు చాలా బాధకరం. 87 సంవత్సరాల వయస్సు గల ఒక పెద్దాయనపై, రాజ్యాంగంలో ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రంలో ప్రథమ పౌరుడిగా ఉన్న పెద్దమనిషిపై చంద్రబాబునాయుడు గారు రాకపోగా తన కొడుకును, ఎమ్మెల్యేలను పురమాయించి anti social elements గా వాళ్లు ప్రవర్తించిన తీరు దిగజారిన రాజకీయాలకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ విమర్శలన్నింటికీ సమాధానంగా నేరుగా వాళ్లని ఒక ప్రశ్న అడగదలుచుకున్నాను. ఈ రాష్ట్ర ప్రజలకు చంద్రబాబునాయుడు గారు చేసిన మేలు ఏమిటి అని అడగదలుచుకున్నాను. ఎందుకంటే వాళ్ల ప్రభుత్వ పాలనను ప్రజలందరూ చూశారు. ఆయన ఐదు సంవత్సరాల పరిపాలన చూశాక ఎన్నికలు వచ్చిన తరవాత ప్రజలే తీర్పునిస్తూ ఓటు వేశారు. తరవాత మన పాలన వచ్చింది. ఈ రోజు కూడా చంద్రబాబునాయుడు గారి పేరు చెబితే గుర్తుకు వచ్చే సంక్షేమ పథకం ఒక్కటి అంటే ఒక్కటైనా ఉందా అని అడుగుతున్నాను. ఆయన సొంతం అనుకోడానికి ఆయన ఫలానా సంక్షేమ పథకం చేశానని చెప్పుకునేది ఒక్కటైనా ఉందా?

(మోసం, వెన్నుపోటు ఉన్నాయి అని అధికారపక్షసభ్యులు అన్నారు)

అధ్యక్షా, ఇప్పుడు మా సభ్యులందరూ ఆయన పేరు చెబితే ఒక స్కీం బాగా గుర్తుకొస్తోందని అంటున్నారు. ఆ స్కీం ఏమిటని నేను చెప్పకముందే అందరూ కూడా "వెన్నుపోటు" అనే పథకం గుర్తుకు వస్తోందని అంటున్నారు. చంద్రబాబునాయుడు గారు తన జీవితంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్ధానాలకు అధికారంలోకి వచ్చిన తరవాత ఇచ్చిన విలువ ఏమిటో అందరికీ తెలుసు. అదే మన ఎన్నికల వాగ్ధానాలకు ఎటువంటి విలువనిస్తున్నామో దాదాపుగా 34 నెలల పాటు సాగిన మన పరిపాలనలో ప్రతి ఒక్కరూ చూస్తున్నారు. చంద్రబాబునాయుడు గారి పాలనలో, ఎన్నికలలో ఆయన వాగ్ధానాలకు ఆయన ఇచ్చిన విలువ ఏమిటి? మన ప్రభుత్వంలో మనం ఎటువంటి విలువను ఇస్తున్నాం? 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీ గెలుచుకుంది 151 మంది ఎమ్మెల్యే, 22 మంది లోక్‌సభ ఎంపీ సీట్లు అయితే ఈ 34 నెలల్లో మనం పరిపాలన ఎలా చేశాం? ఎన్నికలలో ఇచ్చిన హామీలను మనం ఎలా నెరవేర్చాం? మనం మంచి పాలన చేశామా, చెయ్యలేదా అనేది ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో నిర్ణయించారు.

**మ.3.40**

అధ్యక్షా, తరువాత జరిగిన ప్రతీ ఎన్నికల్లో చివరకు గత నవంబర్ నెలలో 13 మునిసిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో ఏ ఎన్నిక తీసుకున్నా, ప్రతీ ఎన్నికల్లో, తిరుపతి ఎంపీ ఉపఎన్నికైనా, బద్వేల్ ఎంఎల్ఏ ఉప ఎన్నికైనా, పంచాయతీ ఎన్నికలైనా, జిల్లా పరిషత్తు ఎన్నికలైనా, మండల పరిషత్ ఎన్నికలైనా,

మునిసిపాలిటీ, నగర పంచాయతీల ఎన్నికలైనా, కుప్పం మునిసిపాలిటీతో సహా ఏ ఎన్నికలోనైనా ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారంటే దాని అర్థం ఏమిటని అడుగుతున్నాను.

(అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు)

అధ్యక్షా, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు 87 చోట్ల ఎన్నికలు జరిగితే 84 చోట్ల వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ గెలిచింది. వాస్తవం చెప్పాలంటే 85 చోట్ల గెలిచింది. కానీ ఒకచోట ఇంకా రిజల్ట్ రాలేదు. కోర్టు రిజల్ట్‌ని ఆపేయమంది. 12 మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే 12 మునిసిపల్ కార్పొరేషన్లను వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. 13 జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగితే 13 జెడ్పీపీలు వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. 9702 ఎంపీటీసీల ఎన్నికలు జరిగితే 8298 అంటే 86 శాతం వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. 652 ZPTC లకు ఎన్నికలు జరిగితే 639 ZPTC లు అంటే 98 శాతం వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ గెలిచింది. 648 ఎంపీపీలకు ఎన్నికలు జరిగితే 639 అంటే 98.60 శాతం వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ గెలిచింది.

అధ్యక్షా, ప్రజలు ఇంతగా ఆప్యాయత, అభిమానం వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీపై చూపించి ఓటు వేశారంటే దానర్థం ఏమిటి? తెలుగుదేశం పార్టీని ఈ ఎన్నికల్లో తీర్పుల ద్వారా ప్రజలు కొన్ని ప్రశ్నలు అడిగారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి చేసిందేమిటయ్యా పెద్దమనిషి అని ప్రజలు చంద్రబాబు నాయుడు గారిని ఈ తీర్పు ద్వారా అడిగారు. ఈ రకమైన మ్యాండేట్ గతంలో ఎప్పుడూ రాలేదు. ఈరకమైన మ్యాండేట్‌ను ప్రజలు ఎందుకు ఇచ్చారంటే మనం చేస్తున్న మంచిని ఆశీర్వదిస్తూ చంద్రబాబు నాయుడు గారిని కొన్ని సూటి ప్రశ్నలు ప్రజలు అడిగారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి చేసిందేమిటి అని ప్రజలు అడిగారు. అధ్యక్షా, దాదాపు మూడు సంవత్సరాల పాలనలో కొవిడ్ సహా ప్రపంచమే ఊహించని కష్టాలు ఎదురైనప్పటికీ ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థలు తలక్రిందులు అయిన పరిస్థితి ఉన్నప్పటికీ కూడా జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు అని ప్రజలు తీర్పు ఇచ్చారు. మేనిఫెస్టోలోని 95శాతం వాగ్దానాలు ఇప్పటికే నిలబెట్టుకున్న పార్టీకి ప్రజలు ప్రేమతో, అభిమానంతో తమ దీవెనలు, ఆశీస్సులు అందించారు. దీని అర్థం వారి గత వికృత పాలనను, వారి ప్రస్తుత వైఖరికి ప్రజలు ఛీ కొడుతూ ఇచ్చిన తీర్పు ఇది. చంద్రబాబు నాయుడు గారి గత పరిపాలనను ఛీ కొడుతూ, ఇప్పటికీ ఆయన అవలంబిస్తున్న వైఖరిని ఛీ కొడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది. అంతెందుకు, ఏ ఒక్క గ్రామంలోని ఏ ఒక్క పేద కుటుంబాన్నైనా తీసుకోండి. 2014-2019 మధ్య ఇప్పుడు మళ్లీ 2019 నుంచి 2022 మధ్య ఒకసారి పోల్చి చూడమని మీద్వారా ప్రజలందరికీ చెబుతున్నాను. ఏ ఒక్క నియోజకవర్గాన్నైనా తీసుకోండి. చివరకు కుప్పం మునిసిపాలిటీ అయినా సరే, కుప్పం నియోజకవర్గమైనా సరే ఎవరి పాలన బాగుందో ప్రజల్ని అడగమని చెబుతున్నాను. ఏ ఒక్క జిల్లానైనా తీసుకుని పోల్చి చూడండి. అంతేకాదు ఏ ఒక్క సామాజిక వర్గాన్నైనా తీసుకోండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు ఈ విధంగా ఎవర్నైనా తీసుకోండి. ఎవరి హయాంలో ఎంత మేలు జరిగిందో

అడగండి. ఒకసారి ప్రజలందర్నీ దీని గురించి ఆలోచన చేయమని కోరుతున్నాను. ఏ ఒక్క రంగాన్ని తీసుకున్నా అది వ్యవసాయం, విద్య, వైద్యం కావచ్చు, మహిళా ఎంపవర్‌మెంటు, మహిళా సాధికారత కావచ్చు. పరిపాలనా సంస్కరణలు, గవర్నెన్స్ విషయంలో కూడా కావచ్చు.

అధ్యక్షా, గ్రామాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న మార్పులు ఏ రంగాన్ని తీసుకున్నా తెలుగుదేశం ప్రభుత్వం చేసిన చెడు కనిపిస్తుంది. మన ప్రభుత్వం చేస్తున్న మంచి కూడా కనిపిస్తుంది. నేరుగా చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను. ఎందుకంటే ఆయన ఈ సభలో లేకపోయినా కచ్చితంగా టీవీ చూస్తూ ఉంటాడు కాబట్టి అడగదలచుకున్నాను. నిజంగా ఈ చర్చ చేయలేకనే గవర్నర్ గారి ప్రసంగ ప్రతుల్ని చించేయడం, ప్రజలకు వాస్తవాలు తెలియకుండా భ్రమ కల్పించడం ఇవన్నీ చేయడంలో ఆయన దిట్ట. చంద్రబాబు నాయుడు గారి పాలనలో ఏ పథకానికైనా శాచ్యురేషన్ విధానంతో అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నైనా గతంలో అమలు చేశారా అని పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను.

**మ.3.50**

అధ్యక్షా, ఇదే పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారిని ఇంకొక ప్రశ్న కూడా అడుగుతున్నాను. ఆయన గారి హయాంలో లంచం లేకుండా ఏదైనా ఒక పథకాన్నైనా ఇచ్చారా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఈ రోజున ప్రజలకు కావలసినది జన్మభూమి దోపిడి కమిటీలా? లేక ఎలాంటి లంచాలకు, అవినీతికి, వివక్షకు తావులేని పారదర్శకమైన గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థనా అన్నది ఒకసారి అడగాలి. సూర్యోదయానికి ముందే లబ్ధిదారుడి ఇంటికి గ్రామ వాలంటీరు వెళ్లి ఒకటవ తేదీన అది ఆదివారమైనా సరే, సెలవు దినమైనా సరే చిరునవ్వుతో పొద్దున్నే తలుపుతట్టి గుడ్ మార్నింగ్ చెబుతూ పెంచిన పింఛను మొత్తాన్ని ఇచ్చే వ్యవస్థ వారి పరిపాలనలో ఏ రోజైనా ఉందా, కనీసం ఆ దిశగా ఆలోచనైనా వారు చేయగలిగారా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఉదయం కూడా ఈ డిబేట్ జరిగింది. రామచంద్రా రెడ్డి అన్న పింఛన్ల గురించి మాట్లాడుతున్నప్పుడు కూడా మనం చూశాం. ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు ఇదే పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన పింఛన్ల సొమ్ము నెలకు ఎంత అని అడుగుతున్నాను. ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు వారి హయాంలో నెలకు వెయ్యి రూపాయల చొప్పున పింఛను మొత్తం లబ్ధిదారుడికి అందేది. ఇదే పెద్ద మనిషి ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు అంటే అక్టోబర్ 2018 ముందు వరకు 42 లక్షల మందికి వారి హయాంలో పింఛన్లు పంపిణీ చేసేవారు. ఇదే పెద్ద మనిషి హయాంలో ప్రభుత్వానికి పింఛను సొమ్ము చెల్లింపు కొరకు అయ్యే ఖర్చు కేవలం నెలకు రూ.500.00 కోట్లు మాత్రమే. అంతకు మించి ప్రభుత్వం ఖర్చుపెట్టేది కాదు. కానీ ఈ రోజున పింఛన్ల చెల్లింపు నిమిత్తం మన ప్రభుత్వానికి అవుతోన్న ఖర్చు మొత్తం రూ. 1,567.00 కోట్లు. ఈ పెద్ద మనిషి హయాంలో పింఛను మొత్తం క్రింద రూ.వెయ్యి ఉండగా, ఈ రోజున ఆ మొత్తాన్ని మనం రూ.2,500/-

ల వరకు తీసుకువెళ్లాం. ఈ పెద్ద మనిషి ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు 42 లక్షల మందికి పింఛన్లు మంజూరుచేస్తే, నేడు మనం 62 లక్షల మందికి పింఛన్ల క్రింద మొత్తాన్ని చెల్లిస్తున్నాం.

(సభ్యులు బల్లలు చరిచారు)

ఆ పెద్ద మనిషి హయాంలో నెలకు రూ.500.00 కోట్లకు మించి ఖర్చు కాని పరిస్థితి ఉంటే ఈ రోజు ప్రభుత్వానికి రూ.1,567.00 కోట్లు పింఛన్ల క్రింద ఖర్చు అవుతోంది.

(సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, ఇదే పెద్ద మనిషి పాలనలో ఎవరికైనా చిన్న సర్టిఫికేట్ కావాలన్నా మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లి ఏ సేవ కావాలన్నా, ఏ సర్టిఫికేట్ కావాలన్నా చెప్పులు అరిగేలా తిరగడం తప్ప ఫలితం ఉండేది కాదు. ఆనాటి పరిస్థితి అది. అది కూడా లంచాలిచ్చుకుంటూ చెప్పులు అరిగేలా తిరగడం తప్ప వేరే లేదు. ప్రతి రెండు వేల జనాభాకు దాదాపు 540 పౌర సేవలందించే గ్రామ, వార్డు సచివాలయాలను మన ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కనీసం ఇటువంటి ఆలోచనైనా వారు చేయగల్గే పరిస్థితి ఆనాడు ఉండేదా అని అడుగుతున్నాను. They never dreamt something like this. కనీసం తన ఊహకు కూడా అందని విషయం.

అధ్యక్షా, ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి పదవులను తిరస్కరించాను అని చెప్పుకునే ఈ పెద్ద మనిషికి ఇటువంటి ఆలోచనలు ఎందుకు తట్టలేదో అర్థం కాలేదు. ఎంతసేపు ఈ మనిషి పదవుల గురించే తప్ప జనం గురించి, వాళ్లకు ఎలా మంచి చేయాలని గానీ ఏ రోజు ఆలోచన చేసిన పాపాన పోలేదు. ఆయన దుర్బుద్ధితో ఆనాడు మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మా దగ్గర్నుంచి 23 మంది ఎమ్మెల్యేలను అనైతికంగా తీసుకున్నాడు. అందుకనే దేవుడు, ప్రజలు ఆయనకు మొట్టికాయలు వేసి కరెక్టుగా ఆయనకు ఇచ్చింది కూడా అదే 23 మంది ఎమ్మెల్యేలనే.

(సభ్యులు బల్లలు చరిచారు)

**శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు (నాని) (SRI KODALI SRI VENKATESWARA RAO)(NANI):** (మైకు లేకుండా) అదే విధంగా ముగ్గురు ఎంపీలను తీసుకుపోయాడు, మళ్లీ ముగ్గురు ఎంపీలనే దేవుడు వాళ్లకు ఇచ్చాడు.

**శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (SRI Y.S.JAGANMOHAN REDDY)**: అది కూడా కరెక్టే, అధ్యక్ష. ఎన్నికలకు ముందు మా పార్టీ ఎంపీలను ముగ్గురిని అనైతికంగా తీసుకున్నాడు. కరెక్టుగా దేవుడు, ప్రజలు మొట్టికాయలు వేసి మళ్లీ ఆయనకు ఇచ్చింది కూడా అదే ముగ్గురు ఎంపీలనే.

అధ్యక్షా, గ్రామాన్ని ఉదాహరణ క్రింద తీసుకోండి. అందరినీ ఆలోచన చేయమని కోరుతున్నాను. ప్రతి రెండు వేల మందికి పౌరసేవలందించే గ్రామ సచివాలయం ఎవరైనా ఊరిలోకి పోయిన వెంటనే కనిపిస్తుంది. గ్రామ సచివాలయంలో చిరునవ్వుతో మంచి యూనిఫార్మ్ వేసుకున్న పది మంది వాలంటీర్లు సేవలందించే పరిస్థితి కనిపిస్తుంది. మన గ్రామానికి సంబంధించిన మన పిల్లలు

అక్కడే ఉద్యోగాలు చేసే పరిస్థితి కనిపిస్తుంది. అక్కడ నుంచి నాలుగు అడుగులు ముందుకేస్తే అదే గ్రామంలో రైతులకు విత్తనం వేయడం నుంచి పంట అమ్మకం వరకు టోటల్‌గా అన్ని విధాలా రైతన్నలకు సహాయం అందేలా పూర్తిగా రైతన్నకు తోడుగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలు అక్కడే గ్రామంలో కనిపిస్తాయి. మరో నాలుగు అడుగులు ముందుకేస్తే నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తాయి. 24X7 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో బిఎస్సీ నర్సింగ్ చదువు పూర్తి చేసిన నర్సులు అంటే మిడ్ లెవెల్ హెల్త్ ప్రాక్టిషనర్స్, ఏఎన్ఎమ్, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండటమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీల ఏర్పాటుతో పాటు ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, మండలానికి నలుగురు డాక్టర్లు ఏర్పాటై ఉన్నారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక 104 వాహనం, ఒక డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే మరో డాక్టర్ అదే 104 వాహనం ఎక్కి తనకు కేటాయించిన స్పెసిఫిక్ గ్రామాల్లో తిరగడం, ప్రతి డాక్టర్‌కు పరిమితంగా ఐదారు గ్రామాలనే కేటాయించడం, అదే గ్రామాన్ని డాక్టరు రోజు మార్చి రోజు కచ్చితంగా అటెండ్ కావడం, నెలకు ప్రతి డాక్టరు కనీసం గ్రామానికి నాలుగైదు సార్లు అంటెడ్ అయ్యేట్లుగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పనిచేసే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు గ్రామంలో కనిపిస్తున్నాయి. మరో నాలుగు అడుగులు అదే గ్రామంలో ముందుకేస్తే ఒక ఇంగ్లీషు మీడియం స్కూల్ కనిపిస్తుంది. ఒక గ్రామ రూపురేఖలు ఏ విధంగా మారుతాయన్న దానికి ప్రాక్టికల్ నిదర్శనం గ్రామ సచివాలయ వ్యవస్థ.

అధ్యక్షా, అదే గ్రామంలోనే మరో నాలుగు అడుగులు ముందుకేస్తే నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తాయి. గ్రామానికి వెళితే నిర్మాణాలు మన కళ్లకు కనబడతాయి. మరో నాలుగు అడుగులు ముందుకేస్తే మెరుగులు దిద్దుకుంటున్న మన అంగన్‌వాడీ కేంద్రాలు కనిపిస్తాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ రోజున శాటిలైట్ ఫౌండేషన్ క్రింద ఇంగ్లీషు భాషలో బోధన జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలు ఇంగ్లీషు బోధించే శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్‌గా పూర్తిగా మార్పు చెందుతున్నాయి. ఇవన్నీ కూడా మారుతున్న మన గ్రామంలో కనిపిస్తోన్న పరిస్థితులు.

అధ్యక్షా, ఇంతకు ముందే చెప్పాను. గ్రామాన్ని ఉదాహరణగా తీసుకున్నా ఈ విధంగా మార్పు కనిపిస్తుందని. మండలం కూడా ఎప్పుడూ జరగని విధంగా మార్పు జరిగింది. ప్రతి మండల కేంద్రంలో 108 వాహనం అందుబాటులో ఉంది. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, ప్రతి పీహెచ్‌సీకి ఒక ఆధునిక 104 వాహనంతో పాటు రాబోతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్. ఇవన్నీ కూడా గ్రామంలో కనిపిస్తున్నాయి. ఇది కేవలం 34 నెలల ప్రభుత్వ పాలనలో మన ప్రభుత్వం మార్చిన, మార్చబోతున్న మన గ్రామ స్వరూపం ఇది.

(సభ్యులు బల్లలు చరిచారు)

**సా.4.00**

చంద్రబాబు నాయుడికి గ్రామమంటే ఏమాత్రం గౌరవం గానీ, ప్రేమగానీ, అక్కడ ప్రజల అవసరాలు తెలుసుకునే స్వభావం గానీ లేవు.

అధ్యక్షా, ఒక్క గ్రామాలే కాకుండా జిల్లాల స్వరూపం కూడా మనం మారుస్తున్నాము. ప్రతి 6 నుంచి 8 నియోజకవర్గాలకు ఒక కొత్త జిల్లాను ఏర్పాటుచేస్తున్నామంటే పరిపాలనా సంస్కరణల్లో విజన్ ఎవరిదని అడుగుతున్నాను. ఎందుకంటే, ఆయన ఎప్పుడూ విజన్ గురించి చెబుతూ ఉంటాడు. మనం చేస్తున్న పరిపాలన వికేంద్రీకరణ చూసి, రాజధాని వికేంద్రీకరణ వద్దని చెబుతున్న వారు కూడా అక్కడ కాదు, మా జిల్లా ప్రధాన కార్యాలయం ఇక్కడ పెట్టండని చివరకు బాబుగారి బావమరిది కూడా హిందూపురంలో జిల్లా కేంద్రం కావాలని బాబు హయాంలో బాబును కాకుండా మన హయాంలో మనల్ని అడుగుతున్నారంటే ఎవరికి ఎంత విజన్ ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. చివరకు బాబు గారు కూడా కుప్పంలో రెవెన్యూ డివిజన్ కావాలని తన పరిపాలనలో తాను చెయ్యకుండా మన పరిపాలనలో మనల్ని అడుగుతున్నాడంటే ఎవరికి ఎంత విజన్ ఉందో ప్రజలకు అర్థమవుతోంది.

అధ్యక్షా, రాజధాని వికేంద్రీకరణ చేస్తామంటే వారి భూములు, వారి వాళ్ల భూములు, వాటి రేట్లు తప్ప 13 జిల్లాలు, అక్కడున్న ప్రజల ప్రయోజనాలేవీ చంద్రబాబు నాయుడి ప్రజాస్వామ్యంలో లేవు. మూడు ప్రాంతాలకు సమానమైన అభివృద్ధి, ప్రజల మధ్య ఒకరి పట్ల మరొకరికి ఆప్యాయతలు ఉండాలనే తపన వంటి ఆలోచనలు కూడా చంద్రబాబు నాయుడు గారు చేసిన దాఖలాలు లేవు. పేద వారికి రాజధానిలో ఇళ్ల స్థలాల విషయంలో గానీ, పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం చదువుల విషయంలో గానీ ఏ కోర్టులో అయినా వ్యతిరేకంగా ఏ తీర్పు వచ్చినా సంతోషపడేవాడు ఎవరైనా ఉన్నారా అంటే చంద్రబాబు నాయుడు గారే. దగ్గరుండి కేసులు వారే వేయిస్తారు. కోర్టు తీర్పులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చినందువల్ల ప్రజలు నష్టపోతున్నారని తెలిసినా కూడా చంద్రబాబు నాయుడు గారికి సంతోషంగా ఉంటుంది. ఈ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం, బాధ్యతతో మనం తీసుకునే నిర్ణయాలకు, ఆయన మనస్తత్వానికి ఎంత తేడా ఉందో ఒక్కసారి ఆలోచించాలని మీద్వారా అడుగుతున్నాను. ఆయన పరిస్థితి అన్ని విషయాల్లో కూడా ఇదే విధంగా ఉంది.

అధ్యక్షా, విద్యారంగం విషయానికి వస్తే, ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నాశనం చేయాలని గతంలో బాబు గారు చేయని ప్రయత్నం లేదు. నిజంగా బాబు గారు మరో 5 సంవత్సరాలు అదే స్థానంలో పారపాటున ఉంటే ప్రభుత్వ పాఠశాలలన్నీ మూసివేసి ఉండేవారు. అదే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బ్రతికించడానికి మాత్రమే కాక ప్రభుత్వ పాఠశాలలకు వైభవం తీసుకొచ్చేందుకు గత 34 నెలల కాలంగా మనం ఎంత కష్టపడుతున్నాము? చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం ఎంతసేపూ నారాయణ, చైతన్య విద్యాసంస్థల కోసం ఆలోచిస్తే, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చేందుకు మనం పరిగెడుతున్నాము.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన పేదవర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో మాత్రమే చదవాలని, కేవలం వారి పిల్లలు మాత్రం ఇంగ్లీషు మీడియంలో చదవాలన్న ఆయన గారి విధానం మంచిదా, లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాల్లో ఉన్న నిరుపేద

పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుకోవాలన్న మా విధానం మంచిదా అని అడుగుతున్నాను. ఈ తరం పిల్లలు కూడా వారి పాలాల్లో కూలీలుగా, వారి వ్యాపారాలకు, వారి పరిశ్రమలకు వెట్టిచాకిరీ చేసే కార్మికులుగా మిగిలిపోవాలన్న చంద్రబాబు నాయుడు గారి అన్యాయమైన ఆలోచనలు సరైనవా, లేక ఈ తరం పిల్లలు ప్రపంచంలో ఎక్కడైనా బ్రతికేందుకు, ఎదిగేందుకు అవకాశం ఉన్న చదువులు చదివించాలన్న మా విధానం సరైనదా అనేది ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, అమ్మ ఒడి వంటి పథకం ప్రవేశపెట్టాలనే ఆలోచన కనీసం చంద్రబాబు నాయుడు గారు తన కలలోనైనా చేయగలిగాడా అని అడుగుతున్నాను. చదివించే తల్లుల కష్టాలు ఏమిటో, పేద పిల్లలు మధ్యలోనే చదువును ఆపేసే పరిస్థితి ఎందుకు వస్తుందో ఏనాడైనా చంద్రబాబు నాయుడు గారు కనీసం ఆలోచించిన చరిత్ర ఉన్నదా అని అడుగుతున్నాను. మాటిమాటికీ 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని అంటారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఏమి చేసుకోవడానికో నాకైతే అర్థం కావడం లేదు. ఆయన పేరు చెబితే ఒక్కటంటే ఒక్క స్కీము కూడా గుర్తుకొచ్చే విధంగా ముఖ్యమంత్రిగా తన పరిపాలనలో చేసుకోలేకపోయారు. ఇంతకుముందు మన వాళ్లు చెప్పినట్లు ఆయన పేరు చెబితే ఒక్కటే స్కీము వెన్నుపోటు స్కీము. ఆ వెన్నుపోటు స్కీము ఎన్.టి.రామారావు గారి దగ్గర నుంచి చివరకు మన ప్రధాని మోదీ గారి వరకూ జరిగింది. ఈ పెద్ద మనిషి ఎంతటి వెన్నుపోట్లు పొడవగలుగుతాడో అందరికీ తెలిసిపోయింది.

**సా.4.10**

చంద్రబాబు నాయుడు గారి పేరు వినగానే అందరకీ గుర్తుకొచ్చేది వెన్నుపోటు ఒక్కటే. కొవిడ్ కాలంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగిందంటే ప్రజల మనసు తెలిసిన పాలన ఎవరిది అని అడుగుతున్నాను. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నాడు-నేడు పేరుతో పాఠశాలల రూపు రేఖలు మార్చింది. ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌లో Bilingual text books ప్రవేశపెట్టాము. ఆ పుస్తకాలలో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లీషులో పాఠ్యాంశాలు ముద్రించి ఇచ్చాం. వచ్చే విద్యా సంవత్సరం నుండి సబ్జెక్ట్ టీచర్స్ కూడా వస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. పాఠశాలల చుట్టూ ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టాం. తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో పాఠశాలలు ఏ విధంగా ఉన్నాయి, ఈ ప్రభుత్వ పరిపాలనలో పాఠశాలలు ఏవిధంగా ఉన్నాయన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని మీ ద్వారా కోరుతున్నాను. వేసవి సెలవలు ముగించుకుని పాఠశాలల్లో తరగతులు ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు కావలసిన యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాము. సుమారు పదికి పైగా హంగులు ఏర్పాటు చేశాం. అందుకు జగన్ మామా థ్యాంక్స్ అంటూ పిల్లలు చెబుతున్నారు. మా పరిపాలన ఎలా ఉందో ఒకసారి చూడమని మీ ద్వారా వారిని అడుగుతున్నాను. ఇటువంటి ప్రభుత్వ చర్యల కారణంగా 1 నుండి 10వ

తరగతి వరకు చదువుకుంటున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 2018-2019 విద్యా సంవత్సరంలో 70.43 లక్షలు కాగా, నేడు ఆ సంఖ్య 73.05 లక్షలకు పెరిగింది. 2018-2019 విద్యా సంవత్సరం నాటికి కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 37.20 లక్షలుగా ఉంటే ఈ రోజు ఆ సంఖ్య 43.43 లక్షలకు పెరిగింది. అంటే 6.23 లక్షల మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి చేరారు. ఈ పరిస్థితి మన రాష్ట్రంలోనే కనిపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదవాలంటే శాసనసభ్యులు, శాసనపరిషత్ సభ్యుల నుండి సిఫార్సు లేఖలు కావాల్సిన పరిస్థితులు వచ్చాయి.

(బల్లలు చరిచారు )

ప్రభుత్వ పాఠశాలలు ఏ స్థాయికి ఎదిగాయన్న విషయాన్ని చెప్పుకోడానికి ఇంతకన్నా మరొక నిదర్శనం ఏదీ లేదని చెప్పుకోవచ్చు. చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య ఎంత ఉందో ఒకసారి గమనించాలని కోరుతున్నాను. అయినప్పటికీ మనం ప్రచారం చేసుకోవడం లేదు. ఇదే చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఒక లక్ష పెరిగి ఉంటే ప్రపంచ విద్యారంగానికే చంద్రబాబు నాయుడు చుక్కాని, చుక్కా రామయ్య గారి కంటే చంద్రబాబు గారు గొప్ప విద్యావేత్త అంటూ నూరు శాతం అక్షరాస్యత కలిగిన దేశాల అధ్యక్షులు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ కూడా చంద్రబాబు నాయుడు గారి అపాయింట్‌మెంట్ కోసం కరకట్ట (చంద్రబాబు నాయుడు గారి నివాసం) మీద క్యూ కట్టుకొని నిలుచున్నారని ప్రచారం జరిగి ఉండేది, ఎల్లో మీడియాలో కథనాలు వచ్చి ఉండేవి. మనం విని ఉండే వాళ్లము, మా ప్రభుత్వం అవన్నీ కోరుకోదు, రాష్ట్రంలో పేద విద్యార్థుల కష్టాలు తీరితే చాలు అని అనుకుంటుంది. బాబు పాలనలో అరకొరగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటే.. బ్రహ్మాండంగా ఉందనీ, బాగుందనీ చెప్పుకునేవారు. అప్పట్లో రీయింబర్స్‌మెంట్ ఎప్పుడుంటుందో స్పష్టంగా తెలిసేది కాదు. గత ప్రభుత్వంలో రెండేళ్ల వరకు బకాయిలు చెల్లించకుండా పెండింగ్ ఉంచినా కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ చాలా బాగుందంటూ ఎల్లో మీడియాలో ప్రచారం జరిగేది. సుమారు రూ.1,800 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో ఉంచి గత ప్రభుత్వం దిగిపోయింది. అయినప్పటికీ బాబు పాలనే బాగుందనీ ప్రచారం ఉండేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ బకాయిలన్నీ చెల్లించడమే కాకుండా వసతి దీవెనతోపాటుగా పూర్తి రీయింబర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు క్వార్టర్లీ చెల్లిస్తున్నా కూడా బాగాలేదని ఎవరికి అనిపిస్తుందంటే అది కేవలం ఎల్లో మీడియా.. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలకు. రామోజీరావు గారికి, రాధాకృష్ణ గారికి, టి.వి.-5 బీఆర్. నాయుడు గారికి అనిపిస్తోంది. ఇంత మంచి పరిపాలన చూసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు.

మధ్యాహ్న భోజనం కాంట్రాక్టర్లకు ఎనిమిది నెలల పైచిలుకు బకాయిలు ఉంచుకుని, చంద్రబాబు నాయుడు గారు పెట్టిన నీళ్ల చారన్నం బాగుందా లేదా పూర్తిగా మార్చబడి రోజుకో మెనూ చొప్పున మన ప్రభుత్వం అందిస్తున్న గోరుముద్దలు బాగుందా అని అడుగుతున్నాను. ఎందుకు ఈ

మాట అడుగుతున్నానంటే కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్లుగా చంద్రబాబు నాయుడు గారు ఎల్లో మీడియాకు ముద్దు కాబట్టి.

అక్క చెల్లెమ్మల విషయానికి వస్తే 2014 నాటికి డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా చివరకు సున్నా వడ్డీని కూడా 2016 నుండి చెల్లించకుండా ఏ గ్రేడ్, బి గ్రేడ్ లో ఉన్న డ్వాక్రా సంఘాలను కూడా సీ, డీ గ్రేడ్ కు దింపేసింది ఆ ప్రభుత్వం. బాబు గారి హయాంలో Non-performing assets (NPAs) 18 శాతానికి పైగా చేరిన పరిస్థితులు బాబుగారి పాలనలో కనిపించింది. NPAలుగా మార్చేశారు. అటువంటి చంద్రబాబు నాయుడు గారి పాలన బాగుందా లేదా డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు రూ.25వేల కోట్ల రుణాల మొత్తాన్ని నాలుగు వాయిదాలలో వారి చేతుల్లో పెడతామని మాట ఇచ్చిన ఈ ప్రభుత్వం రూ.12758 కోట్లు సుమారు 80 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు నేరుగా అందించి, మిగిలిన మొత్తాన్ని కూడా అన్నమాట ప్రకారం చెల్లిస్తోన్న మన వైఎస్ఆర్ ఆసరా బాగుందా అని అడుగుతున్నాను. సున్నా వడ్డీ ఎగ్గొట్టిన చంద్రబాబు నాయుడు గారి పాలన బాగుందా? లేదా సున్నా వడ్డీ అన్న ఒక్క పథకానికే రూ.2,354 కోట్లను మన ప్రభుత్వమే చెల్లిస్తోన్న వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం బాగుందా అని అడుగుతున్నాను.

**సా. 4.20**

అధ్యక్షా, గతంలో వనజాక్షి అనే ఎమ్మార్వో ఇసుక లూటీని ఆపుతూ ఉంటే పాపం ఆ ఎమ్మార్వోని అప్పటి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు జుత్తు పట్టుకుని ఈడ్చారు. ఆవిడను ఈడ్చినట్లే పాదుపు సంఘాల అక్క చెల్లెమ్మలను కూడా రోడ్డు మీదకు ఈడ్చిన చంద్రబాబునాయుడుగారికి "అక్క-చెల్లెమ్మలు, మహిళలు" అని పలికే అర్హత కూడా లేదు. వారు చంద్రబాబునాయుడుగారిని ఎంతగా చీదరించుకుంటున్నారో ఈ మనిషి ఇంకా ప్రజల్లోకి వెళ్లలేదు కాబట్టి వారికి అర్థం కావడం లేదు.

అధ్యక్షా, ఆడపిల్లల చదువుల గురించి, కనీసం బడుల్లో టాయిలెట్ల నిర్మాణం గురించి, ఏ కారణంగా ఆడపిల్లలు బడులు మానేస్తున్నారో దానికి గల కారణం గురించి గాని, వారికి ఇవ్వాల్సిన రక్షణ గురించి గాని 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి కనీసం ఏ ఒక్క రోజైనా ఆలోచన చేసిన చరిత్ర చంద్రబాబునాయుడుగారికి ఉందా అని అడుగుతున్నాను. ఇటువంటి పెద్ద మనిషి అటువంటి మంచి ఆలోచనలు చేసేదేమీ లేదు. కానీ ఇటువంటి మనిషి మాత్రం సెల్ఫోన్‌ను నేనే కనిపెట్టా, హైదరాబాదు సిటీ నేనే కట్టా, అదిగో హైపర్‌లూప్, ఇదిగో బుల్లెట్ ట్రైన్, ఇక్కడే ఎయిర్ బస్, బిల్‌గేట్స్ నా కంప్యూటర్ స్కిల్స్ చూసి మూర్ఛపోయాడు, సత్య నాదెళ్లకు నేనే చదువు చెప్పించాను, పి.వి. సింధుకు నేనే బ్యాడ్మింటన్ నేర్పించాను అని బడాయిలు.

(సభలో నవ్వులు)

అధ్యక్షా, అన్నీ గొప్పగా కళ్లార్పకుండా సత్యదూరమైన మాటలు చెప్పే ఈ మనిషికి దిశ యాప్, దిశ చట్టం, దిశ పోలీసు స్టేషన్లు, వీటి కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రతి రెండు వేల మంది

జనాభాకు గ్రామ సచివాలయంలో ఒక మహిళా పోలీసు, ఇటువంటి కాన్సెప్ట్‌లు ఏనాడైనా ఆయన బుర్రలోకి వచ్చాయా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, కేవలం ఐదు సార్లు ఫోన్‌ను షేక్ చేస్తే చాలు. ఎస్ఒఎస్‌కు వెళ్లిపోయే టెక్నాలజీ. ఇప్పటికి కోటి పదమూడు మంది అక్క చెల్లెమ్మలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

కేవలం ఐదు సార్లు ఫోన్‌ను షేక్ చేస్తే చాలు. ఆ అక్క చెల్లెమ్మలకు తోడుగా ఉండేందుకు పది నిమిషాల్లో పోలీసులు చేరుకుంటారు. రూరల్ ప్రాంతంలో అయితే 20నిమిషాల లోపు, అర్బన్ ప్రాంతంలో అయితే పది నిమిషాల లోపు చేరుకుంటారు. ఇంకా త్వరగా ఎస్ఒఎస్ డెలివరీ అయ్యేందుకు, దాని సమయాన్ని ఇంకా తగ్గించేందుకు చర్యలు తీసుకొంటున్నాము. దీనిద్వారా ఇప్పటికే 900మంది అక్క చెల్లెమ్మలు రక్షణ పొందారు. దీనిని మా ఘనతగా ఏ రోజూ మేము చెప్పుకోలేదు. ఒక బాధ్యతగా, బుర్రపెట్టి మహిళల భద్రత కోసం ఆలోచిస్తున్నామని గర్వంగా చెబుతున్నాము.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అయినా కూడా, బాబు గారి – బుర్ర తక్కువ పాలనే అద్భుతమని, అమోఘమని ప్రత్యేకమైన బుర్రకథలు చెప్పడానికి ఒక ఈనాడు, ఒక రాధాకృష్ణ (ఆంధ్రజ్యోతి), ఒక TV-5, ఇలాంటి నలుగురు ప్రత్యేకమైన కళాకారుల్ని వారి కింద బృందాలుగా తయారుచేసుకున్నారు తప్ప, ప్రజలకు చిత్తశుద్ధితో మంచి చేసి ప్రజల మన్ననా పొందాలన్న ఆలోచన ఏ రోజూ వారికి లేదు. అధ్యక్షా, 45 నుంచి 60సంవత్సరాల మధ్య మోస్ట్ రెస్పాన్సిబుల్ వయసులో ఉన్న ఆ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మల జీవితాల గురించి, వారి కుటుంబ బాధ్యతలు పంచుకుంటోన్న వారికి కాస్తంత ఆర్థికంగా, అండగా నిలబడితే, వారి కుటుంబాలకు అత్యంత మంచి జరుగుతుందన్న ఆలోచన చంద్రబాబునాయుడుగారు ఒక్కసారైనా చేశారా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఈ 45నుంచి 60సంవత్సరాల మధ్య మోస్ట్ రెస్పాన్సిబుల్ వయసులో 25లక్షల పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలకు నాలుగు సంవత్సరాల్లో వరుసగా క్రమం తప్పకుండా సంవత్సరానికి రూ.18,750ల చొప్పున మనం ఇస్తున్న డబ్బులు రూ.75,000లు.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, ఇప్పటికే ఈ రెండేళ్ల కాలంలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అక్షరాలా రూ.9,000కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెబుతున్నాను. డబ్బులు ఇవ్వడమే కాకుండా వారికి బ్యాంకులతోనూ, హిందూస్థాన్ లీవర్, రిలయన్స్, ఐటిసి, ప్రాక్టర్ అండ్ గాంబిల్, అమూల్ వంటి

కార్పొరేట్ దిగ్గజాలతో అనుసంధానం చేసి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే విధంగా ఒక గొప్ప ఆలోచనకు ఈ రోజు శ్రీకారం చుట్టాము.

అధ్యక్షా, కొవిడ్ కష్టకాలంలో కూడా ఒకవైపు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, 31లక్షల ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు ఇళ్ల నిర్మాణం ఇవన్నీ చేస్తూనే చేయూత వంటి పథకం కూడా అమలు చేస్తున్నాము. ఈ చేయూత పథకం స్ఫూర్తితోనే కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను కూడా తీసుకొచ్చాము. అంటే 45నుంచి 60సంవత్సరాల మధ్య మోస్ట్ రెస్పాన్సిబిల్ వయసులో ఉన్న ప్రతి ఒక్క పేద అక్క చెల్లెమ్మలకు అండగా నిలబడుతున్నానని గర్వంగా చెబుతున్నాను.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

వారి జీవిత కాలంలో కనీసం ఎప్పుడైనా ఇటువంటి ఆలోచన చేశారా అని చంద్రబాబునాయుడుగారిని అడుగుతున్నాను. మోస్ట్ రెస్పాన్సిబుల్ వయసులో ఉన్న ఇటువంటి అక్కచెల్లెమ్మలకు మనం తోడుగా నిలబడగలిగితే ఆ కుటుంబాలన్నీ పేదరికం నుంచి బయటపడే పరిస్థితి ఏర్పడుతుందన్న కనీస ఆలోచన వారికి ఎప్పుడైనా తట్టిందా అని చంద్రబాబునాయుడుగారిని అడుగుతున్నాను. ఎందుకు ఇటువంటి ఆలోచనలు ఆయనకు తట్టవూ అంటే, అటువంటి మనసు ఆయనకు లేదు కాబట్టి.

ఇక ఇళ్ల నిర్మాణ విషయానికి వస్తే ఎప్పుడూ, ఎవరి ఇమాజినేషన్‌కు, ఆలోచనలకు తట్టని విధంగా 31లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చాము.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, ఈ చంద్రబాబునాయుడుగారి పార్టీ పుట్టి 40సంవత్సరాలు అయింది. ఈ నలభై సంవత్సరాల చరిత్రలో ఏనాడైనా ఇటువంటి మంచి కార్యక్రమం చేసిన చరిత్ర వాళ్లకుందా అని అడుగుతున్నాను.

**సా.4.30**

రెండు దశల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అందులో మొదటి దశ వేగం పుంజుకుంటోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయితే ప్రతి అక్కచెల్లెమ్మల చేతిలో కనీసం 5లక్షల నుంచి 10లక్షల రూపాయలు విలువ చేసే ఆస్తి వారి చేతికే నేరుగా ఇచ్చినట్టు అవుతుంది. అదే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో స్థలం విలువ దాదాపు పది లక్షల నుంచి 20లక్షల రూపాయలు కూడా పెరుగుతుంది. ఇటువంటి మంచి కార్యక్రమాలు పూర్తి అయితే వాళ్లకు వచ్చిన 23సీట్లు కూడా దక్కకుండా పోతాయనే భయంతో వీటిని అడ్డుకునేందుకు కోర్టులకు వాళ్లే వెళతారు, కేసులు కూడా వాళ్లే వేయిస్తారు. మేము చేస్తున్నామనే విమర్శలు తప్ప, పేదలను గుండెల్లో పెట్టుకున్న

చరిత్ర వాళ్లకు ఎప్పుడూ లేదు. పేదలకు శాశ్వత చిరునామా ఉండాలని, వారి సామాజిక హోదాను పెంచాలని, ఏ రోజు కూడా వారు ఆలోచన చేసిన దాఖలాలు లేవు. చంద్రబాబునాయుడు గారి పార్టీ జెండా ఎప్పుడైనా గమనించారా? చంద్రబాబునాయుడుగారి పార్టీ గుర్తులోనే గుడిసె కనిపిస్తుంది. ఆ గుడిసెలో పేదలు కలకాలం ఉండాలని కోరుకునే మనస్తత్వం చంద్రబాబునాయుడుగారిది. ప్రజలకు పక్కా ఇళ్లు అవసరమని, వారు ఎప్పుడూ గుర్తించరు. వాళ్లు కట్టని టిడ్కో ఇళ్లను వారే కట్టారని డ్రామాలు చేస్తుంటే ఈ రోజుకీ చూస్తున్నాం. టిడ్కో ఇళ్లు, అవి కూడా ముష్టి 2,62,000 ఇళ్లు మాత్రమే. అవి కూడా పూర్తి కాకుండా వదిలేసిన ఇళ్లు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత అక్కడకు వెళ్లి చూస్తే, డ్రైనేజీ, కరెంటు, రోడ్లు, కనీసం నీళ్ల కనెక్షన్ కూడా లేవు. 80వేల ఫ్లాట్లు ఒక స్టేజ్‌కి వచ్చాయి. మిగతా ఫ్లాట్లు ఆ దశలో కూడా లేవు. అటువంటి దారుణమైన పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లు ఉన్నాయి. టిడ్కో ఇళ్లకు సంబంధించి మన ప్రభుత్వమే బాధ్యత తీసుకొని వాటిని పూర్తి చేసే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికపైన చేస్తున్నాము. దానికి మన ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వకపోగా, వారికి (చంద్రబాబునాయుడు గారికి) అబద్ధాలు చెప్పే అలవాటు ఉంది. "హైదరాబాదుని నేనే కట్టానని, హైదరాబాదు ఎయిర్‌పోర్టు నేనే కట్టానని, ఔటర్ రింగు రోడ్డును నేనే కట్టానని, పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే"ను నేనే కట్టానని ఇవన్నీ ఆయన కట్టకు పోగా తానే కట్టాను అన్నట్టుగా, ఇప్పటికి కూడా వారు అప్పుడప్పుడు భజనలు చేస్తారు. ఇది చాలా ముఖ్యమైన పాయింట్. వారు 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న తరవాత కూడా 31లక్షల మంది ప్రజలు పక్కా ఇళ్లు లేకుండా ఎందుకు మిగిలిపోయారనే ప్రశ్నకు చంద్రబాబునాయుడు గారి దగ్గర సమాధానం ఉందా అని అడుగుతున్నాను. నేను ముఖ్యమంత్రి స్థానంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తోంది. 31లక్షల మందికి ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నాం.

నామినేటెడ్ పోస్టుల విషయానికి వస్తే సామాజిక న్యాయం అన్నది వారి మాటల్లో కనిపిస్తోంది తప్ప ఏ రోజు అమలుచేసిన దాఖలాలు లేవు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ మీద ఇచ్చే కాంట్రాక్టుల్లో 50శాతం కచ్చితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇవ్వడంతోపాటు 50 శాతం కచ్చితంగా మహిళలకే ఇచ్చే విధంగా చట్టం చేసిన తొలి ప్రభుత్వం కూడా మాదే అని గర్వంగా చెబుతున్నాను.

మరి కొన్ని విషయాలు గమనించమని కోరుతున్నాను. బీసీలను పనిముట్లుగా ఉపయోగించుకోవడం తప్ప ఈ పెద్దమనిషి చంద్రబాబునాయుడుగారు చేసింది ఏమిటని ఒకసారి మీ ద్వారా ప్రజలందర్నీ ఆలోచన చేయమని కోరుతున్నాను. తన మనఃసాక్షిని ప్రశ్నించుకోమని ఆయన్ను అడుగుతున్నాను. చంద్రబాబునాయుడుగారి పరిపాలనలో నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, చేదోడు, జగనన్న తోడు ఇటువంటి పథకాల గురించి కనీసం ఒక్కరోజైనా వారికి ఆలోచనలు వచ్చాయా అని అడుగుతున్నాను. చంద్రబాబునాయుడుగారి పరిపాలనలో అగ్రిగోల్డు బాధితులు తమ కళ్ల ముందే ఇబ్బంది పడే పరిస్థితులు వచ్చి, అవస్థలు పడుతున్నా కూడా, అగ్రి గోల్డు కంపెనీని దోచుకున్నది,

సర్వనాశనం చేసింది ఈ పెద్దమనిషి అయితే, ఆ బాధితులకు మన ప్రభుత్వం రూ.905కోట్లు చెల్లించింది. ఈ మనిషి పాలనకు, మన ప్రభుత్వానికి తేడా చూడండి. ఎటువంటి మంచి ఆయన చేయలేదు. ఈ పెద్దమనిషి చేస్తున్న పనులు కులాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం, నిత్యం ఏదో ఒక సంఘటనను తీసుకొని దానితో ప్రభుత్వానికి ఏ సంబంధం లేకపోయినా కూడా పొగ వేయాలని నానా తంటాలు పడుతుంటారు. ఈ పెద్దమనిషికి తోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, వీళ్లు డబ్బా వాయిస్తారు. చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి స్థాయిలో లేరు కాబట్టి ఆ ముఖ్యమంత్రి స్థానంలోకి చంద్రబాబునాయుడుగారిని తీసుకురావాలనే తపన, తాపత్రయంతో అబద్ధాలు చెప్పడంలో వాళ్లంతా తమ స్థాయిని మరచిపోయి ఏమంటే అవి చేసేస్తున్నారు. న్యాయం, ధర్మం ఏవీ వాళ్లకు కనిపించవు. అధికారంలో ఉండగా, పట్టపగలు దేవాలయాలు కూలగొట్టిన చరిత్రలు ఉన్న వారికి, అధికారం పోతే చీకట్లో విగ్రహాలు విరిచేయాలన్న ఆలోచనలు, రథాలు తగలబెట్టాలన్న ఆలోచనలు వారికి రాకుండా పోతాయా అని అడుగుతున్నాను. ఈ కూలగొట్టిన దేవాలయాల స్థానంలో తిరిగి మళ్లీ దేవాలయం కట్టించే కార్యక్రమం, తగల బెట్టిన రథాల మసి మాకు పూశారో అటువంటి రథాలను మళ్లీ పునఃనిర్మించి వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నం మేము చేస్తుంటే, వారు ఎటువంటి తప్పుడు మాటలు మాట్లాడుతూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారో ఒకసారి ప్రజలందర్ని మీ ద్వారా ఆలోచన చేయమని కోరుతున్నాను.

**సా.4.40**

ఇటువంటి సంకుచిత భావాలు ఉన్న రాజకీయ నాయకులు, మీడియా వ్యవస్థలు ఉన్నాయి. ఇంకొన్ని విషయాల గురించి ప్రతి ఒక్కరు ఆలోచన చెయ్యాలి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల లోపే 1,30,000 శాశ్వత ఉద్యోగాలను ఇచ్చిన చరిత్ర మనది.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరిచారు)

అటువంటి చరిత్ర వాళ్లకి లేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుకున్న చరిత్ర మనదైతే, కనీసం వాళ్ల గురించి ఆలోచన చేసిన పాపాన పోని చరిత్ర ఆయనది. వైద్య, ఆరోగ్య శాఖలో డాక్టర్లు, నర్సులు లేని ప్రభుత్వ ఆసుపత్రులు ఉండకూడదని ఏకంగా 39,000 పోస్టులు వైద్య, ఆరోగ్య శాఖలో భర్తీ చేస్తున్న చరిత్ర మనది అయితే ఆ ఆసుపత్రులను గాలికి వదిలేసి, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకలు కొరికి పిల్లలు చనిపోయిన పరిస్థితిని చూసిన చరిత్ర వాళ్లది. ప్రభుత్వ సంస్థలను మూసివెయ్యడం, వాటిని పప్పు బెల్లాలకు అమ్మేయ్యడం మాత్రమే తెలిసిన వ్యక్తులు గత ప్రభుత్వ పెద్దలు. ప్రభుత్వ ఉద్యోగాల గురించి మాట్లాడే నైతిక హక్కు ఇటువంటి వారికి ఉందా అని అడుగుతున్నాను. ఎందుకంటే ఈ పెద్దమనిషి మాట్లాడడం మొదలు పెట్టాడు కాబట్టి ఆశ్చర్యం కలిగించింది. ఈ రోజు ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీలో 52,000మంది మన కళ్ల ఎదుటనే కనిపిస్తున్నారు. మన కళ్ల ఎదుటనే 1,30,000 మంది సచివాలయాల్లో చిరునవ్వుతో ఉద్యోగాలు చేస్తున్న మన పిల్లలే అక్కడ కనిపిస్తున్నారు. యాభై

ఇళ్లకు ఒకరు చొప్పున 2,70,000 మంది వాలంటీర్లు చిరునవ్వుతో సేవలు అందిస్తూ కనిపిస్తున్నారు. మరో లక్షమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు APCOS ద్వారా మెరుగైన జీతాలు అందేట్టుగా వారికోసం ఒక కార్పొరేషన్ కూడా క్రియేట్ చేశాం. ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మంచి చేశాం. మరో 20,000 మందికి కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చాం. ఈ 34 నెలల కాలంలో గవర్నమెంట్ సెక్టార్‌లోనే రకరకాల కేటగిరీస్‌లో ఇచ్చిన ఉద్యోగాలు అక్షరాలా 6,03,000.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా మెరుగైన జీతాలు ఇచ్చేందుకు మన ప్రభుత్వమే టైం స్కేల్ ఇంప్లిమెంట్ చేసింది. ఈ పెద్ద మనిషి ఏప్రిల్‌లో ఎన్నికలకు నెల ముందు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌కు టైం స్కేల్ అని ఒక జీవో ఇస్తారు. ఐదు సంవత్సరాల్లో ఏమీ చేయకుండా G.O. to be implemented from June అని ఇచ్చారు. ఇటువంటి వ్యక్తులు ఈ రోజు ఉద్యోగుల గురించి మాట్లాడుతున్నారంటే వీళ్లకు ఉద్యోగుల మీద ప్రేమ, మమకారం ఉందా అని ఒకసారి ఆలోచన చెయ్యాలి. ఇటువంటి వాళ్లకు తాన-తందాన అనే కమ్యూనిస్ట్ కామ్రేడ్‌లు కూడా ఆలోచన చెయ్యాలి. ఈ కమ్యూనిస్ట్ కామ్రేడ్‌లను నమ్ముకున్న ఆ లీడర్లు ఉద్యోగులకు ఏమి న్యాయం చేస్తారో ఆలోచన చెయ్యాలి. అంగన్‌వాడీలో పనిచేస్తున్న వారికి, ఆశా వర్కర్లకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, శానిటరీ వర్కర్లకు, హోం గార్డ్‌లకు, 104, 108 సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు ఇలా అనేక విభాగాలలో పనిచేస్తూ చాలీ చాలని జీతాలతో బ్రతుకు బండి ఈడుస్తున్న 3,07,727 మందికి మేలు చేసేలా, గతంలో వీరి జీతాలకు రూ.1100కోట్లు ఖర్చు అయితే ఇప్పుడు మనం ఇస్తున్నది రూ.3000కోట్లు.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరిచారు)

అంతేగాక భారమైన పీఆర్సీ విషయంలో రాష్ట్రంలో ఇబ్బందులు ఎన్ని ఉన్నా ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో పెరగకపోయినా అంతిమంగా ఉద్యోగుల సంతోషాన్ని ప్రామాణికంగా తీసుకుని వారి వేతనాలను కూడా వీలైనంత ఎక్కువగా పెంచగలిగినంతా పెంచాం.

వైద్య రంగాన్ని ఒక్కసారి తీసుకున్నట్లైతే ఆరోగ్యశ్రీ ఆలోచన ఎలాగూ వారికి రాలేదు. ఆ ఆలోచన ఎలాగూ వారిది కాదు. కనీసం దానిని సక్రమంగా అమలు చేసే మనసైనా వాళ్లకు ఉందా అంటే అదీ లేదు. మన పాలనలో రూ.5లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీ వర్తింపు చేస్తున్నందువలన ఈ రోజు రాష్ట్రంలో 95శాతం మందికి ఈ స్కీం వర్తిస్తోంది. గతంలో చంద్రబాబునాయుడు గారి హయాంలో 1000 ప్రొసీజర్స్‌కు మాత్రమే ఆరోగ్యశ్రీ అమలులో ఉంటే, ఈ రోజు 2,600 ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తున్నాం.

అధ్యక్షా ఆరోగ్య ఆసరా. మనిషికి ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్‌కు వెళ్లి ఆపరేషన్ చేయించుకుని ఆ మనిషికి 2 లేదా 4 లేదా 6 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టరు చెబితే ఆ విశ్రాంతి

తీసుకునే పీరియడ్‌లో ఆ మనిషి ఇబ్బంది పడకూడదని ఆ మనిషిని చిరునవ్వుతో పంపించడమే కాకుండా నెలకు రూ.5000లు అతని చేతిలో పెట్టి రెస్ట్ తీసుకోమని పంపిస్తున్న పథకం ఆరోగ్య ఆసరా. ఇటువంటి స్కీం గురించి నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని ఎప్పుడూ ఏడుస్తుంటారు. కనీసం ఒక్కసారైనా ఈ పెద్ద మనిషి ఆలోచన చేశారా అని అడుగుతున్నాను. ఆరోగ్యశ్రీ స్కీంను నిర్వీర్యం చేస్తూ సంవత్సరం పైగా నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు బకాయిలు కూడా పెట్టారు. ఆయన పెట్టిన రూ.680కోట్ల బకాయిలను మన ప్రభుత్వం వచ్చిన తరవాత క్లియర్ చేశాం. ఈ రోజు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు ప్రతి నెలా ఆటో డెబిట్ కింద డెబిట్ అయిపోతాయి. ఏ హాస్పిటల్‌లో కూడా నెల దాటి డిలే లేదు. అంత గొప్పగా ఈ కార్యక్రమం సాగుతోంది. దాదాపుగా 1100 108, 104 వాహనాలను కొత్తగా కొన్నాము. ఇవి కాకుండా గ్రామ, గ్రామాన వై.ఎస్సార్.విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లు, పీహెచ్‌సీలు, వై.ఎస్సార్.విలేజ్ క్లినిక్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. కొవిడ్ సమయంలో టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీట్‌మెంట్ విషయాలలో దేశంలోని అగ్రరాష్ట్రాలలో మనది కూడా ఒకటి. దేశంలో కొవిడ్ మరణాలు అతి తక్కువ ఉన్న రాష్ట్రం మనదే అని గర్వంగా చెబుతున్నాను.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరిచారు)

ఎందుకు ఈ విషయాలు చెబుతున్నాను అంటే మన దగ్గర పెద్ద రాష్ట్రాల మాదిరి tertiary health care లేదు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై పెద్ద, పెద్ద నగరాలు కాబట్టి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అన్నీ అందుబాటులో ఉంటాయి. కానీ ఆ సౌలభ్యం మనకు లేదు. ఎందుకంటే అటువంటి పెద్ద నగరాలు మనకు లేవు కాబట్టి. అయినప్పటికీ గ్రామస్థాయిలో మన సచివాలయాలు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు, వ్యవస్థలు పనిచేసిన తీరు దాదాపుగా 36 హౌస్ టు హౌస్ సర్వేలు జరిగాయి. ఈ రకంగా వీళ్లంతా కొవిడ్ టెస్ట్‌లు చేసి తొందరగా ట్రేస్ చేసి, టెస్టింగ్ చేసి, ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో ప్రజలను మనం కాపాడుకోగలిగామని, మరణాలు అతి తక్కువగా నమోదు చెయ్యగలిగామని చెప్పగలుగుతున్నాం.

**సా.4.50**

అధ్యక్షా, వీటికి శాశ్వత పరిష్కారం కొరకు tertiary care మన రాష్ట్రంలో అభివృద్ధి కావాలనే ఉద్దేశంతో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ 11 టీచింగ్ ఆసుపత్రులు మన రాష్ట్రంలో ఉంటే వీటికి అదనంగా మరో 16 బోధన ఆసుపత్రులను ప్రతీ పార్లమెంటు పరిధిలో ఒకటి చొప్పున ఈ రోజు మన రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నాము. మనిషి ప్రాణాల విలువ తెలుసు కాబట్టి వాళ్లను బ్రతికించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులన్నింటినీ శిథిలావస్థకు చేర్చిన గత పరిస్థితికి ఈ ఆసుపత్రులన్నింటినీ మెరుగుపరచాలన్న మన తపనకు తేడా గమనించమని మిమ్మల్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ రోజు ఆసుపత్రుల్లో నాడు-నేడు ద్వారా అక్షరాలా రూ.16,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఆసుపత్రుల రూపు రేఖలన్నీ పూర్తిగా మారుస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది

కొరత ఎక్కడా లేకుండా ఏ ఆసుపత్రిలో ఎంత మంది డాక్టర్లు, నర్సులు ఉండాలో అంత మంది ఉండేలా చరిత్రలో ఎక్కడా జరగని విధంగా 39,000 మంది డాక్టర్లను, నర్సులను ఈ రోజు రిక్రూట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రులలో నియమిస్తున్నాము. వైద్య రంగానికి సంబంధించిన టాపిక్స్ మాట్లాడే కనీస అర్హత కూడా చంద్రబాబు నాయుడుకి లేదు.

రైతు, వ్యవసాయం గురించి ఒకసారి గమనించమని చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను. రైతును చంద్రబాబు నాయుడు గారు మోసం చేస్తే మేము అదే రైతన్నకి ఇవాళ న్యాయం చేస్తున్నామని సగర్వంగా చెప్పగలుగుతున్నాను. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల్లో ప్రతీ రూపాయి మాఫీ చేస్తామని చెప్పిన ఈ పెద్ద మనిషి మోసం చేసి కేవలం రూ.15,000 కోట్లు కూడా గత ఐదు సంవత్సరాల్లో ఇవ్వని పరిస్థితి మనం చూశాం. అటువంటి పరిస్థితి నుంచి ప్రతీ రైతన్నకు రూ.12,500/-లు రైతు భరోసా కింద నాలుగేళ్లపాటు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పినా ఈ రోజు రైతు కష్టాన్ని చూసి రైతుకు మరింత మెరుగ్గా మేలు చేసే ఉద్దేశంతో అదే రైతు భరోసా సొమ్మును ఏటా రూ.13,500లకి పెంచి ఐదేళ్లపాటు దానిని వర్తింప చేస్తూ దేశంలో ఎక్కడా జరగని విధంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.

Recognition of Forest Rights (RoFR), కౌలు రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తూ దేశంలో ఎక్కడా జరగని విధంగా ఈ రోజు అమలు చేస్తున్నాం. అరకోటి పైగా రైతులకు మంచి చేసే ఇలాంటి పథకాన్ని పెట్టాలని అధికారంలో ఐదు సంవత్సరాలున్నా బాబు గారికి ఆలోచన రాలేదు. రైతుకి పెట్టుబడి సహాయం ఏదైనా చేయాలి, దాదాపుగా 80 శాతం మంది రైతులకు ఒక హెక్టారు లోపల భూములున్న రైతులకు రూ.13,500/- ఇచ్చే రైతు భరోసా లాంటి పథకం ఇవ్వగలిగితే 80 శాతం పెట్టుబడి ఖర్చు వాళ్ల చేతుల్లో పెట్టగలుగుతాము. దానివలన పెట్టుబడికి వాళ్లు అప్పులు తీసుకోవలసిన దుస్థితి లేకుండా 80 శాతం పెట్టుబడి కొరకు కనీసం వాళ్ల చేతుల్లోనే డబ్బులుంటాయన్న ఆలోచన ఏ రోజూ ఆ పెద్ద మనిషికి రాలేదు.

అధ్యక్షా, ఈ పెద్దమనిషి మైండ్‌సెట్ కూడా అలాంటిదే. ఉచిత విద్యుత్తు ఇస్తే కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవడానికి తీగలు ఉపయోగపడతాయని చెప్పిన ఈ పెద్ద మనిషి, వ్యవసాయం దండగ అన్న ఈ పెద్ద మనిషి, వ్యవసాయ విద్యుత్తు బిల్లులు కట్టలేని రైతుల ఇళ్లల్లోని సామాన్లను రోడ్డు మీద వేసి వేలం వేయించిన ఈ వ్యక్తి, రైతులను కరెంటు దొంగలన్న ఈ వ్యక్తి, కరెంటు బకాయిల వసూలు కోసం ప్రత్యేక పోలీసు స్టేషన్లను పెట్టిన ఈ వ్యక్తి, ప్రత్యేక కోర్టులను పెట్టిన ఈ వ్యక్తి, ఈ రోజు మనం రైతు కోసం ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలు పెడుతుంటే, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటే, అమూల్ పాల వెల్లువరేట్లను పెంచాల్సిన స్థితి వచ్చింది కాబట్టి దానిని కూడా ఈ పెద్ద మనిషి విమర్శిస్తాడు.

అధ్యక్షా, ఈ రోజు రైతు భరోసా సొమ్ము ఈ ప్రభుత్వం ఇచ్చిందని చెబుతుంటే నరనరాల్లో ఈ పెద్దమనిషి జీర్ణించుకోలేని పరిస్థితి మనందరం చూస్తున్నాం. చంద్రబాబు నాయుడు గారి హయాంలో రూ.960 కోట్లు విలువ గల ధాన్యం సేకరణ చేసి సంవత్సరాల తరబడి రైతుల బకాయిలు కట్టకుండా వదిలేశాడు. రూ.960 కోట్లు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మనం కట్టాం. ధాన్యం సేకరణ బకాయిలు రూ.960 కోట్లు, రూ.384 కోట్ల విత్తన బకాయిలను సంవత్సరాల తరబడి ఆయన పెండింగ్ పెడితే మన ప్రభుత్వం వచ్చాక మనం కట్టాం. వీటన్నింటికీ మించి రూ.9000 కోట్ల కరెంటు బకాయిలు కట్టకుండా వదిలేసిన ఈ పెద్ద మనిషి మన ప్రభుత్వానికి గిఫ్టుగా ఇచ్చాడు. అయినప్పటికీ చిరునవ్వుతోనే ఇవన్నీ స్వీకరించి పేమెంట్స్ చేస్తున్నాం. ఎన్నికలప్పుడు చంద్రబాబు నాయుడు గారు కూడా రైతు అవతారం ఎత్తి, తలపాగా పెట్టుకుని ఫొటోలకు ఫోజులిస్తాడు. ఎన్నికల హామీలిచ్చి, ఎన్నికలు కాగానే వారికి టోపీ పెడతాడు. దేశ చరిత్రలోనే ఇటువంటి గొప్ప మోసగాడు ఎవరూ ఉండరు.

అధ్యక్షా, ఇలాంటి వ్యక్తి మన వ్యవసాయ విధానాన్నే విమర్శిస్తుంటే ఇంతకన్నా సిగ్గుపడాల్సిన వ్యవహారం ఎక్కడైనా ఉంటుందో, లేదో నాకైతే తెలియదు. రైతులను, వారి కుటుంబాలను నమ్మించి, మోసం చేసి చివరకు వారి బంగారాన్ని కూడా వేలం వేసే పరిస్థితికి తీసుకొచ్చిన చంద్రబాబు పాలనకు, నేరుగా సమయానికి డబ్బులు కడితే సున్నా వడ్డీ రుణం వర్తిస్తుందని క్రమం తప్పకుండా రైతులను మోటివేట్ చేస్తూ సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా అమలు చేస్తున్న మాకు పోలికే లేదు అధ్యక్ష. ఇ-క్రాప్ చేయించడమే కాకుండా గతంలో బ్యాంకుల్లో కొంత మంది రుణాలు తీసుకున్న వారికి మాత్రమే ఇన్సూరెన్స్ వచ్చే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి పోయి ఇ-క్రాప్ ద్వారా అందరికీ ఉచిత పంటల బీమా చేయించడం వలన అదే సీజన్ ముగిసేలోగా పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో ఇచ్చే పరిస్థితి ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ కూడా ఒక సీజన్‌లో ఖరీఫ్‌లో ఏదైనా జరగరానిది జరిగితే మరో ఖరీఫ్ రాక మునుపే ఇన్సూరెన్స్ ఇవ్వడం ఎక్కడా ఆలస్యం అన్నది లేకుండా జరుగుతున్నాయి. గ్రామ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు రైతన్నలకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ అన్ని రకాలుగా తోడుగా ఉన్నాయి. ఈ రోజు ఇ-క్రాప్ విధానం గ్రామ స్థాయిలోనే జరుగుతున్నది. ఇ-క్రాప్ విధానంలో పూర్తిగా పారదర్శకత కనిపిస్తోంది. ఇ-క్రాప్ చేయడం, ఇ-క్రాప్‌తో బాటు ఫిజికల్ ఎకనాలెడ్జ్‌మెంటు, డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంటు కూడా రైతులకు ఇస్తున్నాం. వ్యవసాయ రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులకు ఇవన్నీ శ్రీకారం చుట్టే విధంగా జరుగుతున్నాయి. అధ్యక్షా నేను మరోసారి ఇదే పెద్దమనిషి చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను. రైతన్నను ఇన్ని రకాలుగా వంచన చేసిన ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారిదైతే, రైతన్నలకు అన్ని రకాలుగా మేలు చేస్తున్న ప్రభుత్వం మాది కాదా అని ఒకసారి గుండెల మీద చేయి వేసుకుని వారు (తెలుగుదేశం పార్టీ సభ్యుల నుద్దేశించి) వాళ్ల మనస్సాక్షిని అడగాలని కోరుతున్నాను.

**సా.5.00**

అధ్యక్షా, ఈ మధ్య కాలంలో ఇదే పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారి నోట్లో నుంచి వచ్చిన మాటలను మనం చూస్తున్నాం. ఇవే మాటలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 లలో కూడా అప్పుడప్పుడు చూస్తుంటాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల మయం అని పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాస్తుంటారు.

అధ్యక్షా, నాకు ఒక్కొక్కసారి ఆశ్చర్యం అనిపిస్తుంది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందంటూ, పరిమితులు దాటి అప్పులు చేసిందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఇటువంటి ప్రచారాన్ని ఒకసారి గమనించమని అడుగుతున్నాను. 2014 సంవత్సరం నాటికి రూ.1,20,556.00 కోట్ల అప్పులు మన రాష్ట్రానికి ఉంటే ఈ పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారు ఐదేళ్ల సమయంలో ఆ అప్పు మొత్తాన్ని రూ.2,68,225.00 కోట్లకు తీసుకువెళ్లారు. ఇది కాకుండా ఈ పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు చెల్లించకుండా వదిలివేసిన బకాయిలు దాదాపు రూ.39 వేల కోట్లు మనమీదే పడింది. అంటే ఆయన హయాంలో చెల్లించకుండా వదిలివేసిన బకాయిలు మన నెత్తిన పడింది. ఇవి కాకుండా ప్రభుత్వ గ్యారంటీ మీద చేసిన అప్పులు 2014 నాటికి రూ.14,028.00 కోట్లైతే ఈ పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు గారి హయాం 2019 నాటికి ఆ అప్పును మరో రూ.58 వేల కోట్లకు పెంచాడు.

అధ్యక్షా, ఇవి కాకుండా విద్యుత్తు సంస్థల పంపిణీకి సంబంధించిన బకాయిల మొత్తం 2014లో రూ.2,893.00 కోట్లు ఉండగా ఈ పెద్ద మనిషి హయాంలో 2019 నాటికి విద్యుత్తు సంస్థల పంపిణీకి సంబంధించిన బకాయిలు అక్షరాల రూ.21,540.00 కోట్లకు పెంచారు. విద్యుత్తు సంస్థల పంపిణీకి సంబంధించిన బకాయిలు అంటే విద్యుత్తును కొనుగోలు చేసి ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించకుండా ఎగ్గొట్టిన మొత్తం రూ.21,540.00 కోట్లు.

అధ్యక్షా, ఇవి కాకుండా విద్యుత్తుకు సంబంధించి వివిధ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలన్నింటికీ అంటే జెన్కో, ట్రాన్స్కో వంటి వాటికి సంబంధించిన అప్పులు రూ.20,703.00 కోట్లు ఉంటే ఈ పెద్ద మనిషి ఐదేళ్ల సమయంలో ఆ మొత్తాన్ని రూ.68,596.00 కోట్లకు పెంచాడు. దీన్ని ఆర్థిక వ్యవస్థ అంటారా లేక ఆర్థిక అరాచకం అంటారో ఇదే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వాళ్లకే తెలియాలి. ఇటువంటి అరాచకాలు చేసి, చేసిన అప్పులతో పాటు వడ్డీ భారాన్ని కూడా మన ప్రభుత్వం నెత్తిన వేసి మళ్లీ ఇప్పుడు అదే నోటితో విమర్శలు చేస్తున్నారు.

అధ్యక్షా, రాష్ట్రం మీద ఇంత భారం మోపి, పోనీ ఏదైనా ప్రజలకు మంచి చేశారా అంటే, ఏదేని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (DBT) ద్వారానో, లేదా ఏదేని ప్రజా సంక్షేమ పథకం ద్వారానో ప్రజలకు మంచి చేశారా అంటే అది కూడా లేదు. వాళ్లు చేసిన అప్పు అంతా అవినీతిమయం అయింది. కానీ ఈ రోజున మనం చేసే అప్పు పేదవాడి జేబులోకి వెళ్లిపోతోంది.

(సభ్యులు బల్లలు చరిచారు)

అంతే కాకుండా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సంవత్సరం కూడా ఎఫ్ఆర్బీఎమ్ (FRBM) పరిమితికి లోబడి అప్పు చేసింది లేదు. కేవలం జీఎస్డీపీ (GSDP) లో మూడు శాతం మాత్రమే అప్పు చేయవచ్చు అనే నిబంధన ఉంటే దాన్ని తుంగలో తొక్కి 2014-15 సంవత్సరంలో మూడు శాతం అని నిబంధన ఉంటే దాన్ని మించి 3.95 శాతం, 2015-16 లో 3.65 శాతం, 2016-17లో 4.52 శాతం, 2017-18లో 4.12 శాతం, 2018-19లో 4.07 శాతం అప్పులు వారి హయంలో చేశారు. ఇలా ప్రతి యేట ఎక్కువగా అప్పులు చేసినందువల్ల ఇప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత చేయగల అప్పు పరిమితిని రూ.16,419.00 కోట్ల విషయంలో ఈ రోజున కేంద్ర ప్రభుత్వంతో మనం యుద్ధం చేయవలసి వస్తోంది. అవన్నీ చంద్రబాబు నాయుడు గారు చేసిన excess borrowings వల్ల.

అంటే చంద్రబాబు నాయుడు గారు చేసిన పాపాలు ఇప్పుడు మనల్ని ఎట్లా వెంటాడుతున్నాయో ఒకసారి గమనించమని అడుగుతున్నాను. పాపాలభైరవుడు చేసిన పాపాలను సరిదిద్దడానికి డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారి హయాం నుంచి చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చేదాక అంటే 2014 వరకు గత ప్రభుత్వాలు చేసిన under borrowings ను వెతికి తీసి ఆ మేరకు దీన్ని అడ్జస్ట్ చేసే ప్రయత్నంలో భాగంగానే మనం ఈ రోజు కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేసే ప్రయత్నంలో ఉన్నాం. ఇది చంద్రబాబు నాయుడు గారి హయాంలో ప్రతియేట చేసిన అప్పులు Compound Annual Growth Rate 17.33 per cent చొప్పున పెరిగితే ఆ విషయం ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, చంద్రబాబు నాయుడు గారికి కనపడదు. బాబు గారి హయాంలో ప్రతియేట CAGR (Compound Annual Growth Rate) 17.33 శాతం చొప్పున పెరిగితే, మన హయాంలో వారు చేసిన అప్పులను ఒక వైపున మనం చెల్లిస్తూనే, పెరిగిన మన అప్పు కేవలం 14.88 శాతం మాత్రమేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

(సభ్యులు బల్లలు చరిచారు)

అధ్యక్షా, పాపాలు ఆయనవి, ప్రాయశ్చిత్తం మనది. ఇవన్నీ చూసి చంద్రబాబు నాయుడు గారు గొప్ప ఆర్థికవేత్త అని అంటారా లేకపోతే అసలు నిజాన్ని దాచి మన ప్రభుత్వం మీద నిందలు వేయడానికే జర్నలిజాన్ని ఉపయోగించుకుంటున్న దీన్ని జర్నలిజం విలువలు అని అంటారా అన్నది వాళ్లంతా ఆలోచన చేసుకోవాలి.

అధ్యక్షా, ''చేతకాని వాడికి కోపం ఎక్కువ'' అని ఒక సామెత ఉంది. అందుకే చంద్రబాబు నాయుడు గారు రోజుకొక జూమ్ మీటింగ్, అరడజన్ ప్రెస్‌మీట్లు పెట్టిస్తాడు. అందులో తిట్ల పోటీ పెట్టిస్తాడు. ముఖ్యమంత్రిని తిట్టండని రెచ్చగొడతాడు. పోటీ పెట్టి మరీ బాబు పంపిస్తాడు, వాళ్లు తిడతారు. అది ఎల్లో మీడియాలో ఆనందంగా టెలికాస్ట్ చేస్తారు. ఇవన్నీ నిత్యం జరుగుతున్నాయి. పద్ధతి ప్రకారం సీక్వెన్స్‌గా ప్రతి నిత్యం ఇదే తంతు జరుగుతుంది. కానీ ప్రజలకు అర్థం కావల్సింది ఒకటే. ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు గారు మరియు ఆయన పార్టీ చేసిన మేలేమిటి అని ఒకసారి

అడుగుతున్నాను. వాళ్లు చేసింది కేవలం దుర్మార్గం తప్ప మరొకటి కాదు. మంచి చేసే మన ప్రభుత్వం మీద కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతూ నిందలు వేసే మరో దుర్మార్గానికి ఈ మధ్య కాలంలో శ్రీకారం చుడుతూ రోజూ దాన్ని ప్రచారం చేయిస్తున్నారు. కంక్లూడ్ చేసే ముందు అందరూ ఆలోచించాలని మరొకసారి కోరుతున్నాను. తనకు అధికారం పోయి వెయ్యి రోజులైన సందర్భంగా రగిలిపోతున్న చంద్రబాబు నాయుడు గారి పార్టీకి, దాని అనుబంధ సంస్థలకు, ఎల్లో మీడియా వారికి, వేర్వేరు పార్టీల్లో, సంస్థల్లో చంద్రబాబు నాయుడు గారి బాగు కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికి, తదితరులకు T.TAN 40 tablets; Gelusil Syrup; Eno sachets వంటివన్నీ విరివిగా లభించాలని కోరుకుంటూ, దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలు మన ప్రభుత్వం మీద కూడా కలకాలం ఉండాలని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

(సభ్యులు బల్లలు చరిచారు)

**MR.SPEAKER:** The question is.

''That the Members of Andhra Pradesh Legislative Assembly assembled in the Eighth Session of the Fifteenth Legislative Assembly are deeply grateful to the Hon'ble Governor for the Address which he has been pleased to deliver to the Legislative Assembly on 07th March, 2022''.

Those who are for the motion, please say 'Aye'

Those who are against, please say 'No'

'Ayes' have it, 'Ayes' have it

The Resolution is adopted.

**MR.SPEAKER:**Now,the House is adjourned to meet again at 10.15am tomorrow.

**(The House then adjourned at 5.10 pm to meet again at 10.15 am on Friday, the 11th March, 2022)**

**“Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.”**